ఆదివారం అనుబంధం
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విశాఖపట్నం
: fb.com/vaartha Digital
Published from Visakhapatnam, Vijayawada, Hyderabad,Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
29-6-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 149 పేజీలు: 16 వెల: 6.50

ప్రకృతి సంపదకు ఈశాన్య భారతం పుట్టినిల్లు: ప్రధాని 5లో

కరాచీలో భీకర ఉగ్రదాడి: నలుగురు సైనికులు మృతి

# ఉమ్మడి కుటుంబమే ముద్దు


ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమంలో చిన్నారికి చుక్కల మందువేస్తున్న సిఎం చంద్రబాబు

## పిల్లల పెంపకంలో తండ్రి బాధ్యత తీసుకోవాలి
## ఇప్పుడు సంతానం భారం కాదు.. సంపద
## పిల్లలు ఎక్కువ ఉంటే ప్రభుత్వంనుంచి ప్రోత్సాహం
## చిన్నారులకు పోలియో చుక్కల కార్యక్రమంలో సిఎం చంద్రబాబు

**విజయవాడ జూన్ 28,ప్రభాతవార్తప్రతినిధి:** జాతీయ ఇమ్యునైజేషన్ డే సందర్భంగా సిఎం చంద్రబాబు నాయుడు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. జాతీయ ఇమ్యునైజేషన్ డే సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా సిఎం క్యాంప్ కార్యాలయంలో పిల్లలకు పోలియో చుక్కలువేశారు. అనంతరం చిన్నారుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో ముఖ్యమంత్రి ఆప్యాయంగా మాట్లాడారు. పిల్లలను ఎత్తుకుని కొంతసేపు ఆడించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి, వ్యాక్సినేషన్ వివరాలు తెలుసుకున్నారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అందిస్తున్న అన్నిరకాల టీకాలను నిర్ణీత సమయానికి తప్పనిసరిగా వేయించాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పల్స్ పోలియో కార్యక్రమం అమలుకు చేసిన ఏర్పాట్లను కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలో నేటి నుంచి మూడు రోజుల పల్స్ పోలియో కార్యక్రమం ద్వారా 5 సంవత్సరాల లోపు ఉన్న సుమారు 49.20లక్షలమంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన పిల్లల తల్లిదండ్రులుతో సిఎం చంద్రబాబు ఈ సందర్భంగా మాట్లాడారు. పిల్లల పెంపకం భారంగాఉంటుందా అని అడిగి తెలుసుకు >>2

## రాష్ట్ర వ్యాప్తంగా పల్స్ పోలియో ప్రారంభం

**విజయవాడ,జూన్ 28,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా 'పల్స్ పోలియో' కార్యక్రమం ప్రారంభమైంది. ఐదేళ్లలోపు వయసున్న పిల్లలకు తల్లిదండ్రులు పోలియో చుక్కలు వేస్తున్నారు. రాష్ట్రంలో 49.20 లక్షల మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నారు. రైల్వేస్టేషన్లు, బస్ స్టాండ్లు, విమానాశ్రయాలు, మార్కెట్లు వంటి రద్దీ ప్రదేశాల్లో పోలియో చుక్కల కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్, పశ్చిమగోదావరి, కోనసీమ జిల్లాల్లో పల్స్ పోలియో కార్యక్రమం కొనసాగుతోంది. ఆరోగ్యకరమైన సమాజ ఏర్పాటుకు రెండు పల్స్ పోలియోచుక్కలు అమృతం లాంటివని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. తణుకులో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అధికారులతో కలిసి పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. పోలియో రహిత సమాజాన్ని నిర్మించడంలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. కృష్ణా జిల్లా పెడనలో బంటుమిల్లి బస్టాండ్‌నందు 'పల్స్ పోలియో' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రధాన కూడలిలో పల్స్ >>2


ఆదివారం ప్రధాని మోడీకి "గార్డియన్ ఆఫ్ ది బ్లూ హారైజాన్" అవార్డు ప్రదానం చేస్తున్న సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మిని

## ప్రధాని మోడీకి సీషెల్స్ అత్యున్నత పురస్కారం
### 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హారైజాన్'ను అందించిన అధ్యక్షుడు పాట్రిక్ హెర్మిని

**విక్టోరియా,జూన్ 28:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి మరో అరుదైన అంతర్జాతీయ గౌరవం లభించింది. పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా సీషెల్స్ ప్రభుత్వం తమ దేశ అత్యున్నత పురస్కారమైన "గార్డియన్ ఆఫ్ ది బ్లూ హారైజాన్"ను ప్రదానం చేసింది. హరిత భవిష్యత్తు కోసం ప్రధాని మోడీదార్శనికతను ఈ అవార్డు గుర్తించింది. ప్రస్తుతం ప్రధాని మోడీ మూడు రోజుల పర్యటన నిమిత్తం సీషెల్స్‌లో ఉన్నారు. ఆ దేశ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పర్యటనలో భాగంగా ఆయన సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినితో సమావేశమయ్యారు. అంతకుముందు, ప్రధానికి స్టేట్ హౌస్‌లో గౌరవ వందనంలభించింది. ఈ సందర్భంగా, మేడ్ >>2

# బాంబులు దూస్తున్న ఇరాన్



## పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ జ్వాలలు
### కువైట్, బహ్రెయిన్‌లోని యుఎస్ స్థావరాలపై ఇరాన్ దాడులు
### ప్రపంచ పటంనుంచి ఇరాన్‌ను చెరిపేస్తాం: ట్రంప్ తీవ్ర హెచ్చరిక

**కువైట్ సిటీ, జూన్ 28:** పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు మరింత తీవ్రరూపం దాల్చాయి. తమ భూభాగంపై అమెరికా జరిపిన వైమానిక దాడులకు ప్రతీకారంగా ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) సంచలన చర్యకు దిగింది. కువైట్, బహ్రెయిన్ దేశాలలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ బలగాలు ఆదివారం క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడ్డాయి. ఈ ఆకస్మిక పరిణామంతో ఆ ప్రాంతంలో కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం పూర్తిగా పక్కకుపోయి, ఉభయ దేశాల మధ్య పూర్తిస్థాయి యుద్ధం మొదలయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. హార్ముజ్ జలసంధి సమీపంలో ఉన్న తమ క్షిపణి కేంద్రాలు, డ్రోన్ గిడ్డంగులు, తీరప్రాంత >>2


ఆదివారం తిరుమలలో అనంత్ అంబానీకి స్వామివారి చిత్రపటం బహూకరిస్తున్న టిటిడి అధికారులు

## టిటిడికి అనంత్ అంబానీ రూ. 27.5 కోట్ల భారీ విరాళం
### 25 ఎలక్ట్రిక్ బస్సులు సమర్పణ
### టిటిడి గోశాల ఆధునీకరణకు సమ్మతి

**తిరుమల,జూన్ 28ప్రభాతవార్తప్రతినిధి:** పారిశ్రామికవేత్త అనంత్ అంబానీ ఆదివారం వేకువజామున తిరుమల శ్రీవారి సుప్రభాతసేవలో పాల్గొన్నారు. ఆలయంలోనికి చేరుకున్న అనంత్ సుప్రభాతసేవలో కలియుగదైవాన్ని దర్శించుకున్నారు. ఆశీస్సులందుకున్నారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, రిసెప్షన్ డిప్యూటీ ఇఒ భాస్కర్ >>2

# రొట్టెల పండుగకు జన ప్రభంజనం

## 5 లక్షల మంది పైగా విచ్చేసిన భక్తులు
## ఉద్యోగం, వివాహం, సంతానం రొట్టెలకు డిమాండ్
## భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన అధికారులు


ఆదివారం రొట్టెల పండుగకు భారీ సంఖ్యలో హాజరైన భక్తులు

**నెల్లూరు, జూన్ 28, ప్రభాతవార్త - కలెక్టరేట్ :** నెల్లూరు బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగకు మూడో రోజు భక్తులు పోటేత్తారు. ఆదివారం సెలవుదినం కావడంతో భక్తుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. సుమారు 5 లక్షల మందికి పైగా భక్తులు దర్గాను దర్శించుకున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఎండ బాగా వున్నప్పటికీ భక్తుల రద్దీ కొనసాగింది. దేశం నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎస్పీ అజిత వేజెండ్ల, మున్సిపల్ కమిషనర్ నందన్ ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ అన్ని చర్యలు చేపట్టడంతో భక్తులందరూ సజావుగా దర్గాను దర్శించుకుని, రొట్టెలు >>2



## స్మార్ట్ కిచెన్లు చూసి ఓర్వలేని జగన్
### వైఎస్సార్ కడప జిల్లాలో 5 స్మార్ట్ కిచెన్లు పెట్టాం: మంత్రి నారా లోకేష్

**విజయవాడ. జూన్ 28,ప్రభాతవార్తప్రతినిధి:** స్మార్ట్ కిచెన్ల ద్వారా ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు రుచి, శుచి, శుభ్రతతో కూడిన భోజనం పెడుతుంటే జగన్ గారు ఓర్వలేకపోతున్నారని ఎపి ఐటి, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ఆరోపించారు. స్మార్ట్ కిచెన్ల ద్వారా ఉన్నవారితోపాటు అదనంగా మహిళలు, పేదలకు ఉపాధి కల్పిస్తుంటే ఉసూరుమంటున్నారు. ఆదివారం ఆయన "ఎక్స్" వేదికగా స్మార్ట్ కిచన్ వ్యవస్థపై చేసిన విమర్శలకు స్పందిస్తూ మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్ కడప జిల్లాలో ఐదు స్మార్ట్ కిచెన్లు పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టాం. ఈ స్కూళ్ల పరిధిలో పనిచేస్తున్న 233 మంది కుక్‌కమ్‌హెల్పర్లు యథావిధిగా తమ విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఏర్పాటు చేయబోతున్న మరో 33 స్మార్ట్ కిచెన్ల పరిధిలో ఏ ఒక్కరి ఉపాధికీ ఢోకాలేదు. పైగా స్మార్ట్ కిచెన్ల నిర్వహణ ద్వారా స్వయంశక్తి సంఘ మహిళలకు 38 మంది హెడ్ కుక్స్, 22 మంది అసిస్టెంట్ కుక్స్, 256 మంది హెల్పర్లు, సుమారు 76 మంది డ్రైవర్లకు అదనంగా ఉపాధి కల్పించబో తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా ఏర్పాటు చేయబోయే స్మార్ట్ కిచెన్లతో ఉన్నవారితోపాటు అదనంగా వేలాది మందికి ఉపాధి కల్పిస్తుంటే ఎందుకు ఏడుస్తున్నారు జగన్ గారు? పేదలు బాగుపడితే చూడలేరా? స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుతో వేతనాలు చెల్లించలేదని జగన్ ఆరోపించిన వైఎస్సార్ కడప జిల్లాలో పనిచేస్తున్న మొత్తం 3,450 మంది కుక్‌కమ్‌హెల్పర్లు ఏప్రిల్ 2026 నెల వరకు గౌరవ వేతనాలు పూర్తిగా చెల్లించేశాం. మే నెలలో పాఠశాలలకు వేసవి సెలవుల కారణంగా గౌరవ >>2

## ఆందోళన బాటలో ఆర్టీసీ ఉద్యోగులు
### 7,8న ఆర్టీసీ పరిరక్షణ దినం
### ప్రైవేటీకరణపై ఉద్యోగుల నిరసన

**విజయవాడ,జూన్ 28,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిఎస్ ఆర్టీసీలో విద్యుత్ బస్సుల పేరుతో ప్రైవేట్ ఆపరేటర్లకు అవకాశం కల్పిస్తూ రూ.వేల కోట్లు విలువైన ఆర్టీసి డిపో స్థలాలను కూడా వారికి కట్టబెట్టడాన్ని నిరసిస్తూ ఉద్యోగులు మరోసారి నిరసనల బాట పట్టబోతున్నారు. దశల వారీగా ఆర్టీసీని ప్రైవేటుపరం చేయాలన్న ప్రభుత్వం ఆలోచనలు విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ చేస్తూ సంస్థ పరిరక్షణ, ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతం, పిటిడి(ఆర్టీసి) ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టనున్న రెండవ దశ ఆందోళన కార్యక్రమాల షెడ్యూల్‌ను ఇవాళ విజయవాడలో విడుదల చేశారు.విజయవాడ రెవెన్యూ భవన్‌లో ఆర్టీసి ఉద్యోగసంఘాల జెఎసి సమావేశం జరిగింది. ఈ >>2

# 1 నుంచి జిల్లాల్లో సిఎం పర్యటనలు

### హీరో మోటోకార్ప్, జీరాంజీ, రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనుల ప్రారంభోత్సవాలు

**విజయవాడ, జూన్28, ప్రభాతవార్త ప్రతినిధి:** సిఎం నారా చంద్రబాబు నాయుడు జూలై 1వ తేదీ నుంచి వరుసగా పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు ఆయన పలు జిల్లాల్లో పర్యటించనున్నారు. జిల్లా పర్యటనల్లో పలు సంక్షేమ, అభివృద్ధి కార్యమాల్లో సిఎం పాల్గొననున్నారు. 1వ తేదీ పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం కోసం నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలంలో పర్యటించనున్నారు. అదే రోజు తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలోని శ్రీ సిటీలో ద్విచక్ర వాహనాల సంస్థ హీరో మోటో కార్ప్ గ్లోబల్ పార్ట్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. దాదాపు రూ.750 కోట్ల పెట్టుబడులతో హీరో సంస్థ ఈ పార్ట్స్ సెంటర్ ను ఏర్పాటు చేస్తోంది. దీనికి శంకుస్థాపన చేయనున్నారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. 2వ తేదీ ఉదయం తిరుపతి జిల్లా రైల్వే కోడూరులో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ ఆజీవికా మిషన్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారు. అదే రోజు సాయంత్రం తిరుపతి పట్టణంలో ప్రైవేటు హోటల్‌లో జరిగే జిఎస్‌డిపూ కెపాసిటీ బిల్డింగ్ వర్క్ షాప్ నకు హాజరవుతారు. >>2



## 22 రాష్ట్రాల్లో విస్తరించిన 'నైరుతి'
### ఎపి, తెలంగాణలో భారీ వర్షాలకు అవకాశం
### ఈశాన్యంలోనూ అధిక వర్షపాతం
### వాతావరణ శాఖ అంచనా


**న్యూఢిల్లీ, జూన్ 28:** నైరుతి రుతుపవనాలు దేశవ్యాప్తంగా దాదాపు 22 రాష్ట్రాల్లో విస్తరించాయి. మరింతగా విస్తరిస్తున్నందున తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు, ఉరుములు కొనసాగుతాయని భారత వాతావరణ శాఖ (ఐఎమ్‌డి) అంచనా వేసింది. ఐఎండి ప్రకారం, అనుకూలమైన వాతావరణ పరిస్థితులు రుతుపవనాలు ఉత్తర అరేబియా సముద్రంలోని కొన్ని ప్రాంతాలతో పాటు గుజరాత్, మధ్య ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, బీహార్, ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల్లోకి మరింతగా విస్తరించడానికి తోడ్పడుతున్నాయి. తెలంగాణ, కోస్తా ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్ణాటక, పుదుచ్చేరి, లక్షద్వీప్ లలో భారీ వర్షాలు కురిసే అవకాశంఉంది. దక్షిణాది రాష్ట్రాల్లో ఉరుములతో కూడిన వర్షాలు, మెరుపులు, బలమైన గాలులు వీస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. కర్ణాటకలో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉండగా, అండమాన్, నికోబార్ దీవులలోని కొన్ని ప్రాంతాలలో గంటకు 60 కిలోమీటర్ల వేగంతో గాలులతో కూడిన ఉరుములతోకూడిన ఈదురు గాలులు సంభవించవచ్చు. అసోం, మేఘాలయ, ఉపహిమాలయ పశ్చిమ బెంగాల్, సిక్కిం సహా >>2

## మినీ వాహనాన్ని ఢీకొన్న లారీ
### శ్రీకాకుళం జిల్లా కవిటి మండలంలో దుర్ఘటన, ముగ్గురు మహిళలు మృతి

**కవిటి (శ్రీకాకుళం జిల్లా), జూన్ 28 ప్రభాతవార్త :** శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం జమేదారిపుట్టుగ జాతీయ రహదారి సమీపంలో ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే ముగ్గురు మహిళలు మృతి చెందిన వైనం చోటు చేసుకుంది. లారీ డ్రైవర్ మద్యం సేవించి వాహనం అతి వేగంగా నడపడమే ప్రధాన కారణంగా తెలియ వస్తోంది. కంచిలి మండలం మకరాంపురం ఆదివారం సంత నుంచి పనసకాయలోడుతో బరంపురం వెళుతుండగా ఈ ప్రమాదం సంభవించినట్లు విశ్వసనీయ సమాచారం. ఆదివారం సంత నుంచి పనస కాయలు కొని బరంపురం తరలించే క్రమంలో ఇచ్చాపురం ఎస్ఎన్ పేటకు చెందిన మద్దిలి తరిణమ్మ (62), కవిటి మండలం గుజ్జుపుట్టుగ గ్రామానికి చెందిన మురపాల పార్వతి (50) అలానే రాపాకపుట్టుగ గ్రామానికి చెందిన నర్తు పద్మమ్మ (60) మినీ వాహనంపై బరంపురం వైపు వెళుచుండగా వెనుక వైపు నుంచి వస్తున్న లారీ డ్రైవర్ >>2

29-06pg2exHMNWJQE.qxd:29-06pg2exHMNWJQE.qxd 1/1/02 6:14 AM Page 1





ఆదివారం భారత్-సీషెల్స్ మధ్య అవగాహనా ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఇరుదేశాల విదేశాంగ మంత్రులు

# బాంబులు దూస్తున్న ఇరాన్

>> రాడార్ స్థావరాలపై అమెరికా జరిపిన దాడులకు సమాధానంగానే తాము ఈ సైనిక చర్య చేపట్టినట్లు ఇరాన్ సైన్యం ప్రకటించింది. ఇరాన్ ప్రయోగించిన క్షిపణులను కువైట్ వైమానిక రక్షణ వ్యవస్థలు మధ్యలోనే అడ్డుకోగా.. బహ్రెయిన్‌లోని అమెరికా సైనిక కేంద్రాల పరిసరాల్లో భారీ అలజడి రేగింది. ఈ దాడుల వల్ల జరిగిన ఆస్తి, ప్రాణ నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది.
ఈ దాడుల అనంతరం ఇరాన్ నావికాదళం అమెరికాకు తీవ్ర హెచ్చరికలు చేసింది. రాబోయే రోజుల్లో ఈ ప్రాంతంలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలు 'నరకాన్ని చూస్తాయని' వ్యాఖ్యానించింది. అమెరికాయే మొదట శాంతి ఒప్పందాన్ని ఉల్లంఘించిందని, హార్ముజ్ జలసంధిలో తమ నిబంధనలను పాటించని నౌకలపై మరిన్ని కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత ఘాటుగా స్పందించారు. ఇరాన్ గనుక ఇలాగే ఒప్పందాలను ఉల్లంఘిస్తూ పోతే వాషింగ్టన్ సైనికపరంగా ఈ కథను ముగించాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాంటి పరిస్థితి వస్తే ప్రపంచ పటంలో 'ఇరాన్ అనే దేశమే ఇకపై ఉనికిలో ఉండదు' అంటూ ట్రంప్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. హార్ముజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న 'కికు' అనే అంతర్జాతీయ చమురు నౌకపై ఇరాన్ జరిపిన డ్రోన్ దాడికి ప్రతిచర్యగా అమెరికా సైన్యం దాడులు ప్రారంభించిది. అమెరికా వరుసగా రెండోరోజు కూడా ఇరాన్ స్థావరాలను ధ్వంసం చేయడంతో ఇచాన్ క్షిపణి దాడులకు దిగింది. ఈ పరిణామాలతో ఇరు దేశాల మధ్య శాంతిని నెలకొల్పేందుకు జరుగుతున్న దౌత్యపరమైన చర్చలు పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం పొంచి ఉంది.

# స్మార్ట్ కిచెన్లు చూసి ఓర్వలేని జగన్

>> వేతనాలు చెల్లింపు ఉండదు. జూన్ నెల ఇంకా పూర్తి కాలేదు. మరి జగన్ ఎవరి బకాయిలు గురించి ఫేక్ ఆరోపణలు చేశారో చెప్పాలి. స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుతో విద్యార్థులకు మరింత పరిశుభ్రమైన, నాణ్యమైన, ప్రమాణాలకు అనుగుణమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం. పేద పిల్లలకు మంచి భోజనం పెట్టడం, ఆరోగ్యం ఉండడం కూడా సహించలేకపోతే ఎలా అండీ జగన్ అంటూ వ్యాఖ్యానించారు స్మార్ట్ కిచెన్ల ప్రధాన ఉద్దేశ్యం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మరింత పరిశుభ్రమైన, నాణ్యమైన, ప్రమాణాలకు అనుగుణమైన మధ్యాహ్న భోజనం అందించడమేనని మంత్రి వివరించారు. ఆధునిక వంటశాలల ద్వారా ఆహార నాణ్యత మెరుగుపడటం ఉంటుందని చెప్పారు. దీంతో విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా వారి విద్యాభ్యాసంపై కూడా సానుకూల ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు.

# రాష్ట్రంలో మరో రెండురోజులు వానలు

## మంగళగిరిలో 68.2మిమీ, రాజాంలో 52.5మిమీ వర్షపాతం నమోదు

**విజయవాడ,జూన్ 28,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో ఆదివారం వివిధ జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసాయి. సాయంత్రం 4 గంటల సమయానికి వాతావరణ సమాచారాన్ని అనుసరించి గుంటూరు జిల్లా మంగళగిరిలో 68.2మిమీ, విజయనగరం జిల్లా రాజాంలో 52.5మిమీ, గుంటూరు జిల్లా కాకుమానులో 51.5మిమీ, తాడేపల్లిలో 45.2మిమీ, ఎన్టీఆర్ జిల్లా కవులూరులో 41.5మిమీ, బాపట్ల జిల్లా భట్టిప్రోలు 39.9మిమీ చొప్పున వర్షపాతం నమోదైంది.ఉత్తరాంధ్ర తీరప్రాంతం నుండి ఛత్తీస్‌గఢ్ మీదుగా మహారాష్ట్ర వరకు ద్రోణి విస్తరించి ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు.అంతర్గత కర్ణాటక నుండి రాయలసీమ, తమిళనాడు మీదుగా కొమోరిన్ ప్రాంతం వరకు మరొక ద్రోణి విస్తరించి ఉందని పేర్కొన్నారు.దీని ప్రభావంతో మరో రెండు రోజులు మేఘావృతమైన వాతావరణంతో పాటు చెదురుమదురుగా మోస్తరునుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.
కోస్తాంధ్ర జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, రాయలసీమ జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలకు అవకాశంఉందని పేర్కొన్నారు. మంగళవారం శ్రీకాకుళం, విజయ నగరం, మన్యం, పోలవరం, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలకు అవకాశం ఉందన్నారు.ఈదురుగాలులు, ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల క్రింద, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడొద్దని సూచించారు. వర్షపు గాలుల వల్ల ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే వాటిని గమనిస్తూ వీలైనంత దూరంగా ఉండాలని హెచ్చరించారు.

# ఉమ్మడి కుటుంబమే ముద్దు

>> న్నారు. ఉద్యోగానికి, ఉపాధికి వెళుతున్న మహిళలు పిల్లల పెంపకంలో ఎలా సమన్వయం చేసుకుంటున్నారని అడిగారు. ఇంట్లో భర్త, మగవాళ్లు కూడా పిల్లల పెంపకంలో బాధ్యత తీసుకోవాలని ఈ సందర్భంగా సిఎం అన్నారు. పిల్లల్ని కని, పెంచడం, వారి అలనాపాలనా చూసుకోవడం తల్లికి మాత్రమే పరిమితం చేయకూడదని అన్నారు. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉంటే పిల్లల పెంపకంలో భాగస్వాములు అయ్యేవారని అన్నారు. పిల్లలను విలువలతో పెంచడంలో నాడు అమ్మమ్మలు, తాతయ్యలు, ఇతర కుటుంబ సభ్యులు ఎంతో ముఖ్యమైన పాత్ర పోషించేవారని గుర్తుచేశారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ చాలా బలమైనదని.. అలాంటి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మళ్లీ రావాలని సిఎం చంద్రబాబు అన్నారు. సంతానాన్ని సమస్యగా, భారంగా చూసే విధానం పోవాలని.. సంతానం అంటే సంపద అనే పరిస్థితి వస్తోందని సిఎం అన్నారు. అందుకే ఇద్దరు అంత కంటే ఎక్కువ మంది పిల్లలు ఉండేలా ప్రభుత్వ పరంగా కూడా ప్రోత్సహి స్తున్నామని సిఎం అన్నారు. ఈ విషయంలో ముందుగా తల్లిదండ్రులకు అవగాహన పెంచే కార్యక్రమాలు చేపడతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ కేవీఎన్ చక్రధర్ బాబుతో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులు, జాతీయ ఆరోగ్య మిషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పల్స్ పోలియో ప్రారంభం

>> పోలియో సెంటర్‌లు ఉన్నాయన్నారు. పాయకరావుపేటలో హోంమంత్రి వంగలపూడి అనిత, నందిగామ, జగ్గయ్యపేటల్లో ప్రభుత్వ విప్‌లు తంగిరాల సౌమ్య, శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), ఏలూరు.,కాకినాడ, గుంటూరు, శ్రీకాకుళం, విజయవాడ, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పల్స్ పోలియో కార్యక్రమాలు జరిగాయి. మంత్రుల అచ్చెన్ననాయుడు, పి.శ్రీబాల వీరాంజనేయులు,గుమ్మడి సంధ్యారాణి, వాసంశెట్టి సుభాష్. కొండపల్లి శ్రీనివాస్.కందుల దుర్గేష్,నాదెండ్ల మనోహర్ తదితరలు ఆయా జిల్లాలో పల్స్‌పోలియో కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# భారతి ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ సునీల్ భారతి మిత్తల్‌తో సిఎం చంద్రబాబు భేటీ



ఆదివారం భారతి ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ సునీల్ భారతి మిత్తల్‌తో సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూన్ 28,ప్రభాతవార్తప్రతినిధి:** భారతి ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ సునీల్ భారతి మిత్తల్‌తో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు.సీఎం వ్యక్తిగత కార్యాలయంలో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డిజిటల్ మౌలిక వసతుల అభివృద్ధిపై చర్చించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా డిజిటల్ మౌలిక వసతుల అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, భారతి ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ సునీల్ భారతి మిత్తల్‌తో చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాలకు లాస్ట్‌మైల్ ఇంటర్నెట్ సేవలను విస్తరించే అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. అలాగే రాష్ట్రంలో మొబైల్ టవర్ కనెక్టివిటీని పెంచేందుకు చేపట్టాల్సిన కార్యాచరణ,
డేటా సెంటర్ల ఏర్పాటుకు పెట్టుబడులను ప్రోత్సహించే అవకాశాలు, సముద్రగర్భ ఇంటర్నెట్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ ఏర్పాటు వంటి కీలక అంశాలపై ఇరువురు చర్చించారు. మొబైల్ సేవల సంస్థలకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మరింత మెరుగు పరిచే చర్యలపైకూడా అభిప్రాయాలు పంచుకున్నారు. రాష్ట్రంలో ప్రపంచ స్థాయి డిజిటల్ మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

## వారం - వర్జ్యం

29-06-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆరుద్ర కార్తె
పౌర్ణమి తె.5.26, మూల తె.4.03
వర్జ్యం : రా.2.16-తె.4.03
దు.మ.12.37-మ.1.29,
2) మ.3.14-సా.4.06
శుభసమయం : ఉ.8.00-9.00
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం:** శ్రమకు ఓర్చి మీవంతు సహాయం అందిస్తారు. ఉచిత సలహాలు ఇవ్వకండి. పొదుపు పథకాలు అంది వస్తాయి.

**వృషభం:** దూరమైన ఆప్తులు దగ్గరవుతారు సంతాన విద్యావరంగా అభివృద్ధి కనిపిస్తుంది. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు.

**మిథునం:** అన్యాక్రాంతమైన భూములు, ఇవ్వవలసిన ఋణాలు మొదలయిన విషయాలన్నీ మీకు అనుకూలంగా ఉంటాయి.

**కర్కాటకం:** సంతాన క్షేమం పురోభివృద్ధి సాధిస్తారు. కాలానుగుణంగా ప్రవర్తించడమే విజయానికి మార్గమని గుర్తించండి.

**సింహం:** ప్రముఖులతో చర్చలు సాగిస్తారు. ఇంటిలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

**కన్య :** క్రెడిట్‌కార్డు, పాస్‌పోర్టు వంటివి ఇతరులకు అప్పగించవద్దు. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు.

**తుల:** పొలము, స్థిరాస్తుల తాలూకు ధనము చేతికి వస్తుంది. తప్పుడు లెక్కలు, అబద్ధములు మీ దృష్టికి వస్తాయి.

**వృశ్చికం:** సన్మానాలు, సత్కారాలతో హడావిడిగా కాలం గడుపుతారు. నరఘోష అధికమవుతుంది. బంధువుల కలయిక.

**ధనుస్సు:** కుటుంబంలో ఏర్పడే స్పర్థలు చిన్నపాటి వివాదాలు సర్దుకుంటాయి. దీర్ఘకాలిక సమస్యలను మాత్రం కాలానికి వదిలివేస్తారు.

**మకరం:** ఎంత సాధించినా ఇంకా సాధించాలనే తృప్తి లేని ధోరణి మానసిక ప్రశాంతతను దూరం చేస్తుంది.

**కుంభం:** ఆదర్శప్రాయంగా జీవితం గడపాలనుకొని అందుకు తగిన విధంగా ప్రణాళికలు రూపొందించుకుంటారు.

**మీనం:** ప్రభుత్వ సంబంధమైన చిక్కులను అతియుక్తిగా తప్పించుకోగలుగుతారు. వాహనాలు కొనుగోలు చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# తోతాపురి మామిడి రైతులకు కేంద్రం అండగా నిలవాలి

## 7.03 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లకు రూ.281 కోట్ల ఆర్థిక సహకారం ఇవ్వాలి

## మామిడి రైతుల కోసం ప్రైస్ డెఫిషియన్సీ పేమెంట్ స్కీం అమలు చేయాలి: సిఎం చంద్రబాబు

**విజయవాడ, జూన్ 28, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని తోతాపురి మామిడి రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభాన్ని అధిగమించేందుకు చొరవ తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సిఎం లేఖ రాశారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ కింద ప్రైస్ డెఫిషియన్సీ పేమెంట్ స్కీం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ పరిణామాలతో మ్యాంగో పల్ప్ ఎగుమతులు నిలిచిపోవడం, పరిశ్రమలు కొనుగోళ్లు నిలిపివేయడంతో మార్కెట్‌లో తోతాపురి ధరలు పడిపోయాయని లేఖలో పేర్కొన్నారు. మామిడి రైతులను ఆదుకునేందుకు కేంద్రం రూ.281 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించాలని ముఖ్యమంత్రి ఆ లేఖలో కోరారు. దేశంలోనే మామిడి ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉందని, రాష్ట్రవ్యాప్తంగా 3.99 లక్షల హెక్టార్లలో సాగవుతూ 52.65 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తోందని చంద్రబాబు వివరించారు. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలోని చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, కడప జిల్లాల్లో దాదాపు 91,011 హెక్టార్లలో తోతాపురి రకం సాగవుతోందని తెలిపారు. దీని ద్వారా 8.65 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తూ లక్షలాది రైతు కుటుంబాలకు జీవనాధారంగా ఉందని పేర్కొన్నారు. అయితే, ప్రస్తుత సీజన్‌లో పెట్టుబడి వ్యయం పెరగడం, మార్కెట్ ధరలు కుప్పకూలడంతో మామిడి రైతులు ఇబ్బందుల్లో ఉన్నారని లేఖలో పరిస్థితిని వివరించారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని 7.03 లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడి కొనుగోళ్లకు మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం అమలు చేస్తున్నట్టు సీఎం లేఖలో వెల్లడించారు. దీంట్లో భాగంగా కిలోకు అదనంగా రూ.4 చొప్పున మామిడి రైతులకు ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఈ మేరకు పీడీపీఎస్‌కింద కేంద్రం మద్దతివ్వాలని... ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు జరిగే ఈ కొనుగోళ్లకు కేంద్ర ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీంను అమలు చేసేలా చూడాలని కేంద్రమంత్రికి రాసిన లేఖలో ముఖ్యమంత్రి కోరారు.

# రొట్టెల పండుగకు జన ప్రభంజనం

>> మార్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు.

**కోర్కెలు తీరిన వారు రొట్టెలను వదలడం**

కోర్కెలతో వచ్చిన వారు ఆ రొట్టెలను స్వీకరించడం వంటి దృశ్యాలతో స్వర్ణాల చెరువు ఘాట్ పరిసర ప్రాంతాలు సరికొత్త శోభను సంతరించుకున్నాయి. ఉద్యోగం, వివాహం, సంతాన రొట్టెలకు డిమాండ్ పెరిగింది. జిల్లా యంత్రాంగం పటిష్ఠంగా చేపట్టిన ఏర్పాట్ల పట్ల సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.
దర్గా ప్రాంగణంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, క్యూలైన్లు సజావుగా సాగేలా, శాంతి భద్రతలను పరిరక్షించేందుకు పటిష్ఠ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలీస్ కంట్రోల్ రూం 24 గంటలు అనౌన్స్మెంట్ చేస్తూ ఎప్పటికప్పుడు భక్తులను అప్రమత్తం చేస్తున్నారు. తప్పిపోయిన చిన్నారులను, వృద్ధులను వెంటనే సంబంధికులకు అప్పగిస్తున్నారు. భక్తులు పోగొట్టుకున్న పర్సులను అందిస్తున్నారు. దీంతో పోలీసు కంట్రోల్ రూం సేవలను అందరూ శభాష్ అని మెచ్చుకుంటున్నారు.

**పారిశుద్ధ్య సిబ్బంది సేవలు భేష్..**

దర్గా పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్తా చెదరాన్ని తొలగిస్తూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారు. దర్గా ప్రాంగణాన్ని ఏడు జోన్లుగా విభజించి పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం చేపడుతున్నారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు సెప్టిక్ ట్యాంక్ వాహనాల ద్వారా శుభ్రపరుస్తున్నారు. దీంతో దర్గా పరిసరాలు పరిశుభ్రతతో కళకళలాడుతున్నాయి. మున్సిపల్ కమిషనర్ నందన్, హెల్త్ ఆఫీసర్ చైతన్య ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

**వైద్య శిబిరాలను వినియోగించుకుంటున్న భక్తులు**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలు భక్తులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ప్రత్యేక వైద్యులను, సిబ్బందిని బ్యాచ్‌ల వారీగా నియమించి 24 గంటలూ భక్తులకు వైద్య సేవలందిస్తున్నారు. మెరుగైన వైద్యంకోసం భక్తులను అంబులెన్స్‌లద్వారా ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తున్నారు. మూడురోజుల్లో సుమారు 3000 మంది పైగా భక్తులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేసినట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుజాత తెలిపారు.

**అప్రమత్తంగా అగ్నిమాపక శాఖ..**

స్వర్ణాల చెరువులో ఏ చిన్న ప్రమాదం జరగకుండా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టారు. 24 గంటలూ అప్రమత్తంగా బోట్లు, రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచారు.



ఆదివారం న్యూఢిల్లీలో రాష్ట్రీయ గ్రామీణ వికాస్ సమ్మేళన్'ను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తదితరులు

# మోడీకి సీషెల్స్ అత్యున్నత పురస్కారం

>> ఇన్ ఇండియా ఫాస్ట్ ప్యాట్రోల్ వెసెల్ పీఎస్ లెస్ప్వార్‌తో పాటు ఆరు అంబులెన్స్‌లు, 10 యుటిలిటీ వాహనాలు, ఐదు లేజర్ రేడియల్ బోట్లను సీషెల్స్‌కు ప్రధాని మోడీ అందజేశారు. ఈ సహాయం సీషెల్స్ సముద్ర నిఘా సామర్థ్యాన్ని బలోపేతం చేస్తుందని విదేశాంగ శాఖ పేర్కొంది. అనంతరం ఇరు దేశాల నేతలు కలిసి సీషెల్స్ నేషనల్ బొటానికల్ గార్డెన్‌లో అరుదైన కోకో డి మెర్ మొక్కను నాటారు. ప్రధాని మోడీకి అంతర్జాతీయ పురస్కారాలు రావడం ఇదే తొలిసారి కాదు. ఈ యేడాది మే నెలలో ఆహార భద్రతకు చేసిన సేవలకు గాను ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ అత్యున్నత పురస్కారం అగ్రికోలా మెడల్ అందుకున్నారు. గతంలో 2018లో సియోల్ శాంతి బహుమతి, ఐక్యరాజ్యసమితి ఛాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్ అవార్డులు కూడా ఆయనను వరించాయి.

# 22 రాష్ట్రాల్లో విస్తరించిన 'నైరుతి'

>> ఈశాన్య రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండి హెచ్చరిక జారీ చేసింది. అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపుర రాష్ట్రాల్లో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, ఉత్తర భారతదేశంలోని ఢిల్లీ, బీహార్, హర్యానాలలో వడగాలుల పరిస్థితులు కొనసాగే అవకాశం ఉంది.

**జులై 4 వరకు తెలంగాణలో భారీ వర్షాలు**

రాబోయే ఏడు రోజులలో తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు, ఉరుములతో కూడిన గాలులు, ఈదురు గాలులు వీస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) అంచనా వేసింది. ఈ మేరకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఐఎండి అంచనాల ప్రకారం, పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉండగా, అక్కడక్కడా మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో గాలి వేగం గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వరకు చేరవచ్చు. ఈ వాతావరణ పరిస్థితుల కారణంగా తెలంగాణ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉంది. ఆదివారం సంగారెడ్డిలో గరిష్ట ఉష్ణోగ్రత 28 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు కాగా, హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో 30.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. హైదరాబాద్‌లో రాబోయే రోజుల్లో వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులతో పాటు ఆకాశం సాధారణంగా మేఘావృతమై ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. జులై 1 వరకు అడపాదడపా జల్లులు పడే అవకాశముంది. నగరంలోని కొన్ని ప్రాంతాలు, చుట్టుపక్కల ప్రాంతాలలో మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో చెదురుమదురుగా ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

# రూ. 27.5 కోట్ల భారీ విరాళం

>>అనంత్ అంబానీకి దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. దర్శనానంతరం ఆలయ పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించారు.స్వామివారి చిత్రపటం బహుకరించారు. ఈ సందర్భంగా వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఆయన టిటిడికి భారీ విరాళం ప్రకటించారు. దాదాపు 27.5 కోట్ల రూపాయలతో 25 ఎలక్ట్రిక్ బస్సులు విరాళంగా ఇస్తానని ప్రకటించారు. ఈ బస్సుల నిర్వహణ, డ్రైవర్ల జీతాలు కూడా తామే భరిస్తామని రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ వెల్లడించారు. అనంతరం ఆలయం వెలుపల టిటిడి అధికారులతో మాట్లాడిన అనంత్ అంబానీ తిరుమలలో జరుగుతున్న సేవా కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. బస్సుల నిర్వహణకు అవసరమైన ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు కూడా నిధులు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. అలాగే రిలయన్స్ సంస్థ గుజరాత్ వంతారాలో నిర్వహిస్తున్న టిటిడి గోశాల ఆధునికీకరణకు అంగీకారం తెలిపారు. టిటిడి అధికారులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

# ఆందోళన బాటలో ఆర్టీసీ ఉద్యోగులు

>> సమావేశంలో జేఏసీ కమిటి తీసుకున్న నిర్ణయాల మేరకు రెండవ దశ ఆందోళన కార్యక్రమాల షెడ్యూల్‌ను లిఖితపూర్వకంగా రేపు సిఎం, సిఎస్, రవాణామంత్రి, ఆర్టీసి ఎండి, ఇతర అధికారులకు అందించనున్నారు. ఇందులో జూలై 7, 8న రెండు రోజులు "ఏపీఎస్ ఆర్టీసీ పరిరక్షణ దినం" గా పాటిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసి ఉద్యోగులందరూ డిమాండ్లతో కూడిన ప్రింటెడ్ బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహిస్తారు.జూలై 9 నుండి 18 వరకు ప్రజాప్రతినిధుల మద్దతు కోరే కార్యక్రమం నిర్వహిస్తారు. జూలై 19 నుండి 26 వరకు వినతిపత్రాలపై ఆర్టీసిలో ఉద్యోగులందరితో సంతకాల సేకరణ చేస్తారు. జూలై 27న గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ల ద్వారా సీఎంకు ఉద్యోగుల సంతకాల సేకరణతో కూడిన వినతిపత్రాలను అందిస్తారు. జూలై 30న జేఏసీ రాష్ట్ర స్థాయి సమావేశం విజయవాడలో నిర్వహించి, మూడవ దశ ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తారు.

# మినీ వాహనాన్ని ఢీకొన్న లారీ

>> మద్యం సేవించి అప్రమత్తంగా వాహనాన్ని నడిపే క్రమంలో మినీ వాహనానికి లారీ బలంగా ఢీకొంది. మినీ వాహనం విద్యుత్ స్తంభానికి ఢీకొని పక్కనే ఉన్న పొలాల్లో పడిపోయింది. తరినమ్మ, మురపాల పార్వతి, ఎన్ పద్మమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనలో ముగ్గురు మహిళలు అక్కడికక్కడే మృతి చెందగా డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురు గాయాల పాలయ్యారు. మిగిలిన వారిలో ఒకరు పరిస్థితి ఇబ్బందికరంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బరంపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న కవిటి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 1నుంచి జిల్లాల్లో సిఎం పర్యటనలు

>> ఈ వర్క్ షాప్‌నకు నీతి ఆయోగ్ సభ్యులతో పాటు, పిఎం ఎకనమిక్ అడ్వైజరీ కౌన్సిల్ సభ్యులు హాజరవుతారు. రెండవ తేదీ రాత్రి తిరుపతిలోనే సిఎం బస చేస్తారు. 3వ తేదీ ఉదయం కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం సున్నపురాళ్లపల్లెలో రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులను ప్రారంభించనున్నారు.
అనంతరం మూడు రోజుల పర్యటనలో భాగంగా అక్కడి నుంచి సిఎం చంద్రబాబు కుప్పం బయలుదేరి వెళతారు. 3 తేదీ నుంచి 5 వతేదీ వరకు సిఎం కుప్పంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. 5వ తేదీన అమరావతికి తిరిగి చేరుకుంటారు.

# కూరగాయలు వ్యాన్ బోల్తా

## 10 మందికి తీవ్రగాయాలు

**వరదయ్యపాలెం, జూన్ 28 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలం చిన్నపాండురు వికెఆర్ కాలనీ వద్ద కూరగాయలు వ్యాన్ బోల్తా పడి 10 మందికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి. సత్యవేడు మండలంకు చెందిన వారు కూరగాయలు వ్యాన్‌లో సంతకు వెళుతుండగా ప్రమాద శాత్తు చిన్నపాండురు వి కె ఆర్ కాలనీ దగ్గర బోల్తా పడిపోయింది. అందులో వున్న 10 మందికి తీవ్రగాయాలు అయ్యాయి. అందులో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు.
గాయపడిన వారిలో చెన్నై హాస్పిటల్‌లో 6 మంది, తిరుపతి రుయా హాస్పిటల్‌లో ముగ్గురు వ్యక్తులు చికిత్స తీసుకుంటున్నారని తెలిపారు. కాయగూరల వ్యాపారం చేసేందుకు సంతకు వెళ్లి ప్రమాదానికి గురైన వారిలో ఈశ్వరన్ (50), కంసాల (40), పాండియన్ (41), మురళి (49), వేండ (45), నాగభూషణమ్మ (60), గోపి (50), వసంతమ్మ (65),వనిత (46)లు వున్నారు. వారిలో ఆందోళన కరంగా వున్న వారిలో ఈశ్వరన్ (50), కంసాల( 40), పాండియన్ (41),మురళి (49), వేండ(45),వనిత (46)లు ఉన్నట్టు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న సత్యవేడు శాసనసభ్యులు కోనేటి ఆదిమూలం దిగ్భ్రాంతి చెందారు. ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్‌కి చరవాణి ద్వారా సమాచారం తెలిపారు.

# 'స్మార్ట్ కిచెన్స్'పై ఆరోపణలన్నీ నిరాధారం



## • స్పష్టతను ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం

**విజయవాడ, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ పాఠశాలల్లో అమలువుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో స్మార్ట్ కిచెన్స్ విధానంపై వస్తున్న ఆరోపణలను ఏపీ ప్రభుత్వం ఖండించింది. ఈ మేరకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ విభాగం ఒక ప్రకటన విడుదల చేసింది. పభుత్వం ప్రతిపాదిస్తున్న స్మార్ట్ కిచెన్లపై కొందరు రాజకీయ స్వార్థంతో చేస్తున్న ఆరోపణలు ముమ్మాటికీ అవాస్తవం, ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్ర మాత్రమేనని ఈ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఆరోపణలను ప్రభుత్వం తీవ్రంగా ఖండిస్తోందని స్పష్టం చేసింది. విద్యార్థుల ఆరోగ్యమే పరమావధిగా స్మార్ట్ కిచెన్స్ లక్ష్యం ఏర్పాటు అని ప్రకటనలో వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద, మధ్యతరగతి విద్యార్థులకు మరింత సమర్థవంతంగా, అత్యంత పరిశుభ్రమైన వాతావరణంలో, నాణ్యమైన, పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించే ఏకైక సంకల్పంతోనే ప్రభుత్వం స్మార్ట్ కిచెన్స్ విధానాన్ని పరిశీలిస్తోంది. ఆధునిక సాంకేతికతను జోడించి విద్యార్థుల ఆరోగ్య భద్రతను మెరుగుపరచడం ప్రభుత్వ బాధ్యతని ప్రకటనలో ప్రభుత్వం వివరించింది.

**కార్మికుల తొలగింపు లేదు, ఉపాధికి పూర్తి భద్రత:** స్మార్ట్ కిచెన్ల పేరుతో వంట కార్మికులను తొలగిస్తున్నారనే ప్రచారంలో ఎలాంటి నిజం లేదు. ఎక్కడా, ఒక్క కుక్‌ను కూడా తొలగించడం లేదు. దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న దాదాపు 85 వేల మంది అక్కచెల్లెమ్మల సేవలను ప్రభుత్వం పూర్తిగా గౌరవిస్తుంది. వారి సంక్షేమానికి, ఉపాధి భద్రతకు ఎలాంటి భంగం కలగకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుంటుంది. కార్మికుల పొట్ట గొట్టే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు.

**జీతాల బకాయిలపై స్పష్టత:** మధ్యాహ్న భోజన కార్మికులకు ఇప్పటికే ఈ ఏడాది ఏప్రిల్ నెల వరకు జీతాలను/ గౌరవ వేతనాలను పూర్తిగా చెల్లించడం జరిగింది. సాంకేతిక కారణాల వల్ల నిలిచిన మిగిలిన స్వల్ప బకాయిలను కూడా త్వరితగతిన విడుదల చేయడానికి ప్రభుత్వం ఇప్పటికే నిధులు సమకూర్చింది. అతి త్వరలోనే ఈ నిధులు కార్మికుల ఖాతాల్లో జమ అవుతాయి. గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన దాదాపు రూ.350 కోట్ల పైచిలుకు బకాయిలను ప్రస్తుత ప్రభుత్వం విజయవంతంగా విడుదల చేసింది. ఈ నిధులలో పాఠశాలల్లో పనిచేసే ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌ల జీతాలతో పాటు, విద్యార్థులకు అందించే గుడ్లు, చిక్కీలు, శానిటరీ నాప్‌కిన్ల వెండర్లకు సుదీర్ఘకాలంగా ఇవ్వాల్సిన బకాయిలు కూడా కలిసి ఉన్నాయి; దీనితో లబ్ధిదారులందరికీ పెద్ద ఉపశమనం లభించింది.

**రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం వద్దు:** విద్యార్థులకు మేలు చేసే సంస్కరణలను, కార్మికుల జీవనోపాధిని దెబ్బతీసే చర్యగా చిత్రీకరించడం శోచనీయం. రాజకీయ ఉనికి కోసం, ప్రజల్లో అభద్రతా భావాన్ని సృష్టించడానికి చేస్తున్న ఇలాంటి నిరాధార ఆరోపణలను ప్రజలు నమ్మవద్దు. విద్యార్థులకు సురక్షితమైన, పోషకాహారం అందించడంతో పాటు అటు మధ్యాహ్న భోజన కార్మికుల సంక్షేమాన్ని, వారి హక్కులను కాపాడటానికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తుందని ఈ సందర్భంగా పునరుద్ఘాటిస్తున్నాము. కార్మికులు ఎలాంటి ఆందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని ప్రభుత్వం తెలిపింది.

# పోలియో రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

## బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత



**విజయవాడ, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో పోలియో రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం పల్స్ పోలియో కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత అన్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావుతో కలిసి మధురానగర్‌లో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని చిన్నారులకు రెండు పోలియో చుక్కలు వేసి మంత్రి సవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ పోలియో నిర్మూలనకు ప్రతి తల్లిదండ్రి బాధ్యతగా తమ ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆశయాలకు అనుగుణంగా, భావితరాల ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తోందన్నారు. సుమారు రూ.6.5 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని అన్ని సచివాలయాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మొబైల్ పోలియో బూత్‌ల ద్వారా కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి చిన్నారికి రెండు చుక్కల పోలియో వ్యాక్సిన్ అందించి, ఆంధ్రప్రదేశ్‌ను సంపూర్ణ పోలియో రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మంత్రి పిలుపునిచ్చారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పోలియో రహిత భారతదేశ నిర్మాణమే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రధాని నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో పోలియో నిర్మూలనపై విస్తృత ప్రచారం నిర్వహించి, తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకువచ్చామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో పోలియో పూర్తిగా నిర్మూలన కావడం ప్రభుత్వాల సమిష్టి కృషి ఫలితమని, ఈ మహమ్మారి మళ్లీ ప్రబలకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగానే పల్స్ పోలియో కార్యక్రమాలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వానికి అధికారం ఒక అలంకారం కాదని, ప్రజాసేవ అనే బాధ్యత అని పేర్కొన్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ నుంచి ముఖ్యమంత్రి వరకు ప్రజలకు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి తల్లిదండ్రి సద్వినియోగం చేసుకుని తమ చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో డిఎమ్ అండ్ హెచ్ఒ జె.ఇందుమతి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రీతి అభిషా, జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి బి.శరత్ బాబు, జిల్లా హెల్త్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పి.నవీన్ కుమార్, రోటరీ క్లబ్‌కు చెందిన వై.పార్థసారథి, కె.మధు, మధురానగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుమల సమాచారం



### స్వర్ణకవచంలో శ్రీభూసమేత మలయప్ప

**తిరుమల, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవారి ఆలయంలో ఆగమోక్తంగా మూడు రోజులు జరిగిన జ్యేష్ఠాభిషేకం ఆదివారం శాస్త్రోక్తంగా ముగిసింది. చివరిరోజు ఆదివారం ఉభయదేవేరులతో కలిసి మలయప్ప స్వామి బంగారు కవచంలో పునః దర్శనమిచ్చారు. మళ్లీ జ్యేష్ఠాభిషేకం వరకు సంవత్సరం పొడవునా స్వామి, అమ్మవార్లు ఈ బంగారు కవచంతోనే ఉంటారు. ఉదయం మలయప్పస్వామి ఉభయదేవేరులతో కలిసి ఆలయంలోని సంపంగి ప్రాకారానికి వేంచేపు చేశారు. ఆలయ అర్చకులు, వేదపారాయణదారులు శాస్త్రోక్తంగా మహా శాంతి హోమం నిర్వహించారు. మలయప్ప స్వామికి, దేవేరులకు స్నపనతిరుమంజనం చేపట్టారు. అనంతరం స్వర్ణ కవచాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవలో స్వామి, అమ్మవార్లు బంగారు కవచంలో దర్శనమిచ్చారు. ఆ తరువాత ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులను కటాక్షి ంచారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు సదాశివరావు, జానకిదేవి, సుచిత్ర ఎల్లా, డిప్యూటీ ఇఒ

# అన్ని రంగాలలోనూ ఎపి అగ్రగామి

## • అమరావతి నిర్మాణం వేగంగా పూర్తికావాలి: మంత్రి దుర్గేష్

**తిరుమల, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** విజన్ ఉన్న నేత, సిఎం చంద్రబాబునాయుడు, డి.సిఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాలలోనూ అగ్రగామిగా దూసుకుపోవాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఆకాంక్షించారు. కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. అత్యంత నిష్ఠతో చాతుర్మాస దీక్షను స్వీకరించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దీక్ష ఎటువంటి విఘ్నాలు లేకుండా, నిరాకంటంగా, దిగ్విజయంగా పూర్తికావాలని ఏడుకొండలస్వామినివేడుకున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం, ప్రజల శ్రేయస్సు కోసం ఆయన పడుతున్న తపన, చేస్తున్న కృషి సంపూర్ణంగా సఫలీకృతం కావాలని, అందుకు ఆ భగవంతుని కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షి ంచారు. మన ప్రజా రాజధాని అమరావతి నిర్మాణ పనులు ఎటువంటి ఆటంకాలు లేకుండా, అత్యంత వేగం పుంజుకుని, ప్రజలందరి ఆకాంక్షలకు ప్రతిరూపమైన అద్భుత రాజధానిగా త్వరలోనే సాకారం కావాలని స్వామివారి పాదాల చెంత ప్రార్థించినట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్ర సంక్షేమం, ప్రజా రాజధాని నిర్మాణంపై శ్రీవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని ఆశిస్తున్నానన్నారు. ఆదివారం ఉదయం నిడదవోలు జనసేన నాయకులతో కలిసి తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ సాంప్రదాయాల ప్రకారం ఉదయం ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు





### జలవిహారంలో సేదదీరిన పద్మావతిదేవి

**తిరుమల, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుచానూరు పద్మావతి అమ్మ వార్షిక తెప్పోత్సవాల్లో ఆదివారం సాయంత్రం పద్మసరోవరంలో సిరులతల్లి పద్మావతిదేవిగా తెప్పపై విహరించి భక్తులకు దివ్యదర్శనం ప్రసాదించారు. మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవమూర్తికి పాలు, పెరుగు, తేనె, చందనం, సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకం జరిపారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పద్మపుష్కరిణి వద్దకు వేంచేపు చేసి, తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగి భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్, ఆలయ డిప్యూటీ ఇఒ పి. హరీంద్రనాథ్, ఎవిఎస్ఒ రాధాకృష్ణ, సూపరింటెండెంట్‌లు సురేష్, రమేష్, ఆలయ ఇన్‌స్పెక్టర్ చలపతి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# తిరుమలలో 5,255 మంది పిల్లలకు పోలియో చుక్కలు



**తిరుమల, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశవ్యాప్త పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం తిరుమల శ్రీవారి ఆలయం వద్ద పల్స్ పోలియో కార్యక్రమాన్ని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి ప్రారంభించారు. పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. టిటిడి ముఖ్య వైద్యాధికారి డాక్టర్ ఎస్.కుసుమ కుమారి ఆధ్వర్యంలో తిరుమలలో 25 ప్రాంతాలలో పల్స్‌పోలియో కేంద్రాలు పనిచేశాయి. శ్రీవారి ఆలయంతో కలిపి 21ప్రాంతాలలో భక్తులకు, 4ప్రాంతాలలో స్థానికులకు ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు 5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అశ్విని ఆసుపత్రి, జియన్‌సి, ఆర్‌టిసి బస్టాండ్, సిఆర్ఓ, పిఏసి 1, 2, ఎమ్‌బిసి 34, వైకుంఠం 1, 2, హెల్త్ ఆఫీసు, ఎటిసి, మేదరమిట్ట, వరాహస్వామి, రాంభగీచ అతిథి గృహాలవద్ద, శ్రీవారి ఆలయం లోపల, కల్యాణకట్ట, బాలాజీ నగర్, టిటిడి ఉద్యోగుల డిస్పెన్సరి ఎస్.వి. హైస్కూల్, పాపావినాశనం, అలిపిరి కాలినడక మార్గంలో పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల్లో కలిపి మొత్తం 5,255 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.

# ఏడుకొండలస్వామీ... ఎక్కడున్నావయ్యా!

## - వెంకన్న దర్శనానికి కిలోమీటర్లు క్యూలు



**తిరుమల, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** దాదాపు 1.50లక్షల మందికి పైగా భక్తులు తిరుమలకు తరలిరావడంతో ఆదివారం కూడా కొండంతా భక్తజనంతో నిండిపోయింది. శనివారం రాత్రికే సామాన్య భక్తులు శ్రీవారి దర్శనం కోసం 28 గంటలపైగా నిరీక్షించాల్సి వచ్చింది. ఆదివారం ఉదయానికి మరింతమంది భక్తులు దేశం నలుమూలల నుండి భారీగా తరలిరావడంతో ఐదు కిలోమీటర్లు దూరం క్యూలైన్లు వ్యాపించాయి. చంటిపిల్లలు, చిన్నారులతో పెద్దలతో, వృద్ధ భక్తులు గోవింద నామస్మరణతో క్యూలైన్లలోనే పడిగాపులు కాస్తున్నారు. ఆదివారం ఉదయానికి కూడా బాటగంగమ్మ ఆలయం వరకు భక్తుల లైన్లు వ్యాపించాయి. శనివారం అర్ధరాత్రి వరకు 85,582మంది భక్తులకు మహాలఘులో శ్రీవారి దర్శనం చేయించారు. 4.66లక్షల లడ్డూలు అమ్మకాలు జరిగాయి. కానుకల రూపంలో హుండీకి రూ.3.72 కోట్ల ఆదాయం చేకూరింది. ముందే ఊహించిన టిటిడి అధికారులు ఒక పథకం ప్రకారం వ్యూహాత్మకంగా ముందుగానే శ్రీవారి సేవకులను సిద్ధంచేసి వెలుపల క్యూలైన్లలో భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ, కాఫీ, పాలు అందించినా క్యూలైన్లలోనికి చేరుకోలేని భక్తులు ఖాళీస్థలాల్లో, కాటేజీల ప్రాంతాల్లో నిరీక్షించడం కనిపిస్తోంది. వీరికి కనీస సౌకర్యాలు అందక అవస్థలు పడుతున్నారు. ఇదే నేపథ్యంలో అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి క్షణకాల దర్శనం కోసం రోజుకు లక్షలాదిమంది భక్తులు దేశం నలుమూలల నుండి తరలివస్తున్నారు. వచ్చిన ప్రతి భక్తునికి సంతృప్తికర దర్శనమ్ కల్పించే మాట ఎలా ఉన్నా అనూహ్యంగా భారీగా భక్తులు తరలివస్తే ఆలయం వెలుపల కిలోమీటర్లు దూరం క్యూలైన్లు బారులు తీరి భక్తులు గంటల తరబడి నిరీక్షిస్తుండటం పరిపాటిగా మారింది. వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం సాధారణ రోజుల్లోనే లక్షమంది వరకు భక్తులు కొండపైకి వస్తే వైకుంఠమ్ 1, వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్‌లలో 62 కంపార్టుమెంట్లు నిండిపోతున్నాయి. ఒక్కో కంపార్టుమెంట్‌లో 400మంది లెక్కన 25వేల మంది వరకు భక్తులు కూర్చునేందుకు సౌకర్యంగా ఉంటుంది. ఆ తరువాత వచ్చిన సామాన్యభక్తులు ఏటిసి, నారాయణగిరి ఉద్యానవనాల మీదుగా శిలాతోరణం, బాటగంగమ్మ ఆలయం, గోగర్భమ్ డ్యామ్ వరకు విస్తరించిన క్యూలైన్లలో నుండి ఆలయంలోనికి చేరుకోవాల్సి ఉంది. అదేగాక 60వేల మంది భక్తులు దాటితే ఇక క్యూలైన్లు చాంతాండంత దూరం వ్యాపిస్తాయి. సర్వదర్శనానికి రద్దీరోజుల్లో, వారాంతం రోజుల్లో ఏకంగా 30 గంటలు నిరీక్షించాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. వేల కిలోమీటర్లు దూరం నుండి ఇష్టదైవమ్ దర్శనానికి వస్తున్న భక్తులకు వెలుపల క్యూలైన్లలోనే దేవుడు కనిపిస్తుంటాడు. ఈ విధానం లో మార్పు తీసుకువచ్చి సామాన్య భక్తులకు క్యూలైన్లు చేరువచేయడం ప్రస్తుతం టిటిడి అధికారులకు ఉన్న తక్షణ కర్తవ్యం. టిటిడి అధికారులు భక్తులు సంయమనం పాటించాలని, దర్శనం సమయం వచ్చేవరకు ఓపికతో ఉండాలని ప్రసార సాధానాల ద్వారా ప్రచారం చేయడం పరిపాటిగా మారింది. 18, 24గంటలు వరకు క్యూలైన్లలోకి రావద్దని విజ్ఞప్తి చేస్తుంటారు. అయితే ప్రత్యామ్నాయం మాత్రం ఆలోచన చేయడంలేదు.

### క్యూలైన్లు కుదింపు పై అధ్యయనం ఏదీ!?:

ఏడుకొండలవాడా నామస్మరణతో తిరుమలకు వస్తున్న సామాన్యభక్తులు ఆలయాన్ని చేరుకునేందుకు కిలోమీటర్లు దూరం విస్తరించిన క్యూలైన్లలో అవస్థలు తప్పడంలేదు. వైకుంఠమ్ కంపార్టుమెంట్లు నిండితే ఇక సామాన్యభక్తులు ఎక్కడ నుండి వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌కు చేరుకోవాలనేది అర్థంకాని ప్రశ్నగా మారింది. ఇప్పటికీ తిరుమలేశుని దర్శనం కోసం టిటిడి అధికారులు రోజువారీగా ఆన్‌లైన్‌లో 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనాలు, ఆర్జితసేవలు, కాలినడక భక్తులకు దివ్యదర్శనమ్ దర్శనాలు, సామాన్యభక్తులకు సర్వదర్శన టైమ్‌స్లాట్ దర్శనాలు, సాధారణ సర్వదర్శనం దర్శనాలు అమలవుతున్నాయి. ఎలాంటి దర్శన టోకెన్లు, టిక్కెట్లు లేని భక్తులు నేరుగా తిరుమలకు వస్తే గతంలో వైకుంఠమ్ 2క్యూకాంప్లెక్స్ వద్ద క్యూలైన్లలో నుండి భక్తులు ఆలయంలోనికి చేరుకునే విధానం ఉండేది. ఇప్పుడు సామాన్య భక్తులు ఈ దరిదాపుల్లోకి కూడా రావడం లేదు. తిరుమలలో సులభంగా భక్తులు ఆలయంలోనికి చేరుకునేందుకు వీలుగా వైకుంఠమ్ 3 క్యూకాంప్లెక్స్ నిర్మాణం అవసరమనేది భక్తుల నుండి వస్తున్న సూచనలు. 2014వ సంవత్సరంలోనే వైకుంఠమ్ 1కు సమీపంలో ఏటిసి వద్ద ప్రత్యేక ప్రవేశ దర్శనాల కాంప్లెక్స్‌ను, కాలినడక భక్తులకు దివ్యదర్శనం కాంప్లెక్స్‌కు అప్పటి టిటిడి ఇఒ డాక్టర్ సాంబశివరావు ముందుచూపుతో నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ రెండు విధానాల్లో టిక్కెట్లు ఉన్న భక్తులు నేరుగా ఈ కాంప్లెక్స్‌ల వద్దకు చేరుకుని ఆలయంలోనికి వెళ్ళేవారు. అయితే ఇప్పుడు ఈ విధానం అమలు కాకపోగా కిలోమీటర్లు బారులుతీరిన క్యూలైన్లు సామాన్యభక్తుల ఓపికను పరీక్షించేలా టిటిడి అధికారులు వ్యవహరిస్తున్నారు. అధికారులు తమదైన రీతిలో విధానాల్లో మార్పులు తీసుకుంటూ సామాన్యభక్తులకు దర్శనంలో చుక్కలు చూపిస్తున్నారనేది విమర్శలు.

### వెంకన్న దర్శనానికి 24గంటలు

### నేడు విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు

వరుసగా మూడురోజులు సెలవులు రావడం, వారాంతంతో మూడురోజులుగా తిరుమల భక్తజన సంద్రంగా మారింది. ఇష్టదైవమ్ దర్శనానికి భక్తులు భారీగా చేరుతున్నారు. ఆదివారం ఉదయానికి వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లలోని 32 కంపార్టుమెంట్లు నిండిపోయి భక్తులు వెలుపల బాటగంగమ్మ ఆలయం వరకు ఐదు కిలోమీటర్లు క్యూలైన్లలో బారులుతీరారు. దీంతో స్వామివారి సర్వదర్శనానికి 24గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనానికి పదిగంటల పైగానే భక్తులు నిరీక్షిస్తున్నారు. టైమ్‌స్లాట్ భక్తులకు పదిగంటల సమయం పడుతోంది. గదులు దొరకని భక్తులు ఆరుబయట, పార్కుల్లో, షెడ్లలో తలదాచుకుని విశ్రాంతి పొందుతున్నారు. ఆదివారం సాయంత్రం వరకు 49వేల మంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా 30వేల మంది భక్తులు అర్ధరాత్రి వరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. భక్తులు భారీగా తిరుమలకు చేరుకోవడంతో గదులు దొరక్క అవస్థలు తప్పడం లేదు. తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య భారీగా ఉండటంతో అలిపిరి సెక్యూరిటీ తనిఖీ కేంద్రం వద్ద తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. భారీ రద్దీ వేళ ఒకేసారి వేలాది ప్రైవేట్ వాహనాలు అలిపిరి సెక్యూరిటీ చెక్ పోస్టు వైపు దూసుకురావడంతో, కపిలతీర్థం, లీలామహల్ బైపాస్ రోడ్లపై భారీ వాహనాల సందడి నెలకొంది.

# భక్తజనసంద్రంగా కాణిపాకం ఆలయం



**కాణిపాకం, జూన్ 28 ప్రభాతవార్త:** సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయం భక్తుల రద్దీతో కాణిపాకం కిటకిటలాడింది. సాధారణంగా ఆలయంలో వారాంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఈమేరకు శుక్ర, శని, ఆదివారాలు వరుస సెలవు రోజులు కావడంతో కాణిపాకం ఆలయ దర్శనార్థం భక్తులు వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం ఆలయ దర్శనానికి భారీగా తరలి రావడంతో ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్ని భక్తులతో పోటెత్తింది. ఈమేరకు గత నాలుగు రోజులుగా ఆలయంలో రద్దీ కొనసాగుతోంది. రద్దీ కారణంగా ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టికెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లులో సుమారు నాలుగు గంటలకు పైగా వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. దీనితో భక్తులకు త్వరితగతిన స్వామిదర్శనం కల్పించేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. అలాగే ఆలయ క్యూలైన్లు వద్ద భక్తులకు దేవస్థానం తరపున ఉచితంగా మజ్జిగ, త్రాగునీరు, సాంబారు అన్నం అందించారు. దీనితో పాటు వేసవి ఉపశమన చర్యల్లో భాగంగా కూలైన్లు వద్ద కూలర్లను ఏర్పాటు చేశారు.

# జులై ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు రూ.2711.79 కోట్లు విడుదల

**విజయవాడ, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా జులై నెలలో 62,19,648 మంది పింఛన్‌దారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసేందుకు రూ.2711.79 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆయన కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదలయింది. జులై 1వ తేదీ ఉదయం నుంచే రాష్ట్ర వ్యాప్తంగా ఈ పెన్షన్లు పంపిణీ చేస్తామని, కొత్తగా మంజూరైన 7,792 మంది వితంతు లబ్ధిదారులకు జులై 1న పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం రూ.3.12 కోట్లను విడుదల చేసినట్టు మంత్రి తెలిపారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు పెన్షన్ల కోసం ఈ నెల విడుదల చేసిన నిధులతో కలుపుకుని రూ.68,598.44 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసిందని, నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ నిధులను ప్రతి నెలా 1వ తేదీనే లబ్ధిదారులకు అందిస్తోందని మంత్రి కొండపల్లి తెలిపారు.

# దుర్గమ్మకి బంగారు ఆభరణాల కానుక

**ఇంద్రకీలాద్రి, జూన్ 28 ప్రభాతవార్త:** ఇంద్రకీలాద్రిపై వేంచేసిన శ్రీ దుర్గమ్మకి విజయవాడకు చెందిన కొండవీటి ఈశ్వరరావు, మాధవి దంపతులు రు.5లక్షల విలువైన బొట్టు, భూలాకి, నత్తులను చైర్మన్ బొర్రా రాధాకృష్ణకు ఆదివారం అందించారు. దాతలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు వారికి దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.



**వేదోక్తంగా సూర్యఉపాసన:** దుర్గమ్మ ఆలయంలో వేదోక్తంగా ఆదివారం సూర్య ఉపాసన జరిగింది. పండితులు వేదమంత్ర పఠనాలను గావిస్తూ శ్రీ స్వామివారికి పూజాదికాలు నిర్వహించారు. ఆదిత్య హృదయం, ద్వాదశాదిత్య మంత్రరాజం, అరుణపారాయణ, సూర్యాష్టకం, సూర్యస్తుతి పఠనలు గావిస్తూ సూర్యనమస్కారాలు సమర్పించారు. పూజాదికాలనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.



**నేడు గిరిప్రదక్షిణ:** శ్రీ దుర్గమ్మ వేంచేసియున్న ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షణ ఈనెల 29న సోమవారం ఉదయం 5.55 గంటలకు ప్రారంభవుతుందని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. పౌర్ణమి పర్వదినాన ఘాట్‌రోడ్డు వద్ద వున్న శ్రీ కామధేను అమ్మవారి ఆలయం వద్దనుండి గిరి ప్రదక్షిణ ప్రారంభమై కుమ్మరిపాలెం, నాలుగు స్తంభాల సెంటర్, సితార, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, నెహ్రూ బొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి, రథం సెంటర్‌ల మీదుగా శ్రీ మల్లిఖార్జున మహా మండపమునకు చేరుకుంటుందన్నారు.

**భక్తుల విరాళాలు:** విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు రవీంద్రభారతి విద్యాసంస్థ చైర్మన్ వీరమాచినేని వంశీకృష్ణ రు.1,11,111ల విరాళాన్ని ఆదివారం అందించారు. అలాగే దుర్గమ్మ ఆలయాభివృద్ధి కోసం ఆదివారం తెనాలికి చెందిన అట్లూరి బాపూజి రు.2,01,116ల విరాళం ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణకు అందించారు. దాతలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు వారికి దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. దుర్గమ్మని రాజ్యసభ ఎంపి లింగమనేని రమేష్ దర్శించుకున్నారు.

**దుర్గమ్మ ఆలయంలో పిల్లలకు పోలియోచుక్కలు:** దుర్గమ్మ ఆలయంలో ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కల కార్యక్రమం జరిగింది. చైర్మన్ బొర్రా రాధాకృష్ణ స్వయంగా పలువురు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.



29-6Pg7exHMNWJQE.qxd:29-6Pg7exHMNWJQE.qxd 1/1/02 6:03 AM Page 1





## యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యం

### • ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి

**కావలి (నెల్లూరు), జూన్ 28, ప్రభాతవార్త:** యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి వ్యక్తం చేశారు. రామచంద్రాపురంలో నిర్వహిస్తున్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంటును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న యువ క్రికెటర్ల ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి టోర్నమెంటు ఎంత ఉపయోగపడుతాయని తెలిపారు. క్రీడలు ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందిసానతయని తెలిపారు. నేటి యువత మొబైల్స్ కు పరిమితం అవుతున్నారని తెలిపారు. క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలన్నారు. ప్రభుత్వం క్రీడాభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించేలా చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సమానంగా స్వీకరించి స్నేహభావంతో పాల్గొనాలని సూచించారు. ఈకార్యక్రమంలో నిర్వాహకులు, క్రీడాకారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మద్యానికి డబ్బులివ్వలేదని భార్యను కడతేర్చిన భర్త

### • అనంతపురం జిల్లా మంగంపల్లిలో ఘటన

**శెట్టూరు:, జూన్ 28 ప్రభాతవార్త:** అనంతపురం జిల్లా శెట్టూరు మండలం మంగంపల్లి గ్రామంలో ఆదివారం హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాలు, మద్యం మత్తు కలిసి ఓ కుటుంబాన్ని విషాదంలోకి నెట్టాయి. మమత అనే మహిళను ఆమె భర్త తిప్పేస్వామి మద్యం సేవించటానికి డబ్బులు ఇవ్వలేదని ఇనుప రాడ్డుతో దాడి చేసి అతి దారుణంగా హత్య చేసిన ఘటన స్థానికంగా సంచలనం రేపింది. గ్రామస్థులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, ఎస్ఐ సుమన్



మృతురాలు మమత ఫైల్ ఫోటో

ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక విచారణలో మద్యం సేవించేందుకు డబ్బుల ఇవ్వలేదనే విషయంలో భార్యాభర్తల మధ్య వాగ్వాదం జరిగినట్లు తెలుస్తోంది. ఆ వాగ్వాదం కాస్తా ఘర్షణగా మారి చివరకు హత్యకు దారి తీసినట్లు పోలీసులు అనుమానిస్తు న్నారు. ఈ ఘటనపై సిఐ నీలకంఠ విచారణ చేపట్టగా, నిందితుడు పరారీలో ఉన్నట్లు సమాచారం. కేసు నమోదు చేసిన పోలీసులు అతని కోసం గాలింపు చర్యలు చెప్పట్టారు. మృతురాలు మమతకు ఒక కుమార్తె ఐశ్వర్య, ఒక కుమారుడు అభిషేక్ ఉన్నారు. తల్లి మృతితో ఇద్దరు చిన్నారులు అనాథలుగా మారడం గ్రామస్థులను కన్నీరు పెట్టించింది.

## సాంకేతికతకు మానవీయ విలువలు తోడైనప్పుడే నిజమైన ప్రగతి

### • మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు

**గుంటూరు (విద్య), జూన్ 28 ప్రభాతవార్త:** 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, వైబ్ కోడింగ్, ఏజెంటిక్ ఏఐ వంటి సరికొత్త సాంకేతికతలు ప్రపంచాన్ని శాసిస్తున్న ప్రస్తుత తరుణంలో, టెక్నాలజీ ఎంత పెరిగినా మానవీయ విలువలు లేకపోతే లాభం లేదు. సాంకేతికతకు సంస్కారం తోడైనప్పుడే నిజమైన ప్రగతి సాధ్యమవుతుంది" అని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలజికల్ యూనివర్సిటీ నిర్వహించిన స్నాతకోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, విద్య అనేది కేవలం జీవనోపాధి కోసం మాత్రమే కాదని, అది సంస్కారాన్ని పెంచి, సమాజం పట్ల బాధ్యత గల పరిపూర్ణమైన మానవుడిగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. భారతదేశంలో 65 శాతం మంది 35 ఏళ్ల లోపు యువకులే ఉన్నారని, రాబోయే రెండు దశాబ్దాల పాటు ప్రపంచానికి అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించగల ఏకైక దేశం మనదే నన్నారు. యువతరం కేవలం ఉద్యోగాలు వెతుక్కునే వారుగా కాకుండా, పదిమందికి ఉపాధినిచ్చే ఉద్యోగ సృష్టికర్తలుగా మారాలని, స్టార్టప్ ఆవిష్కరణలకు పదును పెట్టాలని సూచించారు.



## రాస్ తనూరా వద్ద కుప్పకూలిన ఆరామ్‌కో హెలికాప్టర్

### 14 మంది మృతి

**రియాద్, జూన్ 28:** సౌదీ అరేబియా తూర్పు ప్రాంతంలోని రాస్ తనూరా వద్ద ఆదివారం అరాంకోకు చెందిన హెలికాప్టర్ కుప్పకూలింది. ఈ ప్రమాదంలో హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్న 14 మంది సౌదీ పౌరులు మృతి చెందినట్లు ఆ దేశ అధికారిక వార్తా సంస్థ వెల్లడించింది. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, పూర్తి స్థాయి విచారణ చేపట్టినట్లు సౌదీ ఇంధన మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రమాద సమయంలో హెలికాప్టర్‌లో ఉన్న వారంతా ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు ధృవీకరించారు. సౌదీ అరాంకో సంస్థ వద్ద 60కి పైగా విమానాలు, హెలికాప్టర్లు ఉండగా, దేశవ్యాప్తంగా 300కు పైగా హెలిప్యాడ్‌లకు సేవలు అందిస్తోంది. మధ్యప్రాచ్య ప్రాంతంలో అతిపెద్ద కార్పొరేట్ వైమానిక వాహనాల సముదాయాల్లో ఇది ఒకటిగా గుర్తింపు పొందింది. ఈ ప్రమాదం ఇటీవల మధ్యప్రాచ్య ఉద్రిక్తతల నేపథ్యంలో చోటుచేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇరాన్ దాడులు, హార్ముజ్ జలసంధి మూసివేత కారణంగా గల్ఫ్ దేశాలు చమురు ఉత్పత్తిని పెంచే ప్రయత్నాలు చేస్తున్న వేళ ఈ ఘటన జరిగింది. అయితే ఈ హెలికాప్టర్ ప్రమాదానికి ఎలాంటి శత్రుదాడి సంబంధం లేదని సౌదీ ప్రభుత్వం స్పష్టం చేసింది. రాస్ తనూరా రోజుకు సుమారు 5.5 లక్షల బ్యారెళ్ల సామర్థ్యం కలిగిన మధ్యప్రాచ్యంలోని అతిపెద్ద రిఫైనరీలలో ఒకటి ఉంది. గతంలో ఇరాన్ డ్రోన్ దాడుల కారణంగా ఈ రిఫైనరీలో అగ్నిప్రమాదం సంభవించి, కొంతకాలం ఉత్పత్తి నిలిచిపోయింది. ప్రపంచంలోనే అతిపెద్ద ముడి చమురు ఎగుమతిదారైన సౌదీ అరేబియా ప్రస్తుతం రోజుకు కోటి బ్యారెళ్లకు పైగా ముడి చమురును ఉత్పత్తి చేస్తోంది.

# రాజకీయాల్లో సిద్ధాంతాలు, జీవితంలో క్రమశిక్షణ చాలా ముఖ్యం

### • విజయవాడలో మాశర్మ రచించిన వెంకయ్య నాయకుడు పుస్తక పరిచయ కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**విజయవాడ, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏ విషయాన్ని సూటిగా చెప్పడం రాజకీయ నేతలు నేర్చుకోవాలని వెంకయ్యనాయుడు అన్నారు. జై ఆంధ్ర ఉద్యమం నాడే రాష్ట్ర విభజన జరిగి ఉంటే ఇవాళ ఏపీ ఎక్కడో ఉండేదని, రెండు రాష్ట్రాలు బాగా అభివృద్ధి చెందేవన్నారు. విభజన అనివార్యం అని తెలిసిందని, నేను ఏదో రకంగా విభజన అడ్డుకుంటానని అందరూ అనుకున్నారన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు నా వద్దకు వచ్చి మాట్లాడారని, పార్టీ సిద్ధాంతానికి అనుగుణంగా వ్యవహరిస్తామని చెప్పానని స్పష్టంచేశారు. విజయవాడలో సీనియర్ పాత్రికేయులు మాశర్మ రచించిన వెంకయ్య నాయకుడు పుస్తక పరిచయ కార్యక్రమం జరిగింది. వెంకయ్య నాయుడు జీవన ప్రస్థానాన్ని ఆవిష్కరిస్తూ ఈ పుస్తకాన్ని రచించారు. పుస్తక పరిచయ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాకు చిన్నతనంలోనే తల్లి చనిపోయింది ఆర్‌యస్‌యస్‌లో చేరడం ద్వారా ఎన్నో నేర్చుకున్నాను. ఇటీవల కొంతమంది ఆర్.యస్.యస్ ను నిషేధించాలని డిమాండ్ చేస్తున్నారు. అది నిషేదించాలి అనే వారినే ముందు నిషేధించాలి. తుపాకీ కన్నా బ్యాలెట్ చాలా శక్తివంతమైంది. ఇందిరాగాంధీ, వాజ్ పాయ్, యన్టీఆర్



మాశర్మ రచించిన వెంకయ్య నాయకుడు పుస్తక పరిచయ కార్యక్రమ దృశ్యం

వంటి వారే ఓడిపోయారు. నక్సలైట్లు తప్పుదారి పట్టి అనేక మంది ప్రాణాలు కోల్పో యారు, అభివృద్ధిని కూడా అడ్డుకోవడంతో ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టింది. ఆయుధంతో బెదిరించి ఎవరినీ లొంగ దీసుకోలేరు. అసెంబ్లీ, పార్లమెంట్‌లో కొంతమంది కి బూతు మాటలు మాత్రమే వస్తున్నాయి. నాయకులు ఇలా మాట్లాడుతున్నారని నన్ను అడిగితే.. బూతులు మాట్లాడేవారికి, బూత్‌లలోకి వెళ్లి బటన్ నొక్కు అని చెప్పా, మొన్న ఎన్నికలలో ఇలా బూతులు మాట్లాడే వారు ఒక్కరు కూడా గెలవలేదు, వారి పేర్లు నేను ప్రస్తావించను.. వారి గురించి అందరికీ తెలుసు. నేను వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకం. వారసత్వం కాదు... జవసత్వాలు కావాలి, వారసులుగా వచ్చేవారు కష్టపడి కింద నుంచి పైకి రావాలి. అంతే కానీ హెలికాప్టర్‌లో పై నుంచి కిందకు దింపకూడదు అని నా సిద్ధాంతం, అందుకే నా పిల్లలను నేను రాజకీయాల్లో ప్రోత్సహించలేదు. దక్షి ణాది వారిని పైకి రానివ్వరనే పేరు ఉండేది. వాజ్‌పేయ్, అద్వానీ మధ్యలో కూర్చుని అధ్యక్షుడిగా పని చేశాను. ఆర్‌యస్‌యస్, బిజెపిలో పని చేయడం వల్లే ఈ స్థాయికి ఎదిగాను. ఇప్పుడు ఇక రాజకీయాలు నేను మాట్లాడను. రాజకీయాల్లో సిద్ధాంతాలు, జీవితంలో క్రమశిక్షణ చాలా ముఖ్యం. చట్టసభల్లో గౌరవప్రదమైన భాషను ఉపయోగించాలి, మనమే అసెంబ్లీలో గొడవులు పెట్టుకుని, కాగితాలు చించడం, మైకులు విరగకొట్టడం చూస్తున్నాం. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరూ సమీక్ష చేసుకోవాలి. రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు ఆత్మ సమీక్ష చేసుకుని విలువలను పాటించాలి. వాళ్ల వాళ్ల పార్టీ సభ్యులకు మార్గనిర్దేశిక నియమావళిని అమలు చేయాలి. అప్పుడే సమాజంలో మన నాయకులకు గౌరవం ఉంటుంది. కుటుంబ వ్యవస్థలో పిల్లలతో ఉండేలా తల్లిదండ్రులు సమయం ఇవ్వాలి. నేడు టీవీలు, ఫోన్ లలో ఎవరికి వారే ఒంటరిగా ఉంటున్నారు. గుడ్ మార్నింగ్‌కు నేను వ్యతిరేకం.. పెద్దలకు నమస్కారం చెప్పే విధానం పిల్లలకు నేర్పాలి. మన బొట్టు, కట్టు, మాట, ఆట, పాట, బాట, యాస, గోస ఎప్పుడూ మరచిపోకూడదని చెబుతా, మన సంస్కృతి, సంప్రదాయాలు, కుటుంబ వ్యవస్థ చూసే ఇతర దేశాలు మనల్ని గౌరవిస్తాయి, కార్యక్రమంలో మాశర్మ వెంకయ్య నాయుడు వ్యక్తిత్వాన్ని చక్కగా ఆవిష్కరించారని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టి ఆయన ఉన్నత శిఖరాలు అధిరోహించారని చెప్పారు. రాజకీయాల్లో వెంకయ్య చూపించిన చొరవ అసామాన్యమని కొల్లు రవీంద్ర వివరించారు. వెంకయ్యనాయుడు నిబద్ధత కలిగిన నేత మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. దార్శనికత ఆయనలోని సుగుణమన్నారు. సుజనాచౌదరి, గద్దె రామ్మోహన్‌రావు, బొండా ఉమా మహేశ్వరరావు, కామినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# రాష్ట్ర అభివృద్ధే మా ఆకాంక్ష

### • యేటా రొట్టెల పండగలో అదే కోరిక • ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్

**నెల్లూరు(వైద్యం), జూన్ 28 ప్రభాతవార్త:** రాష్ట్ర అభివృద్ధే తమ ఆకాంక్ష అని, ఏటా రొట్టెల పండగలో అదే కోరిక కోరుటమని, రొట్టెల పండగకు భక్తుల సంఖ్య ఏటికేటికీ పెరిగిపోతొందని, దర్గా ప్రాంగణంలో భక్తుల కోసం చేసిన ఏర్పాట్లు అద్భుతమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఏపీ వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్‌లు అన్నారు. వారు ఆదివారం రొట్టెల పండగ సందర్భంగా నెల్లూరు బారాషహీద్ దర్గాను సందర్శించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఏపీ వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్‌తో కలిసి బారాషహీదులను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే గొప్ప పుణ్యక్షేత్రం బారా హషీద్ దర్గా అని, నెల్లూరులో ఈ దర్గా ఉండటం జిల్లా ప్రజలందరికీ గర్వకారణమన్నారు. ఏటా రొట్టెల పండగ సందర్భంగా ఇక్కడకు వచ్చి రాష్ట్ర అభివృద్ధిని కోరుకోవడం మాకు సంప్రదాయంగా వస్తోందన్నారు. గతంలో రొట్టెల పండగకు 4 లక్షల మంది హాజరైతే, ఇప్పుడు ఆ సంఖ్య 18 లక్షలకు చేరడం సంతోషంగా ఉందన్నారు. ఎన్ని లక్షల మంది వచ్చినా ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తుండటం గొప్ప విషయమన్నారు. అందులో భాగంగా మంత్రి నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్. అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. అదేవిధంగా



అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో కసుమూరు లో నిత్యాన్నదానం ప్రారంభించడంతో పాటు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేసుకున్నామన్నారు. అనంతరం ఏపీ వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ రొట్టెల పండగను విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. దర్గా ప్రాంగణంలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. ఇటీవల జరిగిన ఘటనలను సమీక్షించుకుని, భవిష్యత్తులో అవి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. దర్గా ప్రాంగణాన్ని మరింత విస్తరించే ఆలోచన ఉందన్నారు.

శనివారం రాత్రి నిర్వహించిన గంధోత్సవానికి లక్షలాదిగా భక్తులు తరలివచ్చినా పోలీసులు పకడ్బందీగా పనిచేయడంతో చిన్న అవాంఛనీయ ఘటన కూడా చోటుచేసుకోలేదని తెలిపారు. దర్గా ప్రాంగణంలో ఎవరైనా తప్పిపోతే అప్పటికప్పుడే సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా ఛైర్మన్ మునీర్ అహ్మద్, బొమ్మి సురేంద్ర, సాబీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



## 40యేళ్ల సమస్యకు పరిష్కారం చూపాం

### • నెల్లూరు రూరల్‌లో చరిత్ర సృష్టించే స్థాయిలో అభివృద్ధి: ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి

**నెల్లూరు, జూన్ 28 ప్రభాతవార్త:** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో దాదాపు 40 సంవత్సరాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామని, చరిత్ర సృష్టించే అభివృద్ధి నెల్లూరు రూరల్‌లో జరుగుతోందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ గత 10 సంవత్సరాలలో చేయలేని పనులను ఈ రెండేళ్లలో చేసి చూపించామన్నారు. నేడు నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని ములుమూడి గ్రామంలో 83 లక్షల రూపాయలతో నిర్మించిన ములుమూడి కలుజుపై బ్రిడ్జిని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ప్రారంభించారు. చెప్పిన మాట ప్రకారం 6 నెలల్లో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిలు కలుజు మీద బ్రిడ్జి పూర్తిచేసి చూపించారని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. తన దృష్టికి ఏ సమస్య వచ్చినా తన వైపు నుంచి పూర్తి సహకారం ఉంటుందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జిల్లా కలెక్టర్ సహకారంతో ములుమూడి కలుజు మీద బ్రిడ్జి పూర్తి చేశామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. మరో 2 నెలల్లో పొట్టేపాలెం కలుజు మీద బ్రిడ్జి పూర్తి చేస్తామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### • పరిరక్షణ సమితి పేరిట పర్యటనలు బూటకం • అమరావతి పేరు ఎత్తే హక్కు కూడా వైకాపాకు లేదు • గజపతినగరంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**గజపతినగరం, జూన్ 28 ప్రభాతవార్త:** ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, రాజధాని అమరావతి అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అలుపెరగని పోరాటం చేస్తున్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం గజపతి నగరంలో మీడియా చిట్‌చాట్‌లో రాజధాని గురించి పలు విషయాలు వెల్లడి చేశారు. పరిరక్షణ సమితి పేరిట అల్లర్లు సృష్టిస్తూ వైకాపా నాయకులు బూటకపు పర్యటనలు చేయటం విడ్డూరంగా ఉందన్నారు. అధికారంలో ఉండగా "అమరావతి వద్దు.. మూడు రాజధానులు ముద్దు అని ప్రకటించి అధికారం వచ్చాక రంగులు మార్చటం బులుగు పార్టీకే సాధ్యమన్నారు. అమరావతి ప్రాంతం రైతులను, మహిళలు అని కూడా చూడకుండా హింసకాండ సృష్టించి, అరెస్టులు సైతం చేయించిన ఘనత గొడ్డలి పార్టీది అన్నారు. రాజధాని ప్రాంతంలో నీళ్లు నిలుస్తున్నాయని, రాజధానికి అమరావతి ప్రాంతం తగదని ప్రకటించిన కుతంత్రాల మహా మేధావి జగన్ అని మంత్రి అన్నారు. రాజధాని ప్రాంత ప్రజలు పాదయాత్ర చేస్తుంటే అడ్డుకున్న





ఘనత ఆనాటి వైకాపా ప్రభుత్వానిదన్నారు. ఆంధ్ర ప్రజల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అమరావతిని అంతర్జాతీయ హంగులతో తీర్చిదిద్దడం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2047 విజన్‌తో ముందుకు సాగుతున్నారన్నారు.

మెడికల్ జోన్, ఎడ్యుకేషనల్ జోన్ వంటి అత్యాధునిక సౌకర్యాలతో రాజధాని నిర్మాణం చంద్రబాబు సారధ్యంలో రూపుదిద్దుకుంటుందన్నారు. దాడులు చేశారని రాజధాని ప్రాంత రైతులపై అభియోగం మోపుతున్నారని, ఆ ప్రాంత రైతులంతా రాజధానికి మేము అనుకూలమని చెప్పి వైకాపా అధినేతలు పర్యటనలు చేయాలన్నారు. మూడు రాజధానులా, మావిగనా అన్నదానిపై వైకాపా అధినేతతో స్పష్టత ఇప్పించాలని ఆ పార్టీ నాయకులకు సూచించారు. జగన్ తండ్రి వైయస్సార్ అనుభవం కలిగిన నాయకుడిగా నాడు ఉమ్మడి రాజధాని హైదరాబాదులో చంద్రబాబు ప్రారంభించిన హైటెక్ సిటీ వంటి వాటిని ప్రోత్సహించారని, అనుభవలేమితో అధికారం వచ్చాక జగన్ ప్రవర్తించడంతోనే ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి కుంటు పడిందన్నారు. జగన్ విధ్వంస పాలనతో గజిబిజి సృష్టించిన పాలనను కూటమి ప్రభుత్వం నేడు గాడిలో పెడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని నిర్మాణాలను చిత్తశుద్ధితో పారదర్శకంగా పూర్తి చేయడం జరుగుతుందన్నారు. భావితరాల అభివృద్ధి కోసం రాజకీయాలు చేయాలని, రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతుల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీయకూడదని వైకాపా నాయకులకు హితవు పలికారు. అమరావతి పేరు ఎత్తే హక్కు కూడా వైకాపాకు లేదని కొండపల్లి శ్రీనివాస్ ధ్వజమెత్తారు.

# కేసులపై ప్రమాణానికి సిద్ధమా!

### • రాజకీయాలను రాజకీయంగానే చేద్దాం • మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

**అనంతపురం సిటీ, జూన్ 28 ప్రభాతవార్త:** వైసిపి పాలనలో తనపై 70 కేసులు నమోదు చేశారని పదేపదే చెప్పుకుంటున్న జెసి ప్రభాకర్‌రెడ్డి, ఆ కేసులు ఎందుకు నమోదు అయ్యాయో దేవుని సన్నిధిలో ప్రమాణానికి సిద్ధమా అని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సవాల్ విసిరారు. జిల్లా వైసిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రెండు రోజుల క్రితం తాడిపత్రిలో శాంతియుత దీక్షకు వైసిపి ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వైసిపి సమన్వయ కర్తలు మద్దతు ప్రకటించారన్నారు. అయితే దీనిపై మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్‌రెడ్డి, వైసిపి సమన్వయ కర్తలు అనంత వెంకటరామిరెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డి తలారి రంగయ్యలపై చేసి అసభ్యకరంగా ధూషించడం సరికాదన్నారు. వారిపై చేసిన దూషణలు జెసి ప్రభాకర్‌రెడ్డి వ్యక్తిగతమా, చంద్రబాబునాయుడు, నారా లోకేష్ సూచనలతో చేసిన దూషణలా అని ఆయన ప్రశ్నించారు. జెసి ప్రభాకర్‌రెడ్డి టిడిపి ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలు ఏవీ చేయరని, కేవలం వ్యక్తిగత ప్రోగ్రాంలు మాత్రమే చేస్తుంటారని ఆయన విమర్శించారు. రెండేళ్ల కూటమి పాలనపై రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగానే తాడిపత్రిలో కూడా నిరసన కార్యక్రమం చేపడితే పోలీసులు అనుమతించ లేదని, దీనిని నిరసిస్తూ ఎస్పీ కార్యాలయం ఎదుట తాను నిరసన వ్యక్తం చేశానన్నారు. అయితే జెసి ప్రభాకర్‌రెడ్డి పోలీసుస్టేషన్ ఎదుట ధర్నా చేసి, అక్కడే స్నానం చేసి పోలీసులపై ఒత్తిడి తెచ్చి తనపై అక్రమ కేసులు నమోదు చేయించారని



విమర్శించారు. కానీ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన చేపట్టిన జెసి ప్రభాకర్‌రెడ్డిపైన మాత్రం పోలీసులు కేసులు నమోదు చేయలేదని ఆయన విమర్శించారు. తాడిపత్రి నియోజకవర్గంలో వైసిపి శ్రేణులపై టిడిపి నేతలు దాడులు చేస్తారని, బాధితులు ఫిర్యాదులు చేసినా కేసులు నమోదు చేయకపోయినా, బాధితులపైనే కౌంటర్ కేసులు నమోదు చేస్తారని ఆయన విమర్శించారు. జెసి కుటుంబం కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు వారి కుటుంబం రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధిలో అనంత వెంకటరామిరెడ్డి తోడుగా నిలిచి రాజకీయ భవిష్యత్తు ఇచ్చారన్నది గుర్తించుకోవాలని పెద్దారెడ్డి సూచించారు. తాడిపత్రిలో ఐపిఎస్ అధికారి ఉన్నా లా అండ్ ఆర్డర్ కాపాడటం లేదన్నారు. గతంలో తాడిపత్రి పోలీస్‌స్టేషన్‌కు తాళం వేసిన చరిత్ర జెసి కుటుంబానికి ఉందన్నారు. వైసిపి హయాంలో తాను నష్టపోయానని జెసి ప్రభాకర్‌రెడ్డి యాక్టింగ్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. వారసులు రాజకీయాల్లోకి రావాలని కోరుకోవడం సహజమని, అయితే జెసి ప్రభాకర్‌రెడ్డి కొడుకు ఎమ్మెల్యే అయినా ఆయనను బయటికి రాకుండా చూస్తున్నారన్నారు. ఈ వయస్సులో సలహాలు, సూచనలు ఇవ్వాలని, కొడుకును ప్రజలలో తిప్పితే రానున్న రోజుల్లో మరింత మంచి నేతగా ఎదిగే అవకాశం ఉందని గుర్తించాలన్నారు. కొడుకు భవిష్యత్తు, రాజకీయం గురించి ఆలోచన చేయాలని కక్షలు, కార్పణ్యాలు ఎందుకని ఆయన ప్రశ్నించారు. నీవు తప్పులు చేసి వాటిపై కేసులు నమోదైతే సానుభూతి కోసం మాపై నిందలు వేస్తావా అని ఆయన ప్రశ్నించారు. దీనిపై నీవు నమ్మే శ్రీకాళహస్తీశ్వరుడుపైన కాని, తాము నమ్మే వేంకటేశ్వర స్వామిపై కాని ప్రమాణానికి సిద్ధమా అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా రాజకీయాలను రాజకీయంగానే చేద్దామని, మీరు విరమిస్తే తాను కూడా విరమిస్తానని పెద్దారెడ్డి స్పష్టంచేశారు.

## తిరుపతిలో రాష్ట్ర కరాటే ఛాంపియన్‌షిప్

### • జాతీయ ఎంపికలు-2026 ఘనంగా ప్రారంభం



**తిరుపతి (క్రీడ), జూన్ 28 ప్రభాతవార్త:** కరాటే అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో తిరుపతిలో ఘనంగా నిర్వహించిన 6వ రాష్ట్ర కరాటే ఛాంపియన్‌షిప్ జాతీయ ఎంపికలు-2026 కార్యక్రమానికి శాప్ ఛైర్మన్ రవి నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పాల్గొన్న క్రీడాకారులను ఉద్దేశించి రవి నాయుడు మాట్లాడుతూ క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ముఖ్యంగా కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ స్వీయ రక్షణతో పాటు ధైర్యం, ఏకాగ్రత, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం ప్రతి క్రీడాకారుడికి గర్వకారణమని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆంధ్రప్రదేశ్‌కు జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విజయం కోసం కృషి, క్రమశిక్షణ, నిరంతర సాధన ఎంతో అవసరమని యువ క్రీడాకారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడాకారులను ప్రోత్సహించేలా పలు కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. యువత క్రీడలను అభిరుచిగానే కాకుండా ఉన్నత భవిష్యత్తుకు మార్గంగా కూడా భావించి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం, పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అభినందించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో కరాటే క్రీడాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న కరాటే అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు, కోచ్‌లు, నిర్వాహకులను అభినందిస్తూ, ఇలాంటి పోటీలు మరింత మంది యువతను క్రీడల వైపు ఆకర్షిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు, కోచ్‌లు, న్యాయ నిర్ణేతలు, క్రీడాకారులు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దక్షిణాఫ్రికా విమానప్రమాదంలో సీతంపేట యువకుడు మృతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 28:** దక్షిణాఫ్రికా విమాన ప్రమాదంలో హసన్‌పర్తి మం డలంలోని సీతంపేట గ్రామానికి చెందిన ఆడెపు సుమంత్ (25) దుర్మరణం చెందాడు. ఆడెపు వర లక్ష్మి చంద్రమోహన్ దంపతుల చిన్న కుమారుడైన సుమంత్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీర్ పూర్తి చేసుకున్నాడు. గత 8 నెలలుగా దక్షిణాఫ్రికాలో సుమంత్ పైలెట్‌గా శిక్షణ పొందుతున్నాడని, ఇందులో భాగంగానే శనివారం దక్షిణాఫ్రికాలోని జోహెన్నస్‌బర్గ్‌లో సుమంత్ విమానాన్ని స్టార్ట్ చేసిన కొద్ది నిమిషాలకే ప్రమాదం జరిగిందని సమాచారం. విమానం కూలడానికి సాంకేతిక లోపమా, ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు జరుగుతున్నట్టు సమాచారం.

# పక్కృతి సంపదకు ఈశాన్యభారతం పుట్టినిల్లు

## మన్‌కీ బాత్‌లో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,జూన్ 28:** భారతదేశంలోని ఈశాన్య రాష్ట్రాలు ప్రకృతి సంపదకు, పర్యావరణ హితమైన జీవనశైలికి పుట్టినిల్లు. ఈ క్రమంలోనే పర్యావరణ పరిరక్షణ కోసం అక్కడి ప్రజలు సాగిస్తున్న విశేష కృషిని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశవ్యాప్తంగా పరిచయం చేశారు. ఆదివారం మన్‌కీబాత్ 135వ కార్యక్రమంలో అస్సాంలోని అరుదైన హర్గిలా పక్షి సంరక్షణ, అలాగే మేఘాలయలోని జీవన వేర్ల వంతెనల విశిష్టతను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. సమాజంలో ఉన్న అపోహలను తొలగిస్తూ, ప్రకృతితో మమేకమై జీవించడం ఎలాగో ఈ రెండు అంశాలు నిరూపిస్తున్నాయని ప్రధాని మోడీ ప్రశంసించారు. హర్ అంటే ఎముకలు, గిలా అంటే మింగడం అని అర్థం. ఈ పక్షులు ఎముకలను కూడా సునాయాసంగా మింగేయగలవు. సుమారు 1.5 మీటర్ల ఎత్తు, వింతైన రూపం కారణంగా వీటిని చూసి ప్రజలు భయ పడేవారు. అస్సాంలో కనిపించే అరుదైన హర్గిలా పక్షి సుదీర్ఘకాలంగా స్థానిక ప్రజల మూఢనమ్మకాలకు, భయాందోళనలకు బలవుతూ వచ్చిందని మోడీ అన్నారు. నిజానికి పర్యావరణాన్ని శుభ్రంగా ఉంచడంలో, చనిపోయిన జంతువుల అవశేషాలను తొలగించడంలో ఈ పక్షులు అత్యంత కీలకపాత్ర పోషిస్తాయి. అయినప్పటికీ, వీటి మనుగడను గుర్తించని స్థానికులు హర్గిలా పక్షుల గూళ్లు ఉన్న చెట్లను కూడా క్రూరంగా నరికివేసేవారు. కేవలం అజ్ఞానం వల్లే ఒక ఉపయోగకరమైన పక్షిజాతి వినాశనం అంచుకు చేరుకుందని ప్రధాని వివరించారు. ఈ గడ్డు పరిస్థితుల్లో ఆ పక్షుల రక్షణ కోసం జీవ శాస్త్రవేత్త పూర్ణిమ దేవి బర్మన్ నడుం బిగించారు. సమాజంలో బలంగా నాటుకుపోయిన ఈ మూఢ నమ్మకాలను తొలగించాలని ఆమె గట్టిగా సంకల్పించారు. ఇందులో భాగంగా స్థానిక మహిళలను ఏకంచేసి, శాస్త్రీయ దృక్పథంతో వారికి అవగాహన కల్పించారు. పూర్ణిమ దేవి బర్మన్ చూపిన బాటలో నడిచిన మహిళలు క్రమంగా ఒక పెద్ద ఉద్యమంగా రూపాంతరం చెందారు. అలా ఏర్పడిందే ఈనాటి పర్యావరణ రక్షక దళం హర్గిలా ఆర్మీ. నేడు వేలాది మంది గ్రామీణ మహిళలు ఈ పక్షులను కంటికి రెప్పలా కాపాడుతున్నారు.

అస్సాం స్ఫూర్తిదాయక పక్షిసంరక్షణ ఉదంతాన్ని వివరించిన అనంతరం ప్రధాని మోడీ మేఘాలయ పర్వత శ్రేణులలోని అపురూపమైన జీవన వేర్ల వంతెనల వైపు దృష్టి సారించారు. మేఘాలయ అంటేనే మేఘాల నిలయమని, అక్కడి ప్రజల ఆత్మీయత పర్యాటకులను ఎప్పటికీ ఆకట్టుకుంటుందన్నారు. అయితే వీటన్నింటికంటే ఎంతో ప్రత్యేకమైనవి అక్కడి స్థానిక గిరిజనులు నిర్మించే సహజసిద్ధమైన వంతెనలని చెప్పారు. ఇవి కేవలం కొద్దిరోజుల్లోనో లేదా కొద్ది సంవత్సరాల్లోనో కట్టేవి కాదని, వీటి తయారీ వెనుక దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ,పట్టుదల దాగి ఉన్నాయని ప్రధాని వివరించారు.

**మట్టి వినాయక ప్రతిమలనే వాడాలి:** సెప్టెంబరులో వస్తున్న వినాయకచవితికి మట్టితో చేసిన విగ్రహాలను మాత్రమే వినియోగించాలని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు వద్దని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లా, బియాౖరాకు చెందిన మహిళల కృషని ప్రధాని ప్రత్యేకంగా ప్రశంసించారు. తమ పరిసరాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను చూసి నిరాశ చెందకుండా, ఆ మహిళలు స్వయంగా రంగంలోకి దిగి ప్లాస్టిక్ వ్యర్థాలను, ఖాళీ బాటిళ్లను సేకరించడం ప్రారంభించారని ఆయన వివరించారు. ఈ ప్లాస్టిక్‌ను ఈకోబ్రిక్స్‌గా మార్చి, బహిరంగ ప్రదేశాలను సుందరీకరించడానికి ఉపయోగిస్తున్నారని, గత కొద్దినెలల్లోనే వందలకిలోల ప్లాస్టిక్ రీసైక్లింగ్ జరిగిందని మోడీ సంతోషం వ్యక్తం చేశారు. ఒకప్పుడు కాలుష్యానికి కారణమైన ప్లాస్టిక్, నేడు నగర సౌందర్యానికి చిహ్నంగా మారడం ఆ మహిళల కృషికి నిదర్శనమని ప్రధాని కొనియాడారు. నీటినిపొదుపు చేద్దాం క్యాచ్ దరెయిన్ ప్రకృతిని కాపాడుకోవడంలో భాగంగా,కొనసాగుతున్న క్యాచ్ ద రెయిన్‌ప్రచారంలో ప్రజలందరూ భాగ స్వాములుకావాలని ప్రధాని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని మోడీ దేశ ప్రజలను కోరారు.





## బంగారం కొనవద్దన్న పిలుపునకు అద్భుత స్పందన

### ప్రజలకు ప్రధాని మోడీ కృతజ్ఞతలు

బంగారం కొనుగోళ్లపై దేశ ప్రధాని మోడీ మరోసారి స్పందించారు. తన 135వ మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. దేశ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు తాను ఇచ్చిన పిలుపునకు సామాన్య ప్రజల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోందన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా, దేశ ఆర్థిక స్థిరత్వం కోసం విలాసవంతమైన ఖర్చులు, ముఖ్యంగా బంగారం కొనుగోళ్లను కొంతకాలం వాయిదా వేసుకోవాలని మోడీ చేసిన విజ్ఞప్తిని ప్రజలు బాధ్యతాయుతంగా స్వీకరించారని వెల్లడించారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు మోడీ కృతజ్ఞతలు చెప్పారు విదేశీ పర్యటనలను వాయిదా వేసుకోవడం, ఇంధన ఆదా కోసం సొంత వాహనాల వినియోగాన్ని తగ్గించుకోవడం వంటి చర్యలను ప్రజలు సోషల్ మీడియా వేదికగా పంచుకుంటున్నారని మోడీ తెలిపారు. ఈ సానుకూల ధోరణి దేశ విదేశీ మారక నిల్వలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తోందని ప్రధాని పేర్కొన్నారు. బంగారం, ఇంధనం వంటి అత్యవసర దిగుమతులపై భారం తగ్గించడంద్వారా రూపాయి విలువను సుస్థిరం చేయాలనేదే ఈ ప్రయత్నం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. ప్రధాని విజ్ఞప్తి తర్వాత మార్కెట్లో గణనీయమైన మార్పులు కూడా వచ్చాం. 10న 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 1,53,140 ఉండగా, ఆదివారం నాటికి అది రూ. 1,39,873కి పడిపోయింది. అదేవిధంగా కేజీ వెండి ధర రూ. 2,62,350 నుంచి రూ. 2,16,541కి తగ్గింది. ఈ స్వల్ప వ్యవధిలోనే బంగారం ధర రూ. 13,267, వెండి ధర రూ. 45,809 మేర తగ్గడం విశేషం.

# కరాచీలో భీకర ఉగ్రదాడి

## నలుగురు సైనికులు మృతి

### ఆరుగురు ఉగ్రవాదులు కూడా ఖతం

**కరాచి,జూన్ 28:** పాకిస్థాన్‌లోని అతిపెద్ద నగరమైన కరాచీలో శనివారం భీకర ఉగ్రదాడి జరిగింది. నగరంలోని సింధ్ రేంజర్ల స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు జరిపిన ఆత్మాహుతి దాడి, కాల్పుల ఘటనలో నలుగురు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. భద్రతా బలగాలు జరిపిన ఎదురుకాల్పుల్లో ఆరుగురు ఉగ్రవాదులు హతమవగా, మరొకరిని సజీవంగా పట్టుకున్నారు. కరాచీలోని గులిస్తాన్‌ఎజౌహార్ ప్రాంతంలో ఉన్న సింధ్ రేంజర్ల ప్రధాన కార్యాలయంపైకి ఉగ్రవాదులు పేలుడు పదార్థాలతో నిండిన వాహనంతో దూసుకొచ్చారు. స్థావరాన్ని ఢీకొట్టి వాహనాన్ని పేల్చివేసిన వెంటనే, మిగిలిన ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. అప్రమత్తమైన భద్రతా బలగాలు వెంటనే ఎదురుదాడికి దిగడంతో ఆ ప్రాంతం మొత్తం కాల్పుల మోతతో దద్దరిల్లింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రత్యేక పోలీసు బలగాలు, కమాండోలను రంగంలోకి దించారు. ఈ దాడికి తామే బాధ్యులమని తెహ్రీక్‌ఎతాలిబన్ పాకిస్థాన్ (టిటిపి) నుంచి విడిపోయిన జమాత్‌ఉల్‌అహ్రార్ అనే ఉగ్రవాద సంస్థ ప్రకటించుకుంది. పాకిస్థాన్‌లో భద్రతా బలగాలపై ఇటీవలి కాలంలో దాడులు పెరిగిన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈదాడిపై సింధ్ ముఖ్యమంత్రి సయ్యద్ మురాద్ అలీషా తీవ్రంగా స్పందించారు. ఘటనపై సమగ్ర విచారణ జరపాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రస్తుతం భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని, కూంబింగ్ నిర్వహిస్తు న్నాయి. ఈ ఘటనలో సామాన్య పౌరులెవరూ గాయపడలేదని అధికారులు ప్రాథమికంగా తెలిపారు.

## 15వేల మందిని చంపే టార్గెట్‌తోనే క్యాప్సూల్స్ తెచ్చా..

### మొహర్రం వేడుకల్లో పట్టుబడిన నిందితుడు వెల్లడి

**ముంబయి,జూన్ 28:** మహారాష్ట్ర రాజధాని ముంబైలో మొహర్రం ఊరేగింపు సందర్భంగా భారీ విషాదం త్రుటిలో తప్పింది. ఊరేగింపులో పాల్గొన్న వారికి విషపూరిత క్యాప్సూల్స్ పంపిణీ చేస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి సుమారు 14,900 క్యాప్సూల్స్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు క్యాప్సూల్స్‌ను నొప్పి నివారణ మాత్రలు, రోగనిరోధక శక్తిని పెంచే మందులని చెప్పి ప్రజలకు అందజేశాడు. ఆ క్యాప్సూల్స్‌లో జింక్ ఫాస్ఫైడ్ అనే అత్యంత విషపూరిత రసాయనం ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ రసాయనం సాధారణంగా ఎలుకల మందులో ఉపయోగిస్తారు. ఈ క్యాప్సూల్స్ తీసుకున్న 11 మంది అస్వస్థతకు గురయ్యారు. వారిని వెంటనే సకాలంలో హాస్పిటల్‌లో చేర్చడంతో ప్రాణాలతో బయటపడ్డారు. తాను సుమారు 15 వేల మందిని చంపాలనుకున్నట్టు నిందితుడు ఫయాజ్ ప్రేమ్‌జీ చెప్పినట్లు అధికారులు వెల్లడించారు. అతడు ముందుగానే 30 వేల ఖాళీ క్యాప్సూల్స్, 50 కిలోల జింక్ ఫాస్ఫైడ్ ఆర్డర్ చేసినట్టు దర్యాప్తులో బయటపడింది. అతడి ఉద్దేశం, ఈ ఘటన వెనుక మరెవరైనా ఉన్నారా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ భారీ ప్రమాదాన్ని ముగ్గురు మహిళా వాలంటీర్లు పసిగట్టి అడ్డుకోగలిగారు. నిందితుడు అనుమానాస్పదంగా క్యాప్సూల్స్ పంచుతుండటాన్ని గమనించిన వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం లౌడ్‌స్పీకర్ ద్వారా ప్రజలకు ఆ క్యాప్సూల్స్ తీసుకోవద్దని హెచ్చరికలు జారీ చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. నిందితుడు ముందుగా ఒకరోజు హోటల్‌లోనే ఉండి ఈ క్యాప్సూల్స్ తయారు చేసాడని దర్యాప్తులో అంగీకరించాడు.



## త్రిశూర్‌లో సింథటిక్‌డ్రగ్స్ ముఠా అరెస్టు..

### 308 గ్రాముల ఎంఎండిఎ స్వాధీనం

**త్రిశూర్,జూన్ 28:** కేరళలోని త్రిస్సూర్ జిల్లాలో భారీ ఎత్తున సింథటిక్ డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఇద్దరు మహిళలు సహా మొత్తం ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి 308 గ్రాముల నిషేధిత ఎండీఎంఎ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో పట్టుబడిన అతిపెద్ద డ్రగ్స్ కేసుల్లో ఇది ఒకటని అధికారులు తెలిపారు. వాణియంపార ప్రాంతంలో యాంటీ నార్కోటిక్ స్పెషల్ యాక్షన్ ఫోర్స్ పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా ఈముఠా వ్యవహారం బయటపడింది. పాలక్కాడ్ నుంచి వస్తున్న స్విఫ్ట్ కారును ఆపి సోదా చేయగా, అందులో ఉన్న ఒక మహిళ తన రహస్య భాగాల్లో రెండు గ్రాముల ఎండీఎంఏను దాచి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు.దీంతో కారులోని షిఫాస్, విద్య, జిష్ణు, శ్రీలక్ష్మిలను వెంటనే అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారిని విచారించగా,ఈ నెట్‌వర్క్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడు షిఫాస్ ఇంట్లో సోదాలు చేయగా మరో 18 గ్రాముల డ్రగ్స్ లభించాయి.



## అమర్‌నాథ్ యాత్రకు సహకరించాలి

### ముస్లిం సంఘాల నేతలతో లెఫ్టినెంట్ గవర్నర్ సమావేశం

**శ్రీనగర్, జూన్ 28:** హిందువులు పవిత్రంగా భావించే అమర్‌నాథ్ యాత్ర మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఈ యాత్రకు కాశ్మీరీ ముస్లిం నేతలతోపాటు పౌర సంఘాల నేతలు తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ యాత్ర విజయవంతం కావాలని వారంతా ఆకాంక్షించారు. తాము ఈ యాత్రికుల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నామని అన్నారు. యాత్ర సజావుగా సాగేందుకు యాత్రికులకు సహకారం అందించేందుకు అన్ని విధాల సహకరిస్తామని వారు స్పష్టం చేశారు. ఆదివారం శ్రీనగర్‌లో అమర్‌నాథ్ యాత్ర పుణ్య క్షేత్ర బోర్డ్ ఛైర్మన్, జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి కాశ్మీర్ ముస్లిం నేతలతోపాటు పౌర సంఘాల నేతలు హాజరయ్యారు. ఈ సమావేశంలో పాల్గొని అమర్‌నాథ్ యాత్రకు మద్దతు ప్రకటించిన వారిపై లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ప్రశంసలు కురిపించారు. వారంతా ఆధ్యాత్మిక సంప్రదాయ సంరక్షకులని, దేశ రక్షకులని అభివర్ణించారు. తరతరాలుగా ఈ అమర్‌నాథ్ యాత్ర ఆధ్యాత్మిక వారసత్వంగా కొనసాగుతోందన్నారని గుర్తు చేశారు. ఈ యాత్రకు మరోసారి భక్తులను స్వాగతించడానికి తాము సిద్ధమవుతున్నామని తెలిపారు. అలాంటి తరుణంలో మీ మార్గదర్శనం, సహకారం కోసం మీలో ప్రతి ఒక్కరి కోసం తాను ఎదురు చూస్తున్నానని తెలిపారు. ప్రతి యాత్రికుడు గౌరవం, భద్రతతోపాటు తాము కూడా ఈ ప్రాంతానికి చెందిన వారమనే భావన పెంపొందేలా చూడటంలో మీ పాత్ర అత్యంత కీలకమని ఈ సందర్భంగా లెఫ్టినెంట్ గవర్నర్ సిన్హా వ్యాఖ్యానించారు. తమ హోటళ్లలో బస చేసే అమర్‌నాథ్ యాత్రికుల నుంచి వసూలు చేసే ఛార్జీల్లో 30 శాతం తగ్గిస్తామని హోటల్ యజమానులు ప్రకటించారు. వారు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. జులై 3న ఈ యాత్ర ప్రారంభం కానుంది. ఆగస్టు 28వ తేదీతో ఈ యాత్ర ముగియనుంది. ఈ యాత్ర కోసం ప్రభుత్వం భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది. భద్రత కోసం పోలీసులు, సైన్యంతోపాటు 670 కంపెనీల పారా మిలిటరీ బలగాలను మోహరించనుంది.

# కేంద్ర మంత్రికి రూ.99లక్షలు పైగా సబ్సిడీ..

**న్యూఢిల్లీ,జూన్ 28:** కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ సహాయమంత్రి భగీరథ్ చౌదరి రాజస్థాన్‌లో తన దోసకాయల సాగు కోసం రూ.99 లక్షలకుపైగా మొత్తాన్ని సబ్సిడీగా పొందారు. ఈ రాయితీని ఆయన తాను ఉపాధ్యక్షునిగా పని చేస్తున్న బోర్డునుంచే పొందడం విశేషం. ఒక ఆంగ్లపత్రిక ప్రచురించిన వివరాల ప్రకారం కూచామన్ జిల్లా, పీహ్ గ్రామంలో నేషనల్ హార్టికల్చర్ బోర్డ్(ఎన్‌హెచ్‌బీ), వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ, భారత ప్రభుత్వం వారి సహాయంత్తో అనే బోర్డు కలిగిన ఒక విస్తారమైన వ్యవసాయ క్షేత్రం ఉంది. దానిపై లబ్ధిదారుని పేరు దగ్గర మిస్టర్ భగీరథ్‌చౌదరి అని, సబ్సిడీ మొత్తం 50శాతం అంటే రూ.99, 60,000 అని స్పష్టంగా రాసి ఉంది. గత ఏడాది దేశవ్యాప్తంగా అమోదం పొందిన 467 ప్రాజెక్టులలో మంత్రి ప్రాజెక్టు ఒకటి కావడం విశేషం. కేంద్ర మంత్రికి రాయితీ ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తిన వేళ భగీరథ్ చౌదరి మాట్లాడుతూ తాను మంత్రి కాకముందే తన దోసకాయల సాగు ప్రాజెక్టు కోసం ప్రభుత్వ పథకం కింద రూ.99.03 లక్షల సబ్సిడీని పొందినట్లు తెలిపారు. ఈ విషయంలో తానేమీ దాచలేదని, తనపై వస్తున్న ఆరోపణలను తిప్పికొట్టారు. కాగా ఈ ఉదంతంపై కాంగ్రెస్ నేత పవన్ ఖేరా సోషల్‌మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ధర్మం ఇంటి నుంచే మొదలవుతుందంటారు. కానీ బీజేపీకి మాత్రం సబ్సిడీ ఇంటి నుంచే మొదలవుతుందని వ్యాఖ్యానించారు. మంత్రి చేపట్టిన ప్రాజెక్టు వ్యయం రూ.1.99 కోట్లు. ఇందులో లబ్ధిదారు వాటా రూ. 49.8 లక్షలు. మంత్రి ఈ ప్రాజెక్టు కోసం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి రూ.1.49 కోట్లు రుణం తీసుకున్నారని ఆ వార్తకథనంలోఉంది ఈ ఉదంతంపై మంత్రి కార్యాలయ సహాయకుడు స్పందిస్తూ, ఈ ప్రాజెక్టు వివరాలను త్వరలోనే ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు.




## ఈ యేడాదే బంగ్లాదేశ్‌కు వెళ్లిపోతా: మాజీ ప్రధాని షేక్ హాసీనా

**న్యూఢిల్లీ,జూన్ 28:** రెండేళ్ల క్రితం బంగ్లాదేశ్ లో తలెత్తిన జెన్ జీ తిరుగుబాటు తర్వాత దేశం వదిలి భారత్ కు తరలివచ్చేసిన మాజీ ప్రధాని షేక్ హాసీనా అప్పటి నుంచిభారత్‌లో ప్రవాసంలో ఉంటున్నారు.తాను ప్రధానిగా ఉన్నప్పుడు భారత్‌లో సానుకూల సంబంధాలు నెరిపిన చరిత్ర ఉన్న హాసీనాను మన ప్రభుత్వం శరణార్థిగా పరిగణించి ఆశ్రయం ఇచ్చింది. బంగ్లాదేశ్ లో ఆమెపై పలు కేసులు ఉన్నా, వాటి విచారణ కోసం ఆమెను అప్పగించాలని అక్కడి ప్రభుత్వం కోరినా భారత్ మాత్రం పట్టించుకోలేదు. అయితే హాసీనా ఇప్పుడు స్వదేశం తిరిగి వెళ్లడంపై క్లారిటీ ఇచ్చారు. తాను ఈ ఏడాదే స్వదేశానికి తిరిగి వెళ్లిపోతానని తాజాగా ఇచ్చిన టివి ఇంటర్వ్యూలో ఆమె వెల్లడించారు. తన పార్టీ కేవలం ఒక సంస్థ మాత్రమే కాదని, అదొక శక్తి అని ఆమె స్పష్టం చేశారు. మైనారిటీలపై ఎలాంటి దాడి అయినా బంగ్లాదేశ్ స్వాతంత్రంపై దాడితో సమానమని హాసీనా తేల్చి చెప్పారు. దేశవ్యాప్త నిషేధాన్ని ధిక్కరిస్తూ అవామీ లీగ్ తాజాగా తన 77వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జరుపుకుంది. ఈ సందర్భంగా డజన్ల కొద్దీ కార్యకర్తలు అరెస్టు అయ్యారు. తన తిరుగు ప్రయాణం అనేది వ్యక్తిగత ఆశయానికి సంబంధించిన విషయం కాదని, ఇది బంగ్లాదేశ్ ప్రజల రాజకీయ హక్కులు, ప్రజాస్వామ్య పునరుద్ధరణ, చట్టపాలన, మన విముక్తి పోరాట స్ఫూర్తి వంటి అత్యంత కీలకమైన అంశాలతో ముడిపడి ఉందని టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో హాసీనా తెలిపారు. తాను అధికారం కోసం రాజకీయాలు చేయనని, బంగ్లాదేశ్ ప్రజల సంక్షేమం కోసం, సోనార్ బంగ్లా (సువర్ణ బంగ్లా)ను నిర్మించాలన్న జాతిపిత బంగాబంధు షేక్ ముజిబుర్ రెహామాన్ కలను సాకారం చేయడం కోసం రాజకీయాలు చేస్తానని తెలిపారు. తనకు వ్యతిరేకంగా వచ్చిన తీర్పు న్యాయమైనది కాదన్నారు.



## లోహాగఢ్ కోటలో కేతన్ హత్య సీన్ రీకన్‌స్ట్రక్షన్



**పూణె,జూన్ 28:** మహారాష్ట్రలోని పూనేకు చెందిన వ్యాపారి కేతన్ అగర్వాల్ హత్య కేసు విచారణలో ప్రధాన నిందితురాలు సియా గోయల్, ఆమె ప్రియుడు చేతన్ చౌదరి ప్రస్తుతం పోలీసు కస్టడీలో విచారణ ఎదుర్కొంటున్నారు. దీనిలో భాగంగా సియా గోయల్‌ను పోలీసులు ఆదివారం ఉదయం 6.30 గంటలకు లోహాగఢ్ కోటకు తీసుకువచ్చారు. పర్వతంపైనున్న ఈ కోట నుంచే కేతన్‌ను సియా తోసేసి చంపేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హత్యకు సంబంధించిన వివరాల్ని సేకరించేందుకు పోలీసులు కోట వద్ద సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. సియాను తీసుకెళ్లి అక్కడ ఆమెఎలా హత్య చేసిందో వివరంగా తెలుసుకున్నారు. ఈ సీన్ రీక్రియేషన్‌లో భాగంగా మనిషిని పోలిన ఒక బొమ్మను కూడా పోలీసులు పర్వతంపైనుంచి తోసేశారు. ఇక, పోలీసు కస్టడీలో విచారణలో సియా, చేతన్‌లు కీలక విషయాల్ని తెలిపారు. కేతన్ హత్యకు ముందు లోహాగఢ్ కోటలో మర్డర్ రిహార్సల్స్ కూడా చేసినట్లు తేలింది. హత్య చేయడానికి కొద్ది రోజుల ముందు ఇద్దరూ కోటకు వెళ్లి ఏ ప్రదేశం నుంచి తోసేస్తే ఈజీగా చంపవచ్చు అనేది పరిశీలించారు. అనేక ప్రదేశాల్ని పరిశీలించి, అనువైన ప్రదేశాన్ని ఎంపిక చేసుకున్నారు. అతడిని తోసేసిన తర్వాత అది హత్యలా కాకుండా ప్రమాదంగా అనిపించేలా ఏ జాగ్రత్తలు తీసుకోవాలో ముందే ప్లాన్ చేశారు. కేతన్ హత్య అనంతరం పోలీసులు విచారణలో అడగబోయే ప్రశ్నలు ఏంటి వాటికి ఏం సమాధానంచెప్పాలో కూడాముందుగానే సిద్ధమయ్యారు. హత్య చేసే విధానాల గురించి గూగుల్‌లో, యూట్యూబ్‌లో సెర్చ్ చేశారు. సియా, చేతన్ కలిసి చాలా పకడ్బందీగా హత్యకు ప్లాన్ చేశారు.




## రాజకీయాలంటే పార్ట్‌టైమ్ బాధ్యతలు కాదు

### రాహుల్‌పై మాజీ రాష్ట్రపతి ప్రణబ్ కుమార్తె చురకలు

**న్యూఢిల్లీ,జూన్ 28:** మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కుమార్తె శర్మిష్ఠా ముఖర్జీ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు చేశారు. రాజకీయాలంటే కొద్ది రోజులు ప్రజల్లో ఉంటూ,మళ్లీ మాయమయ్యే వ్యవహారం కాదని, రాజకీయం 24 గంటలు, ఏడాది పొడవునా కొనసాగే ఫుల్‌టైమ్ బాధ్యత అని ఆమె అన్నారు. ఒక మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 2014లో రాహుల్ గాంధీ కాంగ్రెస్ ముఖ్య నేతగా ఉన్నప్పటి నుంచి పార్టీ వరసగా ఎన్నికల్లో ఓటములు చవిచూస్తోందని, ఇది ఆయన నాయకత్వ వైఫల్యంగా భావించాల్సిందే అని పేర్కొన్నారు.

## 'కన్యత్వం' పోతే బాధితురాలిని తప్పుబట్టలేం




### అత్యాచార కేసులో అలహాబాద్ హైకోర్టు సంచలన తీర్పు

### నిందితుడు 10రోజుల్లోపు లొంగిపోవాలని ఆదేశం

**ప్రయాగ్‌రాజ్, జూన్ 28:** అత్యాచార బాధితురాలి వాంగ్మూలం విశ్వసనీయంగా ఉన్నట్లయితే, ఆమె హైమెన్ (కన్యత్వ పొర) చిరిగిపోయి ఉండటం అనే కారణంతో నిందితుడికి 'సందేహ ప్రయోజనం' లభించదని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. అత్యాచారం అనేది ఒక చట్టపరమైన పదం తప్ప వైద్యపరమైన పదం కాదని కూడా కోర్టు పేర్కొంది. 1982లో జరిగిన ఒక ఘటనకు సంబంధించి, అత్యాచార నేరస్తుడికి 1983లో విధించిన శిక్షను (నేర నిర్ధారణ, మూడేళ్ల జైలు శిక్ష) కోర్టు సమర్థించింది. క్రీడలు, సైక్లింగ్, జిమ్నాస్టిక్స్, గుర్రపు స్వారీ, కఠినమైన శారీరక శ్రమ లేదా ప్రమాదవశాత్తు జరిగే గాయాల వంటి వివిధ కారణాల వల్ల హైమెన్ చిరిగిపోయే అవకాశం ఉందని జస్టిస్ సంతోష్ రాయ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. కొంతమందికి పుట్టుకతోనే హైమెన్ రంధ్రం కలిగి ఉండటం లేదా అసలు లేకపోవడం వంటివి జరుగుతాయని, మరికొందరిలో అది చాలా సాగేగుణం కలిగిఉంటుందని కోర్టు పేర్కొంది. కాబట్టి, ఇటువంటి వైద్యపరమైన అంశాలు బాధితురాలి విశ్వసనీయమైన వాంగ్మూలాన్ని అధిగమించలేవని కోర్టు అభిప్రాయపడింది. అత్యాచారం సాధారణంగా రహస్య వాతావరణంలో జరుగుతుందని, అంటే స్వతంత్ర ప్రత్యక్ష సాక్షులు దొరికే అవకాశం ఆచరణలో దాదాపు ఉండదని కూడా కోర్టు నొక్కి చెప్పింది. రాకేష్ అప్పటికే బెయిల్‌పై ఉన్నాడు. జూన్ 23నాటి తన తీర్పులో, హైకోర్టు ఆ దోషిబెయిల్ బాండ్లను తక్షణమే రద్దు చేసింది. తన శిక్షలో మిగిలిన భాగాన్ని అనుభవించడానికి 10 రోజుల్లోగా విచారణ కోర్టు (ట్రయల్ కోర్టు) ముందు లొంగిపోవాలని అతన్ని ఆదేశించింది.

## పెళ్లికి తిరస్కరించిందని మహిళపై దాడి, ఇంటికి నిప్పు

### నిందితుడు అరెస్టు

**భువనేశ్వర్, జూన్ 28:** ఒడిశాలోని సుందర్‌గఢ్ జిల్లాలో ప్రేమ ప్రతిపాదనను తిరస్కరించినందుకు ఒక వ్యక్తి మహిళ ఇంటికి నిప్పు పెట్టడంతో ఆమె తీవ్ర గాయాలపాలైంది. నిందితుడిని అరెస్టు చేశామని, తదుపరి విచారణ జరుగుతోందని పోలీసులు తెలిపారు. ఈ ఘటన సుందర్‌గఢ్ జిల్లాలోని బిస్రా బ్లాక్ పరిధిలోని ఒక గ్రామంలో జరిగింది. ప్రాథమిక విచారణ ప్రకారం, నిందితుడు ఆ మహిళ పట్ల తీవ్ర వ్యామోహం పెంచుకున్నాడు. ఆమె తన వివాహ ప్రతిపాదనను తిరస్కరించడంతో దాడికి పాల్పడ్డాడు. ఆమె గదిలో నిద్రిస్తుండగా, నిందితుడు కిటికీ గుండా పెట్రోల్ పోసి,ఆమెను చంపాలనే ఉద్దేశంతో నిప్పు పెట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు. మంటలు చెలరేగడానికి కొద్ది క్షణాల ముందు నిందితుడు రజత్ కిరోను కిటికీ దగ్గరచూసినట్లు బాధితురాలి తండ్రి జెనా టోప్పో ఆరోపించారు. వివాహ ప్రతిపాదనను తిరస్కరించినప్పటి నుండి కిరో తన కుమార్తెను పలుమార్లు వేధించాడని కూడా ఆయన తెలిపారు. మహిళ ఆర్త నాదాలు విని, మంటలను గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని, కాలిపోతున్న ఇంటి నుండి ఆమెను రక్షించి రూర్కెలాలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆమెకు తీవ్రమైన కాలిన గాయాలయ్యాయని (సుమారు 40 శాతం వరకు అని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి), ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. పోలీసులు శాస్త్రీయ పరిశోధన బృందంతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించి, ఫోరెన్సిక్ ఆధారాలను సేకరించారు. నిందితుడికి ఆ మహిళ పట్ల ఉన్న వ్యామోహమే ఈ దాడికి కారణమని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. "నిందితుడిని అరెస్టు చేశాము. అతన్ని కోర్టులో హాజరు పరుస్తాము. తదుపరి విచారణ కొనసాగుతోంద్ధి అని పోలీసులు తెలిపారు.



# సంక్షిప్త వార్తలు

## జపాన్‌లో మళ్లీ భూకంపం: రిక్టర్ స్కేల్‌పై 6.1 తీవ్రత

**టోక్యో, జూన్ 28:** జపాన్‌లో మరోసారి భూకంపం సంభవించింది. ఆదివారం ఉదయం మళ్లీ భూమి కంపించింది. ఆ భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.1గా నమోదైంది. అమోరి ప్రిఫెక్చర్ సమీపంలో 40 కిలోమీటర్ల లోతులో ఈ భూకంప కేంద్రం ఉన్నట్లు జపాన్ వాతావరణ విభాగం (జెఎంఎ) వెల్లడించింది. కాగా గత కొన్ని రోజులుగా పలు దేశాలను భూకంపాలు వణికిస్తున్నాయి. ఈ ప్రకృతి విపత్తు ఇటీవల వెనుజులాలో భారీ విధ్వంసాన్ని సృష్టించి విషాదాన్ని మిగిల్చింది. వెనుజులాలో భూకంపం సంభవించిన సమయంలోనే జపాన్‌లో 7.2 తీవ్రతతో భూకంపం వచ్చింది. మళ్లీ కొద్ది రోజుల వ్యవధిలో ఇలా రెండోసారి ప్రకంపనలు రావడంపై జపాన్‌లో ఆందోళన వ్యక్తమవుతోంది.



## 13యేళ్ల బాలికపై 5 రోజుల్లో 30మంది అత్యాచారం

**న్యూఢిల్లీ, జూన్ 28:** రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్‌లో 13యేళ్ల బాలికపై 30 మందికి పైగా వ్యక్తులు ఐదు రోజుల పాటు అత్యాచారం చేశారని ఆరోపణలు వచ్చాయి. ఈ లైంగిక దాడి ఘటనలు పలు హోటళ్లలో జరిగినట్లు చెబుతున్నారు.పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ప్రకారం, ఇంటి నుండి అదృశ్యమైన బాలికను ఒక రిక్షా డ్రైవర్ హోటల్ యజమానికి విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. మైనర్ బాలిక లైంగిక దోపిడీలో మరికొందరు హోటల్ నిర్వాహకులు కూడా ప్రమేయం కలిగి ఉన్నారని ఆరోపణలు ఉన్నాయి. బాధిత బాలిక ఫిర్యాదుతో పలువురు హోటల్ యజమానులు, నిర్వాహకులను అరెస్టు చేశారు.

## రాజధానిలో రాహుల్ కనిపించడంలేదంటూ పోస్టర్లు..




**న్యూఢిల్లీ,జూన్ 28:** దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయ కలకలం రేగింది. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కనిపించడం లేదు అంటూ ఆదివారం ఢిల్లీలోని పలు కీలక ప్రాంతాల్లో వెలిసిన పోస్టర్లు రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. రాహుల్‌గాంధీ తాజా విదేశీ పర్యటనను లక్ష్యంగా చేసుకుని అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ మధ్య సాగుతున్న పొలిటికల్ వార్‌లో ఈ పరిణామం సరికొత్త మలుపు తిప్పింది. ఢిల్లీలోని ఫిరోజ్‌షా రోడ్డుతో పాటు పలు ప్రధాన కూడళ్లలో రాహుల్ గాంధీ ఫొటోతో కూడిన మిస్సింగ్ పోస్టర్లు ప్రత్యక్షమయ్యాయి. అయితే ఈ పోస్టర్లను ఎవరు అంటించారనేది ప్రస్తుతానికి స్పష్టంగా తెలియరాలేదు.

## ప్రొఫెల్లర్ తగిలి ట్రైనీ పైలట్‌కు గాయాలు..

**లక్నో, జూన్ 28:** శిక్షణలో భాగంగా విమానం నడిపిన మహిళా ట్రైనీ పైలట్ ల్యాండింగ్ తర్వాత ఇంజిన్ ఆన్‌లో ఉండగానే కిందకు దిగింది. దీంతో తిరుగుతున్న ప్రొపెల్లర్ ఆమె వెనుక భాగానికి తగలడంతో గాయపడింది. ఆ మహిళను వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఈ సంఘటన జరిగింది. ఈనెల 26న కాన్పూర్‌లోని చకేరి విమానాశ్రయంలో గార్గ్ ఏవియేషన్‌కు చెందిన ట్విన్ ఇంజిన్ విమానంలో మహిళా ట్రైనీ పైలట్ రాత్రిపూట శిక్షణ పొందింది. ఆమెతో పాటు ఫ్లైట్ ఇన్‌స్ట్రక్టర్ కూడా అందులో ఉన్నారు.



## పార్టీగుర్తు ఫోర్జరీ చేశారంటూ టిఎంసి లీగల్‌సెల్ ఫిర్యాదు

**కోల్‌కత్తా,జూన్ 28:** పశ్చిమ బెంగాల్‌లో అధికారాన్ని కోల్పోయిన అనంతరం తృణమూల్ కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలు తీవ్రమయ్యాయి. ఇప్పటికే పార్టీ రెండుగా చీలింది. మెజారిటీ ఎమ్మెల్యేలు, ఎంపీలు బయటికి వెళ్లి పోయారు. అసలు టీఎంసీ ప్రతిపక్ష హోదా సైతం కోల్పోయింది. ఎన్నికలు ముగిసిన నెల రోజుల్లోపే తృణమూల్ మొత్తం కూడా చెల్లా చెదురైంది. పార్టీ అధినేత్రి మమత బెనర్జీ, ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ సహా పార్టీ సీనియర్లు కేసులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిణామాల మధ్య మమత బెనర్జీ తాజా ఎత్తుగడవేశారు. పార్టీ అధికారిక గుర్తును ఫోర్జరీ చేయడంతో పాటు, పేరును దుర్వినియోగం చేస్తూ కొందరు నేతలు ప్రైవేట్‌గా సమావేశాలు నిర్వహించారనే అంశాన్ని తెర మీదికి తెచ్చారు.ఈ క్రమంలో పార్టీ లీగల్ సెల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.



# రిజిస్ట్రేషన్లలో ప్రైవేటు భాగస్వామ్యం

**• పిపిపి పద్ధతిలో సేవా కేంద్రాల ఏర్పాటు ప్రతిపాదనపై అభ్యంతరాలు**


**• ప్రజల వివరాల గోప్యతపై అనుమానాలు • పూర్తిగా ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్**




**నూజివీడు, జూన్ 28 ప్రభాతవార్త:** రిజిస్ట్రేషన్ల శాఖ ప్రతిపాదించిన 'సేవా కేంద్రాల్ల'పై విముఖత వ్యక్తమవుతోంది. వీటిని పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) పద్ధతిలో నిర్వహిస్తామని ప్రభుత్వం ఇటీవల ప్రకటించడాన్ని చాలామంది వ్యతిరేకిస్తున్నారు. దళారుల బెడద లేకుండా, పారదర్శకంగా సేవలు అందించడానికి వీటిని ఏర్పాటు చేస్తున్నట్టు చెబుతున్నారు. అయితే స్థిరాస్తుల కొనుగోళ్లు, వీలునామాలు, వారసత్వ ఆస్తుల పంపిణీ వివరాలు వంటివి ఆయా వ్యక్తులు గోప్యంగా ఉండాలని భావిస్తారు. ఇలాంటి వ్యవహారాలను నమోదుచేసే బాధ్యతను పిపిపిలో ఏదో ఒక సంస్థకు అప్పగించడమేమిటనే ప్రశ్న వినిపిస్తోంది. ప్రభుత్వం ఇప్పటికే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దళారుల ప్రమేయం లేకుండా ఎవరి డాక్యుమెంట్ వారు రాసుకోవడానికి 'పబ్లిక్ డేటా ఎంట్రీ (పిడిఇ) విధానం అమలు చేస్తోంది. అక్కడ దరఖాస్తు తీసుకొని ఆస్తి వివరాలు, సరిహద్దులు, కొనుగోలుదారు, అమ్మకందారు పేర్లు రాస్తే సరిపోతుంది. రెడీమేడ్ డాక్యుమెంట్ సిద్ధం అయిపోతుంది. తగిన ఫీజు చెల్లిస్తే రిజిస్ట్రేషన్ జరిగిపోతుంది. ఇప్పుడు కొత్తగా సేవా కేంద్రాలు ఏర్పాటుచేస్తే, అక్కడ దళారులు ప్రత్యక్షం కారని గ్యారంటీ ఏమీ లేదు. దీనికి ఫీజులు కాకుండా అదనపు రుసుము రూ.2 వేలు చెల్లించాలని అంటున్నారు. డాక్యుమెంట్ రైటర్‌ను కక్షి దారులు వ్యక్తిగత సహాయకుడిగా నమ్మి అతడికి వివరాలన్నీ చెప్పి రాయించుకుంటారు. అదే ప్రభుత్వం ఏర్పాటుచేసిన మనిషి (సంస్థ) అనగానే అన్ని విషయాలు చెప్పలేని పరిస్థితి ఉంటుంది. పైగా ఇప్పుడు ఆస్తి కొనుగోలు చేసినా, అమ్మినా డాక్యుమెంట్లో రాసే ధర వేరు. బయట వారికి ఇచ్చే ధనం వేరు. ఇది బ్లాక్ అండ్ వైట్‌లో ఉంటుంది. ఇది జగమెరిగిన సత్యం. ఇలాంటి వన్నీ సేవా కేంద్రాల్లో చర్చించలేని, ప్రశ్నించలేని అంశాలు. పారదర్శకత అని చెప్పినా అక్కడ పాటించ లేని అంశాలన్నీ ఉంటాయి. పిపిపి అనగానే ఏదో ఒక సంస్థ కాంట్రాక్టు తీసుకుంటుంది. వారికి సంబంధించిన వ్యక్తులను సేవా కేంద్రాల్లో పెడతారు. వారు సక్రమం గా విధులు రిజిస్ట్రేషన్లలో ప్రైవేటు భాగస్వామ్యం నిర్వహిస్తారని చెప్పలేం. సమర్పించిన ఆస్తుల వివరాలు వేరే వ్యక్తులకు చేరవేయకుండా ఉంటారని విశ్వసించలేము. పాస్‌పోర్టు సేవా కేంద్రాల మాదిరిగా రిజిస్ట్రేషన్ వ్యవహారాలు నడపాలని ప్రభుత్వం ముందు నుంచి భావిస్తోంది. పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో వ్యక్తిగత సమాచారం మాత్రమే ఉంటుంది. ఆధార్, వేలిముద్రలు, ఐరిస్, సర్టిఫికెట్ల పరిశీలన వరకు మాత్రమే అక్కడి సిబ్బంది పరిమితమవుతారు. మిగిలినవన్నీ పాస్‌పోర్టు కార్యాలయం చూసుకుంటుంది.

రిజిస్ట్రేషన్ల విషయానికి వస్తే కోట్ల రూపాయల వ్యవహారాలకు సంబంధించిన డాక్యుమెంట్లు థర్డ్ పార్టీకి సమర్పించాలి. వారి ద్వారా అవి సబ్ రిజిస్ట్రార్లకు వెళతాయి. అక్కడి నుంచి క్లియరెన్స్ వస్తేనే రిజిస్టర్ చేస్తారు. డాక్యుమెంట్ రాయడానికి, ఆయా పత్రాలు తీసుకోవడానికి రూ.2 వేలు ఫీజు కట్టాలని ప్రభుత్వం చెబుతోంది. ఇందులో విశ్వసనీయత ఉండదని అభిప్రాయం వ్యక్తమవుతోంది. సేవా కేంద్రం ఏర్పాటుచేస్తే అక్కడ రోజుకు కనీసం 50 డాక్యుమెంట్లు తీసుకున్నా ఒక్కో డాక్యుమెంట్‌కు రూ.2 వేలు చొప్పున రోజుకు లక్ష రూపాయల ఆదాయం అధికారికంగా వారికి వస్తుంది. పిపిపిలో కాకుండా ప్రభుత్వమే వీటిని నిర్వహిస్తూ, అక్కడ న్యాయశాస్త్రం చదివిన వారిని కనీసం కాంట్రాక్టు విధానంలో తీసుకున్నా బాధ్యతగా పనిచేస్తారు. అందరికీ నమ్మకం ఏర్పడుతుంది. రాష్ట్రవ్యాప్తంగా 298 సబ్ రిజిస్టర్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిలో సగానికి పైగా సొంత భవనాలు లేవు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. అద్దె కూడా సక్రమంగా చెల్లించలేకపోతున్నారు. కార్యాలయాలకు అవసరమైన ప్రింటర్లు, ఇతర సామగ్రి కూడా సరిగ్గా ఇవ్వడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో మరో భవనం తీసుకొని సేవా కేంద్రం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏమిటనే ప్రశ్న వినిపిస్తోంది.

## పివి నరసింహారావు దార్శనికుడు: సిఎం



**విజయవాడ, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** భారత మాజీ ప్రధాని, దివంగత పివి నరసింహారావు 105వ జయంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ప్రముఖులు నివాళి అర్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. పివి నరసింహారావు దేశానికి చేసిన సేవలను ప్రశంసించారు. క్లిష్ట సమయంలో దూరదృష్టితో ఆలోచించి దేశాభివృద్ధికి తోడ్పడ్డారని, భావి తరాలకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.

**పివి నరసింహారావు మహానేత: సిఎం చంద్రబాబు**

"భారత మాజీ ప్రధాని పివి నరసింహారావు 105వ జయంతి సందర్భంగా నివాళి అర్పిస్తున్నా. దేశం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో ప్రధానిగా బాధ్యతలు స్వీకరించి, దూరదృష్టితో ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. భారత అభివృద్ధి దిశను మార్చిన మహానేతగా ఆయన చిరస్మరణీయులు. పివి దార్శనిక నాయకత్వం, దేశాభివృద్ధికి చేసిన సేవలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయి. ఆ మహనీయుడి పుణ్యస్మృతికి మరొకసారి వినమ్ర నివాళ్లి అంటూ ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు.

**ఆర్థికవేత్తగా ఎన్నో సంస్కరణలు: మంత్రి లోకేశ్**

"ప్రధానమంత్రిగా, ఆర్థికవేత్తగా ఎన్నో సంస్కరణలను అమలులోకి తీసుకువచ్చి దేశాభివృద్ధికి విశేషకృషిచేసిన భారతరత్న పివి నరసింహారావు జయంతి సందర్భంగా నివాళి అర్పిస్తున్నా. రాజనీతిజ్ఞుడిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరుగాంచిన పివి నరసింహారావు తెలుగువారు కావడం మనందరికీ గర్వకారణం. పివి జయంతి సందర్భంగా రాష్ట్రానికి, దేశానికి ఆయన అందించిన సేవలను స్మరించుకుందాం్ణ అంటూ ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

**పివి గొప్ప రాజనీతిజ్ఞుడు: డి.సిఎం పవన్ కల్యాణ్**

"భారతరత్న పివి నరసింహారావు జయంతి సందర్భంగా నా హృదయపూర్వక నివాళి అర్పిస్తున్నా. భారతదేశపు అత్యంత దార్శనిక రాజనీతిజ్ఞులలో ఒకరు, అసాధారణ పండితుడు పివి నరసింహారావు. ఆయన నాయకత్వం మన దేశ చరిత్ర గమనాన్ని మార్చేసింది. కీలక సమయంలో ఆయన ధైర్యం, దూరదృష్టి, చారిత్రాత్మక ఆర్థిక సంస్కరణలు భారతదేశ వృద్ధికి, ప్రపంచ స్థాయిలో దాని స్థానానికి కొత్త మార్గాలను తెరిచాయి. పివి అద్భుతమైన మేధస్సు, పరిపాలనా నైపుణ్యం, జాతీయ ప్రగతి పట్ల అచంచలమైన నిబద్ధత శాశ్వత స్ఫూర్తిగా నిలుస్తున్నాయి. ఆయన స్ఫూర్తి ప్రతి భారతీయుడిని నిబద్ధతతో దేశానికి సేవ చేయడానికి ప్రేరేపిస్తూనే ఉండాలని ఆశిస్తున్నా్ణ అని డి.సిఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## ప్రాచీన కళలను పరిరక్షించాలి

**• ముగిసిన జాతీయ సంగీత నృత్యోత్సవాలు**




**తిరుపతి, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆధ్యాత్మిక నగరం తిరుపతి మహతి కళాక్షేత్రం వేదికగా జరుగుతున్న శ్రీకృష్ణదేవరాయ కళాదర్బార్ – రాయలసీమ రంగస్థలం జాతీయస్థాయి జానపద సంగీత, నృత్య పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ఆదివారం నిర్వహించిన పోటీల్లో వివిధ కళా బృందాలు ప్రదర్శించిన సంప్రదాయ కళారూపాలు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన చప్పట్లతో ప్రశంసలు అందుకున్నాయి. అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి ్మ, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ డాక్టర్ జి ఎస్ ప్రసాద్, రామలింగేశ్వర స్వామి గుడి చైర్మన్ దొడ్డ రెడ్డి మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొని విజేతలకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఆధునిక వినోద మాధ్యమాల ప్రభావంతో కనుమరుగవుతున్న కళలను పరిరక్షి ంచడం, ప్రోత్సహించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కళలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని, వాటిని భావితరా లకు అందించేందుకు ఇలాంటి జాతీయస్థాయి పోటీలు ఎంతో దోహదపడ తాయని అన్నారు. గత 35 సంవత్సరాలుగా తిరుపతిని వేదికగా చేసుకుని నిరంతరాయంగా జాతీయస్థాయి సంగీత, నృత్య, జానపద పోటీలను నిర్వహిస్తూ కళాకారులకు ప్రోత్సాహం అందిస్తున్న రాయలసీమ రంగస్థలం సేవలను అభినందించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న సంస్థ చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి, కార్యదర్శి రాజాతో పాటు నిర్వాహక బృందాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాబృందాలు తమ అద్భుతమైన జానపద సంగీత, నృత్య

## కేశినేని సోదరుల ప్రచ్ఛన్న యుద్ధం

**• చిన్నిపై నాని భూకబ్జా ఆరోపణలు • తెలంగాణ సిఎంకు బహిరంగ లేఖ • నాని లేఖపై చిన్ని వ్యంగ్యాస్త్రాలు**



**విజయవాడ, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ రాజకీయాల్లో అన్నదమ్ముల సవాళ్ళు, ప్రతి సవాళ్ళు కొనసాగుతున్నాయి. తాజాగా మాజీ ఎంపి, వైసిపి నేత కేశినేని శ్రీనివాస్(నాని) తన సోదరుడు, ప్రస్తుత విజయవాడ టిడిపి ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) లక్ష్యంగా సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్ శివార్లలోని వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు చిన్ని ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సోషల్ మీడియా వేదికగా ఒక బహిరంగ లేఖ రాశారు. ఈ భూకబ్జా యత్నాన్ని తక్షణమే అడ్డుకోవాలని ఆయన డిమాండ్ చేశారు హైదరాబాద్ నగర శివారులోని ప్రగతినగర్, షంషిగూడ ప్రాంతంలో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థకు (టిజిఐఐసి) చెందిన 112.72 ఎకరాల భూమి ఉంది. దీనిని ఐటీ పార్క్ కోసం కేటాయించారు. అయితే, ఈ అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని ఎంపి కేశినేని చిన్ని, ఆయన బినామీగా వ్యవహరిస్తున్న మెసర్స్ ఎక్సెల్లా ప్రాపర్టీస్ అనే సంస్థ అక్రమంగా చేజిక్కించుకోవాలని చూస్తున్నాయని కేశినేని నాని తన లేఖలో ఆరోపించారు. ఈ భూమిపై ఇప్పటికే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) జప్తు ఆదేశాలు, నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) ఆంక్షలు అమల్లో ఉన్నాయని, ఈ కీలక విషయాలను దాచిపెట్టి మోసానికి పాల్పడుతున్నారని నాని పేర్కొన్నారు. ఈ వాస్తవాలను మరుగునపరిచి, సుప్రీంకోర్టులో ఒక మోసపూరిత రాజీ ఒప్పందాన్ని చూపి ప్రభుత్వ భూమిని కొట్టేయాలని కుట్ర చేస్తున్నారని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు. గతంలో జిల్లా కలెక్టర్ సమర్పించిన అఫిడవిట్ ప్రకారం ఈ భూమిపై ప్రైవేటు వ్యక్తులకు ఎలాంటి హక్కులు లేవని (జీరో ప్రైవేట్ టైటిల్) స్పష్టంగా ఉన్నప్పటికీ, అక్రమార్కులు రాత్రికి రాత్రే ఆక్రమణలు మొదలు పెట్టారని నాని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కేశినేని నాని కోరారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు అడ్వకేట్ జనరల్ ద్వారా న్యాయస్థానాల్లో జోక్యం చేసుకుని, ఈ అక్రమ భూ బదలాయింపును నిలువరించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో ప్రభుత్వ భూముల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు కోసం ఏర్పాటు చేసిన 'హైడ్రా్ణ యంత్రాంగాన్ని వెంటనే రంగంలోకి దించి, ఇప్పటికే మొదలైన అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. నకిలీ పత్రాలు, మోసపూరిత ఒప్పందాలతో ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న ఎంపి కేశినేని చిన్ని, ఆయన బినామీలు, సూత్రధారులపై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు.

**చాల్లే.. ఇక పక్కకు వెళ్ళి ఆడుకో: ఎంపి కేశినేని శివనాథ్:** మాజీ ఎంపీ నానిపై తెలుగుదేశం ఎంపీ కేశినేని శివనాథ్ వ్యంగ్యాస్త్రాల సంధిం చారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నాని రాసిన లేఖపై చిన్ని తీవ్రంగా స్పందిం చారు. ఈర్ష్య, ద్వేషం, కసి, పగతో నాని నిత్యం రగిలిపోతున్నారని ఎద్దేవా చేశారు. ఆదివారం విజయవాడలో కేశినేని శివనాథ్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్ని మీడియాతో మాట్లా డారు. ఇంతకుమించి దిగజారవు అనుకున్న ప్రతిసారి నాని ఇంకా ఇంకా దిగజారుతూనే ఉన్నారని శివనాథ్ సెటైర్లు గుప్పించారు. రేవులో తాడిచెట్టు మాదిరిగా పెరిగాడని, కానీ కొంచెమైనా ఇంగిత జ్ఞానం మాత్రం లేదని వ్యంగ్యంగా అన్నారు. ప్రధానికి, రాష్ట్రపతికి ఇరువురు ముఖ్యమంత్రులకు తనపై నాని ఫిర్యాదు చేశారని చెప్పుకొచ్చారు. ఇక మిగిలింది అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, పుతిన్, కిమ్, కెఏ పాల్ మాత్రమేనని ఎద్దేవా చేశారు. నాని వల్ల ఏం కాదని, పక్కకెళ్లి ఆడుకో అని కేశినేని శివనాథ్ విమర్శలు గుప్పించారు.

## ఉండవల్లి ఘటనలో వైసిపి నేతలపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

**విజయవాడ, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్సార్సీపి నేతల నిన్నటి అమరావతి పర్యటనలో రౌడీషీటర్లు పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు. గతంలో టిడిపి కార్యాలయంపై దాడి చేసిన వారే శనివారం రైతులపై దాడి, కవ్వింపు చర్యల్లో పాల్గొన్నట్లు గుర్తించారు. పోలీసు కానిస్టేబుల్‌పై దాడి వెనకా ఆ రౌడీ బ్యాచే ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తొలుత రాళ్ల దాడికి పాల్పడి రైతుల్ని రెచ్చకొట్టింది వైఎస్సార్సీపి వెంట వచ్చిన రౌడీషీటర్లే అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గతంలో టిడిపి ఆఫీస్‌పై దాడికి పాల్పడిన చైతన్య శనివారం వైఎస్సార్సీపి నేతల వెంటా ఉన్నట్లు ఇప్పటికే పోలీసులు గుర్తించారు.

**3 కేసులు నమోదు:** గుంటూరు జిల్లా తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసులు నమోదయ్యాయి. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, పేర్ని నాని సహా పలువురు నేతలపై కేసులు నమోదు చేసారు.

పోలీసుల నివేదికల ప్రకారం, తాడేపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీ మంత్రి అంబటి రాంబాబుపై ఒక కేసు నమోదైంది. అలాగే, తాడేపల్లి తెలుగు విద్యార్థి సంఘం అధ్యక్షుడు రాయపూడి కిరణ్ ఫిర్యాదుతో మరికొన్ని కేసులు నమోదు చేశారు. అంబటి రాంబాబు, పేర్ని నానితో పాటు లేళ్ల అప్పిరెడ్డి, పనుగంటి చైతన్య, వేమారెడ్డి తదితరులు నిందితుల జాబితాలో ఉన్నారు. వీరితో పాటు రైతులు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా కూడా వైసిపి నేతలపై కేసులు నమోదు చేశారు.

మరోవైపు, వైసీపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైతులపై పోలీసులు కౌంటర్ కేసు నమోదు చేశారు. ఈ పరిణామాలతో తాడేపల్లి ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇరుపక్షాల నుంచి అందిన ఫిర్యాదులపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

## తిరుపతి ఇఎస్ఐ ఆస్పత్రిని బలోపేతం చేయండి

**• సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగరావు**



**తిరుపతి, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** పారిశ్రామికంగానూ, వివిధ రంగాల్లోనూ వేగంగా అభివృద్ధి చెందుతున్న తిరుపతి జిల్లాలోని తిరుపతిలోని ఇఎస్ఐ ఆసుపత్రిని 200 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి పరచాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్.నర్సింగరావు కోరారు. వేలాదిగా పెరుగుతున్న వలస కార్మికులు, రాయలసీమ జిల్లాల అవసరాలు దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం తిరుపతిలోని ఇఎస్ఐ ఆసుపత్రిలో ప్రస్తుతం ఉన్న నర్సింగ్ సిబ్బంది సంఖ్యను, హౌస్ కీపింగ్ కార్మికుల సంఖ్యను గణనీయంగా పెంచాలని నర్సింగరావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం మధ్యాహ్నం సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ నర్సింగ్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి, తిరుపతి జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి టి. సుబ్రహ్మణ్యం, జిల్లా అధ్యక్షుడు జయచంద్ర, తిరుపతి నగర అధ్యక్షురాలు పి.బుజ్జి, కె.వేణుగోపాల్, ఎస్.శంకర్‌తో కూడిన సిఐటియు బృందం తిరుపతిలోని ఇఎస్ఐ ఆసుపత్రిని సందర్శించింది. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, కార్మికులతో పలకరించి సమస్యలను తెలుసుకున్నారు. ఇఎస్ఐ ఆసుపత్రిలోని కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

**• రచయితల పుస్తకాలు ఎక్కువ కొనుగోలు చేసేలా చర్యలు • వచ్చే నెలలో అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణానికి శ్రీకారం • రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు**

**• సందర్శన యాత్రను జెండా ఊపి ప్రారంభించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ**




**విజయవాడ, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి అతిపెద్ద సెంట్రల్ లైబ్రరీ నిర్మాణ పనులకు జులైలో శంకుస్థాపన చేయనున్నట్లు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. కవులు, రచయితల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గ్రంథాలయాల సందర్శన యాత్ర జరిగింది. తొలుత ఈ బస్సు యాత్రను సివిల్ కోర్టుల వద్ద ఉన్న విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ గ్రంథాలయం వద్ద ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్షీ ్మశ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజ్ఞాన భాండాగారాలైన గ్రంథాలయాల ప్రాశ స్త్యాన్ని నేటి తరం వారికి తెలియజేసే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఇటువంటి యాత్ర చేపట్టడం హర్షణీయమ న్నారు. ప్రభుత్వ పరంగా అన్ని సహాయ సహకారాలు రచయితలకు అందజేసేందుకు తానెప్పుడు సిద్ధంగా ఉంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విబిఎఫ్ఎస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఉపాధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీని వాసులు అధ్యక్షతన ప్రారంభ సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో రచయితల పుస్తకాల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తానని హామీ ఇచ్చారు. అమరావతిలో సకల సౌకర్యాలతో విశాలమైన సెంట్రల్ లైబ్రరీ నిర్మాణ పనులకు జులైలో శంకుస్థాపన చేస్తామని రెండేళ్లల్లో పూర్తిచేసేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని వివరించారు. గ్రంథాలయాల ప్రస్తుత స్థితి మార్పు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. కృష్ణా జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.వి.పూర్ణచంద్, సాహితీవేత్తలు గుమ్మా సాంబశివరావు, వేముల హజరత్తయ్య గుప్తా, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కె.లక్ష ్మయ్య, తదితరులు పాల్గొని ప్రసంగించారు. యాత్ర ఉద్దేశాలను ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాశ్ సభకు వివరించారు. ఈ సందర్భంగా చెన్నాప్రగడ శర్మ రచించిన కవిత్వం కురిసింది కవితా సంకలనం, ఎం.ఎస్.వి. ప్రసాద్ రచించిన ఆవకాయ్ శతకం, ఎస్.ఆర్.పృధ్వి రచన ఆరుద్ర సప్తతి ఉత్సవం పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. అనంతరం బస్సుల్లో కవులు, రచయితలు బయలుదేరి నగరంలోని ఠాగూర్ గ్రంథాలయం, రామ్మోహన్ లైబ్రరీ, హనుమంతరాయ గ్రంథాలయం, సర్వోత్తమ గ్రంథాలయాలను సందర్శించి వాటి విశిష్టతలను అక్కడ పుస్తకాలను పరిశీలించారు. ముగింపు వేడుకల్లో పలువురు పాల్గొని వారి సందేశాలను ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం తరపున ప్రభుత్వ ఉగాది పురస్కార విజేత గబ్బిట దుర్గాప్రసాద్‌ను సత్కరించారు. అతిథులు, కవులు, రచయితలకు సంస్థ పక్షాన ఆత్మీయ సత్కారం చేశారు. కార్యక్రమాలను సంఘ ప్రతినిధులు నానా, సోమేపల్లి వశిష్ట, శర్మ సీహెచ్. రాజశేఖర్ పాణిగ్రాహి, కోపూరి పుష్పాదేవి, చింతా లక్షీ ్మసుజాత, వేలూరి సుధారాణి తదితరులు పర్యవేక్షించారు.

## నేడు డయల్ యువర్ ఎస్పిడిసిఎల్ సిఎండి

**తిరుపతి, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు 'డయల్ యువర్ సిఎండ్ణి కార్యక్రమం జరగనుంది. ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు మొబైల్ నంబరు 89777 16661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చు. ఈ కార్యక్రమం ద్వారా తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురాదలచిన వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి.

సర్కిల్ స్థాయిలోనూ డయల్ యువర్ ఎస్ఇ: డయల్ యువర్ ఎస్పిడిసిఎల్ సిఎండి కార్యక్రమంతో పాటు సర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8:30 నుంచి 9:30 గంటల వరకు 'డయల్ యువర్ ఎస్ఇ్ణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లాస్థాయిలో తమ విద్యుత్ సమస్యలను సూపరింటెండింగ్ ఇంజనీర్ దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా వినియోగదారులు తిరుపతి: 87126 52679, చిత్తూరు: 79931 47979, నెల్లూరు: 08612 320427, అన్నమయ్య: 94408 17449, కడప: 08562 242457, కర్నూలు: 73826 14308, నంద్యాల: 73826 18976, అనంతపురం: 91547 90350, శ్రీసత్యసాయి: 94906 15721 నంబర్లకు ఫోన్‌చేయాల్సి ఉంటుంది.

## ఎపిఎస్పిడిసిఎల్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

**విజయవాడ, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఎపిఎస్పిడిసిఎల్) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హత కలిగిన అభ్యర్థుల ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుల ప్రక్రియ జూన్ 30 నుంచి ప్రారంభం కానుంది. ఈ నియామక ప్రక్రియలో మొత్తం 135 ఖాళీలను భర్తీ చేయనున్నారు. వీటిలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) 125 పోస్టులు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సివిల్) 6 పోస్టులు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (టెలికాం) 4 పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత విభాగాల్లో గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి బిఇ లేదా బిటెక్ (ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, టెలికమ్యూనికేషన్స్, సివిల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. వయస్సు 2026 జులై 1 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బిసి, ఇడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఐదేళ్ల వయోపరిమితి సడలింపు ఉంటుంది. ఈ అర్హతలు కలిగిన వారు ఆన్‌లైన్ విధానంలో జులై 20 తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు ఫీజు కింద అప్లికేషన్ ప్రాసెసింగ్, కామన్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ నిర్వహణ కోసం రూ.1,000 చెల్లించాలి. ఆన్‌లైన్ రాత పరీక్ష ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది. ఎంపికైన అభ్యర్థులకు రెండేళ్ల ప్రొబేషన్ కాలంలో నెలకు రూ.75,000 కన్సాలిడేటెడ్ వేతనం చెల్లిస్తారు. అనంతరం రెగ్యులర్ పే స్కేల్ రూ.86,245 నుంచి రూ.2,08,915 వరకు వర్తిస్తుంది.


## పోలియోపై విజయం శాశ్వతం కావాలి: కలెక్టర్ లక్ష్మీశా



**విజయవాడ, జూన్ 28 ప్రభాతవార్త:** మన దేశం పోలియోపై సాధించిన విజయం శాశ్వతం కావాలంటే తల్లిదండ్రులు అందరూ తమ ఐదేళ్ళలోపు చిన్నారులకు పోలియో నివారణ చుక్కల మందులు వేయించాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా కోరారు. విజయవాడలోని అయోధ్యనగర్ పిహెచ్‌సిలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని చిన్నారులకు చుక్కల మందు వేసి కలెక్టర్ ప్రారంభించారు. ఈసందర్భంగా లక్ష్మీశా మాట్లాడుతూ పోలియోరహిత సమాజాన్ని శాశ్వతంగా కొనసాగించే కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా పిహెచ్‌సిలు, యుపిహెచ్‌సిల పరిధిలో 966 పోలీయో కేంద్రాల్లో పల్స్‌పోలియో కార్యక్రమం జరుగుతుందన్నారు. 4,274 మంది వ్యాక్సినేటర్‌లు, 104మంది రూట్ సూపర్‌వైజర్లు పాల్గొంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. రైల్వేస్టేషన్‌లు, బస్టాండ్‌లవద్ద 35 ట్రాన్సిట్ పాయింట్ల ద్వారా పోలియో నివారణ చుక్కల మందు వేస్తున్నట్లు చెప్పారు. ఆదివారం చుక్కలమందు వేయించకపోతే సోమ, మంగళవారాల్లో ఆరోగ్యసిబ్బంది ఇంటివద్దకే వచ్చి చిన్నారులకు పోలియో నివారణ చుక్కలమందు ఇస్తారని చిన్నారులందరికీ చుక్కలమందు వేయించాలని కలెక్టర్ సూచించారు. ఈకార్యక్రమంలో డియంహెచ్ఓ డాక్టర్ ఇందుమతిదేవి, డాక్టర్ చిలకపాటి రామ్‌చంద్, డాక్టర్ శ్వేత, తదితరులు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

## ప్రైవేటు విద్యాసంస్థల దోపిడికి అడ్డుకట్టేయండి

**• ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్**




**చిత్తూరు(హెల్త్), జూన్ 28 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రైవేటు విద్యా సంస్థల దోపిడికి అడ్డుకట్ట వేయడానికి విద్యార్థులు పోరాటం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్ పిలుపునిచ్చారు. చిత్తూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఆదివారం ఎస్ఎఫ్ఐ చిత్తూరు జిల్లా ప్లీనరీ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాలకు ముఖ్యఅతిథిగా హాజరైన ప్రసన్నకుమార్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై పోరాటాలు చేస్తున్న ఏకైక సంస్థ ఎస్ఎఫ్ఐ ఒక్కటే అన్నారు. దేశంలో మతోన్మాత బిజెపి ప్రభుత్వం విద్యను కాషాయికరణ చేసి విద్యను భవిష్యత్ తరాలకు దూరం చేయడానికి ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. చదువుతూ పోరాడు, చదువుకై పోరాడు అనే నినాదంతో ఎస్ఎఫ్ఐ పనిచేస్తూ దేశ వ్యాప్తంగా బలోపేతం అవుతున్నదన్నారు. నీట్ పరీక్షా ప్రశ్నాపత్రం లీకేజీకి బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి సత్వరం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు భగత్‌రవి, ఎస్ఎఫ్ఐ నాయకులు బాలసుబ్రమణ్యం, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

### మహిళా ఎస్సై సాహిబా అంజుమ్‌కు
# సీమంతం నిర్వహించిన హోం మంత్రి అనిత



(నక్కపల్లి, (ప్రభాతవార్త) జూన్ 28: అనకాపల్లి జిల్లా నక్కపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా ఎస్సై సాహిబా అంజుమ్‌కు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తన నక్కపల్లి నివాసంలో ఆదివారం ఘనంగా సీమంతం నిర్వహించారు. గర్భిణి అయిన ఎస్సై సాహిబా అంజుమ్‌కు సంప్రదాయబద్ధంగా సీమంతం చేసి, మాతా-శిశువు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వాదాలు అందించారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మహిళా ఎస్సై ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాలను ఆప్యాయంగా అడిగి తెలుసుకుని, జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేస్తున్న మహిళా పోలీసు సిబ్బందికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. సీమంతం కార్యక్రమంలో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది మహిళా ఎస్సై (తరువాయి 8వ పేజీలో)



పోలియోపై అప్రమత్తతే రక్షణ..

### ప్రతి చిన్నారికి
# పోలియో చుక్కలు వేయించాలి

**మంత్రి సత్యకుమార్ యాదవ్**

**విశాఖపట్నం, జూన్ 28, ప్రభాతవార్త :**

పోలియో రహిత భారతదేశాన్ని శాశ్వతంగా కొనసాగించేందుకు ప్రతి ఏడాది పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆదివారం భవానీ గార్డెన్స్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీ ఎం. శ్రీభరత్, ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ రాజు, జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్‌తో కలిసి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో 49.20 లక్షల మంది ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయడమే లక్ష్యంగా 30 వేల బూత్‌లు, 1,200 మొబైల్ బృందాలు, ట్రాన్సిట్ కేంద్రాల ద్వారా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 60 లక్షల వ్యాక్సిన్ డోసులు, 1.33 లక్షల మంది వైద్య, ఆరోగ్య సిబ్బందిని ఈ కార్యక్రమానికి వినియోగిస్తున్నామని చెప్పారు. బూత్‌లకు రాని చిన్నారులకు చివరి రెండు రోజులు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తామని వెల్లడించారు. ఎంపీ ఎం. శ్రీభరత్ మాట్లాడుతూ పోలియో రహిత భారతాన్ని శాశ్వతంగా కొనసాగించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు రెండు లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడమే లక్ష్యంగా 1,002 స్థిర బూత్‌లు, 62 మొబైల్, ట్రాన్సిట్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రి తమ ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు

### ప్రజల మనసును దోచుకున్న
# నాయకురాలు అనిత...

**పేట కేంద్రంగా రెండు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు ఏర్పాటు..!**

**మంత్రి జనార్దన్ రెడ్డి**

**నక్కపల్లి/అడ్డు రోడ్డు, జూన్ 28, ప్రభాతవార్త:**

పాయకరావుపేట నియోజకవర్గం ప్రజలు మనసులను దోచుకున్న వ్యక్తి వారి గుండెల్లో ఒక స్థానాన్ని సంపాదించుకున్న మహిళా నేత రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అని అటువంటి నాయకురాలు ఈ ప్రాంతంలో ఉండడం అందరి అదృష్టమని ఆమె ఆలోచన అంతా అభివృద్ధి వైపే ఉంటాది తప్ప ఎవరిని ఇబ్బందులు పెట్టాలని ఆలోచన కలిగిన వ్యక్తి కాదని రాజకీయాలకు అతీతంగా పనిచేస్తున్న నాయకురాలని రాష్ట్ర పెట్టుబడుల, మౌలిక సదుపాయాల శాఖామంత్రి బీసీ జనార్దన్ రెడ్డి కొనియాడారు. పాయకరావు పేట నియోజకవర్గంలో మత్స్యకారుల అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది అని చెప్పవచ్చు.! ముందుగా నక్కపల్లి మండలం మత్స్యకార గ్రామాల్లో పర్యటించడానికి వచ్చిన రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత రాష్ట్ర పెట్టుబడిల మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిలకు మత్స్యకార నాయకులు పాయకరావుపేట నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ నాయకత్వంలో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలం బోయపాడు వద్ద దొండవాక, రాజయ్యపేట (చందనాడ) తీరాల్లో నిర్మించనున్న రెండు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లకు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో పెట్టుబడులు , మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి చేతులు మీదుగా ఆదివారం శంకుస్థాపన చేశారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద ఒక్కో ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌ను రూ.24.77 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనుండగా, ఈ రెండు కేంద్రాల ద్వారా స్థానిక మత్స్యకారులకు ఆధునిక మౌలిక వసతులు, సురక్షిత బోటు ల్యాండింగ్, మార్కెటింగ్ సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా



స్థానిక మత్స్యకారులు మంత్రి వంగలపూడి అనితకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సభలో హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.60 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు నేడు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలో మంజూరైన మూడు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లలో రెండింటిని పాయకరావుపేట నియోజకవర్గానికి తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. మత్స్యకారులతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, గతంలో మత్స్యకార గ్రామంలో ఉపాధ్యాయురాలిగా పనిచేసిన విషయాన్ని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న ఆమె, గత రెండేళ్లలో సుమారు రూ.600 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ఆర్ అండ్ బీ శాఖ ద్వారా రూ.100 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయని చెప్పారు. రాజయ్యపేటలో గతంలో జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ, ఎవరి మీదా కేసులు నమోదు చేయవద్దని తానే ఆదేశించినట్లు వెల్లడించారు. ఎన్నికల వరకు మాత్రమే రాజకీయాలు ఉంటాయని, అనంతరం అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యమని స్పష్టం చేశారు. నియోజకవర్గానికి బీసీ వెల్ఫేర్ బాలికల హాస్టల్‌ను మంజూరు చేయించామని, త్వరలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో సుమారు తొమ్మిది వేల మత్స్యకార కుటుంబాలు ఉన్నాయని, వారి సంక్షేమానికి ఎన్డీఏ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. పెట్టుబడులు , మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని అన్నారు. ఈ రెండు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు వేలాది మత్స్యకార (తరువాయి 8వ పేజీలో)





## చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన హోం మంత్రి అనిత



**ఎస్.రాయవరం, జూన్ 28, ప్రభాతవార్త :**

మండలంలోని సోముదేవపల్లి గ్రామంలో ఎంపీయుపి స్కూల్లో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో హోం మంత్రి అనిత పాల్గొని చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ చిన్నారుల నిండు జీవితానికి రెండు చుక్కలు అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ ఐదేళ్ల లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజాన్ని నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అమలకంటి అబద్ధం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### పోర్టు వెంకన్న స్వామివారి
# తెప్పోత్సవం వైభవం





**విశాఖపట్నం, జూన్ 28, ప్రభాతవార్త:**

పోర్టు ఏరియాలోని శృంగమణి పర్వతంపై వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామివారి వార్షిక తిరు క్కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆది వారం నిర్వహించిన సముద్ర తెప్పోత్సవం భక్తిశ్రద్ధల మధ్య అత్యంత వైభవంగా జరిగింది. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకిలో ఊరేగించి, అనంతరం సముద్రంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన

**పోటెత్తిన భక్తజనం**

తెప్పపై విహరింపజేశారు. ఈ వేడుకల్లో విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి పల్లకిని భక్తిశ్రద్ధలతో మోసి, తెప్పోత్సవంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ప్రతి ఏడాది నిర్వహించే ఈ తెప్పోత్సవాన్ని తిలకించేందుకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు ఘనంగా నిర్వహించగా, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, జనసేన నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి.

### ప్రతి చిన్నారికి
# పోలియో చుక్కలు వేయించాలి

**జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్**



**విశాఖపట్నం, జూన్ 28, ప్రభాతవార్త :**

పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఐదేళ్లలోపు చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పిలుపునిచ్చారు. పల్స్ పోలియో--2026 కార్యక్రమంలో భాగంగా ఆదివారం జీవీఎంసీ సౌత్ జోనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలియో బూత్‌ను అదనపు కమిషనర్ ఎస్.ఎస్. వర్మతో కలిసి ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, గతంలో పోలియో టీకా తీసుకున్న చిన్నారులు కూడా ఈ (తరువాయి 8వ పేజీలో)

### చూపిన ఆర్థిక సంస్కరణలే భారత అభివృద్ధికి
# బలమైన పునాది

**విశాఖ ఎంపీ శ్రీభరత్**



**విశాఖపట్నం, జూన్ 28, ప్రభాతవార్త:**

భారత మాజీ ప్రధాని, ఆర్థిక సంస్కరణల రూపశిల్పి పాములపర్తి వెంకట నరసింహారావు 105వ జయంతి వేడుకలు ఆదివారం విశాఖలోని దసపల్లా హోటల్‌లో బ్రాహ్మణ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఎంపీ శ్రీభరత్, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రముఖులు (తరువాయి 8వ పేజీలో)

# అమరావతిలో దాడి ప్రజాస్వామ్యం పై దాడే

**శాసనమండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ**

**విశాఖపట్నం, జూన్ 28, ప్రభాతవార్త :**

అమరావతిలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధుల పర్యటన సందర్భంగా జరిగిన దాడి ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అని శాసనమండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శించారు. విశాఖపట్నంలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, అమరావతి రైతుల ఆహ్వానం మేరకే తమ పార్టీ నేతలు అక్కడికి వెళ్లారని, అయితే టీడీపీ శ్రేణులు ఉద్దేశపూర్వకంగా అడ్డుకుని రాళ్లతో దాడి చేయడంతో పాటు వాహనాలను ధ్వంసం చేశారని ఆరోపించారు. ఈ ఘటన రాష్ట్రంలో అదుపుతప్పిన శాంతిభద్రతలకు నిదర్శనమని అన్నారు. అమరావతిలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు బయటపడతాయనే భయంతోనే



ప్రతిపక్షాల పర్యటనను అడ్డుకుంటున్నారని బొత్స ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ నేతలపై దాడి చేసి, తిరిగి వారిపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో రైతులకు కనీస మద్దతు ధర కల్పించడంలో ప్రభు త్వం పూర్తిగా విఫలమైందని, విశాఖలో ప్రభుత్వ భూములను దోచిపెడుతూ, బీచ్‌లలో బార్ల ఏర్పాటుతో రాష్ట్ర సంస్కృతిని దెబ్బతీస్తోందని విమర్శించారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా ప్రభుత్వ అతిథి గృహాలు ఉండగా ప్రైవేట్ హోటల్ లో బస ఏర్పాటు చేయడాన్ని తప్పుబట్టారు. అలాగే విజయవాడలో జరిగిన లాకప్ డెత్ ఘటనపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు పాల్గొన్నారు

### రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో..
## నేడు జీవీఎంసీలో
# పీజీఆర్ఎస్ రద్దు

**విశాఖపట్నం, జూన్ 28, ప్రభాతవార్త :**

జీవీఎంసీ ప్రధాన కార్యాలయం, అన్ని జోనల్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. జూన్ 30న భారత రాష్ట్రపతి విశాఖపట్నం పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లలో పూర్తిస్థాయిలో నిమగ్నమై ఉండటం తో, జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. అధికారులు అందుబాటులో ఉండని కారణంగా ఈ వారానికి మాత్రమే పీజీఆర్ఎస్ కార్యక్రమా న్ని రద్దు చేస్తున్నామని, ప్రజలు, ఫిర్యాదుదారులు ఈ విషయాన్ని గమనించి జీవీఎంసీకి సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్ర స్థాయి కరాటే పోటీల పోస్టర్ ఆవిష్కరణ



గాజువాక,జూన్ 28,ప్రభాతవార్త :
నగరంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఆగస్టు 22, 23 తేదీల్లో 3వ రాష్ట్ర స్థాయి ఓపెన్ కరాటే పోటీలు నిర్వహించనున్నట్లు వాడోకాయ్ కరాటే డు అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు సతీష్ కుమార్ తెలిపారు. హెచ్‌బీ కాలనీ డ్రాగన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో ఆదివారం ఈ పోటీల గోడపత్రికను ప్రముఖ సినీ నటుడు సుమన్ తల్వార్, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, భాజపా నేత కర్ణంరెడ్డి నరసింగరావు ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలను ఎంతగానో ప్రోత్సహిస్తున్నాయని, క్రీడాకారులు ఈ పోటీలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో కోచ్‌లు ఆనందబాలు, అగస్త్య, కిషోర్, రాము, అన్బు తదితరులు పాల్గొన్నారు.

## సింహాగిరికాలనీలో మహా అన్నదానం కార్యక్రమం



ఆరిలోవ, జూన్ 28, ప్రభాతవార్త
స్థానిక 9వ వార్డు పరిధిలో గల పెదగదిలి సింహగిరి కాలనీలో ఆదివారం శ్రీ లక్ష్మీ తలశిల ఇన్ఫ్రా ప్రాజెక్ట్స అధినేత తలశిల విజయమోహన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక తెదేపా నాయకులు బుడుమూరి గోవింద్, ఒమ్మి అప్పలరాజు, అనుగుపల్లి ఈశ్వరరావు, అనుగుపల్లి శంకర్రావు, పోతిన భరత్ తో పాటు గ్రామ సంఘం పెద్దలు ఆయనకు సాలువతో సత్కరించి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ఆయన అభయ ఆంజనేయ స్వామి ఆలయం లో స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం సింహగిరి కాలనీలో సుమారు 2వేల మందికి పైగా మహా అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన జన్మదినం సందర్భంగా వివిధ ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేసినందుకు సంతోషంగా ఉందని, మధురవాడ సేవా నగర్, కొమ్మాది అమరావతి కాలనీ, ఓజోన్ వాలీ కాలనీ, కే వన్ కాలనీ, కే టు కాలనీ, కే త్రీ కాలనీ, కొమ్మాది విలేజ్ లో సుమారు పదివేల మందికి అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు విజయ మోహన్ తెలిపారు.

## సీమంతం నిర్వహించిన హోంమంత్రి అనిత..!

(7వ పేజీ తరువాయి)

సాహిబా అంజుమ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత గారికి మహిళా ఎస్సై సాహిబా అంజుమ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట నియోజకవర్గ టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, మహిళా కన్వీనర్ మునిషా బేగం, డి.ఎస్.పి పోతిరెడ్డి శ్రీనివాస్, సిఐ జూరెడ్డి మురళి, ఎస్సైలు సన్నిబాబు, కానిస్టేబుల్ కిరణ్ తో పాటు పలువురున్నారు.

## ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలి

(7వ పేజీ తరువాయి)

ప్రత్యేక కార్యక్రమంలో మళ్లీ పోలియో చుక్కలు వేయించుకోవడం అవసరమని తెలిపారు. జీవీఎంసీ పరిధిలో ఏర్పాటు చేసిన అన్ని పోలియో బూత్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, బూత్‌లకు రాలేని చిన్నారులకు ప్రత్యేక బృందాలు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తాయని చెప్పారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, జీవీఎంసీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, వాలంటీర్లు సమన్వయంతో పనిచేస్తున్నారని ఆయన అభినందించారు. కార్యక్రమంలో సౌత్ జోనల్ కమిషనర్ ఎం. మల్లయ్య నాయుడు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చూపిన ఆర్థిక సంస్కరణలే భారత అభివృద్ధికి బలమైన పునాది

(7వ పేజీ తరువాయి)

పాల్గొని పీవీ నరసింహా రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న దేశాన్ని సంస్కరణలతో గాడిన పెట్టి ప్రపంచ వేదికపై భారతదేశ ప్రతిష్ఠను పెంచిన మహానేత పీవీ నరసింహారావు అని కొనియాడారు. ఆయన దూరదృష్టి, పరిపాలనా నైపుణ్యం, దేశాభివృద్ధికి చేసిన సేవలు భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, పీవీ నరసింహారావు దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశానిర్దేశం చేసిన గొప్ప నాయకుడని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎల్, సీతంరాజు సుధాకర్, సుహాసిని ఆనంద్, బొత్స ఝాన్సీ, ద్రోణంరాజు శ్రీవాత్సవ్‌తో పాటు వివిధ బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు, అర్చక–పురోహిత సంఘాలు, పీవీ అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డాక్టర్ సతీష్‌రాజు కు జాతీయ పురస్కారం

ఆరిలోవ,జూన్28, ప్రభాతవార్త:
విశాఖ అపోలో ఆసుపత్రి చీఫ్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ ఇందుకూరి సతీష్ రాజు కు న్యూఢిల్లీలోని తాజ్ ప్యాలెస్‌లో జరిగిన 9వ టైమ్స్ నౌ డాక్టర్స్ డే కాన్‌క్లేవ్‌లో భారతదేశంలోని 20 మంది స్ఫూర్తిదాయకమైన ఆర్థోపెడిక్ సర్జన్లలో ఒకరు అనే విశిష్ట బిరుదును ప్రదానం చేశారు. ఈ కాన్‌క్లేవ్ సందర్భంగా లెఫ్టినెంట్ జనరల్ సిజీ మురళీధరన్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్, ఇండియన్ నేవీ వారి చేతుల మీదుగా డా.సతీష్ రాజు ఇందుకూరికి ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని ప్రదానం చేశారు. ది టైమ్స్ గ్రూప్ నిర్వహించే ఈ కాన్‌క్లేవ్, భారతదేశ వైద్య సమాజం యొక్క నిబద్ధత, నైపుణ్యం, పరివర్తనాత్మక కృషిని గౌరవించే ఒక ప్రముఖ జాతీయ వేదికలో ఆయనను సత్కరించారు. భారతదేశంలో ఆరోగ్య సంరక్షణ భవిష్యత్తుపై చర్చించడానికి ఇది ప్రముఖ ఆరోగ్య సంరక్షణ నాయకులు, విధాన రూపకర్తలు, ప్రఖ్యాత వైద్య నిపుణులు, పరిశ్రమ నిపుణులు, మేధావులను ఈ కన్ క్లీవ్ ఒకచోట చేర్చింది. టైమ్స్ నౌ ఆధ్వర్యంలో డా. సతీష్ రాజును పురస్కారంతో సత్కరించడం పట్ల అపోలో సి ఓఓ డా.కృష్ణ ప్రసాద్, తోటి వైద్యులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేసారు.

## విజయవంతంగా యూరో-ఆంకాలజీ అప్‌డేట్స్ వైద్య విద్యా కార్యక్రమం




ఆరిలోవ, జూన్28, ప్రభాత వార్త:
విశాఖ హెల్త్ సిటీ లో గల ఒమేగా హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బి.రవి శంకర్ ఆధ్వర్యంలో యూరో–ఆంకాలజీ అప్‌డేట్స్ పేరుతో నిరంతర వైద్య విద్యా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.
ఈ కార్యక్రమాన్ని ఒమేగా హాస్పిటల్స్, నార్త్ ఆంధ్ర యూరాలజిస్ట్స సొసైటీ, ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ వారు కలసి సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ వినోద్ వాధ్వా, ఏపీఎంసీ అబ్జర్వర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డాక్టర్ రవీంద్ర వర్మ, మేనేజింగ్ డైరెక్టర్ అండ్ సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్, డాక్టర్ అమిత్ సాప్లే, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, డాక్టర్ పి. శ్రీధర్, డాక్టర్ పైడి వెంకటేశ్వరరావు, ఒమేగా హాస్పిటల్స్; డాక్టర్ శ్రీ హర్ష, డాక్టర్ ప్రశాంత్, ఒమేగా హాస్పిటల్స్‌తో పాటు పలువురు ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 80 మందికి పైగా యూరాలజిస్టులు, ఆంకాలజిస్టులు, సర్జన్లు, ఇతర వైద్య నిపుణులు పాల్గొని, విజ్ఞానాన్ని పరస్పరం పంచుకునే వేదికగా ఈ సదస్సు నిలిచింది. ఒమేగా హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎం. శుభాకర రావు ఈ కార్యక్రమం విజయవంతం చేసిన అధ్యాపకులు, వైద్య నిపుణులు, ప్రతినిధులు, నిర్వహణ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేసారు.

# ప్రజల మనసును దోచుకున్న నాయకురాలు అనిత...

(7వ పేజీ తరువాయి)

కుటుంబాలకు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. గత ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని అన్నారు. హోంమంత్రి వంగలపూడి అనిత ప్రజల మనసు గెలుచుకున్న నాయకురాలని, నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని మంత్రి జనార్దన్ రెడ్డి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జనసేన పార్టీ నాయకులు మాజీ గ్రంథాల సంస్థ చైర్మన్ తోట నగేష్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు ,మండల పార్టీ అధ్యక్షులు గింజల లక్ష్మణరావు, అమలకంటి అబద్ధం, మార్కెట్ చైర్మన్ దేవర సత్యనారాయణ, చించెలుపు పద్దు, వినోద్ రాజు , కొప్పుశెట్టి బుజ్జి ,కురం దాస్ నూకరాజు ,గోసల చిన్న తాతారావు, జడ్పిటిసి గోసల కాసులమ్మ, మెరుగు నాగేశ్వరరావు, శ్రీకాంత్, పిక్కి కొర్లయ్య, శ్రీను, గంగరాజు, కోదండరావ్, పేర్ల శ్రీను, అప్పలరాజు, శివాజీ, అయినంపూడి అప్పలరాజు, మీగడ సత్యనారాయణమూర్తి తోపాటు పలువురు కూటమి నాయకులు సుధాకర్, పోలినాటి నానాజీ ,పిక్కి స్వామి, బొందు దేవుడులు ఉన్నారు

### ఉద్దండపురం-తిరుపతిపాలెం రహదారి ప్రారంభం.!

నక్కపల్లి మండలంలోని ఉద్దండపురం నుంచి తిరుపతిపాలెం వరకు ఆర్ అండ్ బీ శాఖ ఆధ్వర్యంలో రూ.7.03 కోట్ల వ్యయంతో నిర్మించిన రహదారిని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, పెట్టుబడులు మౌలిక సదుపాయాలు (ఆర్ అండ్ బీ) శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. అనంతరం మత్స్యకార నాయకులు రాష్ట్ర పెట్టుబడిలో మౌలిక శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డిని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో కొప్పిశెట్టి వెంకటేష్,లాలం కాసినాయుడు ల నాయకత్వంలో మత్స్యకారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తుమ్మల వెంకటరమణ, హరికృష్ణ, రమణ, సురేష్, బొల్లం రమణ, మాజీ సర్పంచ్ రాజారావు, పిఎసిఎస్ అధ్యక్షులు ధార్ల కృష్ణ, న్యాయవాది కర్రి ఆంజనేయులు, మాజీ సర్పంచ్ పొడగట్ల వెంకటరమణ, తుమ్మల లక్ష్మణరావు, పేకేటి చిన్న రాజారావు, కీర్తి గోవిందు, కుర్ర బాబ్జి, బొద్ద రాజు , తుమ్మల శ్యామ్ కిషోర్, తదితరులు ఉన్నారు.

# గాయపడిన టీడీపీ కార్యకర్తకు అండగా రవితేజ ఆర్థిక సాయం



ఆనందపురం, జూన్ 28, ప్రభాతవార్త:
ఆనందపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఒనుము లక్ష్మణ ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో ఆయన కుటుంబానికి యువ నాయకుడు గంటా రవితేజ అండగా నిలిచారు. విశాఖపట్నంలో రోజువారీ ఉపాధి పనుల నిమిత్తం విద్యుత్ స్తంభంపై పనిచేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కిందపడిపోయిన లక్ష్మణకు రెండు కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో శస్త్రచికిత్స నిర్వహించారు.
ఈ విషయం తెలుసుకున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వెంటనే స్పందించి బాధితుడి పరిస్థితిని తెలుసుకోవాలని ఆదేశించడంతో ఆదివారం బాధితుడి నివాసానికి చేరుకుని లక్ష్మణ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ, నాయకత్వం కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబం ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రూ.20 వేల నగదు సహాయాన్ని అందజేశారు. అలాగే తదుపరి వైద్య చికిత్సకు అవసరమైన సహాయాన్ని అందించడంతో పాటు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా ఆర్థిక సాయం పొందేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం ద్వారా అందుబాటులో ఉన్న అన్ని సంక్షేమ, వైద్య సహాయ పథకాలను బాధిత కుటుంబానికి అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో ఆనందపురం మండల టీడీపీ అధ్యక్షుడు తాట్రాజు అప్పారావు, మండల క్లస్టర్ ఇన్‌చార్జి మీసాల సత్యనారాయణ, నాయకులు బి.ఆర్.బి. నాయుడు, కాకర వెంకటరమణ, కొట్యాడ రెడ్డిబాబు, మజ్జి అప్పలరాజు, కాకర సురేష్, బోని ప్రసాద్, కోరాడ వైకుంఠం, బమ్మిడి తారక్, పాండ్రింకి అప్పలరాజు, కర్రోతు సత్యనారాయణ, మరుపిళ్ళ సాయి జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి



విశాఖపట్నం, జూన్ 28 ప్రభాతవార్త:
విశాఖలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 105 జయంతి కార్యక్రమం ఆదివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. విశాఖ బ్రాహ్మిణ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గవర్నర్ బంగ్లా ఎదురుగా గల పీవీ విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. విశాఖ ఎంపీ ఎం శ్రీభరత్, శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, రాజ్యసభ మాజీ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు,ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ రావు,ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు,మాజీ ఎంపీ పద్మశ్రీ యార్లగడ్డ లక్ష్మి ప్రసాద్,వైస్సార్ సీపీ యువనేత ద్రోణంరాజు శ్రీవాత్సవ తదితరులు పీవీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శ్రీ పీవీ నరసింహారావు జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో దసపల్లా హోటల్ లో వేలాదిమంది బ్రాహ్మణ సామాజికవర్గం సమక్షంలో అంగరంగ వైభవంగా పీవీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. రాజ్యసభ మాజీ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా విశాఖ ఎంపీ ఎం శ్రీ భరత్,అతిధులుగా మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ,ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్,ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ సీతంరాజు సుధాకర్,బీజేపీ అధికారప్రతినిధి సుహాసిని ఆనంద్, యువనేత ద్రోణంరాజు శ్రీవాత్సవ, పివి కి ఎస్ డి ఓ గా పనిచేసిన ప్రసాద్ తదితరులు హాజరై పీవీ చిత్రపటానికి పూలమాలలు అలంకరించి నివాళులర్పించారు. ముఖ్య అతిధి ఎం శ్రీ భరత్ మాట్లాడుతూ భారతదేశం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న సమయంలో ప్రధానమంత్రిగా పీవీ బాధ్యతలు చేపట్టి సాహసోపేతంగా ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలతో దేశ దశను మార్చిన ఆధునిక భారతదేశ ఆర్థిక సంస్కర్త అని కొనియాడారు. సాధారణ రైతు కుటుంబం నుంచి ప్రపంచం మెచ్చిన ఆర్థిక సంస్కరణల మేధావిగా ఎదిగిన పీవీ స్ఫూర్తిగా నేటి యువతరం ఎదగాలని కోరారు. బొత్స ఝాన్సీ మాట్లాడుతూ పీవీ ఆశయాలు, విలువలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ భారత కీర్తిపతాకను ప్రపంచ స్థాయిలో నిలిపిన పీవీ నరసింహారావు జయంతిని, వర్ధంతిని ప్రభుత్వం అధికారంగా జరపాలని కోరారు. ప్రధానమంత్రి గా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా చేసిన ఏకైక తెలుగు వ్యక్తి పీవీ అని,ఈయన దేశానికి చేసిన సేవలకు గుర్తింపుగా భారత రత్న పురస్కారం ఇచ్చి గౌరవించిన ప్రభుత్వం మాత్రం భారతీయ జనతా పార్టీ అన్నారు. రాజకీయంగా ప్రత్యర్థి ఐనప్పటికీ పీవీ కు అత్యున్నత పురస్కారం భారత రత్న ఇచ్చి గౌరవించినట్లు తెలిపారు. 16 భాషల్లో అనర్గళంగా మాట్లాడగలిగిన నేర్పరిఅని బహుముఖ ప్రజ్ఞాశాలి పీవీ నేటి తరానికి మార్గదర్శి అన్నారు.
పీవీ నరసింహారావు వద్ద ప్రత్యేక అధికారిగా ఆరేళ్ళు పనిచేసిన ప్రసాద్ మాట్లాడుతూ పీవీ జీవన శైలి, ఆలోచన, కార్యాచరణ విధానాలు వివరించారు. ప్రతిపక్ష నేతలైన అటల్ బిహారి వాజపేయి, అద్వానీ, ఇతర ముఖ్య నేతలు అందరితోనూ స్నేహ పూర్వక అనుబంధాన్ని కొనసాగించారని తెలిపారు. తన సొంత భూమి 80 ఎకరాలను ప్రభుత్వానికి స్వచ్ఛందంగా అప్పగించారని తెలిపారు. ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్, సీతంరాజు సుధాకర్, సుహాసిని ఆనంద్, బొత్స ఝాన్సీ, ద్రోణంరాజు శ్రీవాత్సవ తదితరులు పీవీ దేశానికి చేసిన సేవలను ప్రశంసించారు.
ఈ కార్యక్రమంలో కాపూరి చరణ్ కుమార్, పీవీ జయంతి వేడుకల కమిటీ చైర్మన్ కె నరసింహ మూర్తి,కన్వీనర్ చెరువు రామకోటయ్య, వైజాగ్ బ్రాహ్మణ జెఏసి కన్వీనర్ కిరణ్ శర్మ,దశరధ రామయ్య,వేదుల హనుమంత రావు, రాచకొండ దశరథ రామయ్య,గంటి రవికుమార్, చరణ్ కుమార్, గంటి మురళి, శివ గణేష్ శర్మ,గాడేపల్లి ప్రభాకర శాస్త్రి, వేదుల రామకృష్ణ, నేరెళ్ళ కామేశ్వర శర్మ, కొలిగట్ల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

### 13 ఏళ్ల విజయవంతమైన ప్రస్థానాన్ని పురస్కరించుకుని

# జేడీ వార్షిక డిజైన్ అవార్డ్స్-2026కు సర్వం సిద్ధం



విశాఖపట్నం, జూన్ 28 ప్రభాతవార్త:
విశాఖపట్నంలో గత 13 సంవత్సరాలుగా సృజనాత్మక విద్యకు, డిజైన్ రంగంలో ప్రతిభావంతులైన యువతను తీర్చిదిద్దడంలో విశిష్ట సేవలందిస్తున్న జేడీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ, విశాఖపట్నం ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకమైన జేడీ యాన్యువల్ డిజైన్ అవార్డ్స్ (ADA)–2026 కార్యక్రమం ఈ నెల 28వ తేదీ సాయంత్రం 6 గంటలకు నవోటెల్, విశాఖపట్నంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు.
ఈ ఏడాది కార్యక్రమం "వసుధైవ కుటుంబం – ప్రపంచమంతా ఒకే కుటుంబం" అనే ప్రధాన అంశంతో నిర్వహించబడుతోంది. భారతీయ సంస్కృతిలోని ఈ మహోన్నత భావాన్ని ప్రతిబింబించేలా విద్యార్థుల సృజనాత్మక ఆలోచనలు, వినూత్న రూపకల్పనలు, సామాజిక బాధ్యత, సుస్థిర అభివృద్ధి వంటి అంశాలు ఈ ప్రదర్శనలో ప్రతిఫలించనున్నాయి. జేడీ ఇన్‌స్టిట్యూట్ విశాఖపట్నం కేంద్రం గత 13 సంవత్సరాలుగా వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య, పరిశ్రమలకు అనుగుణమైన శిక్షణ, ప్రాక్టికల్ లెర్నింగ్, అంతర్జాతీయ ప్రమాణాల బోధన అందిస్తూ అనేక మంది యువతకు విజయవంతమైన కెరీర్‌ను అందించింది. ప్రతి సంవత్సరం నిర్వహించే జేడీ యాన్యువల్ డిజైన్ అవార్డ్స్ విద్యార్థుల ప్రతిభను ప్రదర్శించే అత్యంత ప్రతిష్ఠాత్మక వేదికగా నిలుస్తోంది. ఈ కార్యక్రమంలో ఎనిమిది విభిన్న థీమ్‌లతో రూపొందించిన డిజైన్ ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకోనున్నాయి. విద్యార్థులు నెలల తరబడి చేసిన పరిశోధన, సృజనాత్మకత, నైపుణ్యం, కృషికి ఈ వేదిక నిదర్శనంగా నిలవనుంది. కార్యక్రమం ప్రారంభంలో ముఖ్య అతిథుల చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన నిర్వహించబడుతుంది.
అనంతరం ముఖ్య అతిథుల ప్రసంగాలు, విద్యార్థుల ప్రతిభా ప్రదర్శనలు, విశిష్ట అతిథుల సన్మానం, అవార్డు ప్రదానోత్సవం, ప్రత్యేక ర్యాంప్ షోలు ప్రధాన ఆకర్షణలుగా ఉంటాయి. ఈ సందర్భంగా జేడీ ఇన్‌స్టిట్యూట్ విశాఖపట్నం సెంటర్ డైరెక్టర్లు శ్రీ కట్టమూరి ప్రదీప్ మరియు శ్రీమతి కట్టమూరి దివ్య మాట్లాడుతూ...
"జేడీ యాన్యువల్ డిజైన్ అవార్డ్స్ అనేది కేవలం ఒక ఫ్యాషన్ షో మాత్రమే కాదు. విద్యార్థుల సృజనాత్మకత, ఆవిష్కరణలు, కృషి, ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేసే గొప్ప వేదిక. విశాఖపట్నంలో 13 సంవత్సరాల విజయవంతమైన ప్రయాణాన్ని జరుపుకుంటున్న ఈ సందర్భంగా, 'వసుధైవ కుటుంబకం' అనే అంశంతో సమాజానికి సానుకూల సందేశాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ప్రతి ఒక్కరూ ఈ వేడుకకు విచ్చేసి విద్యార్థులను ప్రోత్సహించాలని కోరుతున్నాం." అని తెలిపారు.
జేడీ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ శ్రీ రూపల్ దలాల్ మరియు డైరెక్టర్ శ్రీ హర్ష్ దలాల్ నాయకత్వంలో సంస్థ దేశవ్యాప్తంగా డిజైన్ విద్యలో అత్యుత్తమ ప్రమాణాలను నెలకొల్పుతూ, విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలను కల్పిస్తూ ముందుకు సాగుతోందని వారు తెలిపారు. ప్రముఖ ఈవెంట్ మేనేజ్మెంట్ కంపెనీ రేస్ ఎంటర్టైన్మెంట్స్ ఈవెంట్ మేనేజర్ దాడి రవికుమార్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి నగర ప్రముఖులు, పరిశ్రమల ప్రతినిధులు, విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, మీడియా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**కార్యక్రమ వివరాలు**

కార్యక్రమం: జేడీ యాన్యువల్ డిజైన్ అవార్డ్స్ (ADA)--2026, థీమ్: వసుధైవ కుటుంబం–ప్రపంచమంతా ఒకే కుటుంబం, తేదీ: 28 నవంబర్ 2026, సమయం: సాయంత్రం 6.00 గంటలకు, వేదిక: నవోటెల్, విశాఖపట్నం.


## పోలియో రహిత సమాజమే లక్ష్యం..

### చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ



విశాఖపట్నం, జూన్ 28, ప్రభాతవార్త :
పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం 34వ వార్డు పరిధిలో మనోరమ థియేటర్ సమీపంలోని యూపీహెచ్‌సీతో పాటు 27వ వార్డు పరిధిలో దొండపర్తి రామాలయం వద్ద ఉన్న యూపీహెచ్‌సీలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో పల్స్ పోలియో కార్యక్రమం కీలకమని, ఒక్క చిన్నారి కూడా ఈ కార్యక్రమానికి దూరం కాకుండా అందరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## నిద్రలోనే యువకుడి కన్నుమూత



గాజువాక,జూన్ 28,ప్రభాతవార్త :
జీవీఎంసీ 61వ వార్డ్ శెట్టిబలిజ వీధిలో ఓ యువకుడు నిద్రలోనే అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శెట్టిబలిజ వీధికి చెందిన నూకరాజు కుమారుడు కర్రి గణేష్ (34) మల్కాపురం మార్కెట్ వీధిలో సెల్‌ఫోన్ యాక్సెసరీస్, రీఛార్జ్ దుకాణం నిర్వహిస్తున్నాడు. అతనికి భార్య, మూడేళ్ల కుమార్తె ఉన్నారు. శనివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో దుకాణం ముగించుకుని ఇంటికి వచ్చిన గణేష్, కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశాడు. అనంతరం రాత్రి 11:30 గంటల సమయంలో భార్య, కుమార్తెతో కలిసి గదిలోకి వెళ్లి నిద్రపోయాడు. ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో గణేష్ ఫోన్‌కు కాల్ రావడంతో భార్య లేచి అతడిని నిద్రలేపే ప్రయత్నం చేసింది. ఎంత పిలిచినా పలకకపోవడంతో ఆందోళన చెందిన ఆమె కుటుంబ సభ్యులకు తెలిపింది. వెంటనే గణేష్‌ను స్థానిక సెయింట్ ఆన్స్ ఆసుపత్రికి, అక్కడి నుంచి కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు కేజీహెచ్‌కు తరలించగా, అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. నిద్రపోయిన కొడుకు విగతజీవిగా మారడంతో తల్లి కర్రి లక్ష్మి మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జీవీఎంసీ 62వ వార్డులో పల్స్ పోలియో



గాజువాక,జూన్ 28,ప్రభాతవార్త :
విశాఖ పశ్చిమ నియోజకవర్గం 62వ వార్డు పరిధిలోని పలు కేంద్రాల్లో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా జరిగింది. వార్డు తెదేపా అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు స్థానిక నాయకులతో కలిసి త్రినాథపురం, దుర్గానగర్, అల్లూరి సీతారామరాజు కాలనీ, ప్రకాష్‌నగర్, అంబేద్కర్ కాలనీల్లోని పోలియో కేంద్రాలను సందర్శించి ఐదేళ్ల లోపు చిన్నారులకు చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు తరాల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమంలో ప్రతి తల్లిదండ్రూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో వార్డు కార్యదర్శి కామరాజు, యూనిట్ ఇన్‌చార్జి డప్పా సన్యాసిరావు, నాయకులు కోరుబిల్లి రాము, బూత్ ఇన్‌చార్జిలు రాము, శ్రీధర్, దుర్గా, నీలంరాజు తదితరులు పాల్గొన్నారు.

## పద్మనాభం మండలంలో విజయవంతంగా పల్స్ పోలియో కార్యక్రమం



పద్మనాభం, జూన్ 28, ప్రభాతవార్త :
మండలంలో వివిధగ్రామాలలో రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విద్యాధికారి లీలాప్రసాదు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. ఇరవై రెండు గ్రామ పంచాయతీలలో ఏర్పాటు పల్స్ పోలియో కేంద్రాలలో చుక్కలు మందు కొరత రాకుండా చర్యలు తీసుకున్నారు. ఉదయం పదిగంటలకే సుమారు ఎనభై శాతం మంది పిల్లలకు చుక్కల మందు వేసినట్లు చెప్పారు. అయితే ఎంపీపీ రాంబాబు పద్మనాభంలో పిల్లలకు పోలియో చుక్కలు మందు వేసి ప్రారంభించిన కార్యక్రమంలో ఎంపిటీసీ లక్ష్మీ, ఎర్రినాయుడు, రాము, సన్యాసిరావు, పైడిరాజు పాల్గొన్నారు.

## మద్దిగ్రామంలో ఈనెల 29 న ఏరువాక పౌర్ణమి కార్యక్రమం



పద్మనాభం, జూన్ 28, ప్రభాతవార్త :
మండలంలో మద్దిగ్రామంలో బైపాస్ రోడ్డు సమీపంలో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో ఈ నెల 29 న జరగనున్న ఏరువాక పౌర్ణమి కార్యక్రమంను విజయవంతం చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి చలం చెప్పారు. ఈ కార్యక్రమానికి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హాజరవుతారని ఆయన అన్నారు. రైతులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

## గారపాటి ఆధ్వర్యంలో విజయవంతంగా పల్స్ పోలియో కార్యక్రమం



ఆరిలోవ, జూన్ 28, ప్రభాతవార్త
ఉత్తర నియోజకవర్గం 44వ వార్డు పరిధిలోగల అక్కయ్యపాలెంలో తెలుగుదేశం పార్టీ వార్డు అధ్యక్షులు గారపాటి సత్యనారాయణ (సతీష్) ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులకు ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వెయ్యాలని తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తు తరాల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమంలో ప్రతి తల్లిదండ్రులు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్

ఆనందపురం, జూన్ 28, ప్రభాతవార్త:
ఆనందపురం మండలం బోయపాలెం గ్రామంలో విశాఖ నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిర్వహించిన ఆకస్మిక దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. శనివారం రాత్రి బోయపాలెం లోని ఓ ప్రదేశంలో తనిఖీలు చేపట్టగా, కొందరు వ్యక్తులు పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి నగదు రూ.20,350తో పాటు పేకాట సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.




## విగ్రహ ప్రతిష్ట ఆహ్వాన పత్రం విడుదల

పాడేరు,జూన్28, ప్రభాతవార్త:



పాడేరు గిరి కైలాస క్షేత్రం ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ ఆహ్వాన పత్రిక విడుదల కార్యక్రమాన్ని ఆదివారం గిరి కైలాస క్షేత్రంలోఘనంగా నిర్వహించారు. ఈ పత్రిక విడుదల కార్యక్రమానికి వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రెటరీ కుసుమంచి వెంకట్రావు, కే లక్ష్మణరావు ఐపిసి. (అనకాపల్లి) వాసవి క్లబ్ సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల సీతారామశాస్త్రి,పాడేరు గిరి కైలాస క్షేత్రం ఆలయ ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకటరత్నం, వాసవి క్లబ్ ముఖ్య కార్య నిర్వాహక సభ్యులు,ఉడా త్రినాధరావు, పుట్ట నానాజీ, బత్తుల రాజు,వాసవి క్లబ్ వాసవి హిల్స్,వాసవి వనిత సభ్యులు పాడేరు వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరి

### అల్లూరి జిల్లా బిజెపి అధ్యక్షురాలు శాంతికుమారి



పాడేరు,జూన్ 28,ప్రభాతవార్త:

ఐదేళ్ల లోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయడం తప్పనిసరిని భారతీయ జనతా పార్టీ అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షులు మఠం శాంతకుమారి పేర్కొన్నారు. పోలియో దేను పురస్కరించుకుని ఆదివారం మఠం పంచాయతీలో పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా శాంత కుమారి మాట్లాడుతూ పోలియో రహిత భారత దేశ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వాలు పోలియో రహిత సమాజ నిర్మాణం కోసం చేసిన కృషికి ప్రజలు కూడా సహకారం అందించాలన్నారు. అప్పుడే పోలియో రహిత భారత నిర్మాణం సాధ్యమవుతుందని ఇప్పటికీ అక్కడక్కడ కేసులు నమోదు అవుతుండడం దురదృష్టకరమన్నారు. గతంలో పోలియో వ్యాధి భారతను పట్టిపీడించిందని ప్రస్తుతం పరిస్థితుల మారాయని... ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన 0పెంచుకొని పోలియో రహిత సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలన్నారు.

## అమ్మవారి భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు

పాడేరు,జూన్ 28,ప్రభాతవార్త:



గిరిజన ఆరాధ్య దైవంమోదకొండమ్మ అమ్మవారి సన్నిధిలో ఆలయ కమిటీ చైర్మన్, పాడేరు శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆదేశాల మేరకు అలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనీ అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియోను సద్వినియోగం చేసుకోవాలి



### టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు పిలుపు

పాడేరు,జూన్28,ప్రభాతవార్త:

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం పాడేరు పంచాయతీలో లోచిలిపుట్టు,గుడివాడ, గుడివాడ గడ్డి కాలనీ, కొత్త పాడేరు గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు పాల్గొని ప్రారంభించారు.ఐదు సంవత్సరాలు లోపు ఉన్న చిన్నారులకు ఆయా పోలియో కేంద్రాల్లో చుక్కలు మందును సుబ్బారావు వేశారు.ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి ఒక్క తల్లులు తమ పిల్లల్ని పోలియో బారిన పడకుండా మూతి వంకర,కాలు వంకర,చెయ్యి వంకర పిల్లలకి వాటినుంచి వైదొలిగేలా పోలియో చుక్కలు క్రమం తప్పకుండా వేయించాలన్నారు.ఈ పోలియో కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సుబ్బారావు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ భూరెడ్డి రామానాయుడు, లోచిలిపుట్టు ఏఎన్ఎం సుశీల, అంగన్వాడీ టీచర్ విజయ, ఆశా వర్కర్ చిన్న తల్లి, కరుణ, గుడివాడ ఏఎన్ఎం సిహెచ్ మహేశ్వరి, ఆశా వర్కర్ బి సరస్వతి, ఈ. దాసమ్మ, కొత్త పాడేరు ఏఎన్ఎం రమాప్రభ, ఆశా వర్కర్ మోదకొండమ్మ , తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

డుంబ్రిగూడ, జూన్ 28, ప్రభాతవార్త:



పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని స్థానిక వైద్యాధికారి పి. రాంబాబు చెప్పారు. ఇక్కడి మండలంలోని ఐదేళ్లలోపు చిన్నారు లందరికీ పోలియో చుక్కలను వేశారు. ఈ సందర్భంగా వైద్య అధికారి మాట్లాడుతూ ప్రతి ఒక్క ఐదేళ్ల లోపు చిన్నారులందరు పోలియో చుక్కలను సద్వినియోగం చేసుకొని అంగవైకల్యాని రూపుమాపే విధంగా జాగ్రత్తలు వహించాలని వైద్యాధికారి రాంబాబు సూచించారు. అరమ పంచాయితీ గ్రామాల్లో గల 450 మంది ఐదేళ్ల లోపు గల చిన్నారులను పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో ఆ పంచాయతీ హెల్త్ అసిస్టెంట్ సిటీ ప్రభాకర్, ఎం ఎల్ హెచ్ పి హరిణి, ఏఎన్ఎం నీలిమ ఆశా కార్యకర్త తంజలు పాల్గొన్నారు.

## అల్లూరి, పోలవరం జిల్లాల్లో ఏ సర్వేలకూ అనుమతులు లేవు

### జిల్లా గనుల శాఖ అధికారి జి. కృష్ణమూర్తి స్పష్టీకరణ



పాడేరు, జూన్ 28, ప్రభాతవార్త:

అల్లూరిసీతారామరాజు జిల్లా, పోలవరం జిల్లాలో బాక్సైట్ పేరుతో సర్వేలకు ఎటువంటి అధికారిక అనుమతులు లేవని జిల్లా భూగర్భ శాస్త్ర, గనుల శాఖ అధికారి జి.కృష్ణమూర్తి స్పష్టం చేశారు. అల్లూరి జిల్లాలోని చింతపల్లి పరిసర ప్రాంతాల్లో కొంతమంది బాక్సైట్ నిల్వల కోసం సర్వే లుజరుపుతున్నారన్న అంశంపై ఆయన స్పందించారు. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ, ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా ఏవరైనా వ్యక్తులు గాని, ప్రైవేట్ ఏజెన్సీలు సర్వేలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.ఇటీవల చింతపల్లి పరిసర ప్రాంతాల్లో సహ గూడెం కొత్తవీధి మండలం లోని జర్రెల గ్రామంలో రహస్యంగా సర్వేలు నిర్వహిస్తున్న కొంతమంది వ్యక్తులను స్థానికులు అడ్డుకొని పోలీసులకు అప్పగించడం కూడా జరిగిందని ఆయన చెప్పారు.

## రంగసింగుడ పాఠశాల దుస్థితిపై దృష్టిసారించండి

డుంబ్రిగూడ, జూన్ 28 ప్రభాతవార్త:



మండలంలోని రంగ్సింగ్గుడ మోడల్ ప్రైమరీ పాఠశాలవిద్యార్థుల అవస్థలు అంతా ఇంతా కాదు. పాఠశాలలో సుమారు 70 మంది విద్యనభ్యసిస్తున్నారు. సరైన పాఠశాల భవనం లేక ఎదురు కట్టెలతో నిర్మించిన పాకలో నెట్టుకొ స్తున్నారు. వర్షాకాలంలో వీరి పరిస్థితి వర్ణనాతీతం. పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు 70 మంది విద్యార్థులతో ప్రభుత్వ యంత్రాంగం పాఠశాల నిర్వహణ సాగుతుంది. కానీ అక్కడి ఉపాధ్యాయులకు గాని విద్యార్థులు గాని సౌకర్యాలు కల్పన మాత్రం లేవని చెప్పడంలో ఎంత మాత్రం అతిశయోక్తి కాదు. గతంలో నూతన పాఠశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ సాంకేతిక సమస్యల కారణంగా పాఠశాల నిర్మాణ పురోగతి లేదు. దీని కారణంగా విద్యాబోధన ఉపాధ్యాయులతో పాటు విద్యా పాటలు నేర్చుకునే విద్యార్థుల కష్టాలు ఉన్నత స్థాయి అధికారుల కంటపడకపోవడం దురదృష్టం అని చెప్పడం తప్పదు.

## అల్లూరి జిల్లాను పోలియో రహితంగా మార్చడమే లక్ష్యం : కలెక్టర్

హుకుంపేట, జూన్ 28, ప్రభాత వార్త:

అల్లూరి జిల్లాను పూర్తిగా పోలియో రహిత జిల్లాగా మార్చడానికి ప్రజలందరూ స్వచ్ఛందంగా సహకరించాలని కలెక్టర్ నిషాంతి పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం హుకుంపేటలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో బూత్ (కేంద్రంలో) కలెక్టర్ స్వయంగా పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. హుకుంపేట ఎంపీటిసి కె.రమా, జిల్లా వైద్యాధికారి డాక్టర్ కృష్ణమూర్తి నాయక్, మండల అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ నారాయణరావు, హుక్కుంపేట పీహెచ్ సి డాక్టర్లు డాక్టర్ భార్గవి, డాక్టర్ సౌజన్య, సూపర్వైజర్ ఎస్ పద్మజ, ఏఎన్ ఎం ఎ. సరోజినీ దేవి, సిహెచ్వబ్ల్యు జి.కోమలమ్మ, ఆశవర్కర్ బి.శాంతి కుమారి ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీరాంపురంలో పల్స్ పోలియో కార్యక్రమం



పాయకరావుపేట, జూన్ 28, ప్రభాతవార్త:

పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం చిన్నారులకు ఒక వరంలాంటిదని మండల టిడిపి అధ్యక్షులు చింతలపు ప్రదీప్ తెలిపారు. శ్రీరాంపురంలో నిర్వహించిన పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంలో పాల్గొన్న ఆయన చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షులు ప్రదీప్ (పద్దు) మాట్లాడుతూ సున్నా నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు విధిగా పోలియో చుక్కలు వేయించాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమం చిన్నారులకు ఒక ఆశా ద్వీపం లాంటిదని మం దల టిడిపి అధ్యక్షులు చింతలపు ప్రదీప్ తెలియజేయడమైనది. కార్యక్రమంలో శ్రీరాంపురం టీడీపీ అధ్యక్షుడు కూరందాసు రమణ,జనసేన పార్టీ అధ్యక్షుడు పెరుమాళ్ళ మల్లిబాబు,ఎన్డిఏ పార్టీల నాయకులు ముప్పిన అప్పారావు, రాజుబాబు,రమణ వైద్య సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, ఆశకార్యకర్తలు, పలువురు పాల్గొన్నారు.

## బాక్సైట్ సమస్యపై జడ్పీటీసీ ఎక్కడ..?

గూడెం కొత్తవీధి, జూన్ 28, ప్రభాతవార్త:



బాక్సైట్ సమస్యపై జిల్లా పరిషత్ సమావేశంలో జీకే వీధి జడ్పిటిసి ఎందుకు స్పందించలేదని గాలికొండ సిపిఎం పార్టీ ఎంపీటీసీ సభ్యుడు, మండల కార్యదర్శి అంపురంగి బుజ్జిబాబు ప్రశ్నించారు. శనివారం ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని జడ్పిటిసిలు గిరిజనుల హక్కులు, సమస్యలను దృష్టిలో ఉంచుకుని బాక్సైట్, హైడ్రో పవర్ ప్రాజెక్టులు, 1/70 చట్టం, జీవో నెంబర్-3 వంటి కీలక అంశాలపై గళం విప్పుతున్నారని తెలిపారు. అనంతగిరి సిపిఎం జడ్పిటిసి దిసరి గంగరాజు, చింతపల్లి వైఎస్సార్సీపీ జడ్పిటిసి పోతురాజు బాలయ్య తదితరులు జిల్లా పరిషత్ వేదికగా గిరిజన సమస్యలపై పోరాడుతున్నారని అన్నారు. అయితే, జీకే వీధి మండలానికి చెందిన వైఎస్సార్సీపీ జడ్పిటిసి కిముదు శివరత్నం ఎక్కడ ఉన్నారని, సమావేశానికి హాజరుకాకపోవడం బాధాకరమని విమర్శించారు. ప్రజల సమస్యలపై స్పందించకుండా ఉండటం జీకే వీధి మండల ప్రజల దురదృష్టకర పరిస్థితి అని పేర్కొన్నారు. ఓట్లు వేసి గెలిపించిన ఆదివాసీలు ఈ విషయంపై ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. జీకే వీధి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో కూడా ప్రజాప్రతినిధులు నోరు విప్పకపోతే, వారి వైఖరిని ప్రజల ముందు బట్టబయలు చేస్తామని హెచ్చరించారు. సిపిఎం మండల నాయకులు బాకూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## పోలియో రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యం : దొన్నుదొర



అరకు రూరల్, జూన్ 28, ప్రభాత వార్త:

పోలియో రహిత ఆంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలని ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం ప్రాంతీయ జోన్ చైర్మన్ , తెలుగుదేశం పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జి డా. సియ్యారి దొన్ను దొర పేర్కొన్నారు. పోలియో డే ను పురస్కరించుకొని అరకు లోయ మ్యూజియం వద్ద, అనంతగిరి మండలం బొడ్డ చెట్టు కాలనీలోనూ పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేసి అనంతరం దొన్ను దొర మాట్లాడుతూ పోలియో రహిత సమాజ నిర్మాణం కోసం ప్రభుత్వాలు నిరంతరం కృషి చేస్తున్నాయని దీనికి ప్రజలు కూడా సహకారం అందించాలన్నారు. గతంలో ఈ పరిస్థితి భారతదేశం తీవ్రంగా ఎదుర్కొందని భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తల్లిదండ్రుల అజాగ్రత్తగా ఉండొద్దని ఐదేళ్ల లోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈరోజు ఒక్కరోజే కాదని వారం రోజులు పాటు కార్యక్రమం కొనసాగుతుందని మీ సమీపంలో ఉన్న పీహెచ్సీ, హెల్త్ సెంటర్, ప్రభుత్వ ఆసుపత్రులలోనూ ,అంగన్వాడి సెంటర్లలో పోలియో చుక్కలు వేస్తారని చెప్పారు. అరకులోయ తాసిల్దార్ రాజ శ్రీధర్, అరకులోయ మండల అధ్యక్షుడు లోకోయి మహాదేవ్, ఏఎంసి చైర్మన్ బొరి బొరి లక్ష్మీ, మాజీ ఎంపీటీసీ కుమార్ , టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## 80 కేజీలు గంజాయి పట్టివేత.. ఇద్దరు అరెస్ట్

### మరో ఇద్దరు పరార్ - కారు, రెండు సెల్ఫోన్లు స్వాధీనం



అరకు రూరల్, జూన్ 28, ప్రభాతవార్త :

అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయి నివారణ కు జిల్లా పోలీస్ యంత్రాంగం, జిల్లా ఉన్నత అధికారులు పకట్టు దిట్టమైన చర్యలు తీసుకుంటున్నప్పటికీ మరోవైపు గంజాయి అక్రమ రవాణా కొనసాగుతూనే ఉంది. అరకులోయ ఆర్ఐటిఐ వద్ద ఆదివారం పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా, కర్ణాటక రిజిస్ట్రేషన్ కి చెందిన కారులో అక్రమంగా తరలిస్తున్న 80 కేజీల గంజాయిని పట్టుకున్నారు. దీనికి పాల్పడిన కర్ణాటక రాష్ట్రానికి చెందిన కాశీం షరీఫ్, సాయిబు ఆలీ అనే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. అక్రమ గంజాయి రవాణాకు ఉపయోగించిన కారు ని సీజ్ చేసి, రెండు సెల్ ఫోన్ లను పోలీసులు స్వాధీనం చేస్తున్నారు . అరకులోయ ఆర్ ఐ టి ఐ వద్ద సబ్ ఇన్స్పెక్టర్ మల్లేశ్వర ఆధ్వర్యం లో వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో కర్ణాటక రిజిస్ట్రేషన్ కి చెందిన కారు విశాఖ వైపు వెళ్తుండగా, అనుమానం వచ్చిన పోలీస్ సిబ్బంది కారు ని ఆపారు. అయితే కారులో ఉన్న నలుగురి లో ఇద్దరు వ్యక్తులు అక్కడ నుండి దిగి పారి పోగా మరో ఇద్దరిని పోలీసులు పట్టుకుని, కారు ని క్షుణంగా తనిఖీ చేసి, డిక్కీలో గోనే సంచు ల్లో 80 కేజీల గంజాయిని ఉన్నట్లు గుర్తించి, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, కారుతో పాటు రెండు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నారు అక్రమ గంజాయి రవాణా పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విజయవంతంగా సాగిన పల్స్ పోలియో

కొయ్యూరు, జూన్ 28, ప్రభాతవార్త:



రాజేంద్రపాలెం, యు. చీడిపాలెం, డౌనూరు, కంటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల నేతృత్వంలో వైద్య సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్ల ఆధ్వర్యంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా సాగింది. ఇందులో భాగంగారాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కార్యక్రమం డా. జగదీష్ నాయక్, డా. సందేశ్ ఆధ్వర్యంలో అన్ని పల్స్ పోలియో కేంద్రాల్లో విజయవంతంగా సాగింది. ముందుగా ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పల్స్ పోలియోపై ముందుగా ప్రచారం నిర్వహించడంతో ఈ కార్యక్రమానికి విశేష స్పందన కనబడింది.

## సీలేరు పీహెచ్సీ పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం



గూడెం కొత్తవీధి/సీలేరు, జూన్ 28 ప్రభాతవార్త:

జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ) పరిధిలో పోలియో చుక్కల కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్లు వైద్యాధికారి డాక్టర్ ఓ. శ్రీసాగర్ తెలిపారు. ఆదివారం పీహెచ్సీలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని గూడెం కొత్తవీధి తహసీల్దార్ సి.హెచ్. అన్నాజిరావు సందర్శించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ, సీలేరు పీహెచ్సీ పరిధిలో ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరిగిందన్నారు. మొత్తం 928 మంది చిన్నారులు లక్ష్యంగా ఉండగా, 960 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. హెల్త్ సూపర్వైజర్ ఎన్. త్రినాథరావు, వైద్య సిబ్బంది పి. రాజుబాబు, ఎం. గౌరీ, కె.వి.ఎన్. కుమారి, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియోను సద్వినియోగం చేసుకోవాలి : ఎంపీ తనూజరాణి



పాడేరు,జూన్ 28,ప్రభాతవార్త:

పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా అరకు ఎంపీ డా.గుమ్మా తనూజరాణి ఆదివారం ఉదయం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ప్రభుత్వ పాత ఆస్పత్రిలో పోలియో కార్యక్రమంలో పాల్గొని ఐదు ఏళ్లు లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా పోలియో చుక్కలను ప్రతి చిన్నారులకు వేడి పోలియో రహిత సమాజంగా తీర్చి దిద్దేందుకు తల్లిదండ్రులు సహకరించాలని ఎంపీ పిలుపునిచ్చారు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విజయవంతంగా పోలియో చుక్కల పంపిణీ



గొలుగొండ, జూన్ 28, ప్రభాతవార్త:

పల్స్ పోలియో చుక్కల పంపిణీ మండలంలో విజయవంతంగా పూర్తి చేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసిన పోలియో చుక్కల పంపిణీ కేంద్రానికి పిల్లలను తల్లిదండ్రులు తీసుకువచ్చారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదేళ్ల లోపు చిన్నారుల వరకు పోలియో చుక్కలు ఇప్పించాలని డాక్టర్ శ్యామ్ కుమార్ అన్నారు. చీడిగుమ్మల హైస్కూల్లో ఏర్పాటు పోలియో చుక్కలు పంపిణీ కేంద్రంలో ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. అలాగే కొత్త మల్లంపేటలో పిఎసిఎస్ అధ్యక్షులు చిటికెల సాంబమూర్తి పోలియో చుక్కల పంపిణీ చేశారు. మూడు పీహెచ్సీల పరిధిలో పోలియో చుక్కల పంపిణీ విజయవంతంగా పూర్తి చేశామని, మిగిలిన వారు ఎవరైనా ఉంటే డోర్ టు డోర్ క్యాంపెయిన్ గా పూర్తి చేస్తామని వైద్యాధికారులు తెలిపారు.

## రాజయ్యపేటలో సీపీఎం నేతలు, మత్స్యకారుల నాయకులపై పోలీసులు గృహ నిర్బంధాన్ని ఖండిస్తున్నాం : సిపిఎం

(నక్కపల్లి రూరల్/ అడ్డురోడ్డు, ప్రభాతవార్త):



మండలం లోని రాజయ్యపేట శివారు బోయపాడు సముద్రతీరం లో ఫిషింగ్ జెట్టి నిర్మాణానికి శంకుస్థాపన కు రాష్ట్ర హోం శాఖ మంత్రి,ఆర్ అండ్ బి శాఖ మంత్రి వస్తున్నారని రాజయ్య పేటలో సీపీఎం నాయకులు ఎం.మహేష్ బాబు,ఎం.బైరాగి రాజు(భయ్యన్న), ఎం.దుర్గాప్రసాద్(జాన్) ,కె.దేముడు, మత్స్యకారుల సంఘం నాయకులు జీ.సోమేశ్వరరావు,సి.హెచ్.సోమేష్ను ఆదివారం ఉదయం నుండి నక్కపల్లి పోలీసులు రాజయ్యపేట లో గృహ నిర్బంధం చేయడాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, నక్కపల్లి మండల కార్యదర్శి ఎం.రాజేష్ లు తీవ్రంగా ఖండించారు.రాష్ట్ర మంత్రులు వస్తున్న సందర్భంగా ఈ విధంగా చట్టాలను, రాజ్యాంగాన్ని ఉల్లంఘించి సీపీఎం నాయకులను, మత్స్యకారుల సంఘం నాయకులను నిర్బంధించాల్సిన అవసరం ఏమి వచ్చిందని ప్రశ్నించారు.ఫిషింగ్ జెట్టి నిర్మించాలని మొదటి నుండి మత్స్యకారుల తరుపున పోరాటం చేస్తున్నది సీపీఎం, మత్స్యకారుల సంఘాలు అలాంటి వారుని నిర్బంధించడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు.పోలీసులు చట్టాలను తమ చేతి లో కి తీసుకొని, ప్రభుత్వం ,మంత్రుల మెప్పుకోసం ఇష్టాను సారం చేస్తే చూస్తూ ఊరుకోబోమని, ప్రజాక్షేత్రంలో నిలబెడతామని తెలిపారు. చట్టాలను ఉల్లంఘించిన వారు ఎంతటి వారైనా ప్రస్తుతం తప్పించుకోవచ్చు కానీ అది ఎల్ల కాలం సాగదని తెలిపారు.మత్స్యకారుల సమస్యలు పరిష్కారం చేయడం చేతకాక నే ఈ విధంగా నిర్బంధించి భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తున్నారని , న్యాయం కోసం, మత్స్యకారుల కోసం ఎంతటి నిర్బంధాన్ని అయినా ఎదుర్కుంటామని, ఇలాంటి తాటాకు చప్పుడులకు భయపడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.ఇప్పటికైనా పోలీసులు ఎవరో మెప్పికోసం పాకులాడ కుండా న్యాయాన్ని, చట్టాలను, రాజ్యాంగానికి కట్టుబడి పని చేయాలని చూసించారు.ఈ ప్రాంతంలో వివిధ పోలీసు స్టేషన్ లో ఇప్పుడు ఉన్న అధికారులు కంటే ముందు పని చేసిన అధికారులు కూడా ఇలాగే మంత్రులు, ప్రభుత్వం మెప్పుకోసం పని చేస్తే , వాళ్ళు ఇరకాటంలో పడినప్పుడు ఏ మంత్రి కాపాడ లేకపోయారు. ప్రస్తుతం సరైన పోస్టింగ్ లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో పనిచేస్తున్న పోలీసు అధికారులు కూడా మీరు రాజ్యాంగానికి జవాబుదారీగా ఫ్రెండ్లీ పోలీసు గా లేకపోతే మీరు కూడా ఇబ్బందులో పడితే మీకు గత అధికారులకు వచ్చిన పరిస్థితిలే ఎదురౌతాయని తెలిపారు. ప్రజలు కట్టిన పన్నులతో జీతాలు తీసుకుంటున్న అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండవలసిన వారు ప్రజలను,ప్రజలు తరుపున పోరాటం చేస్తున్న వార్ని నిర్బంధించడం, ఇబ్బందులకు గురి చేయడం మానుకోవాలని కోరారు.

## విధిగా పల్స్ పోలియో చుక్కలు వేయించుకోవాలి : కంబాల



(ఎస్. రాయవరం,జూన్ 28, ప్రభాత వార్త ):

మండలం అడ్డరోడ్డు జంక్షన్లో ఆదివారం పల్స్ పోలియో కేంద్రాన్ని పాయకరావుపేట నియోజకవర్గం సమన్వయకర్త కంబాల జోగులు సందర్శించి,చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాలు లోపు చిన్నారులు విధిగా పోలియో చుక్కలు వేయించుకోవాలని ఆయన అన్నారు.పోలియో బారిన పడకుండా తల్లిదండ్రులు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు తప్పనిసరిగావేయించాలన్నారు. వైద్య రంగానికి పెద్దపీట వేసింది దివంగత మాజీముఖ్యమంత్రి వైఎస్ఆర్ రాజశేఖర్ రెడ్డి అని, ఆయన తర్వాత తన తనయుడు వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి అని ఆయన కొనియాడారు.వైద్య రంగంలో ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి,వైద్య రంగానికి విప్లవత్మక మార్పులు తీసుకొచ్చింది ఆయన అన్నారు. ఆనాడు ఆరోగ్యశ్రీ ఐదు లక్షలు ఉన్న పథకాన్ని 25 లక్షల వరకు పెంచిన ఘనత జగన్మోహన్ రెడ్డి దని ఆయన అన్నారు.ఆరోగ్య శ్రీ పథకం కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, యస్ రాయవరం మండల పార్టీ అధ్యక్షులు మధువర్మ నక్కపల్లి మండల పార్టీ అధ్యక్షులు గొర్ల గోవింద్,వైస్ ఎంపీపీ అప్పన్న, మాజీ సర్పంచ్ కర్రి సత్యనారాయణ,మాజీ సర్పంచ్ నూకునాయుడు, మండల యూత్ ప్రెసిడెంట్ సింహాద్రి,జిల్లా ఐటి వింగ్ ప్రధాన కార్యదర్శి వెంకటరాజు,జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి చొప్పా రాజు,మాజీ సర్పంచ్ గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా పల్స్ పోలియో కార్యక్రమం







(నక్కపల్లి, ప్రభాతవార్త) :

అత్యంత ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం పోలియో నిర్మూలనలో భాగంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమం మండలంలోని పలుచోట్ల స్థానిక వైద్య సిబ్బంది అంగన్వాడీ కార్యకర్తలు విజయవంతంగా నిర్వహించారు. ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ తో పాటు ఏర్పాటు చేసిన పలు సెంటర్లో పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, బిజెపి జిల్లా నాయకులు కోసూరి శ్రీనివాసరావుతో పాటు కూటమి నాయకులు పట్టణంలోని పలు కాలనీలో పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన పిల్లలను నుండి ఐదు సంవత్సరాల పిల్లల వరకు పోలియో చుక్కలు వేసి పోలియో రహిత రాష్ట్రం గా ఆంధ్రప్రదేశ్ ను చేయాలని అన్నారు. కార్యక్రమంలో గుడిచర్ల వైద్యాధికారిడాక్టర్ జయప్రకాష్,హెల్త్ సూపర్వైజర్ శ్రీనివాసరావు,ఏఎన్ఎం సత్యవతి,ఆశ, అంగన్వాడీ మణి , దుర్గారాణి, తదితరులు ఉన్నారు.

## వాడవాడలా విజయవంతంగా సాగిన పల్స్ పోలియో

(నక్కపల్లి ,ప్రభాతవార్త) :



అత్యంత ప్రతిష్టాత్మకంగా మండలంలోని పలుచోట్ల స్థానిక వైద్య ,అంగన్వాడి , ఆశా కార్యకర్తలు ,మహిళా పోలీసులు పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. వాడవాడలా జరిగిన ఈ పల్స్ పోలియో కార్యక్రమంలో రాజకీయాలకు అతీతంగా ప్రజా ప్రతినిధులు పాల్గొని చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దక్షిణ నియోజకవర్గం ఇన్చార్జ్ వీసం రామకృష్ణ పల్స్ పోలియో చుక్కలు వేసి చిన్నారులను ఆశీర్వదించారు. ఆయనతోపాటు టిడిపి సీనియర్ నాయకులు కర్రీ వెంకట సత్యనారాయణ (కేవీ), జానకయ్యపేటలో మాజీ సర్పంచ్ కురం దాసు సింహాచలం, జనసేన పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి అప్పల రాజు, బిజెపి రాష్ట్ర నాయకులు ఈగల వెంకటేశ్వరరావు, తదితరులు పల్స్ పోలియో చుక్కలను వేశారు. పెద్ద తీనార్ల గ్రామంలో ఎంపీటీసీ మెరుగు నాగేశ్వరరావు పల్స్ పోలియో చుక్కలను వేశారు. పల్స్ పోలియో కార్యక్రమాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సహకారం.. నేరాల నియంత్రణకు ఎంతో అవసరం..!



కొయ్యూరు, జూన్ 28, ప్రభాతవార్త :

ప్రజల సహకారంతోనే సమాజంలో నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని కొయ్యూరు సీఐ బమ్మిడి శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. ఆదివారం మండల కేంద్రమైన రాజేంద్రపాలెం వారపు సంతకు మారుమూల గిరిజన గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో విచ్చేసిన గిరిజనులకు కొయ్యూరు ఎస్సై కిషోర్ వర్మ, ఇతర పోలీస్ సిబ్బందితో కలిసి ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల్లో చట్టాల పట్ల అవగాహన పెంపొందించడం, నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం, సమాజంలో శాంతిభద్రతలను పరిరక్షించడం ప్రధాన ఉద్దేశంగా తెలిపారు. ప్రస్తుతం సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే ఫోన్ కాల్స్, వీడియో కాల్స్, సోషల్ మీడియా సందేశాలు, నకిలీ ఉద్యోగాలు, రుణాలు, పెట్టుబడులు, బహుమతుల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం కార్డు వివరాలు, యూపీఐ పిన్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ వెల్లడించరాదని తెలిపారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్లైన్ లేదా సమీప పోలీసు స్టేషన్ను సంప్రదించాలని సూచించారు. అనంతరం మహిళలు, బాలికల భద్రతపై అవగాహన కల్పిస్తూ, వేధింపులు, గృహహింస, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా వంటి నేరాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సంతకు వచ్చిన గిరిజన ప్రజలు, వ్యాపారులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పోలీసుల సూచనలను ఆసక్తిగా విన్నారు. ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంపొందించేందుకు, నేరాల నివారణకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా నిరంతరం నిర్వహిస్తామని సీఐ తెలిపారు.

vsp10:vsp10.qxd 28-06-2026 21:42 Page 1






## ఘనంగా పీవీ 105వ జయంతి

ఎలమంచిలి, జూన్ 28, ప్రభాతవార్త:



పట్టణంలోగల పీవీ కాంప్లెక్స్ వద్ద మాజీ ప్రధాని, భారతరత్న పీవీ.నరసింహారావు 105వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పి.వి కాంప్లెక్స్ వద్దగల పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా స్థానిక గాయత్రి వేద పాఠశాల ఆధ్వర్యంలో పీవీ విగ్రహానికి పుష్ప మాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా గాయత్రి సేవా ట్రస్ట్ చైర్మన్ సోమేశ్వరరావు మాట్లాడుతూ దేశానికి ప్రధానమంత్రి అయిన తొలి తెలుగువాడు,బహు భాషా కోవిదుడు పీవీ ని తెలుగువారు మరచిపోవడం కడు శోచనీయం అన్నారు.నరసింహారావు ప్రధానమంత్రిగానే కాకుండా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా,కేంద్రంలో ఆరోగ్య శాఖ మంత్రిగా,మానవ వనరుల శాఖ మంత్రిగా, ఆర్థికమంత్రిగా,రక్షణశాఖ మంత్రిగా పనిచేసి తెలుగువారి ఘనతను మరింత పెంచారన్నారు.ఐదు సార్లు లోకసభ కు ఎన్నికైన పీవీ ఎన్నో ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చి భారతదేశంలో సరళ ఆర్థిక వ్యవస్థను నెలకొల్పి దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేశారన్నారు.ఇటువంటి మహనీయుణ్ణి స్మరించుకోవడం ,వారి బాటలో నడవడం యువత నేర్చుకోవాలని హితవు పలికారు.అనంతరం పీవీకి అంజలి ఘటించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో గాయత్రి సేవా ట్రస్ట్ కార్యదర్శి పెద్దింటి సూర్యనారాయణమూర్తి, ట్రస్ట్ సభ్యులు రాచకొండ శ్రీనివాస్ శర్మ, వడ్లమాని మోహన్,కామేశ్వర రావు, సి.హెచ్.సంతోష్, రాయవరపు రాజు, ఆకొండి సాయి, ఆకొండి బాబీ,వేద పాఠశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## అదుపుతప్పిన లారీ .. ఒకరికి తీవ్ర గాయాలు



ఎలమంచిలి, జూన్ 28, ప్రభాతవార్త:

మండలంలోని పాత జాతీయ రహదారి మల్లవరం సమీపంలో తుని వైపు నుండి ఎలమంచిలి వైపు వస్తున్న లారీ బోల్తాపడటంతో ఒకరికి గాయాలు అయినట్లు రూరల్ ఎస్సై ఉపేంద్ర తెలిపారు. రూరల్ ఎస్సై ఉపేంద్ర తెలిపిన వివరాలు ప్రకారం రౌతులపూడి నుండి రాంబిల్లి ఎల్ అండ్ టి పరిశ్రమకు పెద్ద పెద్ద బండరాళ్లను లారీలలో తరలిస్తున్నారు. ఇందులో భాగంగా మల్లవరం సమీపంలో లారీ అదుపుతప్పి పడడంతో లారీ నడుపుతున్న డ్రైవర్ కు గాయాలైనట్లు తెలిపారు. గాయాలైన డ్రైవర్ను ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు రూరల్ తెలిపారు.లారీ బోల్తా పడిన సమయంలో ఏ వాహనాలు రాకపోకలు లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పినట్లు స్థానికులు తెలియజేశారు. ఈ ప్రాంతంలోనే తరచూ భారీ బండరాలను తరలిస్తున్న లారీలు ప్రమాదాలకు గురవుతున్న సంఘటన జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి భారీ బండరాలను తరలించే వాహనాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## నూకాంబిక ఆలయంలో శ్రీకాకుళం ఎమ్మెల్యేకి ఘన స్వాగతం

అనకాపల్లి, జూన్ 28,( ప్రభాత వార్త):



శ్రీకాకుళం టిడిపి నాయకులు, శాసనసభ్యులు గొండు శంకరరావు ఆదివారం ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక అమ్మవారిని దర్శించుకు న్నారు. మాజీ మంత్రివర్యులు, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణలి సూచనల మేరకు, అనకాపల్లి జనసేన పార్టీ ఇంచార్జ్ భీమశెట్టి రామ్కి శంకరరావుకి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది పూర్ణకుంభం, మంగళ వాయిద్యాల నడుమ శంకర్రావుకి సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం శ్రీ నూకాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భీమశెట్టి రామ్కి చేతుల మీదుగా గొండు శంకర్రావు కి పట్టువస్త్రాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో నూకాంబిక అమ్మవారి దేవస్థానం చైర్మన్ పీలా నాగ శ్రీను ధర్మకర్తలు , ఆలయ ఈవో వైవి శ్రీధర్ , ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వర్గీయ మాజీ ప్రధాని పీవీ జయంతి వేడుకలు




అనకాపల్లి, జూన్ 28, (ప్రభాతవార్త):

అనకాపల్లి బ్రాహ్మణ సేవ సంఘం ఆధ్వర్యంలో స్వర్గీయ మాజీ ప్రధాని పివి నరసింహారావు 105వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి అధ్యక్షత వహించిన అనకాపల్లి బ్రాహ్మణ సంఘం సెక్రటరీ విశ్వనాథం మాట్లాడుతూ మాజీ ప్రధాని స్వర్గీయ నరసింహారావు ఆనాడు భారతదేశం చాలా కష్ట పరిస్థితులలో ఉందని, ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం మన తెలుగు ముద్దుబిడ్డ, అపర చాణిక్యుడు, మహా మేధావి, బహు భాష కోవిదుడు అయిన బ్రాహ్మణ బంధువు పీవీ నరసింహారావు నీ దేశ ప్రధానిగా ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం చేయడం జరిగింది. అయిన మంచి ఆర్థికవేత్త అయిన పీవీ నరసింహారావు దేశం ఆర్థిక పరిస్థితుల్లో అప్పులలో కొట్టుమిట్టాడుతుంటే దేశాన్ని అప్పుల్లోంచి తన అపరమేధస్సుతో బయటపడడం జరిగిందన్నారు. ఆనాడు అయిన చేసిన ఆర్థిక సంస్కరణలు మార్పులు వల్ల ఈనాడు దేశం ఎంతో ముందుకు పుంజుకుని వెళ్లడం జరుగుతుందన్నారు. ఆయన ఐదేళ్ల పరిపాలన కూడా రాజకీయ అని చిత్తితిలో కూడా ఐదు సంవత్సరాలు ప్రభుత్వాన్ని నిలబెట్టి అన్ని పార్టీల వాళ్ళని స్నేహపూర్వకంగా కలుపుకుంటూ పోతూ ప్రభుత్వాన్ని, పరిపాలన విజయవంతంగా పాలన సాగించారు. అనకాపల్లి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పివి నరసింహారావు కి అన్ని ప్రభుత్వాలు గుర్తింపు ఇవ్వాలని ప్రతి సంవత్సరం ఆయన జయంతి వేడుకలు ప్రభుత్వ నిర్వహించేలాగా ఒక కార్యక్రమం చేపట్టాలని దీనిని ప్రభుత్వం గుర్తించే ఒక గుర్తింపు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. భారతదేశంలో ఆయన ఒక స్థిరస్థాయిగా ప్రజల గుండెల్లో మంచి వ్యక్తిగా మంచి ప్రధానిగా నిలిచిపోయిన వ్యక్తిని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా అనకాపల్లి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. బ్రాహ్మణ సంఘం ఉప కార్యదర్శి పేరూరి భోగలింగం, సన్నది పాండురంగారావు, టి శ్యామ్ కుమార్, కే ఫణి కుమార్, మునగపాక సోమశేఖర్, కసింకోట ప్రసాద్, చింతా గోపి, రమేష్, కే కిరణ్ కుమార్, గార్లపాటి భాస్కర్, జయంతి నాగలింగం శాస్త్రి శ్రీనివాస్, రేవతి, లక్ష్మి పాల్గొన్నారు.


## పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో

పాయకరావుపేట, జూన్ 28, ప్రభాత వార్త:



పల్స్ పోలియో కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొని 5 ఏళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరిగింది . కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డిచిట్టిబాబు, మండల పార్టీ అధ్యక్షులు చించలపు ప్రదీప్ , జనసేన నాయకులు తోట నగేష్ పట్టణ పార్టీ అధ్యక్షులు యాళ్ల వరహాలు బాబు, మజ్జూరి నారాయణరావు, కంకిపాటి వెంకటేశ్వరరావు,బ గూటూరి శ్రీను ,జూరెడ్డి ప్రసాద్, గొల్లపల్లి నాగు, సిరుకూరి పేరాజు, బోడపాటి శ్రీను, ఇంజరపు సూరిబాబు, పిహెచ్సివైద్య అధికారి డాక్టర్ సుభాష్ , డాక్టర్ ఎస్ వి సౌందర్య, ఈవో బి. నెహ్రూ, హెచ్. ఎస్.ఎం. నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, అధిక సంఖ్యలో పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వైద్య సిబ్బందికి 200 ఆహార పొట్లాలు అందజేత



కసింకోట, జూన్ 28, ప్రభాతవార్త:

కసింకోటలో ఆదివారం జరిగిన పోలియో చుక్కల కార్యక్రమంలో పాల్గొన్న వైద్య సిబ్బందికి బయ్యవరం లో గల సాగర సిమెంట్ యాజమాన్యం 200 ఆహార పొట్లాలు అందజేశారు. కార్యక్రమంలో సాగర సిమెంట్ యాజమాన్యం ప్రతినిధులు పాండురంగారావు, కసింకోట ప్రాథమిక వైద్య కేంద్రం అధికారి సిహెచ్. తిరుమలరావు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియో ప్రారంభం

### ఎన్టిఆర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నారులకు చుక్కలు వేసిన కలెక్టర్ విజయ క్రిష్ణన్

అనకాపల్లి, జూన్ 28, ( ప్రభాత వార్త):



ఎన్టిఆర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం ఉదయం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. పోలియో నిర్మూలనలో పల్స్ పోలియో కార్యక్రమం కీలకమని, ఒక్క చిన్నారిని కూడా మిస్ కాకుండా ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. మొదటి రోజైన జూన్ 28న పోలియో కేంద్రాల వద్ద 0-5 ఏళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని , జూన్ 29 మరియు 30 తేదీల్లో హెల్త్ స్టాఫ్ ఇంటింటా తిరిగి, మిగిలిపోయిన చిన్నారులను గుర్తించి పోలియో చుక్కలు వేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పల్స్ పోలియో కార్యక్రమంలో డా. ఎమ్. హైమావతి, జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి, డా. కె. చంద్రశేఖర్‌దేవ్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, డా. జె. నరసింగ రావు జిల్లా పరిశీలకులు, డా. కృష్ణారావు,డి సిహెచ్ ఏ. రామచంద్రరావు, గణాంకాల అధికారి, సిబ్బంది పాల్గొన్నారు. పోలియో ఆదివారం సందర్భంగా పల్స్ పోలియో కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ శాసనసభ్యులు, అనకాపల్లి నియోజవర్గం టిడిపి ఇంచార్జ్ లిపీలా గోవింద సత్యనారాయణ ఆదివారం జీవీఎంసీ విశాఖపట్నం మాజీ మేయర్ పీలా శ్రీనివాసరావుతో కలిసి పాల్గొన్నారు.

**జనసేన పార్టీ ఇంచార్జి రామ్కి**

స్థానిక అనకాపల్లి జిల్లా ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన పోలియో చుక్కల కార్యక్రమంలో పాల్గొన్నారు. మాజీ మంత్రివర్యులు, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణలి గారి సూచనలు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో 0 నుండి 5 సంవత్సరాలలోపు చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్కి పోలియో వ్యాధి నిర్మూలనలో ప్రతి తల్లిదండ్రి బాధ్యత వ్యవహరించి తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఇప్పటికే చుక్కలు వేయించిన పిల్లలకు కూడా ప్రతి విడతలో పోలియో చుక్కలు వేయించడం ఎంతో అవసరమని తెలిపారు.పోలియో రహిత భారతం - మనందరి సంకల్పం అనే లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, 0 నుండి 5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి ఉచితంగా అందిస్తున్న పోలియో చుక్కలను తప్పనిసరిగా వేయించి పిల్లల ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్యసిబ్బంది, ఎన్టీఆర్ హాస్పిటల్ డైరెక్టర్లు, ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన హోంమంత్రి అనిత

(ఎస్.రాయవరం,జూన్,28 ప్రభాతవార్త )



మండలంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదివారం పర్యటించారు. సోముదేవపల్లి గ్రామానికి చేరుకున్న మంత్రికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో వరహానదికి రక్షణగా నిర్మించనున్న రక్షణ గోడ పనులకు హోం మంత్రి శంకుస్థాపన చేశారు. రాష్ట్ర విపత్తు నివారణ నిధి (ఎస్.డి.ఎం.ఎఫ్ ) కింద రూ.9.95 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ పనులు పూర్తయితే నది పరివాహక ప్రాంత ప్రజలకు వరద ముప్పు తగ్గి, ఆస్తి, పంటలకు రక్షణ కలుగుతుందని మంత్రి తెలిపారు. అనంతరం గ్రామంలోఎంపీయూపీ పాఠశాలలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. చిన్నారులతో ఆప్యాయంగా ముచ్చటించిన మంత్రి, నిండు జీవితానికి రెండు చుక్కలు అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, పోలియో రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం ధర్మవరం అగ్రహారం సమీపంలోని వరహానదిపై నూతనంగా రూ.99 లక్షలతో నిర్మించిన పెనుగొల్లు గ్రోయిన్‌ను హోం మంత్రి అనిత ప్రారంభించారు. మండల పార్టీ అధ్యక్షులు అమలకంటి అబద్ధం మాజీ ఎంపీపీ ఏజర్ల వినోద్ రాజు, ఎంపీపీ కే వెంకటలక్ష్మి జడ్పిటిసి కాకర దేవి నాయకులు అల్లు నరసింహమూర్తి సియ్యాధుల అచ్యుత్ కుమార్ ,ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



## అమ్మ దయ వుంటే అన్నీ ఉన్నట్టే!!

నక్కపల్లి, జూన్ 28, (ప్రభాతవార్త):

మండలంలోని రేబాక గూడుపమ్మతల్లి ఆలయం ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తులతో కిక్కిరిసిపో యింది. ఎలమంచిలి, పీఎన్ఆర్ పేట, దిమిలి, ములకలాపల్లి, నాతవరం, కొడవటిపూడి, దొండాక, తదితర గ్రామాల నుంచి భక్తులు రేబాక వచ్చారు. అమ్మవారి ఆలయాన్ని, ఉపాలయాలను దర్శించుకున్నారు. అమ్మవారికి మహిళలు పసుపు,కుంకుమలు సమర్పించారు. అమ్మవారికి హారతులిచ్చినప్పుడు అమ్మవారి నామంతో ఆలయం మార్మోగింది. మహిళాభక్తులందరికీ ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీ హరిరాజు ఆధ్వర్యంలో సౌభాగ్యప్రసాదంగా పసుపు కొమ్ములు, గాజులు పంపిణీ చేశారు. అనేకమంది ఆలయ ప్రాంగణంలోనే వంటలు చేసుకుని భోజనాలు చేసి ఉల్లాసంగా, ఉల్లాసంగా గడిపారు.

## నిండు జీవితానికి రెండు చుక్కలు

కశింకోట, జూన్ 28, ప్రభాతవార్త :



రెండు పోలియో చుక్కలతో పిల్లలను అంగవైకల్యం నుంచి కాపాడుకోవచ్చని కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి తిరుపతిరావు అన్నారు.ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమములో భాగంగా కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఐదు ఏళ్ల లోపు పిల్లలకు 99.4 శాతం పల్స్ పోలియో చుక్కలు వేయడం జరిగింది అన్నారు.మిగిలిన పిల్లలకు సోమవారం,మంగళవారం ప్రతి ఇంటికి వెళ్లి వేయడం జరుగుతుందన్నారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి సందర్శించారు.ఎం.పీ.హెచ్.ఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.అలాగే తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్య అధికారిణి సుమ ఆధ్వర్యంలో పల్స్ పోలియో నిర్వహించారు.ముందుగా పూజా మనస్వి కి పోలియో చుక్కలు వేసారు.ఈ సందర్భంగా వైద్య అధికారిణి సుమ మాట్లాడుతూ పశ్చిమాసియా దేశాల్లో జరుగుతున్న యుద్ధం కారణంగా అరబ్ దేశాల నుంచి ఎక్కువ మంది భారతదేశానికి వచ్చేస్తుండటం, పక్క దేశాలైన పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్లలో ఇంకా పోలియో కేసులు ఉండటంతో మన దేశ వ్యాప్తంగా ఆదివారం జాతీయ పలో పోలియో కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించడం జరిగిందన్నారు.ఈ రోజు బూత్ల కు రాని వారికి ఇంటింటికి వెళ్లి 29, 30వ తేదీల్లో వేస్తామన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో తాళ్లపాలెం వైద్యులు రామ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా ముగిసిన పల్స్ పోలియో



ఎలమంచిలి, జూన్ 28, ప్రభాతవార్త:

చిన్నారుల ఆరోగ్య పరిరక్షణే ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమం పట్టణంలో అత్యంత విజయవంతంగా ముగిసింది. పోలియో రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఆదివారం ఉదయం నుంచే మునిసిపాలిటీ పరిధిలోను మండలంలోని ఏర్పాటు చేసిన పోలియో బూత్‌ల అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదేళ్లలోపు చిన్నారులందరికీ రెండు చుక్కల పోలియో మందు వేయించడానికి తల్లిదండ్రులు తరలివచ్చారు.ఈ పల్స్ పోలియో కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ రాజు,ప్రజాప్రతినిధులు, అధికారులు చురుగ్గా పాల్గొన్నారు. పట్టణంలోని పలు కేంద్రాల్లో నాయకులు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి దాడి రమేష్ స్వయంగా తమ చేతుల మీదుగా చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలియో మహమ్మారిని శాశ్వతంగా తరిమికొట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ఒక్క చిన్నారి కూడా ఈ చుక్కలకు దూరం కాకూడదనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుందని వివరించారు. ప్రజల్లో మరింత అవగాహన కల్పించేలా నాయకులు ప్రోత్సహించారు.వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, మున్సిపల్ అధికారులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పూర్తి సమన్వయంతో పనిచేసి నూరు శాతం లక్ష్యాన్ని చేరుకునేలా అహర్నిశలు కృషి చేశారు. బస్టాండ్, రైల్వే స్టేషన్, ప్రధాన కూడళ్ల వద్ద మొబైల్ టీమ్‌లను ఏర్పాటు చేసి, ప్రయాణాల్లో ఉన్న పిల్లలకు సైతం పోలియో చుక్కలు వేశారు. మారుమూల ప్రాంతాలు, స్లమ్ ఏరియాల్లో సైతం ప్రత్యేక దృష్టి సారించి సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.పట్టణ ప్రజలు చూపించిన చొరవతో పల్స్ పోలియో డ్రైవ్ వంద శాతం విజయవంతమైందని వైద్యాధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ఇంతటి విజయవంతం చేసిన వైద్య సిబ్బందికి, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు, పూర్తిగా సహకరించిన పట్టణ ప్రజలకు నాయకులు, ఉన్నతాధికారులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## నేడే జేష్ఠ పౌర్ణమి ఏరువాక పౌర్ణమి ప్రారంభం

అనకాపల్లి 28, జూన్ 28,(ప్రభాత వార్త)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర రైతాంగం సాంప్రదాయాలకు అనుగుణంగా సోమవారం జేష్ఠ పౌర్ణమి పర్వదినాన ఎరువాక పౌర్ణమి జరుపుకో జరుపుకోమని ప్రభుత్వం ఆదేశించింది. ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లా నందు సోమవారం కసింకోట మండలం బయ్యవరం గ్రామం నందు ఏరువాక పౌర్ణమి జిల్లా కార్యక్రమం జరపనున్నారు. ఉదయం 8 గంటలకి ఈ కార్యక్రమం బయ్యవరం నందు జరుగుతుంది. అనకాపల్లి శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ , జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ,జిల్లా వ్యవసాయ అధికారి ఎం.ఆశా దేవి , జిల్లా వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులు కార్యక్రమంలో పాల్గొంటారు. రైతులందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయాధికారులు కోరుతున్నారు.

## కానిస్టేబుల్ రామకోటిని సత్కరించిన హోం మంత్రి

(నక్కపల్లి, ప్రభాతవార్త), జూన్ 28:



అనకాపల్లి జిల్లా ఈగల్ బృందంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రామకోటిని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత నక్కపల్లి మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. ఇటీవల జూన్ 26న నిర్వహించిన అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా మాదకద్రవ్యాల నియంత్రణలో విశేష సేవలు అందించినందుకు కానిస్టేబుల్ రామకోటికి ప్రతిష్ఠాత్మక ఈగల్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. అనకాపల్లి జిల్లాలో గంజాయి రవాణా, అంతర్రాష్ట్ర గంజాయి ముఠాల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచుతూ అక్రమ రవాణాను అరికట్టడంలో రామకోటి కీలక పాత్ర పోషిస్తున్నారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు గుర్రం రామకృష్ణ ,రాష్ట్ర పార్టీ నాయకులు వినోద్ రాజు, మండల పార్టీ అధ్యక్షులు అమలుకంటి అబద్ధం, నాయకులు ఉన్నారు.

## నేడు కలెక్టరేట్‌లో పి.జి.ఆర్.ఎస్, రెవెన్యూ క్లినిక్

అనకాపల్లి (కలెక్టరేట్ ), జూన్ 28 ( ప్రభాత వార్త):

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్), రెవిన్యూ క్లినిక్‌ల కార్యక్రమాలను జూన్ 29 సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంతో పాటు జిల్లాలో అన్ని మండల, డివిజన్ స్థాయి కార్యాలయాలలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు.పి.జి.ఆర్.ఎస్, రెవెన్యూ క్లినిక్ లలో సమర్పించిన అర్జీల సమాచారం కోసం 1100 టోల్ ఫ్రీ నెంబర్ కు నేరుగా కాల్ చేసి తెలుసుకోవాలని అర్జీదారులకు కలెక్టర్ సూచించారు.పి జి ఆర్ ఎస్, రెవిన్యూ క్లినిక్ లకు హాజరు కాని అర్జీదారులు లి(మీ కోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ ద్వారా అర్జీలు నమోదు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణనన్ తెలిపారు.

## సిపిఎం నేత ఎం.అప్పలరాజు గృహ నిర్బంధం

(ఎస్.రాయవరం,జూన్ 28, ప్రభాత వార్త ):



సిపిఎం అంటే హోం మంత్రికి పోలీసులకు ఎందుకు భయం అని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.అప్పలరాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర హోం శాఖ మంత్రి ఎస్.రాయవరం మండలం లో ధర్మవరం అగ్రహారం గ్రామానికి సమీపంలో గల వరాహ నదిలో గల చింతకాలువ మరమ్మతులు చేపట్టి ఆదివారం ప్రారంభిస్తున్న నేపథ్యంలో ధర్మవరం అగ్రహారం గ్రామంలో తమ ఇంటి వద్ద ఎస్.రాయవరం పోలీసు లు ఆదివారం ఉదయం నుండి బయటకు వెళ్ళి నీయకుండా గృహ నిర్బంధం చేసారు. ఈ గృహ నిర్బంధాన్ని ఎం.అప్పలరాజు తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు.సీపీఎం అంటే హోం మంత్రికి, పోలీసులకు ఎందుకు భయమొ అర్థం కావడం లేదని, పోలీసులు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ఉల్లంఘించి, చట్టాలు పరిదులు దాటి ఈ విధంగా నిర్బంధాలకు పాల్పడుతున్నారని.చట్టాలను ఉల్లంఘించిన వారు ఎవరూ తప్పించుకోలేరని, న్యాయం,చట్టం తప్పని సరిగా ఎంతటి వారినైనా శిక్షిస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు.ఇలాంటి నిర్బంధాలకు భయపడే ప్రసక్తే లేదని అయన తెలిపారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో వందశాతం విజయమే లక్ష్యం: హోంమంత్రి



(నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త)జూన్ 28:

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇప్పటినుంచే ఒక ప్రణాళిక ప్రకారం ప్రతి కార్యకర్త నాయకులు సిద్ధమై వందకు వంద శాతం విజయం సాధించే విధంగా అడుగులు వేయాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పార్టీ నాయకత్వానికి పిలుపునిచ్చారు. నక్కపల్లి హోంమంత్రి క్యాంపు కార్యాలయంలో పాయకరావుపేట పట్టణ పరిధికి చెందిన ముఖ్య నాయకులతో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రచారం, స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహకాలు తదితర అంశాలపై నాయకులతో విస్తృతంగా చర్చించారు. హోంమంత్రి అనిత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరేలా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వందకు వంద శాతం విజయాన్ని లక్ష్యంగా పెట్టుకుని ప్రతి నాయకుడు, కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని కోరారు. నాయకులందరూ సమన్వయంతో పనిచేస్తూ పార్టీ విజయానికి తోడ్పడాలని హోంమంత్రి సూచించారు.

## గ్రామీణ పరిధిలో ఎస్సై ఉపేంద్ర ఆధ్వర్యంలో తనిఖీలు

ఎలమంచిలి, జూన్ 28, ప్రభాతవార్త:



గ్రామీణ పోలీస్ స్టేషన్ పరిధిలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు, మత్తు పదార్థాల వినియోగానికి చెక్ పెట్టేందుకు పోలీసులు ముమ్మర చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఎస్సై ఉపేంద్ర ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బహిరంగ ప్రదేశాల్లో మద్యం, గంజాయి సేవిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకునే దిశగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.గ్రామీణ పరిధిలోని పలు అనుమానాస్పద, నిర్మానుష్య ప్రదేశాలతో పాటు యువత గుమికూడే ప్రాంతాలపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా బహిరంగంగా మద్యం సేవించే ప్రాంతాలు, గంజాయి వినియోగానికి అడ్డాలుగా మారిన ప్రదేశాల్లో రూరల్ ఎస్సై ఉపేంద్ర సిబ్బందితో కలిసి ఈ ఆకస్మిక దాడులు కొనసాగించారు. ఈ తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆకస్మిక దాడుల్లో భాగంగా నేరస్థులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు ఉపేంద్ర తెలిపారు. పబ్లిక్ స్థలాల్లో మద్యం సేవించినందుకు గాను మొత్తం 4 ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. యువత మత్తు పదార్థాలకు, గంజాయికి బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా, ప్రజలకు ఇబ్బంది కలిగేలా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే ఉపేక్షించేది లేదని, ఇకముందు కూడా ఈ తనిఖీలు నిరంతరాయంగా కొనసాగుతాయని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

## మృత్యు రహదారిగా కేబీ రోడ్డు.. తృటిలో తప్పిన ప్రాణాపాయం

బుచ్చయ్యపేట, జూన్ 28, ప్రభాత వార్త



అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం రాజాం రైస్ మిల్లు సమీపంలోని కేబీ రోడ్డుపై మరోసారి ప్రమాదం చోటుచేసుకుంది. వడ్డాది నుంచి అనకాపల్లి వైపు వెళ్తున్న ఓ కారు అదుపుతప్పి రోడ్డుకు అత్యంత సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం పూర్తిగా దెబ్బతినగా, కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. అదృష్టవశాత్తూ ప్రాణాపాయం తప్పింది.అయితే, ఈ ఘటన ఒక్కటే కాదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజాం నుంచి కుంద్రం వరకు ఉన్న కేబీ రోడ్డులో తారు రహదారికి అత్యంత సమీపంలోనే అనేక విద్యుత్ స్తంభాలు ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. గతంలో కూడా ఇదే కారణంగా పలుమార్లు ప్రమాదాలు జరిగినప్పటికీ సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు.ఈ సమస్యపై పలుమార్లు వార్తలు ప్రచురితమైనా, ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ, రహదారుల శాఖ అధికారులు స్పందించకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరిన్ని ప్రాణనష్టాలు సంభవించేలోపు రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించి, సురక్షితమైన ప్రదేశాలకు మార్చాలని స్థానికులు బలంగా డిమాండ్ చేస్తున్నారు. "ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కాదు... ప్రాణాలు పోయేలోపు చర్యలు తీసుకోవాలి" అని స్థానికులు అధికారులను హెచ్చరిస్తున్నారు.

## గుడిలోవ విద్యార్థుల షూటింగ్ బాల్ ప్రతిభ

### రాష్ట్రస్థాయి పోటీలకు ముగ్గురు విద్యార్థుల ఎంపిక

ఆనందపురం, జూన్ 28, ప్రభాతవార్త:




విశాఖపట్నం జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 27న నిర్వహించిన జిల్లా స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో గుడిలోవ లోని విజ్ఞాన విహార ఆవాస విద్యాలయం విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తం గా బాలురు, బాలికలు కలిపి సుమారు 200 మంది పాల్గొన్నారు. ఇందులో విజ్ఞాన విహార ఆవాస విద్యాలయం నుంచి ఈ. యశ్వంత్, టి. ఆశిష్ కుమార్, టి. శ్రీహరిప్రియ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక య్యారని వ్యాయామ ఉపాధ్యాయుడు పి.టి.శ్రీనివాసరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు జూలై 11, 12 తేదీల్లో కడప జిల్లా పులివెందులలో జరగనున్న రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా విద్యార్థు లను విద్యాలయ యాజమాన్యం, ప్రిన్సిపల్ అభినందించి, రాష్ట్రస్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబర్చి విద్యాలయానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## బాల వికాస్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణి

ఆనందపురం, జూన్ 28, ప్రభాతవార్త :



మండలంలోని గొట్టిపల్లి శ్రీ సత్యసాయి ఇంటిగ్రేటెడ్ సేవా మందిరంలో ఆదివారం బాలవికాస్ విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. సాయి భక్తులు పి ఎస్ ఎన్ మూర్తి, ఆనందపురం భజన మండలి సేవాదళ్ కో-ఆర్డినేటర్ కొట్యాడ లక్ష్మణ్ మూర్తి సహాయ సహకారాలతో 35 మంది బాల వికాస్ విద్యార్థులకు 150నోటు పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సమితి కో-ఆర్డినేటర్ డబ్బీరు విజయ్ కుమార్,సమితి కన్వీనర్ కోరాడ తమ్మునాయుడు, స్థానిక భజన మండలి కన్వీనర్ డీపీ రాజు, జిల్లా జాయింట్ యూత్ కోఆర్డినేటర్ డి శరత్ కుమార్, ఆధ్యాత్మిక కో-ఆర్డినేటర్ వి కృష్ణమూర్తి రాజు పాల్గొన్నారు.

## అలరించిన 'పవిత్ర' సంగీత గాత్రకచేరి

విశాఖపట్నం జూన్ 28 ప్రభాతవార్త



రామ్నగర్ మెయిన్ రోడ్డు శ్రీ రాఘవేంద్ర స్వామివారి మఠంలో ఐవియల్ శాస్త్రి సంగీత సమితి వారి ఆధ్వర్యంలో నెలవారీ సాంస్కృతిక ఉత్సవంలో భాగంగా శాస్త్రీయ సంగీత గాత్ర కచేరీ నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ జ్యోతిని వెలిగించి ప్రారంభించి గాత్ర సంగీతం యొక్క ప్రాము ఖ్యతను తెలిపారు . విశాఖ నగరానికి చెందిన విదుషి కుమారి కె పవిత్ర వాగ్గేయ కారులైన శ్రీత్యాగరాజ స్వామి, పురందర దాసు, అన్నమయ్య సంకీర్తనలను మధు రంగా గానం చేసి ఆహూతుల ప్రశంసలను అందుకున్నారు. సంగీత గాత్ర కచేరీకి వయోలిన్ పై కుమారి కె గాయత్రి వరేణ్య, మృదంగంపై టి సాయి చంద్రశేఖర్ సంగీత వాద్య సాకారం అందించేశారు. తదుపరి కళాకారులను సంస్థ తరఫున నిర్వాహకులు ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఆధ్యాత్మిక భావనతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఆకొండి వెంకట రావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం వి రాజశేఖర్, ఎస్బిఐ ఏజిఎం అనిల్ కుమార్, సహాయ కోశాధికారి ఎం.నాగేశ్వరరావు కళాభిమానులు సంగీత ప్రియులు తదితరులు పాల్గొన్నారు .

## గ్రామాలలో భగవద్గీత ప్రచారం కార్యక్రమం

ఆనందపురం, జూన్ 28, ప్రభాతవార్త:



ఆనందపురం మండలంలోని పందల పాక పంచాయితీ బాకురుపాలెం, కుసులువాడ రేగానిగూడెం గ్రామా ల్లో ఆదివారం త్రైత సిద్ధాంత ప్ర బోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ ఆధ్వర్యంలో భగవద్గీత, అనుబంధ గ్రంథాల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదిక సభ్యులు మాట్లాడుతూ భగవద్గీత సృష్టి ఆది నుంచి వచ్చిన దైవజ్ఞానమని, ప్రతి మానవుడు గీతలోని ధర్మాలను ఆచరించి ఆధ్యాత్మిక ఉన్నతిని సాధించాలని పిలుపునిచ్చారు. భగవద్గీతలోని బోధనలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు కే. త్రినాధరావు, జి. కృష్ణసూరి అప్పడు, ఎస్. శ్రీనివాసరావు, వి. సురేష్, కే. లక్ష్మి, సంతోష్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సీతానగరంలో విజయవంతంగా పల్స్ పోలియో

గాజువాక,జూన్ 28,ప్రభాతవార్త :



పోలియో రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైకాపా నాయకులు పిలుపునిచ్చారు. గాజువాక నియో జకవర్గం 75వ వార్డు పరిధిలోని సీతానగరం దుర్గవాణి పాలెం సచివా లయం వద్ద ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవం తంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా వార్డు పరిధిలోని ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ.. చిన్నారుల ఆరోగ్యమే దేశ భవిష్యత్తు అని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని కోరారు. 'ఒక్క చుక్క.. జీవితానికే భరోసా' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు మార్డుపూడి పరదేశి, గంట్యాడ గురుమూర్తి, జీవీ రమణ రెడ్డి, పిట్టా రెడ్డి, ములకలపల్లి వెంకటేష్, గేదెల మధుసూదన్ రెడ్డి, ఆశా వర్కర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## కొరమాండల్ శ్మశాన వాటికలో 'నీటి' కష్టాలు!

### పనిచేయని బోరు.. రాని జీవీఎంసీ నీరు

### అంత్యక్రియల సమయంలో జనం తీవ్ర ఇబ్బందులు

గాజువాక, జూన్ 28,ప్రభాతవార్త :



అంతిమ యాత్రలోనూ ఇబ్బందులు తప్పడం లేదు. కనీస మౌలిక వసతులు కరువై ఆ శ్మశాన వాటిక దీనస్థితికి అద్దం పడుతోంది. జీవీఎంసీ 60వ వార్డు పరిధిలోని కోరమండల్ గేట్ వద్ద గల శ్మశాన వాటికలో నీటి సదుపాయం లేకపోవడంతో దహన సంస్కారాలకు వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఈ శ్మశాన వాటిక సమస్యల నిలయంగా మారింది. ఇక్కడున్న బోర్వెల్ పాడైపోవడంతో ఎందుకూ పనికిరాకుండా పోయింది. జీవీఎంసీ కొళాయిలు ఉన్నప్పటికీ వాటిలో చుక్క నీరు రావడం లేదు. దీంతో అంత్యక్రియల సమయంలో స్నానాలకు, ఇతర అవసరాలకు నీరు లేక ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. అప్పటికప్పుడు బయటి నుంచి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు రెండు లక్షల జనాభా ఉన్న ఈ ప్రాంతానికి ఇదే ప్రధాన శ్మశాన వాటిక. ఇంతపెద్ద సంఖ్యలో ప్రజలు ఆధారపడిన చోట కనీస వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి, తక్షణమే బోరు బావికి మరమ్మతులు చేయించి నీటి సమస్యను తీర్చాలని డిమాండ్ చేస్తున్నారు.

# అంబరాన్ని తాకిన కళాసంబరం

- 60 మంది జర్నలిస్టులకు మీడియా అవార్డులు
- 150 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు
- దేశ, విదేశీ కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్న వేడుక

4విశాఖపట్నం, జూన్ 28 (ప్రభాతవార్త):



సమాజ అభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని, ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో మీడియా విశేష సేవలందిస్తోందని పలువురు ప్రముఖులు కొనియాడారు. వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ అరేనాలో ఆదివారం వైజాగ్ మీడియా అవార్డ్స్, స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ప్రతిభకు ప్రోత్సాహం--2026' కార్యక్రమం ఘనంగా జరిగింది.

ఈ సందర్భంగా మీడియా రంగంలో విశేష సేవలందించిన 60 మంది జర్నలిస్టులకు మీడియా అవార్డులు, వివిధ కోర్సుల్లో ప్రతిభ కనబరిచిన 150 మంది జర్నలిస్టుల పిల్లలకు ఉపకార వేతనాలు అందజేశారు. అలాగే శ్రీలంక, బంగ్లాదేశ్‌తో పాటు దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన 35 మంది కళాకారులకు కళాజీవ పురస్కారాలు ప్రదానం చేశారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వ పథకాలు, సమాజంలోని పరిణామాలను చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర అమూల్యమని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వాలు తమ వంతు సహకారం అందిస్తాయని తెలిపారు.

నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకబ్రత బాగ్చి మాట్లాడుతూ, జర్నలిస్టులు సంచలనాలకు తావులేకుండా వాస్తవాధారిత కథనాలను ప్రజలకు అందించాలని సూచించారు. అంతర్జాతీయ కళాకారులు విశాఖకు రావడం నగర ప్రతిష్ఠను మరింత పెంచుతుందన్నారు. కెవీఆర్ గ్రూప్ అధినేత కాయల వెంకటరెడ్డి, వాకర్స్ అసోసియేషన్ అంతర్జాతీయ అధ్యక్షుడు కమల్ బెయిడ్, జనసేన నాయకుడు బెహరా భాస్కరరావు తదితరులు మాట్లాడుతూ జర్నలిస్టులు, వారి పిల్లలను ప్రోత్సహించే ఇటువంటి కార్యక్రమాలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.

వైజాగ్ మీడియా అవార్డ్స్ గౌరవ చైర్మన్ గంట్ల శ్రీనుబాబు, చైర్మన్ ఆర్. నాగరాజు పట్నాయక్ మాట్లాడుతూ, ఎల్‌కేజీ నుంచి ఉన్నత విద్య వరకు ప్రతిభ కనబరిచిన జర్నలిస్టుల పిల్లలకు ప్రతి ఏడాది ఉపకార వేతనాలు అందిస్తున్నామని తెలిపారు. ఈసారి 150 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు చెప్పారు.

### కనువిందు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీలంక, బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్, గుజరాత్, ముంబయి తదితర ప్రాంతాలకు చెందిన కళాకారులతో పాటు హర్షిత, టీనా, డింపుల్, పూజిత చందన బృందాల శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. లక్కీడిప్, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో సుమారు 650 మంది జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని ఉత్సాహంగా గడిపారు. నిర్వాహకులు అతిథులకు అల్పాహారం, భోజనంతో పాటు ఆతిథ్యం అందించారు.

## నటుడు సుమన్‌కు ఘన సన్మానం

గాజువాక,జూన్ 28,ప్రభాతవార్త :




రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్, నాటక రంగ అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా నియమితులైన తర్వాత తొలిసారి నగరానికి విచ్చేసిన ప్రముఖ సినీ నటుడు సుమన్ తల్వార్‌ను ఘనంగా సత్కరించారు. హెచ్‌బీ కాలనీకి చెందిన డ్రాగన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ చైర్మన్ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. దీనికి యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, భాజపా రాష్ట్ర మీడియా ప్యానెలిస్ట్ కర్ణంరెడ్డి నరసింగరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ.. తనకు ఈ పదవిలో అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణలకు కృతజ్ఞతలు తెలిపారు. విశాఖ, అమరావతి కేంద్రాలుగా సినీ, నాటక రంగాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రఘు, ఆనందబాలు, అగస్త్య, కిషోర్, రాము, అన్బు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కుర్మన్నపాలెంలో ఏజీఆర్ స్పోర్ట్స్ అకాడమీ ప్రారంభం

గాజువాక, జూన్ 28,ప్రభాతవార్త :




చిన్న వయసులోనే పిల్లల్లోని క్రీడా నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించడంలో తల్లిదండ్రులు చొరవ చూపాలని సినీ నటుడు సుమన్ తల్వార్, భాజపా రాష్ట్ర మీడియా ప్యానెలిస్ట్ కర్ణంరెడ్డి నర్సింగ రావు కోరారు. కుర్మన్నపాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏజీఆర్ స్పోర్ట్స్ అకాడమీని వారు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అట్టడుగు స్థాయి నుంచి ప్రతిభను గుర్తించి, వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే అకాడమీ లక్ష్యమన్నారు. అనుభవజ్ఞులైన కోచ్‌ల ద్వారా అత్యాధునిక వసతులతో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పిల్లల్లో ఆత్మరక్షణ, ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు కరాటే ఎంతో అవసరమన్నారు. అకాడమీ సభ్యులు అన్బు, సరస్వతి, రాజేశ్వరి, గోవర్ధన్ సాయి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు బోండా జగన్, లేళ్ళ కోటేశ్వరరావు, నాయకులు సతీష్ కుమార్, రాము, వెంకటాద్రి, డీజేఆర్‌కే రాజు, ఎండీ మొబీన్ తదితరులు పాల్గొన్నారు.

## (అ)పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళణం

- మళ్లీ మళ్లీ ఇది రాని రోజు
- 50 ఏళ్ల తర్వాత కలుసుకున్న పాత స్నేహితులు
- ఆటపాటలు తో సంతోషంగా గడిపిన వృద్ధులు
- గోల్డెన్ జూబ్లీ జరుపుకున్న 1975-76 సంవత్సరం టెన్త్ క్లాస్ బ్యాచ్

విశాఖపట్నం, జూన్ 28 ప్రభాతవార్త




ప్రతి ఒక్కరి జీవితంలో గుర్తుండే తీపి జ్ఞాపకాలు చిన్నతనంలోనే ఉంటాయి. తను చదువుకునే రోజులు... చేసే అల్లరి... స్నేహితుల కోసం చేసే ఫైటింగ్లు... వారితో కలిసి ఆడిన ఆటలు... చిన్న చిన్న గ్యాంగ్లు... అవన్నీ ఓ మధురమైన క్షణాలు. మళ్లీ అవన్నీ గుర్తు చేసుకోవటానికి 50 వసంతాల తర్వాత కలుసుకుని ఆనందంగా గడిపారు పాతనగరం ఎంవీడీఎం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు.

విశాఖనగరం ఓల్డ్ సిటి కురుపాం మార్కెట్ ప్రాంతంలో గల ఎం.వీ.డీ.ఎం. ఉన్నత పాఠశాలలో 1975-76 లో పదవతరగతి పూర్తి చేసుకున్న వీరంతా 50 వసంతాలు పూర్తైన సందర్భంగా గోల్డెన్ జూబ్లి వేడుకలు నిర్వహించేందుకు ముందుగా ఓ ప్రాంతంలో కలిశారు. ఆ తర్వాత ఆదివారం నాడు విద్యనభ్యసించిన పాఠశాలకు చేరారు. పాతరోజులు గుర్తుకు తెచ్చుకున్నారు. ఎవరెవరు....ఎక్కడ ఉన్నారు.. ఏ స్థాయిలో ఉన్నారు... ఆరోగ్యం... పిల్లలు... కుటుంబం... ఉద్యోగం ఉపాధి ఇలా అన్ని విషయాలు ఒకరికొకరు తెలుసుకున్నారు. అప్పటి అధ్యాపకులు నేర్పిన పాఠాలు...నేర్పించిన పద్ధతులు గుర్తుచేసుకుని ఆనందంతో తేలియాడారు. ఈ బ్యాచ్ విద్యార్థుల్లో అనేక మంది ఉన్నత విద్యనభ్యసించి వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకుల్లో దేశంలో వివిధ రాష్ట్రాల్లో ఉన్నత స్థానాలధిరోహించిన వారు, వివిధ వ్యాపార రంగాల్లో స్థిరపడ్డవారు ఉన్నారు. పాఠశాలలో అడుగిడిన వెంటనే అందరూ ఒక్కసారిగా చిన్ననాటి రోజులు గుర్తుతెచ్చుకుని ఉత్సాహంగా రోజంతా గడిపారు. అప్పట్లో విద్యనొసంగిన ఉపాధ్యాయులను మనసారా గుర్తుచేసుకుని గురుభక్తి చాటుకున్నారు. పాత జ్ఞాపకాలు గుర్తుకు తెచ్చుకుని ఉల్లాసంగా గడిపారు. సుమారు 60 మంది పూర్వ విద్యార్థులు తమ తమ కుటుంబ సభ్యులతో హాజరైన వారంతా ఆటలు, పాటలు, చిన్న చిన్న సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు సహపంక్తి భోజనాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అప్పటి విద్యార్థి వంకాయల రమేష్ సేకరించిన కరెన్సీ నోట్లు, నాణెముల ప్రదర్శన అందరినీ అలరించింది. కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రస్తుత హెడ్మాస్టర్ నిరజ ఇన్చార్జి హెడ్మాస్టర్ స్రవంతి ల ను కలిసి అప్పట్లో స్కూలు వాతావరణం, సదుపాయాలు, ఆనాటి గురువులతో తమ అనుబంధం గురించి వారి మనోగతాన్ని పంచుకొని వారిరువురిని ఘనంగా సత్కరించారు. అనంతరం తమకు విద్యనందించిన స్కూలుకు ఆరు క్రాంప్టన్ సీలింగ్ ఫ్యాన్ లు బహూకరించారు. భవిష్యత్తులో పూర్వ విద్యార్థులందరూ చర్చించుకుని మరింత సహాయం అందిస్తామని చెప్పారు. ప్రతీ సంవత్సరం ఇటువంటి సమావేశాలు నిర్వహించుకుంటామని చెప్పారు. చివరగా ఆనాటి విద్యార్థులందరూ (నేటి వృద్ధులు) సామూహిక జాతీయగీత వందన సమర్పణలో కార్యక్రమం ముగిసింది.

## పోలియో రహిత సమాజానికి సహకరించండి

### మాజీ కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి పిలుపు

గాజువాక, జూన్ 28,ప్రభాతవార్త :




ప్రతి చిన్నారి ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు బాధ్యతగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని 69వ వార్డ్ మాజీ కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి కోరారు. పోలియోను పూర్తిగా నిర్మూలించాలంటే ఐదేళ్ల లోపు వయసున్న ప్రతి చిన్నారికి తప్పని సరిగా రెండు చుక్కల పోలియో మందు వేయించాల న్నారు. 'నిండు ప్రాణానికి... రెండు చుక్కలు' అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లోని వారికి చేరవేసి, పోలియో రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. సమీపంలోని పోలియో కేంద్రా లకు చిన్నారులను తీసుకువచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం అంగన్వాడీ సిబ్బంది,పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నకిలీ నువ్వు విత్తనాలతో నష్టపోయిన రైతులు

పద్మనాభం,జూన్ 28, ప్రభాతవార్త :

మండలంలో పలుగ్రామాలకు ప్రభుత్వం తొలకరి సీజనుకు సరఫరా చేసిన నకిలీ నువ్వు విత్తనాలు వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు.ఏప్రిల్ నెలలో వేయనున్న నువ్వు పంటకు ప్రభుత్వం పలు గ్రామాల రైతులకు ఉచితంగా సుమారు ఆరువందల కేజీల నువ్వు విత్తనాలను సరఫరాచేసింది. ఎల మంచిలి నువ్వుల హైబ్రిడ్ విత్తనాలు అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు విస్తృతంగా ప్రచారం చేయడంతో రైతులు పుట్టెడు ఆశతో విత్తనాలు వేసారు. వర్షాలు అనుకూలించడంతో పంట ఏపుగా పెరగ డమే తప్ప పూతగాని కాపుగాని లేకపోవడంతో రైతులు లబోదిబో మంటున్నారు. ఎకరానికి పెట్టిన సుమారు పదిహేను వేల రూపాయలు కూడా నష్టపోయినట్లు రైతులు గగ్గోలు పెడుతు న్నారు. నష్టపరిహారం చెల్లించకపోతే ఆంధోళన చేయనున్నట్లు రైతులు చెప్పారు.

## ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరి

### శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం మాజీ చైర్మన్, కొల్లి సింహాచలం

విశాఖపట్నం, జూన్ 28, ప్రభాతవార్త :



పల్స్ పోలియో కార్య క్రమంలో భాగంగా శ్రీ కనకమహాలక్ష్మి అమ్మ వారి దేవస్థానం మాజీ చైర్మన్, జనసేన పార్టీ నాయ కురాలు కొల్లి సింహాచలం 39వ వార్డు పరిధి పద్మానగర్ అంగన్వాడి కేంద్రంలో వున్న చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. రెండు చుక్కల పోలియో టీకాతో చిన్నారులను అంగవైకల్యం నుంచి రక్షించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జన సైనికులు పాల్గొన్నారు.

## పోలియో రహిత భారత్ ప్రధాని మోదీ లక్ష్యం

### భాజపా రాష్ట్ర మీడియా ప్యానెలిస్ట్ కర్ణంరెడ్డి నరసింగరావు



గాజువాక,జూన్ 28,ప్రభాతవార్త :

పోలియో రహిత భారతదేశమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర కూటమి ప్రభుత్వ సంకల్పమని భాజపా రాష్ట్ర మీడియా ప్యానెలిస్ట్, గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కర్ణంరెడ్డి నరసింగరావు (కేఎన్ఆర్) అన్నారు. పాతకర్ణవానిపాలెం సామాజిక భవనంలో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'నిండు జీవితానికి రెండు చుక్కలు' ఎంతో అవసరమని, ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త పూర్ణకుమారి, ఏఎన్ఎం ముంతాజ్ బేగం, ఆశా వర్కర్లు, భాజపా నాయకులు నాగేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు పోలియో చుక్కలు 'శ్రీరామరక్ష'

### మొల్లి పెంటిరాజు



గాజువాక,జూన్ 28,ప్రభాతవార్త :

చిన్న పిల్లల ఆరోగ్యానికి పల్స్ పోలియో చుక్కలు శ్రీరామరక్ష లాంటివని, ప్రభుత్వ సూచనల మేరకు ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా వీటిని వేయించాలని రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్, విశాఖ జిల్లా తెలుగుయువత ప్రధాన కార్యదర్శి మొల్లి పెంటిరాజు సూచించారు. దేశవ్యాప్తంగా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా.. జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని మొల్లివానిపాలెం కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. దేశాన్ని పోలియో రహితంగా మార్చేందుకు తల్లిదండ్రులంతా బాధ్యతగా తమ పిల్లలకు చుక్కల మందు వేయించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు క్లస్టర్ ఇన్‌ఛార్జి ఊరుకుటి అప్పలరాజు, గ్రామ అధ్యక్షుడు ఉరుకూటి శ్రీనివాస్, నమ్మి చంద్రరావు, నమ్మి సింహాద్రి, మొల్లి రమణ, మొల్లి అప్పలనాయుడు, మొల్లి అప్పారావు, ఏఎన్ఎం అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

## అవగాహనతోనే పోలియో నిర్మూలన


### 66వ వార్డ్ టీడీపీ ఇంచార్జ్ మహమ్మద్ రఫీ



గాజువాక,జూన్ 28,ప్రభాతవార్త :

సమాజంలో ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని, ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని 66వ వార్డు తెదేపా ఇన్‌ఛార్జ్, మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ కోరారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఆదివారం వార్డు పరిధిలోని అజీమాబాద్ అంగన్‌వాడీ కేంద్రం, కనితి రహదారి పీహెచ్‌సీల్లో చిన్నారులకు ఆయన పోలియో చుక్కలు వేశారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి అవగాహన కల్పించాలని రఫీ కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మునిరా, ఏఎన్ఎంలు టి.వరలక్ష్మి, డి.భవాని, ఆశా కార్యకర్తలు సైరాబాను, వరలక్ష్మి, కూటమి నాయకులు అన్సర్ వల్లి, శివ, మున్వర్, రాజు, మణికంఠ పాల్గొన్నారు

## ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలి: గుడివాడ లతీష్



గాజువాక, జూన్ 28,ప్రభాతవార్త :

ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ తల్లిదండ్రులు తప్పని సరిగా పోలియో చుక్కలు వేయించాలని వైకాపా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్ కోరారు. గాజువాక 68వ వార్డు మిందిలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వార్డు పరిధిలోని మింది అక్కిరెడ్డిపాలెం, రామ్ నగర్, అప్పన్న కాలనీ, కాళికానగర్, రాజీవ్‌నగర్ తదితర 11 కేంద్రాలను ఆయన సందర్శించి చిన్నారులకు చుక్కలు వేశారు. డాక్టర్ ఎస్. అనూష, డాక్టర్ కె.తేజ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



ఆదివారం హిమాయత్ సాగర్ గేట్లు ఎత్తుతున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

# హిమాయత్‌సాగర్ గేటు ఎత్తివేత

## ఇన్‌ఫ్లో 60 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 339 క్యూసెక్కులు

**నార్సింగి, జూన్ 28 ప్రభాతవార్త:** హైదరాబాద్ మహానగరం శివారుల్లో ఉన్న హిమాయత్ సాగర్ జలాశయం నిండుకుండగా మారింది. ఇటీవల కురిసిన వర్షానికి కొంత కొత్తనీరు రావడంతో ఈ జలాశయం నీటిమట్టం ప్రస్తుతం 1762.25 అడుగులకు చేరుకుంది. పూర్తి మట్టం 1763.50.అడుగులు. మరో 1.25.అడుగుల నీరువస్తే పూర్తిస్థాయికి చేరుకుంటుంది. గత సంవత్సరం వర్షాకాలంలో జంట జలాశయాలగేట్లు ఎత్తడం వలన రాజధాని హైదరాబాద్ నగరంలోని ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ముందు జాగ్రత్తలో భాగంగా ఆదివారం సాయంత్రం జలమండలి ఉన్నతాధికారుల ఆదేశాలతో 8వ నెంబర్ గేటును ఎత్తి ఈసీ వాగులోకి నీటిని వదిలిపెట్టారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ గేటుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈసీ వాగులోకి 339 క్యూసెక్కుల నీటిని వదిలిపెట్టారు. ఇంత ఆగమేఘాల మీద ఎందుకు నీటిని వదులుతున్నారని స్థానికులు గుసగుసలాడారు. మరో జలాశయం గండిపేట పూర్తిస్థాయి నీటి మట్టం 1790 అడుగులు కాగా ప్రస్తుతం 1784.15 అడుగుల నీరుంది. మరో 6 ఫీట్ల కొత్త నీరు వస్తే ఈ జలాశయంగేట్లు ఎత్తుతారు. కృష్ణా, గోదావరి, మంజీర ప్రాజెక్టుల నీటిని నగర ప్రజలకు సరఫరాచేస్తుండడం వలన ఈ జంట జలాశయాల నీటిని ఎక్కువగా సరఫరా చేయడంలేదు. ఫలితంగా వేగంగా ఈ జలాశయాలు నిండిపోతున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, చైర్మన్ మల్లేష్, వేణుగోద్, మాజీ సర్పంచ్ హరికృష్ణ, అంతారం నరేష్, దొబ్బ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# భూగర్భ జలాలకు కాలుష్యం ముప్పు



## దేశంలో తెలంగాణ మూడో స్థానం

## సురక్షిత తాగునీరు సరఫరాలో విఫలం

## 28 జిల్లాల్లో ఫ్లోరైడ్, 32 జిల్లాల్లో నైట్రేట్

## రసాయనం, ఎరువులు, వ్యవసాయ వ్యర్థాలతో ముప్పు

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** తెలంగాణ వ్యాప్తంగా భూగర్భ జలాల్లో మార్పులు చోటు చేసుకున్నప్పటికీ, పలు జిల్లాల్లో సురక్షితమైన తాగునీటిని అందించడంలో విఫలమైంది. అధిక వర్షపాతం, బలమైన రీఛార్జ్ కారణంగా పర్యవేక్షించిన 98శాతం బావుల్లో భూగర్భ జలాల పరిస్థితి మెరుగుపడినప్పటికీ, పలు జిల్లాల్లో ఫ్లోరైడ్, నైట్రేట్ కాలుష్యం ఇంకా కొనసాగుతున్నట్లు భూగర్భజలశాఖ తాజా అంచనాలో వెల్లడైంది. ఈ నివేదిక ప్రకారం మంచిర్యాల జిల్లాలో ఫ్లోరైడ్ స్థాయిలు గరిష్టంగా లీటరుకు 13.9మిల్లీగ్రాములుగా, నిజామాబాద్‌లో 697 మిల్లీ గ్రాములు, కామారెడ్డి జిల్లాలో లీటరు నీటికి 683 మిల్లీ గ్రాములుగా నమోదయ్యాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల ప్రకారం, తాగునీటిలో ఫ్లోరైడ్ అనుమతించదగిన పరిమితి లీటరు నీటిలో 1.5 మిల్లీ గ్రాములు, నైట్రేట్ 50 మిల్లీ గ్రాములుగా ఉండాలి. జలశక్తి మంత్రిత్వ శాఖ నివేదిక ప్రకారం, తెలంగాణలోని 28 జిల్లాల్లో ఫ్లోరైడ్ అధికంగా ఉండగా, రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 32 జిల్లాల్లో నైట్రేట్ సురక్షిత పరిమితులను మించిపోయింది. దీంతో నైట్రేట్ కాలుష్యం విషయంలో తెలంగాణ దేశంలో మూడవ అత్యంత అధ్వాన్నమైన రాష్ట్రంగా నిలిచింది.

రుతుపవనాలకు ముందు, తరువాత కాలంలో సేకరించిన 2,200కు పైగా భూగర్భ జల నమూనాల ఆధారంగా జరిపిన అంచనాలో, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఫ్లోరైడ్, నైట్రేట్, లవణీయత వల్ల భూగర్భ జలాలు కలుషితం అవుతున్నట్లు తేలింది. ప్రధానంగా ఫ్లోరైడ్ కాలుష్యం తెలంగాణ యొక్క అత్యంత ముఖ్యమైన భూగర్భజల నాణ్యత ఆందోళనలలో ఒకటిగా ఉంది. ప్రభావిత జిల్లాల్లో నల్గొండ, రంగారెడ్డి, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, హన్మకొండ, జనగాం, కొత్తగూడెం, నాగర్‌కర్నూల్, మహబూబ్ నగర్‌లోని కొన్ని ప్రాంతాలు ఉన్నాయి. వర్షాకాలం ముందు కాలంలో ఆసిఫాబాద్ జిల్లాలో లీటరుకు 0.01 మిల్లీ గ్రాముల నుండి మంచిర్యాలలో 13.9 మిల్లీ గ్రాముల వరకు ఫ్లోరైడ్ సాంద్రతలు ఉన్నాయి. ఇక నైట్రేట్ కాలుష్యం మరింత విస్తృతంగా ఉంది. దాదాపు ప్రతి జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో దీని స్థాయిలు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. రసాయన ఎరువుల మితిమీరిన వాడకం, వ్యవసాయ వ్యర్థాలు, మురుగునీటి లీకేజీ మరియు మురుగునీటి పారుదల వంటి మానవ కార్యకలాపాలే దీనికి ప్రధాన కారణాలని నిపుణులు పేర్కొంటున్నారు.

ఫ్లోరైడ్ కాలుష్యానికి ప్రధానంగా తెలంగాణ భూగర్భ నిర్మాణమే కారణమని నివేదిక పేర్కొంది. రాష్ట్రంలో దాదాపు 81 భూభాగం గ్రానైట్లు, గ్నీస్‌లు, స్కిస్ట్‌లు, క్వార్ట్‌జైట్‌లు, దక్కన్ బసాల్ట్‌లతో సహా గట్టి శిలా నిర్మాణాలతో నిండి ఉంది. ఈ నిర్మాణాలలో నిల్వ ఉన్న భూగర్భ జలాలు ఫ్లోరైడ్ కలిగిన ఖనిజాలతో దీర్ఘకాలం పాటు సంపర్కంలో ఉండటం వల్ల, కాలక్రమేణా ఫ్లోరైడ్ భూగర్భ జల పొరలలోకి కరిగిపోతుంది. కేవలం భూగర్భ జలాల లభ్యతను మెరుగుపరచడం మాత్రమే సురక్షితమైన తాగునీటికి హామీ ఇవ్వలేదని పర్యావరణ నిపుణులు హెచ్చరించారు. నిరంతర భూగర్భ జల నాణ్యత పర్యవేక్షణ, మెరుగైన ఎరువుల నిర్వహణ, రీఛార్జ్ జోన్ల పరిరక్షణ, ఫ్లోరైడ్, నైట్రేట్ ప్రభావిత ప్రాంతాలలో లక్షిత చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని రెయిన్ వాటర్ ప్రాజెక్ట్ వ్యవస్థాపకురాలు కల్పనా రమేష్ అన్నారు.



ఆదివారం బాగ్ లింగంపల్లిలో నిర్వహించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ సదస్సు లో పాల్గొన్న పూర్వ న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య గౌడ్, జేఏసీ చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్ , పూర్వ డీజీపీ, ఆల్ ఇండియా బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ సమన్వయకర్త జె.పూర్ణచందర్ రావు తదితరులు

# అన్ని కులాల పాలన రావాలి

## పూర్వ న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య గౌడ్, జెఎసి చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్ పిలుపు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జూన్ 28 ప్రభాతవార్త :** తెలంగాణలో కొన్ని కులాల పాలన పోయి, అన్ని కులాలకూ ప్రాతినిధ్యం ఉన్న పాలన రావాలని, అది బీసీ, ఎస్సీ,ఎస్టీ జేఏసీ ద్వారానే బహుజనులకు రాజ్యాధికారం ముమ్మాటికీ సాధ్యమవుతుందని పూర్వ న్యాయమూర్తి, బీసీ జాతీయ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య గౌడ్ అన్నారు. ఆదివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కొన్ని కులాల పాలనకు బదులుగా అన్ని కులాలకు సమాన అవకాశాలు కల్పించే పాలన రావాల్సిన అవసరం ఉందని ఈశ్వరయ్య గౌడ్ పేర్కొన్నారు. పూర్వ డీజీపీ, ఆల్ ఇండియా బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ సమన్వయకర్త జె.పూర్ణచందర్ రావు మాట్లాడుతూ భారతదేశంలో ప్రాంతాలు, మతాలు, భాషల కంటే కుల ఆధిపత్యమే రాజకీయ అధికారాన్ని నిర్ణయిస్తున్న ప్రధాన అంశమని, ఈ వాస్తవాన్ని బహుజన సమాజానికి విస్తృతంగా వివరించి రాజకీయ చైతన్యం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్ మాట్లాడుతూ అగ్ర కుల భూస్వామ్య పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీలు నిరంతరం బలిపశువులవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహనీయుల ఆశయాలు, ఆలోచనల రథాన్ని తెలంగాణలో ముందుకు నడిపించేందుకే ఈ జేఏసీ ఆవిర్భవించిందన్నారు. సమ్మక్క సారలమ్మ, సర్వాయి పాపన్న గౌడ్, పండగ సాయన్న, కొండా లక్ష్మణ్ బాపూజీల ఆత్మగౌరవ జెండాని, బహుజన రాజ్యాధికార అజెండాని పునర్నిర్మించడమే జేఏసీ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సదస్సులో పలువురు బహుజన సంఘాల నాయకులు, సదస్సులో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య, బిసి ఎస్సి, ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేంద్ర ముదిరాజ్, ప్రొఫెసర్ నాగం కుమారస్వామి, ప్రొఫెసర్ రామయ్య యాదవ్, రాము యాదవ్, అహ్మద్ పాషా, పూసల సాయిబాబా, హై కోర్ట్ న్యాయవాదిరఘునాథ్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సమావేశమైన రాజ్యసభ సభ్యుడు ఆర్.క్రిష్ణయ్య

# కొత్తగా 120హాస్టళ్లు, 150 గురుకులాలు మంజూరు చేయాలి

## బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి

**హైదరాబాద్, జూన్ 28 ప్రభాతవార్త :** రాష్ట్రంలో విపరీతమైన డిమాండ్ ఉన్నందున కొత్తగా 120 బీసీ కాలేజీ హాస్టళ్లను, మరో 150 బీసీ గురుకుల పాఠశాలలను తక్షణమే మంజూరు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నాంపల్లిలోని బీసీ సంక్షేమ భవన్‌లో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఆర్.కృష్ణయ్య నేతృత్వంలోని బీసీ నాయకుల బృందం సమావేశమై పలు విజ్ఞప్తులతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ, రాష్ట్రంలో బీసీ జనాభా 52 శాతానికి పైగా ఉన్నప్పటికీ దానికి తగినట్లుగా గురుకులాలు, హాస్టళ్ల వసతి లేదన్నారు. హాస్టల్ సీట్లు దొరకక వేలాది మంది గ్రామీణ విద్యార్థులు ప్రైవేట్ హాస్టళ్ల ఫీజులు భరించలేక చదువులు మానేసే పరిస్థితి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే స్పందించి హైదరాబాద్ జిల్లాలో 20, మహ బూబ్‌నగర్‌లో 12, వరంగల్‌లో 12, నల్గొండలో 12, కరీం నగర్‌లో 12, రంగారెడ్డిలో 12, సంగారెడ్డిలో 10, వికారాబాద్‌లో 10, మేడ్చల్‌లో 10, ఖమ్మం జిల్లాలో 10 చొప్పున బాలబాలికల హాస్టళ్లను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం కొనసాగుతున్న బీసీ గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల డిమాండ్‌కు అనుగుణంగా 5, 6, 7, 8 తరగతుల్లో అదనపు సెక్షన్లను ప్రారంభించాలని సూచించారు. అలాగే, సాధారణ జూనియర్ కాలేజీల్లో క్లాసుకు 40 మంది చొప్పున సీట్లు కేటాయిస్తుంటే, బీసీ గురుకులాల్లో మాత్రం కేవలం 30 సీట్లే ఇస్తున్నారని, దీన్ని 40కి పెంచాలని కోరారు. సాధారణ కాలేజీల్లో ఒక్కో గ్రూపునకు 160 సీట్లు ఉంటే, బీసీ గురుకుల కాలేజీలకు 80 సీట్లే కేటాయించడం అన్యాయమన్నారు. ఈ ఏడాది గురుకులాల్లో 10వ తరగతి, ఇంటర్ ఫలితాలు 99 శాతం రావడంతో సీట్లకు డిమాండ్ భారీగా పెరిగిందని, లక్షలాది మంది దరఖాస్తు చేసుకుంటున్నా వేల మందికి మాత్రమే సీట్లు వస్తున్నాయని పేర్కొన్నారు.

**ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటా : మంత్రి పొన్నం:** బీసీ నాయకుల విజ్ఞప్తులపై మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి కొత్త హాస్టళ్ల మంజూరుతో పాటు గురుకులాల్లో అదనపు సెక్షన్లు, సీట్ల పెంపునకు తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

# రికార్డు స్థాయి ఎండలతో ఐరోపా ఉక్కిరి బిక్కిరి

## ఫ్రాన్స్‌లో వారంలోనే అదనంగా వెయ్యి మంది మృతి



**ప్యారిస్,జూన్ 28:** యూరప్‌ను రికార్డు స్థాయి వడగాడ్పులు తీవ్రస్థాయిలో ప్రభావితం చేస్తున్నాయి. ఫ్రాన్స్‌లో గత వారం నమోదైన తీవ్ర ఉష్ణోగ్రతల కారణంగా అదనంగా సుమారు వెయ్యి మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఆ దేశ ప్రజారోగ్య సంస్థ వెల్లడించింది. మరోవైపు, ప్రపంచ ఆరోగ్య సంస్థ యూరప్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా వేడెక్కుతున్న ఖండంగా మారిందని హెచ్చరిస్తూ, ప్రజల రక్షణ కోసం ప్రభుత్వాలు అత్యవసర చర్యలు చేపట్టాలని సూచించింది. వారాంతంలో యూరప్‌లోని పలు దేశాల్లో ఎన్నడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జర్మనీలో అడవి మంటలు చెలరేగగా, రాజధాని బెర్లిన్‌లో ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు పోలీసులు వాటర్ కానన్లతో చల్లని నీటిని పిచికారీ చేశారు. ప్రస్తుతం ఈ హీట్‌వేవ్ తూర్పు యూరప్ వైపు కదులుతోంది. జర్మనీలో పోలాండ్ సరిహద్దుకు సమీపంలోని నైసెముండే ప్రాంతంలో వరుసగా మూడో రోజు కొత్త ఉష్ణోగ్రత రికార్డు నమోదైంది. అక్కడ గరిష్ఠంగా 41.7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. చెక్ రిపబ్లిక్‌లోనూ చరిత్రలోనే అత్యధికంగా 41.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. యూరప్‌కు చెందిన శాస్త్రవేత్తల బృందం వరల్డ్ వెదర్ అట్రిబ్యూషన్ విడుదల చేసిన తాజా అధ్యయనం ప్రకారం, గత వారం నమోదైన ఈ తీవ్ర ఉష్ణోగ్రతలు, అధిక తేమ పరిస్థితులు వాతావరణ మార్పులు లేకుండా సంభవించే అవకాశం లేదని స్పష్టం చేసింది. ఐదు దశాబ్దాల క్రితం ఇటువంటి పరిస్థితులు దాదాపు లేవని, ప్రస్తుతం ఇవి 20 ఏళ్ల క్రితంతో పోలిస్తే 200 రెట్లు ఎక్కువగా సంభవించే అవకాశముందని అధ్యయనం వెల్లడించింది.

**ఫ్రాన్స్‌లో ఒక్కసారిగా పెరిగిన మరణాలు**

ఫ్రాన్స్‌లో హీట్‌వేవ్ తీవ్రత అత్యధికంగా ఉన్న రోజుల్లో మరణాల సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. ముఖ్యంగా పారిస్ ప్రాంతంలో ఇళ్లలోనే మరణించిన వారి సంఖ్య గణనీయంగా అధికమైంది. బుధవారం ఒక్కరోజే 1,200 మందికిపైగా మరణించగా, ఆ తర్వాతి రెండు రోజుల్లో రోజుకు 1,400 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో రోజుకు 900 నుంచి వెయ్యి మరణాలు మాత్రమే నమోదయ్యేవని అధికారులు తెలిపారు. మూడు రోజుల్లోనే కనీసం వెయ్యి అదనపు మరణాలు సంభవించినట్లు ప్రజారోగ్య సంస్థ అంచనా వేసింది. తీవ్ర ఉష్ణోగ్రతల హెచ్చరికలు జారీ చేసిన ప్రాంతాల్లోనే మరణాలు ఎక్కువగా నమోదయ్యాయి. హీట్‌వేవ్ గరిష్ఠ స్థాయిలో ఉన్న సమయంలో ఫ్రాన్స్‌లో దాదాపు మూడు వంతుల ప్రాంతాలు రెడ్ అలర్ట్ పరిధిలో ఉండగా, మొత్తం మరణాల్లో 85 శాతం మంది 65 ఏళ్లు దాటిన వృద్ధులేనని వెల్లడించింది.

**ప్రపంచ ఆరోగ్యసంస్థ హెచ్చరిక**

ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనోమ్ గ్యాబ్రియేసస్ మాట్లాడుతూ, ప్రపంచ సగటుతో పోలిస్తే యూరప్ రెండు రెట్లు వేగంగా వేడెక్కుతోందన్నారు. ప్రస్తుతం దాదాపు 15 కోట్ల మంది వడగాడ్పుల ప్రభావంలో జీవిస్తున్నారని, వందలాది మంది మరణించారని, పాఠశాలలు మూతపడగా విద్యుత్ వ్యవస్థలపై తీవ్ర ఒత్తిడి ఏర్పడుతోందని తెలిపారు.వాతావరణ మార్పుల కారణంగా ఒకప్పుడు తరంలో ఒక్కసారి మాత్రమే సంభవించే హీట్‌వేవ్‌లు ఇప్పుడు దాదాపు ప్రతి ఏడాది కనిపిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. జూన్ 21 నుంచి ఇప్పటివరకు యూరప్‌లో అధిక ఉష్ణోగ్రతలతో సంబంధం ఉన్న 1,300కుపైగా అదనపు మరణాలు నమోదైనట్లు తెలిపారు. యూరప్‌లోని ఇళ్లు, కార్యాలయాలు, పాఠశాలలు ఇలాంటి ఉష్ణోగ్రతలను తట్టుకునేలా నిర్మించబడలేదు" అని హెచ్చరిస్తూ, ముందస్తు ప్రణాళికలు, నివారణ చర్యలు, ఆరోగ్య వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని సభ్య దేశాలకు సూచించారు.

# రేపు ఇఏపిసెట్ ఫలితాలు విడుదల

**విజయవాడ,జూన్ 28,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తోన్న ఏపీ ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఫలితాలు ఈనెల 30న విడుదల కానున్నాయి. ఈ మేరకు ఉన్నత విద్యామండలి ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రకటన మేరకు మంగళవారం ఉదయం 11 గంటలకు విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఈఏపీసెట్ ఫలితాలు విడుదల చేయనున్నారు.మే 12 నుంచి 20 వరకు ఆన్‌లైన్ విధానంలో రేపు ఈఏపీసెట్ నిర్వహించారు.ఈ ఏడాది ఈఏపీసెట్‌కు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 3.29లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో ఎంపీసీ స్ట్రీమ్‌లో 2.5 లక్షల మంది విద్యార్థులు, బైపీసీలో 70,929 మంది పరీక్షరాశారు. ఈ పరీక్షలకు సంబంధించిన ప్రిలిమినరీ కీ మే 25న విడుదల చేశారు. ఇక షెడ్యూల్ ప్రకారం ఫలితాలు జూన్ 1న ఫలితాలు విడుదల కావాల్సి ఉంది. అయితే ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులు రాసిన ఇంప్రూవ్‌మెంట్, సీబీఎస్ఈ రివ్యాల్యూయేషన్ ఫలితాల కారణంగా ఫలితాల విడుదల రెండు సార్లు వాయిదా పడింది. ఈ రెండు అడ్డంకులు తొలగిపోవడంతో ఈఏపీసెట్ ఫలితాల విడుదలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈఏపీసెట్‌లో ఇంటర్ మార్కులకు 25 వెయిటేజీ ఉంటుంది. ర్యాంకులు కేటాయించాలంటే ఇంటర్మీడియట్ మార్కులూ తప్పనిసరి. ఈ కారణంగానే విద్యార్థులు నష్టపోకూడదని ఇంప్రూవ్‌మెంట్ ఫలితాలు వచ్చేంత వరకు ఈఏపీసెట్ ఫలితాలను వాయిదా వేసింది. ఎట్టకేలకు ఫలితాలు వెలువడనుండటంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో వచ్చిన ర్యాంకు ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇంజనీరింగ్, అగ్రి, ఫార్మా కాలేజీల్లో సీట్లు కేటాయిస్తారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి, ఆరుగురికి గాయాలు



**చిట్యాల రూరల్, జూన్ 28, ప్రభాతవార్త :** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామ శివారులోని బతుకమ్మ కుంట సమీపంలో జాతీయ రహదారి65పై ఆదివారం జరిగిన ఘోరరోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరో ఆరుగురు గాయపడ్డారు. చిట్యాల ఎస్ఐ మామిడి రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం, హైదరాబాద్ నుంచి చిట్యాల వైపు వస్తున్న డీమ్యాక్స్ విక్రాస్ వాహనాన్ని వెనుక నుంచి వస్తున్న ఇన్నోవా కారు బతుకమ్మకుంట సమీపంలోని మూల మలుపు వద్ద ఢీకొట్టింది. దీంతో డీమ్యాక్స్ వాహనం టైర్ పేలి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి ఎదురువైపు రోడ్డులోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో చిట్యాల నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కియా కారు, స్విఫ్ట్ డిజైర్ కార్లను ఢీకొట్టడంతో పాటు వెనుక వస్తున్న ద్విచక్ర వాహనాన్ని కూడా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. కియా కారు పల్టీలు కొడుతూ రహదారిపై నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో స్విఫ్ట్ డిజైర్ కారులో ప్రయాణిస్తున్న నార్కట్‌పల్లి మండలం అక్కెనపల్లి గ్రామానికి చెందిన కసిరెడ్డి దేవేందర్‌రెడ్డి (52), దేప సరిత (48) మృతి చెందారు. ప్రమాద సమయంలో స్విఫ్ట్ డిజైర్ కారును దేవేందర్‌రెడ్డి నడుపుతుండగా, వెనుక సీటులో ప్రయాణిస్తున్న సరిత అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు. అదే కారులో ప్రయాణిస్తున్న శ్రీనివాస్ రెడ్డి, కసిరెడ్డి మంజుల, యాపాల మమత గాయపడగా, కియా కారులో ప్రయాణిస్తున్న మరో ఇద్దరికి కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదం కారణంగా జాతీయ రహదారి65పై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. కార్లలో చిక్కుకున్న వారిని స్థానికులు, పోలీసులు బయటకు తీసి సహాయక చర్యలు చేపట్టారు. అనంతరం క్రేన్ల సహాయంతో ప్రమాదానికి గురైన వాహనాలను రహదారి నుంచి తొలగించి ట్రాఫిక్‌ను పున రుద్ధరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# అమరావతికి పరిరక్షణ కమిటీ రావడం వెనుక కుట్ర

## రాజధాని రైతుల ఆరోపణ

**విజయవాడ,జూన్ 28,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతికి వైసీపీ సీఆర్డీఏ పరిరక్షణ కమిటీ రావడం,అనుసరణగా జరిగిన ఘటనకు వెనుక కుట్రకోణం దాగి ఉందని రాజధాని రైతులు ఆరోపించారు. అమరావతి అభివృద్ధిని అడ్డుకోవడమే వైసీపీ లక్ష్యమని ఆక్షేపించారు.రాజధాని నిర్మాణాన్ని నిలిపివేయడానికి వైసీపీ నేతల కుట్రలు నేటికీ జరుగుతున్నాయని మండిపడ్డారు. ఆదివారం అమరావతిలోని మందడంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి రాజధాని రైతులు పలు కీలక విషయాలు వెల్లడించారు. అన్నదాతల ప్రయోజనాలకు వైసీపీ నేతలు వ్యతిరేకంగా వ్యవహరించారని దుయ్యబట్టారు. అమరావతి అభివృద్ధి కొందరికి ఇష్టం లేదని చెప్పుకొచ్చారు. అమరావతిలో మాజీ మంత్రి పేర్ని నాని ఇతర వైసీపీ ముఖ్య నేతల పర్యటనపై తాము అభ్యంతరం తెలిపామన్నారు. తమను వైసీపీ రెచ్చగొట్టొద్దని పేర్కొన్నారు. అవసరమైతే కొత్త తరహా ఉద్యమానికి తాము సిద్ధమని స్పష్టం చేశారు. అమరావతి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

అవసరమైతే 10 వేల మంది రైతులతో తాడేపల్లి ప్యాలెస్‌ను, వైసీపీ కార్యా లయాలను ముట్టడిస్తామని వార్నింగ్ ఇచ్చారు. 1631 రోజుల ఉద్యమంలో వైసీపీ నాయకులు ఎందుకు తమను పరామర్శించలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు కవ్వింపు చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు.తమపై టీడీపీ వారు దాడి చేశారనే ఆరోపణలు అవాస్తవమని అమరావతి రైతన్నలు అన్నారు. రాజధానిపై వైసీపీ కుట్రలు కొనసాగితే గట్టిగా బుదులిస్తామని అమరావతి రైతులు హెచ్చరించారు.

# రూ.20 కోట్లు ఇవ్వకపోతే లేపేస్తాం: బిష్ణోయ్‌గ్యాంగ్ వార్నింగ్



**ముంబయి,జూన్ 28:**బాలీవుడ్ దర్శకుడు రోహిత్ శెట్టికి గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి తీవ్రమైన హెచ్చరికలు అందాయి. రూ. 20 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దుండగులు ఒక ఆడియో క్లిప్ పంపారు. ఈ ఘటన బాలీవుడ్‌లో తీవ్ర కలకలం రేపింది. కొద్ది నెలల క్రితం ఆయన ఇంటిపై కాల్పులు జరిగిన నేపథ్యంలో ఈ తాజా పరిణామం ఆందోళన కలిగిస్తోంది. ముందురోజు ఉదయం రోహిత్ శెట్టి సిబ్బందికి సుమారు 90 సెకన్ల నిడివి గల ఆడియో క్లిప్ వచ్చింది. అందులో "ఫిబ్రవరిలో మీ ఇంటిపై జరిపిన కాల్పులు కేవలం ట్రైలర్ మాత్రమే. డిమాండ్ చేసిన రూ. 20 కోట్లు ఇవ్వకపోతే ఈసారి బుల్లెట్లు నేరుగా నీకే తగులుతాయి" అని గ్యాంగ్‌స్టర్లు హెచ్చరించారు. ఈ వాయిస్, లారెన్స్ బిష్ణోయ్ ముఖ్య అనుచరుడిగా భావిస్తున్న శుభం లోంకర్‌దిగా పోలీసులు అనుమానిస్తున్నారు. 2024లో జరిగిన నేత బాబా సిద్ధిఖీ హత్య కేసుతో పాటు రోహిత్ శెట్టి ఇంటిపై కాల్పుల కేసులో కూడా శుభం లోంకర్ నిందితుడిగా ఉన్నాడు. రోహిత్ శెట్టి సిబ్బంది ఈ ఆడియో క్లిప్‌ను ముంబై క్రైం బ్రాంచ్ పోలీసులకు అందజేశారు. ఈ కాల్పుల ఘటనపై ముంబై క్రైం బ్రాంచ్ ఏప్రిల్‌లో 1,624 పేజీల చార్జిషీట్‌ను దాఖలు చేసింది. ఇందులో 15 మందిని నిందితులుగా పేర్కొనగా, ప్రవీణ్ లోంకర్, ఆర్జో బిష్ణోయ్‌లను పరారీలో ఉన్న వారిగా ప్రకటించారు. ఈ కేసు దర్యాప్తు జరుగుతుండగానే, అదే గ్యాంగ్ నుంచి మరోసారి బెదిరింపులు రావడం గమనార్హం.

# సముద్ర స్నానానికి వెళ్లిన ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు మృతి

**సంతబొమ్మాళి (శ్రీకాకుళం జిల్లా), జూన్ 28 ప్రభాతవార్త:** శ్రీకాకుళంజిల్లా సంతబొమ్మాళి మండలం భావనపాడు సముద్రపుబీచ్‌లో ఆదివారం ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు స్నానానికి వెళ్లి మృతి చెందారు. టెక్కలి ఐతం ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న ఏడుగురు విద్యార్థులు భావనపాడు వెళ్లి సముద్రంలో స్నానానికి దిగారు. వీరిలో విశాఖపట్నంజిల్లా కశింకోటకు చెందిన గోరివుంకల అగస్త్య (19), విజయనగరం జిల్లా మెరక ముడిదాం గ్రామానికి చెందిన సారపెంట యశ్వంత్ (18) సముద్రంలో అలల ఉధృతికి కొట్టుకుపోయి మృతిచెందారు. ఈ ఇద్దరిలో భావనపాడుసముద్రపు ఒడ్డుకు ఓ విద్యార్థి మృతదేహం చేరగా,వజ్రపుకొత్తూరు మండలం అల్లాడ సముద్రపు ఒడ్డుకు మరో విద్యార్థి మృతదేహం కొట్టుకు వచ్చింది.మరో విద్యార్థి జజ్జన అభిలాష్ కెరటాలలో కొట్టుకుని ఉక్కిరిబిక్కిరి అవుతున్న సమయంలో మెరైన్ పోలీసులు ప్రాణాలతో ఒడ్డుకు తీసుకునివచ్చి రక్షించారు. నౌపడఎస్సై నారాయణ స్వామి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# లారీని ఢీకొన్న కారు: ఒకరు మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు

## మంచిర్యాల-చెన్నూర్ జాతీయ రహదారిపై ప్రమాదం

**జైపూర్, జూన్ 28, ప్రభాతవార్త :** మంచిర్యాల జిల్లాలోని మంచిర్యాల -చెన్నూర్ జాతీయ రహదారిపై శ్రీరాంపూర్ జీఎం కార్యాలయ సమీపంలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి వెంకటసాయి (18) సంఘటనా స్థలంలో మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. జైపూర్ ఎస్సై భూమేష్ తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాలలో నివాసం ఉంటున్న పద్మ శ్రీనివాస్ వారి కుమారుడు వెంకటసాయి, మృతుడి నాయినమ్మ ఉదయలక్ష్మి నలుగురు కలిసి వారి ఆటోకారులో పెద్దపల్లిలో శుభకార్యానికి హాజరై తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో సాయంత్రం ఇందారం ఎక్స్ రోడ్ దాటిన కొద్ది దూరంలో లారీ ఎలాంటి ట్రాఫిక్ నియమాలు పాటించకుండా అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా నిలిపి ఉండడం వలన కారు నడుపుతున్న కారు డ్రైవర్ శ్రీనివాస్ లారీని గమనించకపోవడం వల్ల లారీ వెనుకభాగానికి ఢీ కొనడంతో ముందు సీటులో కూర్చుని ఉన్న వెంకటసాయి అక్కడికక్కడే మృతి చెందాడని, మిగిలిన ముగ్గురికి తీవ్రగాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుని తల్లిదండ్రులు వృత్తిరీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయులు. మృతుడి తల్లి నరేందులపద్మ ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.





ప్రమాదానికి గురైన కారు. వెంకటసాయి (ఫైల్)

# ద్విచక్ర వాహనాలు ఢీ: ఇరువురు మృతి

**రేపల్లె (బాపట్లజిల్లా), జూన్ 28, ప్రభాతవార్త:** బాపట్ల జిల్లా రేపల్లె మండలం పెనుమూడి రోడ్‌లో ఆదివారం మధ్యాహ్నం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో కృష్ణా జిల్లాకు చెందిన ఇరువురు అక్కడికక్కడే మృతి చెందారు. కృష్ణా జిల్లా కోడూరు మండలంలోని ఈరాల గ్రామానికి చెందిన గంజాల బాపనయ్య(37) తన భార్య నాంచారమ్మ,కుమారుడు సంతోష్‌కుమార్ తో కలిసి ఎపి39కెవై7236 నెంబరు గల మోటారు బైక్‌పై రేపల్లెలోని బంధువులు ఇంటికి బయల్దేరాడు. రేపల్లె పట్టణం నుండి కృష్ణా జిల్లాలోని స్వగ్రామమైన చల్లపల్లికి వెళ్తూ రాంగ్ రూట్‌లో వేగంగా వచ్చి ఎపి40ఇటి 2998 నెంబరు గల బైక్‌ను నడిపిన రాకేష్ ఎదురుగా వస్తున్న బాపనయ్య బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో కాకి రాకేష్(27), గంజాల బాపనయ్య అక్కడికక్కడే మృతి చెందారు. ఈ రెండు మోటార్ బైక్‌లపై ప్రయాణిస్తున్న గంజాల నాంచారమ్మ, గంజాల సంతోష్‌కుమార్,ప్రకాష్‌లు గాయపడ్డారు. నాంచారమ్మ,సంతోష్‌కుమార్‌లను చికిత్స నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు,ప్రకాష్‌ను తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.సంఘటనా ప్రదేశాన్ని రేపల్లెటౌన్ సిఐ బి.అశోక్‌కుమార్ పరిశీలించారు.మృతుడు గంజాల బాపనయ్య సతీమణి నాంచారమ్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ వెల్లడించారు.

29skl13:29skl13.qxd 28-06-2026 22:58 Page 1



## పల్స్‌పోలియో విజయవంతం



**ఇచ్ఛాపురం, జూన్ 28, ప్రభాతవార్త:**

ఈదుపురం సచివాలయం ఆవరణలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో చిన్నారులకు పోలియో చుక్కలు నియోజకవర్గ యూత్ వైస్సార్సీపీ అధ్యక్షుడు నర్తు ప్రేమ్ కుమార్ యాదవ్ అందించారు. ఈ కార్యక్రమంలో పీ హెచ్ సి డాక్టర్ అనపాన రమ్య, ఫిషర్ మెన్ కమ్యూనిటీ జిల్లా అధ్యక్షులు మొండలో మోహన్ బెహరా, రఘు బెహరా, గస్యా బోనమాలి బెహరా తోఖిరో బెహరా, దువ్వ భాస్కర్ రెడ్డి, ఉప్పాడ జగదీష్ రెడ్డి, ఉదయ్ బెహరా సిబ్బంది కొండక కమ, పార్వతి, విమల తదితరులు పాల్గొన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 2583 మంది చిన్నారులకు 23 కేంద్రాల్లో పోలియో చుక్కలు వేసినట్లు దక్కత కృష్ణమూర్తి రెడ్డి చెప్పారు.

## నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు



**ఆమదాలవలస, జూన్ 28, (ప్రభాతవార్త):**

పోలియో నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత తెలిపారు. ఆమదాలవలస పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. పోలియో రహిత భారత్ కోసం మనమంతా కలిసి ముందుకు పోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు. పుట్టిన చిన్నారుల నుంచి ఐదు సంవత్సరాల లోపు వయసు కలిగిన అందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలన్నారు. ఈ రెండు చుక్కల వలన పోలియో వంటి ప్రాణాంతక వ్యాధి నుండి రక్షణ పొందవచ్చునని సూచించారు. ప్రతి చిన్నారి ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన రక్షణ కల్పిస్తుందన్నారు. వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## కేపిఎల్ క్రికెట్ టోర్నమెంట్ విజేత 'భావనపాడు'



**సంతబొమ్మాళి, జూన్ 28 ప్రభాతవార్త:**

దండుగోపాలపురం హైస్కూల్ మైదానంలో నిర్వహించిన కింజరాపు ప్రీమియర్ లీగ్ (కేపీల్) సీజన్-1 క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోటీలో భావనపాడు జట్టు విజేతగా నిలవగా, కొత్తూరు జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేత, రన్నరప్ జట్లకు బహుమతులను సంతబొమ్మాళి మండల టీడీపీ అధ్యక్షుడు సుగ్గ శాంతిస్వరూప్ రెడ్డి, మండల పార్టీ నాయకులు, పెద్దల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా విజేత జట్టును అభినందిస్తూ, క్రీడాస్ఫూర్తితో ఆడిన అన్ని జట్లను ప్రశంసించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి క్రీడా పోటీలు యువతలో ప్రతిభను వెలికి తీసి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, క్రీడాకారులు, యువకులు, పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## నిండు జీవితానికి...రెండు చుక్కలు



**కంచిలి, జూన్ 28 ప్రభాతవార్త**

రెండు చుక్కలు వేస్తే నిండు జీవితంలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఉంటుందని శ్రీరాంపురం మాజీ సర్పంచ్ తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు మాదిన రామారావు అన్నారు. పల్స్ పోలియో ప్రత్యేక కార్యక్రమం సందర్భంగా ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలియో కార్యక్రమంలో చిన్నారులకు రెండు చుక్కలు పోలియో మందులు వేశారు. అలాగే ఎంపీడీవో వి.తిరుమలరావు కంచిలిలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రంలో చుక్కలు వేశారు. జెడ్పిటిసి ప్రతినిధి ఇప్పిలి లోలాక్షి కృష్ణారావు రైల్వే స్టేషన్లో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రంలో, కొల్లూరు పంచాయతీలో ఐటీడీపీ అధ్యక్షులు వాసాల రమేష్ చిన్నారులకు చుక్కలు వేశారు.

## టెక్కలిలో ఘనంగా పల్స్ పోలియో కార్యక్రమం



**టెక్కలి, జూన్ 28, ప్రభాతవార్త:**

రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా టెక్కలి పట్టణంలో పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్‌తో పాటు పలు పోలియో కేంద్రాలను టెక్కలి బీజేపీ మండల అధ్యక్షులు జర్జాన రాంజీ పరిశీలించారు. కేంద్రాల్లో జరుగుతున్న ఏర్పాట్లను సమీక్షించిన అనంతరం చిన్నారులకు పోలియో చుక్కలు వేయించడం జరిగింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు జర్జాన రాంజీ మాట్లాడుతూ ప్రతి తల్లి తండ్రి తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, ఆరోగ్యవంతమైన భారతదేశ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరి బాధ్యతగా దీనిని భావించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నడుపూరి లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి గుణ మీనాకుమార్, మండల ఉపాధ్యక్షులు ఆకుల ప్రకాష్, పెట్ట రామ్మోహన్‌రావు, పోలాకి ఈశ్వర్, లవకుమార్, కూన రమణ , తదితరులు పాల్గొన్నారు.

## సమాజ సేవకు దక్కిన అవార్డు




**ఆమదాలవలస, జూన్ 28, (ప్రభాతవార్త) :**

ఆమదాలవలస పట్టణానికి చెందిన కృత్తిక్ ఫౌండేషన్ పేదలకు చేస్తున్న సమాజ సేవలను గుర్తించి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అవార్డును అందించింది. శ్రీకాకుళం పట్టణంలో ఆదివారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృత్తి ఫౌండేషన్ చైర్మన్ చిగురుపల్లి వెంకటేష్(చిన్ను) సేవలను గుర్తించి రెడ్ క్రాస్ సొసైటీ అవార్డు ప్రధానోత్సవం చేశారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, పేదలకు అన్న, వస్త్రధానాలు, ఇతర సేవా కార్యక్రమాలు, సమాజ సేవ కోసం చేయడంలో ప్రముఖ పాత్ర పోషిస్తుంది. ఈ సేవలను గుర్తించి ఈ అవార్డును అందించడం జరిగిందని ఫౌండేషన్ చైర్మన్ వెంకటేష్(చిన్ను) తెలిపారు. ఈ అవార్డుతో సమాజ సేవ చేసేందుకు మరింత బాధ్యత పెరిగిందని, రానున్న రోజుల్లో అందరు సహకారంతో మరిన్ని సేవలను విస్తరింప చేయడం జరుగుతుందన్నారు. అవార్డు ప్రధానోత్సవంలో రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, సెక్రటరీ దుర్గ శ్రీనివాస్ ఉన్నారు. వెంకటేష్ ప్రశంసాపత్రం అందుకోవడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## గణేష్ ఉత్సవాల విశిష్టతను చాటాలి



**శ్రీకాకుళం, జూన్ 28, ప్రభాతవార్త :**

భారతీయ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా, గణేష్ ఉత్సవాల విశిష్టతను చాటి చెప్పేలా నూతన కార్యవర్గ సభ్యులు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గణేష్ ఉత్సవ సమితి సభ్యులు ఆచార్య విష్ణుమూర్తి పిలుపు నిచ్చారు. శ్రీకాకుళంలో ఆదివారం జిల్లా గణేష్ ఉత్సవ సమితి ప్రథమ సర్వసభ్య సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గంతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించి, ఉత్సవ సమితి బాధ్యతలపై దిశా నిర్దేశం చేశారు. 2026 సంవత్సరానికి గాను జిల్లా గణేష్ ఉత్సవ సమితి నూతన అధ్యక్షులుగా బుర్రా ఆదినారాయణ శాస్త్రి, కార్యదర్శిగా గొద్దు భాస్కర రావు, కోశాధికారిగా చార్టర్డ్ అకౌంటెంట్ ఇప్పిలి కృష్ణా రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఉత్సవాల విజయవంతానికి నూతన కార్యవర్గం సమన్వయంతో ముందుకు సాగాలని జిల్లా సమితి ఆధ్యాత్మిక సలహాదారులు బ్రహ్మశ్రీ ధర్మపురి గౌరీ శంకర శాస్త్రి సూచించారు. కార్యాలయ కార్యదర్శిగా సంపతిరావు వెంకట రమణ మూర్తి, మీడియా కార్యదర్శిగా వీర్ల నాగేశ్వర రావు, ప్రభుత్వ సంబంధాల కార్యదర్శిగా డాక్టర్ భగత్ శేషగిరి రావు, సాంస్కృతిక కార్యక్రమాల కార్యదర్శిగా జలుమూరు వెంకటేశ్వర రావులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం నగర గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు వీనస్ హరి, ఆమదాలవలస మండల అధ్యక్షులు వెంకుబాబు, శ్రీకాకుళం రూరల్ మండల అధ్యక్షులు ఈదు శ్రీనివాసరావు, ఎచ్చెర్ల మండల అధ్యక్షులు కర్రి ప్రేమకుమార్, నీలం రాజు, తదితరులు పాల్గొని నూతన బాధ్యులకు అభినందనలు తెలిపారు.

## రెండు చుక్కలతో చిన్నారుల ఆరోగ్య భద్రత



**కవిటి, జూన్ 28, ప్రభాతవార్త:**

దేశ వ్యాప్తంగా నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా మండలంలోని శిలగాంలో ఆదివారం మండల పరిషత్ అధ్యక్షురాలు కడియాల పద్మ , కడియాల ప్రకాష్ ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, 'నిండు జీవితానికి రెండు చుక్కలు' అనే నినాదాన్ని ప్రతి తల్లిదండ్రులు గుర్తుంచుకుని, ఐదేళ్లలోపు ఉన్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. పోలియో వ్యాధి నిర్మూలనలో ప్రతి కుటుంబం భాగస్వాములు కావాలని, వైద్య ఆరోగ్యశాఖ నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, కొర్రాయి గోపాల్, మామిడి తులసయ్య, సీపాన నారాయణ, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**కంచిలి, జూన్ 28, ప్రభాతవార్త :**

మండలంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎంఎస్ పల్లి సబ్ స్టేషన్ పరిధిలో గల పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పలాస డివిజనల్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలేరు ఫీడర్‌లో విద్యుత్ మరమ్మతుల కారణంగా బైరిపురం, పోలేరు, కుమ్మరినౌగాం, రేఖాదేవిపురం, డీజీపురం, నారాయణపేట గ్రామాలకు విద్యుత్ ఉండదని తెలిపారు. విద్యుత్ వినియోగదారులంతా సహకరించవలసిందిగా కోరారు.

## వీరఘట్టంలో పల్స్ పోలియో విజయవంతం



**వీరఘట్టం, జూన్ 28, ప్రభాతవార్త :**

మండలంలోని వీరఘట్టం, బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైనట్లు వైద్యాధికారులు బి.ప్రదీప్ కుమార్, పి.గణేష్, గౌతమ్‌లు విలేకరులకు తెలిపారు. వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలోనే 4712 మంది పిల్లలకు గాను 4219 మందికి పల్స్ పోలియో చుక్కలు వేసినట్లు ఆయన తెలిపారు. బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 2922 మంది పిల్లలకు గాను 2979 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయడంతో శతశాతం నమోదు అయినట్లు వైద్యాధికారి గణేష్ గౌతమ్ తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు, ఎంఎల్ హెచ్పిలు, ఏఎన్‌ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా బొజ్జ తారకం 87వ జయంతి



**టెక్కలి, జూన్ 28, ప్రభాతవార్త**

ప్రముఖ హైకోర్టు న్యాయవాది, అణగారిన వర్గాల ఆశాజ్యోతి బొజ్జ తారకం 87వ జయంతిని సమతా సైనిక్ దళ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో టెక్కలిలో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చల్లా రామారావు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల తాడితి పీడిత ప్రజల సమస్యలపై నిరంతరం న్యాయ పోరాటం చేసిన యోధుడు బొజ్జ తారకం అని అన్నారు. దళిత ఆదివాసీల హక్కుల కోసం అనేక పోరాటాలు చేసి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్‌ని కత్తి పద్మారావుతో కలిసి సాధించిన మహనీయుడు బొజ్జ తారకం అని అన్నారు. సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖరావు మాట్లాడుతూ అణగారిన వర్గాల ప్రజల కోసం అనేక త్యాగాలు చేసి హక్కులు సాధించిన ధీరుడు బొజ్జ తారకం అని అన్నారు. కార్యక్రమంలో అక్కురాడ మాధవరావు, డిగ్రీ కాలేజ్ లెక్చరర్ గంగరాపు, కసవయ్య, తమ్మినేని వైకుంఠరావు, సీమల నీలాచలం, పేరా నాగేశ్వరరావు , తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో చుక్కలు వేసిన ఎంపిడిఓ



**జలుమూరు, జూన్ 28, ప్రభాతవార్త:**

మండలంలోని జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంనకు స్థానిక ఎంపీడీవో బంట్రోతు చిన్నమ్మడు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలను జలుమూరులో వేశారు. జలుమూరు 95%, సైరిగాం 98%, అచ్చుతాపురం 100% వైద్యాధికారులు గొలివి సుజాత, పి.గురునాథరావు, పూజారి సుజాత పల్స్ పోలియో చుక్కలను ఆదివారం వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు అహల్య, హేమలత, ప్రసన్నలక్ష్మి, మండల విద్యాశాఖ అధికారి బమ్మిడి మాధవరావు, ఎం పి హెచ్ ఈ ఓ సోమేశ్వరరావు,హెచ్ ఎస్ చిన్నరాజులు, చిన్నారావు, ఏఎనఎంలు, అంగన్వాడి కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

## వైసీపీ నాయకులపై దాడులు.. తిలక్ తీవ్ర ఆగ్రహం




**టెక్కలి, జూన్ 28, ప్రభాతవార్త**

అమరావతిలో వైసీపీ నాయకులపై టీడీపీ దాడులు పట్ల వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గం ఇంచార్జ్ పేరాడ తిలక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడులకు చంద్రబాబు నాయుడు తెలుగుదేశం పార్టీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని తిలక్ హెచ్చరించారు. తిలక్ ఆదివారం టెక్కలిలో విలేకరులతో మాట్లాడారు. అమరావతి రైతుల కోరిక మేరకు నష్టపోయిన రైతులకు న్యాయ సహాయం అందిస్తానని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. రైతుల కోరిక మేరకు జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో అమరావతి రైతుల కష్టాలు తెలుసుకునేందుకు, అమరావతిలో జరుగుతున్న అవినీతిని బయట పెట్టేందుకు అమరావతి వెళ్లిన వైఎసఆర్సిపి నాయకులు పేర్ని నాని, లేళ్ల అప్పిరెడ్డి, అంబటి రాంబాబు, దేవినేని అవినాష్‌లపై టిడిపి గుండాలు మహిళలను ముందు పెట్టి పెద్ద పెద్ద బండరాళ్లతోనూ కోడిగుడ్లతోనూ పోలీసులు సమక్షంలో దాడులకు పాల్పడ్డారు. అమరావతిలో అవినీతి బయటపడుతుందనే భయంతో దానిని కప్పిపుచ్చుకోవడానికి డైవర్షన్ పాలిటిక్స్‌కి చేస్తున్నారు. చంద్రబాబు నాయుడు డైరెక్షన్లో లోకేష్ దగ్గరుండి ఈ దాడులకు ఉసిగొల్పారు. రైతుల కష్టాలు తెలుసుకునేందుకు వెళ్తే దాడులకు పాల్పడతారా... రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా.. అమరావతిలో పూర్తి దోపిడీ రాజ్యం కొనసాగుతోంది.. మెట్రోపాలిటన్ సిటీలలో చదరపు అడుగు నిర్మాణానికి 4500 ఖర్చు అవుతుంటే అమరావతిలో 20 వేల రూపాయలు ఖర్చు పెడుతూ ప్రజాధనాన్ని తెలుగుదేశం నాయకులు దోచుకుంటున్నారు. అమరావతి నిర్మాణానికి లక్ష ఎకరాలు భూమి రెండు లక్షల కోట్లు అవసరం. మావిగన్ కి 20,000 కోట్లు ఉంటే సరిపోతుంది. వైఎసఆర్సిపి ప్రశ్నిస్తుంటే భయపడి దాడులకు పాల్పడుతున్నారు. ఎన్ని దాడులు చేస్తున్న ప్రజల పక్షాన రైతుల పక్షాన వైఎస్ఆర్సిపి పోరాడుతుంది.

## రెండు చుక్కలతో పోలియో మహమ్మారిని తరిమేద్దాం



**కోటబొమ్మాళి, జూన్ 28 ,ప్రభాతవార్త:**

రెండు పోలియో చుక్కలతో పోలియో మహమ్మారిని తరిమేద్దామని రాష్ట్ర కళింగకోమటి కార్పొరేషన్ అధ్యక్షులు బోయిన గోవిందరాజులు పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం కోటబొమ్మాళి పంచాయతీలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అలాగే మండలం తిలారు పీహెచ్సీ కేంద్రంలో మాజీ ఎంపీపీ తర్ర రామక్రిష్ణ, డాక్టర్ మనీషాతో కలిసి పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. 0 నుంచి 5 సంవత్సరాలు లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేసి దేశం నుంచి పోలియోను తరిమి కొట్టి పోలీయో రహితసమాజం నిర్మిద్దామని ఆయన పిలుపునిచ్చారు. అలారు, కొత్తపల్లి, నిమ్మాడ పీహెచ్సీల పరిధిలో చిన్నారులకు పలో పోలియో చుక్కలు వేయటం జరిగిందని వైద్యులు మనీషా, వరుణ్‌లు తెలిపారు. సరియాపల్లిలో పిఎసిఎస్ అధ్యక్షులు వెలమల విజయలక్ష్మి కామేశ్వరరావు, కొత్తపల్లిలో దుబ్బ శివాజీ నాయుడు, కురుడులో జి.నరసింగరావు, కిస్టుపురంలో పాగోటి ముత్తు రాజు, పాకివలసలో చింతల సింహాచలం తదితరులు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

## భావనపాడు బీచ్‌లో ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు మృతి



**సంతబొమ్మాళి, జూన్ 28, ప్రభాతవార్త**

మండలం భావనపాడు సముద్రపు బీచ్‌లో ఆదివారం ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు స్నానానికి వెళ్లి సముద్రంలో కొట్టుకుపోయి మృతి చెందారు. టెక్కలి ఐతం ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న ఏడుగురు విద్యార్థులు భావనపాడు వెళ్లి సముద్రంలో స్నానానికి దిగారు. వీరిలో విశాఖపట్నం జిల్లా కశింకోటకు చెందిన గోరివుంకల అగస్త్య (19) బిటెక్ ఫస్ట్ ఇయర్ విద్యార్థి, విజయనగరం జిల్లా మెరకముడిదాం గ్రామానికి చెందిన సారపెంట యశ్వంత్ (18) బీటెక్ ఫస్ట్ ఇయర్‌లు సముద్రంలో అలల ఉధృతికి కొట్టుకుపోయి మృతి చెందారు. ఈ ఇద్దరిలో భావనపాడు సముద్రపు ఒడ్డుకు ఓ విద్యార్థి మృతదేహం చేరగా, వజ్రపుకొత్తూరు మండలం అల్లాడ సముద్రపు ఒడ్డుకు మరో విద్యార్థి మృతదేహం కొట్టుకు వచ్చింది. మరో విద్యార్థి జజ్జన అభిలాష్ కెరటాలలో కొట్టుకుని ఉక్కిరిబిక్కిరి అవుతున్న సమయంలో, భావనపాడు మెరైన్ పోలీసులు ప్రాణాలతో ఒడ్డుకు తీసుకుని వచ్చి రక్షించారు. నౌపడ ఎస్సై నారాయణస్వామి పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక



**శ్రీకాకుళం, జూన్ 28, ప్రభాతవార్త:**

నేడు (సోమవారం) ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నేరుగా పై కార్యక్రమంలో లేదా ఆన్లైన్‌లో మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చునని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిషత్ పాత సమావేశ మందిరంలో రెవెన్యూ క్లినిక్ ఉంటుందని, ప్రజలు గమనించి రెవెన్యూ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్జీదారుల అర్జీల నమోదు, నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం గూర్చి తెలుసుకోవాలంటే 1100 కి నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు. అర్జీదారులు గమనించి నేడు నిర్వహించే ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# శ్రీకాకుళం వార్త



## మొదటి ఉద్యమ సన్నద్ధం సభకు ఎన్‌జీజీఓస్ జేఏసీ మద్దతు కోరిన ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ ?



**శ్రీకాకుళం, జూన్ 28, ప్రభాతవార్త :**

ఏపీ జేఏసీ అమరావతి ఉద్యమ కార్యాచరణలో భాగంగా జులై 12 వ తేదీన శ్రీకాకుళంలో జరుగు మొదటి ఉద్యమ సన్నద్ధం సభ విజయవంతం చేయడానికి గాను జిల్లా చైర్మన్ బి.వి.వి.ఎన్ రాజు నేతృత్వంలోని బృందం ఆదివారం ఎన్‌జిజిఓస్ అధ్యక్షులు మరియు జేఏసీ చైర్మన్ హనుమంతు సాయిరాం, జనరల్ సెక్రటరీ సిచ్.శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.వేణు మొదలగు కార్యవర్గాన్ని ఎన్‌జిఓ హోమ్‌లో కలసి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను సాధించడం కొరకు చేస్తున్న ఉద్యమ కార్యాచరణకు మీ యొక్క సంపూర్ణ మద్దతు అందజేయాలని కోరుతూ మొదటి ఉద్యమ సన్నద్ధం సభకు తప్పక హాజరు కావాలని కోరడమైనది. అందుకు చైర్మన్ సాయిరాం మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు సాధించడం కోసం మీరు చేస్తున్న ఉద్యమానికి మా యొక్క సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని, జిల్లాలో అందరం ఉద్యోగులము కలసి ఐక్యంగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. అదేవిధంగా స్థానిక రెవెన్యూ గెస్ట్ హౌస్ నందు సమగ్ర శిక్షణలో పని చేస్తున్న ఆర్ట్, క్రాఫ్ట్, పిఈటి యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం అధ్యక్షులు సి.హెచ్. శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. అందరు ఉద్యోగులు బొప్పరాజు నాయకత్వంలో ఉద్యమ కార్యాచణకు మద్దతు నిస్తూ ఆచరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ జేఏసీ అమరావతి శ్రీకాకుళం జిల్లా చైర్మన్ బి.వి.వి.ఎన్.రాజు, జనరల్ సెక్రటరీ ఎస్.వి.రమణ, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి జి.అరుణ కుమారి, జిల్లా కార్యదర్శి డి.సోని కిరణ్, జాయింట్ సెక్రటరీ ఎం.గౌరీశంకర్, ఇసి మెంబర్ సి.హెచ్.దామోదరరావు, శ్రీకాకుళం డివిజన్ యూనిట్ అధ్యక్షులు ఎస్.కిరణ్ కుమార్, కార్యదర్శి డి.ప్రకాశరావు, గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.గోవిందరావు, వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు డి.రాజేష్, కార్యదర్శి బి.రాంజీ, ట్రెజరర్ జి.ఢిల్లేశ్వరరావు, ఏపీ డబ్ల్యుఎపి యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు జి.కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## కవిటి జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

### అక్కడికక్కడే ముగ్గురు మహిళలు మృతి ... మద్యం సేవించి లారీ నడిపిన డ్రైవర్



**కవిటి, జూన్ 28, ప్రభాతవార్త :**

మండలం జమేదారిపుట్టుగ జాతీయ రహదారి సమీపంలో ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే ముగ్గురు మహిళలు మృతి చెందారు. లారీ డ్రైవర్ మద్యం సేవించి వాహనాన్ని అతి వేగంగా నడపడమే ప్రధాన కారణంగా తెలియ వచ్చింది. కంచిలి మండలం మకరాంపురం వద్ద ఆదివారం సంత నుంచి పనసకాయ లోడుతో బరంపురం వెళుతుండగా ఈ ప్రమాదం సంభవించినట్లు విశ్వసనీయ సమాచారం. సంత నుంచి పనస కాయలు కొని బరంపురం తరలించే క్రమంలో ఇచ్ఛాపురం ఎసఎన్ పేటకు చెందిన మద్దిలి తరినమ్మ (62), కవిటి మండలం గుజ్జుపుట్టుగ గ్రామానికి చెందిన మురపాల పార్వతి (50) అలానే రాపాకపుట్టుగ గ్రామానికి చెందిన నర్తు పద్మమ్మ (60) మినీ వాహనంపై బరంపురం వైపు వెళుచుండగా వెనుక వైపు నుంచి వస్తున్న లారీ డ్రైవర్ మద్యం సేవించి అప్రమత్తంతో వాహనాన్ని నడిపే క్రమంలో మినీ వాహనానికి లారీ బలంగా ఢీకొంది. మినీ వాహనం విద్యుత్ స్తంభానికి ఢీకొని తునాతునకలై పక్కన పక్కనే ఉన్న పొలాల్లోకి గాలిలోకి ఎగిరింది. తరినమ్మ, మురపాల పార్వతి, ఎన్ పద్మమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్ తో పాటు మరో ముగ్గురు గాయాల పాలయ్యారు. మిగిలిన వారిలో ఒకరు పరిస్థితి ఇబ్బందికరంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బరంపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న కవిటి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పల్స్ పోలియోలో పాల్గొన్న యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు



**శ్రీకాకుళం, జూన్ 28, ప్రభాతవార్త :**

శ్రీకాకుళం పట్టణంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో రోగనిరోధక టీకాల కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలోని యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమం విజయవంతం కావడానికి తమ వంతు సేవలను అందించారు. ఈ కార్యక్రమానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, శ్రీకాకుళం జిల్లా శాఖ చైర్మన్ పి.జగన్ మోహన్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ చైర్మన్ మాట్లాడుతూ, 'ప్రతి చిన్నారికి రెండు చుక్కలు-పోలియో రహిత భారతదేశానికి మనందరి బాధ్యత" అని పిలుపునిచ్చారు. అలాగే కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శివ శంకర్, డా. ఎన్.అప్పన్న, బి.చిన్నమయ్యారావు, జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులు, రెడ్ క్రాస్ జిల్లా మేనేజర్ రమణ, యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు మరియు రెడ్ క్రాస్ సిబ్బంది ఉమా శంకర్, జగదీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాలంటీర్లు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించే కార్యక్రమంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ, కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు సహకరించారు.

## చిన్నారుల భవిష్యత్తుకు పోలియో చుక్కలే శ్రీరామరక్ష



**శ్రీకాకుళం, జూన్ 28, ప్రభాతవార్త:**

ఐదేళ్ల లోపు వయసున్న చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి వారి ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు తల్లిదండ్రులు పునాది వేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ అనిత పిలుపునిచ్చారు. స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీలోని అంబేద్కర్ భవన్ వద్ద ఆదివారం ఉదయం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆమె అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిత మాట్లాడుతూ జిల్లాలో వంద శాతం పోలియో నిర్మూలనే లక్ష్యంగా వైద్య ఆరోగ్య శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని స్పష్టం చేశారు. మొదటి రోజు నిర్దేశిత బూత్‌లలో చుక్కల మందు వేస్తామని, ఏదైనా అనివార్య కారణాల వల్ల రా లేకపోయిన పిల్లల కోసం తదుపరి రెండు రోజుల పాటు సిబ్బంది నేరుగా ఇంటింటికీ వచ్చి వ్యాక్సిన్ వేస్తారని పేర్కొ న్నారు. ఈ బృహత్తర కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి రాందాస్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ స్వరూప్ పాల్గొని సాంకేతిక అంశాలను పర్యవేక్షించారు. వారితో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మంత్రి వెంకటస్వామి, రోటరీ క్లబ్ ప్రతినిధి నటుకుల మోహన్ తదితరులు హాజరై చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. జిల్లా వ్యాప్తంగా గుర్తించిన లక్షిత చిన్నారులందరికీ ఈ మూడురోజుల పాటు సాగే మహాయజ్ఞంలో వ్యాక్సిన్ అందేలా క్షేత్రస్థాయి సిబ్బంది చొరవ చూపాలని అధికారులు ఈ సందర్భంగా సూచించారు.

## పోలియో రహిత సమాజమే ప్రభుత్వ లక్ష్యం : కోండ్రు



**రాజాం, జూన్ 28, ప్రభాతవార్త:**

పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, అంగవైకల్యాన్ని నివారించి చిన్నారుల ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం ప్రతి ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సంతకవిటి మండలం, కావలి గ్రామంలో, జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో ఆయన పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోండ్రు మాట్లాడుతూ సమాజ భవిష్యత్తు చిన్నారుల ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుందని, పోలియో నిర్మూలన విజయాన్ని శాశ్వతంగా నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. భవిష్యత్ తరాలను వికలాంగత నుంచి రక్షించే ఈ సామాజిక బాధ్యతలో అధికారులు, వైద్య, అంగన్వాడీ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఐదేళ్ల లోపు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసేలా ఏర్పాట్లు చేసారు. పల్స్ పోలియో కేంద్రాలకు చిన్నారులను తీసుకువచ్చి తల్లిదండ్రులు పోలియో చుక్కలు వేయించారు. కార్యక్రమంలో గట్టి భాను, గురవాణ నారాయణ రావు, మహేష్,దుప్పల పూడి శ్రీను,రామోజీరావు, అమర్నాథ్, బాబురావు,హరీష్,దూబ ధర్మారావు తదితర కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

29 -5Pg9th chel.qxd:29 -5Pg9th chel.qxd 1/1/02 6:06 AM Page 1



# తోట పనితో ప్రశాంతత



కొన్ని దశాబ్దాలుగా ఆహారం కోసం మాత్రమే పెంచే ఇంటి తోట, ఆధునిక కాలంలో అలంకరణ ప్రాయంగానూ మారింది. ఏదేమైనప్పటికీ చిన్నాపెద్దా అంతా తోటపనిలో పాలుపంచుకుంటు న్నారు. గార్డెనింగ్‌తో శారీరక ప్రయోజనాలతో పాటు, మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని అధ్యయనాలూ చెబుతున్నాయి. మొక్కల చుట్టూ తిరుగుతూ పని చేయడం వల్ల మనకు తెలియకుండానే శరీరానికి చిన్నపాటి వ్యాయామం అయిపోతుంది. మట్టి తవ్వినప్పుడూ, వంగినపుడూ, మల్చ్ చేసేట ప్పుడు, తేలికపాటి బరువు ఎత్తడం వంటివి అన్నీ మన శరీరానికి ఎంతో మేలుచేస్తాయి. ఇంటి తోటలో సమయం గడపడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. శరీరంలో ఎక్కడైనా వాపులు ఉంటే తగ్గుతాయి కూడా.. స్వచ్ఛమైన గాలి పెరగడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసన్ పేర్కొంటోంది. తోటపనివల్ల విటమిన్-డి శాతం పెరుగుతుంది. జీవక్రియ కూడా మెరుగవుతుంది. నాడీవ్యవస్థ బలంగా మారుతుంది. ఇది పిల్లల్లో ఎముకల అభివృద్ధికీ, పెద్దవారిలో ఎముకలను బలోపేతం చేయంలోనూ తోడ్పడుతుంది. అంతేనా ఆరు బయట, బాల్కనీ, పోర్టి కోల్లో తోటను పెంచేవారిలో సూర్య కాంతి కారణంగా మెలటోనిన్ ఉత్పత్తవు తుందట. తద్వారా సెరటోనిన్ ఉత్పత్తి పెరిగి నిద్రకు దోహదపడుతుంది.. ప్రొసీడింగ్స్ ఆఫ్ ది నేషనల్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్ (పియస్‌ఎయస్) ప్రకారం తోటమట్టి నుంచి వచ్చే పరిమళాలకు కూడా కొన్ని దీర్ఘకాలిక రోగాలను నియంత్రణ చేయగల శక్తి ఉందట. పెద్దపేగు క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులను అదుపులోఉంచుతుంది. తోటమట్టిలో ఉండే మంచి బ్యాక్టీరియా ఒత్తిడిని తగ్గిస్తుంది.

# అందాన్ని లాక్ చేద్దాం..

స్కిన్‌కేర్.. ప్రస్తుతం చాలామంది అమ్మాయిల రొటీన్‌లో ఇది భాగం. ఈ క్రమంలో అనేక రకాల క్రీములు వాడుతుంటాం కదా! అయితే, ప్రస్తుతం నడుస్తోంది మాత్రం గ్లూటాథయోన్ ఉత్పత్తుల ట్రెండే.. చర్మాన్ని కాంతిమంతంగా చేయడంలో ఇదే కీలకం మరి.. శరీరం సహజంగా ఉత్పత్తిచేసే శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్ గ్లూటాథయోన్. ఇందులోని అమైనో ఆమ్లాలు, శరీరానికి హానిచేసే ఫ్రీ ర్యాడికల్స్‌ను తటస్థపరిచి, వృద్ధాప్య ఛాయలు రాకుండా చూస్తాయి. అంతేకాదు, చర్మానికి మంచి ఛాయ వచ్చేలానూ చేస్తాయి.



ట్యాన్ తగ్గించి... ఎన్ని సంరక్షణ పద్ధతులు పాటించినా సూర్యరశ్మి దాడి నుంచి తప్పించుకోవడం కష్టమే కదా! కాసేపు ఎండలో ఉన్నా సరే అతినీల లోహిత కిరణాలు చర్మ కణాలను దెబ్బతీసి, ట్యాన్ ఏర్పరుస్తాయి. ఇలాంటప్పుడు గ్లూటాథయోన్ ఉండే క్రీముల్ని మనం ఎంపిక చేసుకుంటే, శరీరంలో టాక్సిన్లను తొలగించి, క్లియర్ చర్మాన్ని అందిస్తుంది. చర్మంపై రక్షణ కవచంలా ఏర్పడి యూవీ కిరణాల నుంచి రక్షిస్తుంది.

**రిపేర్ చేసి...** వయసుపై బడే కొద్దీ చర్మం సాగే గుణాన్ని కోల్పోతుంది. అప్పుడూ మనకు ఉపయోగపడే మ్యాజిక్ క్రీమ్ ఇదే. ఎందుకంటే చర్మం ఎలాస్టిసిటీని కాపాడడంలో కొలాజెన్ పాత్ర కీలకం. శరీరంలో కొలాజెన్ తయారీకి గ్లూటాథయోన్ తోడ్పడుతుంది.

# సమాధానం చెప్పాల్సిందే..



**తల్లులకు చిన్న పిల్లలు అమ్మా నేనెక్కడి నుంచి వచ్చాను నీ పొట్టలో ఎందుకు న్నానంటూ అడుగుతారు. ఊహించని ఈ ప్రశ్నలకు ఏం చెప్పాలో అర్థం కాదు. ఈ సందర్భం దాదాపు ప్రతి తల్లికీ ఎదురవుతుంది. ఇబ్బందిగా ఉన్నా వారి వయసుకు తగ్గ సమాధానం చెప్పాల్సిందే.**

పిల్లలకు తమకెదురయ్యే ప్రతీదీ కొత్తగా, వింతగా కనిపిస్తుంది. సందేహాలెన్నో వస్తుంటాయి. వారడిగే ప్రతి ప్రశ్నకూ సమాధానం తెలిస్తేనే తృప్తి పడతారు. లేదంటే ఆ ప్రశ్నకు మరో ప్రశ్న వారి మెదడులో చేరి అయోమయానికి గురవుతారు. అందుకే ఎప్పటికప్పుడు వారి సందేహాలను తీర్చాల్సిందే. అవి వారి పాఠ్యాంశాలు, కథలు, వాటిలోని పాత్రలు, అంతరిక్షం, ఆహారం, ఆటలు వంటివి మాత్రమే అయితే ఇబ్బంది లేదు. మరికొంత ముందుకువెళ్లి వారి పుట్టుక గురించి, గర్భధారణ వంటివి ప్రశ్నిస్తే మాత్రం ఇబ్బంది అవుతుంది. ఆ వయసులో వారికి అవసరంలేనివి అడుగుతున్నరని కోప్పడి వాళ్ల నోరు మూయించొచ్చు. అయితే ఆ సందేహం వారి మనసు నుంచి దూరం కాదు. అది పెరిగి పెద్దదవుతుంది.

**ఎలా చెప్పాలంటే...** ఏడెనిమిదేళ్లలోపు చిన్నారుల కైతే ఏదైనా కథ రూపంలో సమాధానమివ్వాలి. మరొకసారి మరింత సమాచారం చెబుతానని అక్కడితో సంభాషణను పూర్తిచేయొచ్చు. ఎనిమిదేళ్లు దాటిని ఆడపిల్లలకు సమాధానం తప్పనిసరి. కొన్ని విషయాలు అర్థం చేసుకోగలుగుతారు. విసుక్కోకుండా మృదువుగా వారికి కావాల్సినంత మేరకు సమాచారాన్నివ్వొచ్చు. అమ్మ గర్భంలో బిడ్డ ఎదుగుదల గురించి వివరించాలి. మరింత అవగాహన తెచ్చుకొనే వయసైతే ప్రసవం గురించీ వివరించొచ్చు.

**చనిపోవడమంటే చెప్పాలి..** అమ్మమ్మ, నాయినమ్మ, జేజమ్మ ఎందుకు చనిపోయారని, వారెక్కడికి వెళ్లారని కొందరు పిల్లలకు సందేహాలొస్తుంటాయి. పదేళ్లవారికైతే జీవితంలో చివరగా వచ్చేమృతువు గురించి మృదువుగా వివరించాలి. అంతకన్నా చిన్నపిల్లలను దేవుడి దగ్గరకెళ్లాలరని చెప్పి మరిపించొచ్చు. అలానే, అన్నయ్యకన్నా నేనెందుకు భిన్నంగా ఉన్నాననే సందేహం ఆడపిల్లలకొస్తుంది. ప్రతి ఒక్కరి శరీరానికి ప్రత్యేకత ఉందని చెప్పాలి. ఆడపిల్లల్లో ఆయా వయసుకు తగినట్లు శారీరకపరమైన మార్పులెలా వస్తాయో అవగాహన కలిగించాలి. పరిశుభ్రత ప్రాముఖ్యతనూ చెప్పి పాటించేలా చేయాలి. ఇవన్నీ పిల్లల్లో శారీరకంగా ఆరోగ్యాన్నే కాకుండా మానసిక పరిపక్వతనూ పెంచుతాయి. ▫

# సరిదిద్దాలి !

**వృషపర్వుడు రాక్షసరాజు.** ఆయన వద్ద పురోహితుడు శుక్రాచార్యుడు. రాకుమార్తె శర్మిష్ఠ, శుక్రాచార్యుని కుమార్తె దేవయాని. ఒక రోజు కొందరు చెలికత్తెలతో కలిసి శర్మిష్ఠ, దేవయాని వనవిహారానికి వెళ్లి ఒక కొలనులో స్నానం చేస్తుండగా పెద్ద సుడిగాలి వచ్చి వారి వస్త్రాలన్నీ చిందర వందరగా ఎగిసి పడ్డాయి. వారంతా నీళ్ళలో నుండి త్వరత్వరగా బయటికి వచ్చి ఎవరికి ఏ వస్త్రం దొరికితే దాన్ని ధరించారు. రాజకుమారి శర్మిష్ఠ దేవయాని దుస్తుల్ని ధరించింది. రాకుమారి శర్మిష్ఠ వస్త్రాలు ధరించటానికి ఇష్టపడని దేవయాని శర్మిష్ఠతో 'నేను బ్రాహ్మణ కన్యను, నీకు పూజ్యురాలను. నీవు కట్టిన మలిన వస్త్రాన్ని నేను కట్టుకోను అనింది. శర్మిష్ఠ కోపంతో, నా తండ్రి రాజు, నీ తండ్రి నా తండ్రిని ఆశ్రయించి బ్రతుకుతున్నాడు, అని అంటూ దేవ యానిని ప్రక్కన ఉన్న పాడుబడిన బావిలోకి తోసింది. వేటకై వచ్చిన యయాతి దేవయాని ని బావిలో నుంచి తీసి రక్షించి వెళ్లి పోయాడు. దేవయాని పట్టణంలోకి పోవటానికి ఇష్టపడక అక్కడే కూర్చొన్నది. విషయా న్నంతా తెలుసుకొని శుక్రాచార్యుడు వచ్చి, గొప్ప యజ్ఞాలు చేసిన వారికన్నా కోపం లేనివాడే ఉత్తముడు శర్మిష్ఠపై కోప్పడక ఇంటికి వెళదాం రా' అన్నాడు. వృషపర్వుడు వచ్చి దేవయానితో, ' నీ కోరికేమో చెప్పు, నెరవేరుస్తాను, అన్నాడు దేవయానితో శర్మిష్ఠతో కలిసి వేయి మంది దాసీలు కావాలని దేవయాని కోరింది. శర్మిష్ఠ ఆమెకు దాసి అయింది. వ్యాస భగవానుడు ఏ గొప్ప సత్యాన్ని, నీతిని నేర్పుతున్నాడో గమనించారా? కులాన్ని గూర్చి అహంకరించరాదు, హోదాను బట్టి విర్ర వీగరాదు, యజ్ఞ యాగాదులను చేయుట కన్నా కోపాల్ని వదలటం శ్రేష్ఠం. ఏ కులస్తులైనా, ఎంత అధికారమున్న వారైన కర్మ ఫలితాన్ని అనుభవించక తప్పదు. పిల్లలు తప్పువారిని సమర్థించక వృషపర్వుని వలె, శుక్రాచార్యుని వలె వారికి తగిన విధంగా బుద్ధి చెప్పి సరిదిద్దాలి. ఇలాంటి వందల కథలను మనకు అందిస్తుంది మహాభారతం. ▫

# ఇంట్లోనే వర్కవుట్ ..

**బరువు తగ్గే క్రమంలో ఆహారానికి ఎంత ప్రాధాన్యమిస్తామో..** వ్యాయామాలకూ అంతే ప్రాధాన్యమిస్తా. అయితే



ఇందుకోసం కొంతమందికి జిమ్‌కి వెళ్లే సమయం ఉండదు. మరికొందరు నలుగురిలో వ్యాయామాలు చేయడానికి ఇబ్బంది పడుతుంటారు. ఇలాంటి వారి కోసం వర్చువల్ ట్రైనర్స్ అందుబాటులో ఉన్నారు అంటే.. వర్కవుట్ యాప్స్ ద్వారా సంబంధిత నిపుణుల సలహా మేరకు ఇంట్లోనే వ్యాయామాలు చేయడానికి ఇబ్బంది పడుతుంటారు. ఇలాంటి వారి కోసం వర్చువల్ ట్రైనర్స్ అందుబాటులో ఉన్నారు అంటే. మర్కవుట్ యాప్స్ ద్వారా సంబంధిత నిపుణుల సలహా మేరకు ఇంట్లోనే వ్యాయామాలు చేయడమన్నమాట! 'హోమ్ వర్కవుట్' జిమ్ వర్కవుట్ ట్రాకర్.. వంటి వివిధ రకాల యాప్స్ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. లేదంటే కొంతమంది ఫిట్‌నెస్ నిపుణులూ ప్రత్యేకంగా యాప్స్ నక్రియేట్ చేసుకుంటారు. కొంత మొత్తం చెల్లిస్తే వాటిని డౌన్‌లోడ్ చేసుకొని వ్యాయామ చిట్కాలు పొందచ్చు. అయితే ఇక్కడ మనం చేసే వ్యాయామాల్ని బట్టి ఆయా జిమ్ పరికరాల్ని కొనుక్కోవడం మంచిది. ఇక కొంతమంది యూట్యూబ్ వీడియోలు చూస్తూ వర్కవుట్లు చేస్తుంటారు. కానీ కొన్ని రకాల వ్యాయామాల్ని నిపుణుల పర్యవేక్షణలోనే చేయాల్సి ఉంటుంది. కాబట్టి కొత్తగా వ్యాయామాలు ప్రారంభించే వారైనా లేదంటే అప్పటికే అలవాటున్న వారైనా.. సంబంధిత యాప్స్ డౌన్‌లోడ్ చేసుకొని లైవ్ సెషన్స్ ద్వారా ఎక్సర్‌సైజ్ మొదలు పెట్టడం సురక్షితం.

# అన్నం పునుగులు

కావలసిన పదార్థాలు
అన్నం: కప్పు
బియ్యప్పిండి: పావు కప్పు
కొత్తిమీర: గుప్పెడు
అల్లం: చిన్న ముక్క
పచ్చిమిరపకాయలు: మూడు
కరివేపాకు: నాలుగు రెబ్బలు
బేకింగ్ సోడా: చిటికెడు
ఉప్పు: తగినంత
నూనె: వేయించడానికి సరిపడా

ముందుగా అన్నాన్ని మిక్సీలో వేసుకొని మెత్తగా మాష్ చేసుకోవాలి. బియ్యప్పిండిని ఇందులో కలుపుకోవాలి. కొత్తిమీర కరివేపాకులను సన్నగా తరుక్కోవాలి. అల్లం పచ్చిమిర్చిలను మిక్సీలో వేసి ముద్దగా చేసి పెట్టుకోవాలి. ఇప్పుడు వీటన్నింటితో పాటు తగినంత ఉప్పు కొద్దిగా బేకింగ్ సోడాలని మాష్ చేసిన అన్నం మిశ్రమానికి కలుపుకోవాలి. బేకింగ్ సోడా వేశాక ఆ పిండిని చేత్తో బాగా కలియ బెట్టాలి. దీనివల్ల పునుగులు బోలుగా వస్తాయి.



కలపడం పూర్తయ్యాక పొయ్యి మీద నూనె పెట్టి గుండ్రటి బంతుల్లా వచ్చేలా కడాయిలో పునుగులు వేసుకుంటే సమ్మర్‌లో వెరైటీ స్నాక్స్ సిద్ధమైపోతాయి. ▫

# 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47' విడుదల తేదీ ఖరారు

తెర



తెలుగు సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్న క్రేజీ కాంబినేషన్ ఎట్టకేలకు వెండితెరపై సందడి చేయడానికి సిద్ధమైంది. విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో వస్తోన్న కుటుంబ కథా చిత్రం 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47' విడుదల తేదీ ఖరారైంది. ఈ చిత్రాన్ని అక్టోబర్ 2, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో భారీస్థాయిలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచేసింది. ఈ పోస్టర్ సినిమాలోని హృద్యమైన, ఉత్సాహభరితమైన ప్రపంచాన్ని పరిచయం చేస్తోంది. ఇందులో వెంకటేష్, శ్రీనిధి శెట్టి ఎంతో హుందాగా, ఆకర్షణీయంగా కనిపిస్తూ, ఆత్మీయ కుటుంబ కథకు అద్దం పట్టేలా ఉన్నారు. ఈ చిత్రం భావోద్వేగాలు, వినోదం, హృదయాన్ని హత్తుకునే క్షణాలతో నిండిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతుందని పోస్టర్ స్పష్టం చేస్తోంది. వెంకటేష్, త్రివిక్రమ్ కలయికలో వస్తున్న సినిమా కావడంతో ప్రకటన వచ్చినప్పటి నుంచే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. త్రివిక్రమ్ శైలిలో మనసును హత్తుకునే భావోద్వేగాలు, గుర్తుండిపోయే పాత్రలు, కట్టిపడేసే హాస్యం, అర్థవంతమైన కథనం కలగలిపి, ప్రేక్షకులకు సంపూర్ణమైన సినిమా అనుభూతిని అందించడానికి 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47 సిద్ధమవుతోంది. తన సహజమైన ఆకర్షణ, అద్భుతమైన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను అలరించే వెంకటేష్.. ఈసారి కూడా కుటుంబ విలువలతో కూడిన పాత్రలో అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించనున్నారు. ఈ చిత్రానికి అగ్రశ్రేణి సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు. ఎస్. థమన్ సంగీతం అందిస్తుండగా, రవి కె. చంద్రన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరి స్తున్నారు. శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్, కెవిన్ కుమార్ యాక్షన్ సన్నివేశాల కొరియోగ్రఫీ బాధ్యతలు చేపట్టారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ప్రతిష్టాత్మ కంగా నిర్మిస్తున్నారు. తెలుగు సినీ పరిశ్రమలో అత్యంత విజయవంత మైన కలయికలో ఒకటైన వెంకటేష్-త్రివిక్రమ్ కాంబో మరోసారి కలిసి వస్తుండటంతో ఈ సినిమాపై అంచనాలు తారా స్థాయిలో ఉన్నాయి. అక్టోబర్ 2, 2026న పండుగ సీజన్‌లో విడుదల కానున్న "ఆదర్శ కుటుంబం హౌస్ నం: 47" చిత్రం, ఒక పరిపూర్ణ కుటుంబ వినోదభరిత చిత్రంగా ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది. వెంకటేష్ ఆకట్టుకునే స్క్రీన్ ప్రజెన్స్, త్రివిక్రమ్ అద్భుతమైన కథాకథనం కలయికతో ఆవిష్కృతమయ్యే మ్యాజిక్‌ను చూడటానికి అభిమానులు, సినీ ప్రేమికులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# 'నాగబంధం' గొప్ప థియెట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది

## నిర్మాతలు కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి



విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎపిక్ అడ్వెంచర్ థ్రిల్లర్ 'నాగబంధం - ది సీక్రెట్ ట్రెజర్'. నిక్ స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. ఈ చిత్రంలో నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జగపతిబాబు, మహేష్ మంజ్రేకర్, రిషభ్ సాహ్నీ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. జూలై 3న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. **నాగబంధం ప్రాజెక్టులోకి మీరు ఎలా వచ్చారు?** మేము సాఫ్ట్‌వేర్ కంపెనీని విజయవంతంగా నిర్వహించాం. అక్కడి నుంచి ఎగ్జిట్ అయిన తర్వాత బిజినెస్‌ను డైవర్సిఫై చేయాలనే ఉద్దేశంతో సినిమా పరిశ్రమను కూడా ఒక మంచి అవకాశంగా భావించాం. నాగబంధం కంటే ముందు మరో కథ విన్నాం. అది చాలా పెద్ద హీరోతో చేయాల్సిన భారీ ప్రాజెక్ట్. అయితే అప్పటికి మేము నిర్మాతలుగా నిరూపించుకోలేదు కాబట్టి ఆ అవకాశం రాలేదు. రవీందర్ రెడ్డి గారు అభిషేక్ నామా వద్ద ఉన్న స్క్రిప్ట్ గురించి చెప్పారు. అలా మేము అభిషేక్‌ని కలిశాం. ఆయన విజన్ మాకు చాలా నచ్చింది. పెద్ద స్థాయిలో సినిమా చేయాలనే ఆలోచనతో నాగబంధం మొదలైంది. మొదటి నుంచి క్రియేటివ్ ఫీల్డ్‌పై మాకు ఆసక్తి ఉంది. అయితే కేవలం పేరు కోసం మేము ఈ రంగంలోకి రాలేదు. సాఫ్ట్‌వేర్ రంగంలోనే మేము మంచి గుర్తింపు సంపాదించాం. **సినిమా అనేది రిస్కీ బిజినెస్ కదా?** రిస్క్ అనేది అన్ని రంగాల్లో ఉంటుంది. మేము స్టార్టప్ ప్రారంభించినప్పుడు ఆ ట్రెండ్ అసలు లేదు. అప్పట్లో బీటెక్ చేసి అమెరికా వెళ్లి మంచి ఉద్యోగం సంపాదించి స్థిరపడాలనే ఆలోచనే ఎక్కువగా ఉండేది. కానీ మేము ఆ ట్రెండ్‌ను బ్రేక్ చేశాం. ఐఐటీ గ్రాడ్యుయేట్స్ అయినప్పటికీ నాలుగేళ్ల పాటు ఎలాంటి ఆదాయం లేకుండా కష్టపడ్డాం. మాపై మాకు ఉన్న నమ్మకం ఈ స్థాయికి తీసుకొచ్చింది. అదే నమ్మకంతో సినిమా రంగంలో కూడా రిస్క్ తీసుకున్నాం. **విరాట్ కర్ణ, దర్శకుడిగా అభిషేక్ నామా ఇద్దరూ కొత్తవారే. ఇంత భారీ బడ్జెట్ పెట్టడానికి కారణం ఏమిటి?** మాకు కంటెంట్‌పై బలమైన నమ్మకం ఉంది. లార్జర్ దాన్ లైఫ్ మైథాలజికల్ కథతో సినిమా చేయాలనే ఆలోచన మొదటి నుంచే ఉంది. అభిషేక్ నామా ఇంతకుముందు డెవిల్ చిత్రానికి దర్శకత్వం వహించారు. హీరో కోసం వెతుకుతున్న సమయంలో విరాట్ కర్ణ ఈ పాత్రకు పర్ఫెక్ట్ అనిపించారు. ఈ సినిమా కోసం ఆయన అద్భుతంగా బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్ అయ్యి, ఎంతో అంకితభావంతో పనిచేశారు. **ఫైనల్ అవుట్‌పుట్ చూసి సంతృప్తిగా ఉన్నారా?** చాలా హ్యాపీగా ఉన్నాం. విజువల్స్ అన్నీ అద్భుతంగా వచ్చాయి. మేము పెట్టిన ప్రతి రూపాయి తెరపై కనిపించాలనే ఉద్దేశంతో ఈ సినిమాను నిర్మించాం. **ఇది డివోషనల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న సినిమా కదా... మీ వ్యక్తిగత జీవితంలో కూడా ఆధ్యాత్మికత ఉందా?** మేము ఆధ్యాత్మికతను విశ్వసించే వాళ్లం. ప్రతి రోజు శివుని అభిషేకంతోనే మా రోజు ప్రారంభమవుతుంది. కార్తీక పౌర్ణమి రోజున ఈ సినిమా చివరి షెడ్యూల్ షూటింగ్ జరిగింది. అదే రోజు 24 గంటల పాటు అభిషేకం జరిగింది. అదంతా శివుడు, అనంత పద్మనాభస్వామి ఆశీర్వాదంతోనే జరుగుతోందనే భావన కలిగింది. ఈ సినిమా కోసం వేసిన అనంత పద్మనాభస్వామి ఆలయ సెట్‌ను చూసిన ప్రతి ఒక్కరూ నిజమైన ఆలయానికి వచ్చిన అనుభూతి కలుగుతోందని చెబుతున్నారు. **ఈ సినిమా నిర్మాణంలో ఎదురైన సవాళ్లు ఏమిటి?** ఈ సినిమా కోసం భారీ సెట్లు నిర్మించాం. భారీ సెట్లు అంటే సహజంగానే ఖర్చులు పెరుగుతాయి. ఈ సినిమాలో ప్రతి పది నిమిషాలకు ఒక అద్భుతమైన విజువల్ కనిపిస్తుంది. అలాంటి విజువల్స్‌ను అవుట్‌డోర్‌లో పొందడం సాధ్యం కాదు. ప్రేక్షకులకు ఒక విజువల్ ఫీస్ట్ అందించాలనే ఉద్దేశంతో ప్రతి సెట్‌ను ఎంతో శ్రద్ధగా రూపొందించాం. **ఈ సినిమాకు సీక్వెల్ ఉంటుందా?** ఈ సినిమా మేము ఆశించిన స్థాయిలో విజయం సాధిస్తే కచ్చితంగా సీక్వెల్ రూపొందించే ఆలోచన ఉంది.

# 'హ్యాపీ జర్నీ' : టీజర్ లాంచ్



గుత్తా ప్రొడక్షన్స్, కమలాకర్ ఫిల్మ్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్మిస్తున్న హార్ట్‌వార్మింగ్ ఎమోషనల్ డ్రామా 'హ్యాపీ జర్నీ'. అభిరామ్ నాయుడు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈచిత్రం మహిళా భావోద్వేగాలకు ప్రధాన ప్రాధాన్యతనిస్తూ రూపొందుతోంది. బాలాజీ గుట్ట, కౌశిక్ రెడ్డి నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా, తరుణ్ రెడ్డి సహ నిర్మాత. ఏడుగురు మహిళల భావోద్వేగ ప్రయాణాలను ప్రధానంగా చూపించే ఈ చిత్రంలో అన్నపూర్ణమ్మ, ఆమని, యాంకర్ ఝాన్సీ, పాయల్ రాధాకృష్ణ, జినిషా అలీశెట్టి, రూపా శ్రీనివాస్, సునయన ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, పృథ్వీ దండమూడి, వంశీధర్ గౌడ్, రవి శివతేజ పైలా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. టీజర్ లాంచ్ ఈవెంట్‌లో సీనియర్ నటి అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ.."ఇప్పటివరకు నేను చేసిన పాత్రలకు భిన్నంగా ఇందులో నా పాత్ర వుంటుంది. ఇది చాలా మంచి కథ. మనందరి కథ." అన్నారు. నటి ఆమని మాట్లా డుతూ.. 'హ్యాపీ జర్నీ' నిజంగానే ఒక హ్యాపీ జర్నీ. మేమందరం ఫ్రెండ్స్‌లా కలిసి ఈ సినిమా చేశాం. ఇది నాకు చాలా కొత్త అనుభవం' అన్నారు. నటి ఝాన్సీ మాట్లాడుతూ.. " ఏడుగురు మహిళలు ఒక ప్రయాణంలో కలిస్తే ఎంత సరదాగా ఉంటుందో, వారి మధ్య ఏర్పడే బంధం, భావోద్వేగాలు, కన్నీళ్లు ఎంత హృదయాన్ని తాకుతాయో ఈ సినిమా చూపిస్తుంది" అన్నారు. దర్శకుడు అభిరామ్‌నాయుడు మాట్లాడుతూ.."ఈ సినిమా జర్నీ చాలా ఆనందంగా సాగింది. మా జీవితాల్లో ఇది ఒక మరపురాని జ్ఞాపకంగా నిలిచిపోతుంది. టీజర్ చూస్తే ఇది అమ్మాయిల కోసం తీసిన సినిమా అనిపించొచ్చు. కానీ నిజానికి ఇది మగాళ్ల కోసంతీసిన సినిమా" అన్నారు.

# 'గుర్తుకొస్తున్నాయి' ట్రైలర్ విడుదల



యంగ్ ట్యాలెంటెడ్ విరాజ్ అశ్విన్ హీరోగా వినోద్ గాలి దర్శకత్వంలో శరత్ చంద్రనాయుడు నిర్మిస్తున్న సిరిస్ 'గుర్తుకొస్తున్నాయి'. యశశ్రీ రావు, రోహిణి హట్టంగడి, శివ నారాయణ నారిపెద్ది, ప్రియదర్శిని రామ్ ఇతర కీలక పాత్రలు పోషించారు. ఈ రోజు మేకర్స్ ట్రైలర్ లాంచ్ చేశారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లా డుతూ.. 'ఈరోజు భాగ్యరాజ్ మరణ వార్త చాలా బాధాకరం. ముందుగా ఆయనను స్మరించుకుంటూ మౌనం పాటిద్దాం. మన ఇండస్ట్రీలో నేను పని చేసిన గొప్ప సంస్థల్లో గీతా ఆర్ట్స్ ఒకటి' అన్నారు.హీరో సత్యదేవ్ మాట్లాడుతూ 'గీతా ఆర్ట్స్ నుంచి ధీరజ్, ఎస్‌కేఎన్, శరత్, బన్నీ వాసు... ఇలా ఎంతోమంది నిర్మాతలుగా రావడం, అందరూ సక్సెస్‌ఫుల్‌గా మంచి సినిమాలు చేయడం నిజంగా చాలా ఆనందంగా ఉంది' అన్నారు. హీరో విరాజ్ అశ్విన్ మాట్లాడుతూ..'ఈ ట్రైలర్ ఈవెంట్‌ను మేము ఎప్పటికీ మర్చిపోలేం. హీరో సత్యదేవ్‌కి, దర్శకుడు కరుణాకర్‌కి, బోయపాటి శ్రీనుకి, ఇక్కడికి విచ్చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు' అన్నారు. బన్నీ వాసు మాట్లాడుతూ.. 'మొన్న నా సినిమా లాంచ్ అయ్యింది. ఈరోజు ఉదయం మా బ్యాచ్‌లో సందీప్ తన సినిమాను ప్రారంభించాడు' అన్నారు. వంశీ నందిపాటి మాట్లాడుతూ..'శరత్ జీవితంలో ముందుకు వెళ్లాలనే తపన ఉన్న వ్యక్తి. ఈరోజు తను ఈ సిరీస్‌తో నిర్మాతగా రావడం చాలా ఆనందంగా ఉంది' అన్నారు.నిర్మాత శరత్ చంద్ర నాయుడు మాట్లాడుతూ.. 'గుర్తుకొస్తున్నాయి' గురించి చెప్పాలంటే నాకు చాలా విషయాలు గుర్తుకొస్తు న్నాయి. ముందుగా అల్లు అర్జున్‌కి థాంక్స్ చెప్పాలి. నేను మొదట ఆయన వద్ద సోషల్ మీడియా హ్యాండిల్ చేశాను. తర్వాత పీఆర్‌గా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా పనిచేశాను' అన్నారు. మైత్రి మూవీమేకర్స్ నిర్మాత రవి మాట్లాడుతూ.. 'గుర్తుకొస్తున్నాయి' అనే టైటిల్ చూడగానే ఒక పాజిటివ్ వైబ్‌వచ్చింది. గీతా ఆర్ట్స్, ఈటీవీ విన్ రెండూ ప్రతిష్టాత్మక సంస్థలు. అలాంటి రెండు సంస్థలనుంచివస్తున్న ఈసిరీస్ తప్పకుండా విజయం సాధిస్తుందని నమ్ముతున్నాను' అన్నారు.

# 'హైకూ' చిత్రీకరణ పూర్తి



'కోర్ట్' సినిమా హీరోయిన్ శ్రీదేవి లేటెస్ట్ మూవీ 'హైకూ'. ఈ బహుభాషా చిత్రంలో శ్రీదేవితో పాటు ఏగన్, 'మిన్నల్ మురళి' మూవీ ఫేమ్ ఫెమినా జార్జ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. విజన్ సినిమా హౌస్ బ్యానర్‌పై డా. డి. అరుళానందు, మాథేవో అరుళానందు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. యువరాజ్ చిన్న సామి కథ, దర్శకత్వ బాధ్యతలు నిర్వహిస్తు న్నారు. నాలుగు షెడ్యూళ్లలో 90 రోజుల చిత్రీకరణతో మొత్తం షూటింగ్ పూర్తయ్యింది. డైరెక్టర్ యువరాజ్ చిన్నసామి మాట్లాడుతూ, 'హైకూ' సినిమాను అనుకున్న ప్లానింగ్ ప్రకారం పూర్తి చేశాం. ఇది మా ఎంటైర్ టీమ్‌కు చాలా ఎమోషనల్, హ్యాపీ మూమెంట్. కథను నమ్మి నాకు పూర్తి క్రియేటివ్ ఫ్రీడమ్ ఇచ్చిన మా నిర్మాతలు డా. డి. అరుళా నందుగారికి, మాథేవో అరుళానందు గారికి ప్రత్యేకమైన ధన్యవాదాలు" అన్నారు. నిర్మాతలు డా. డి. అరుళానందు, మాథేవో అరుళానందు మాట్లాడుతూ, 'హైకూ' సినిమా మొత్తం చిత్రీకరణ పూర్తయ్యింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రారంభమయ్యాయి' అన్నారు.

29vzm15:29vzm15.qxd 28-06-2026 23:27 Page 1



## షెడ్యూల్ క్యాస్ట్ కులం రిజర్వేషన్ వర్తింపరాదు



బొబ్బిలి, జూన్ 28, ప్రభాతవార్త:

దేశంలో ఐఏఎస్ ,ఐపీఎస్ , డాక్టర్స్ ఉన్నత వర్గాలకు చెందిన షెడ్యూల్ కులాలు షెడ్యూల్ క్యాస్ట్ ఉద్యోగులు నేటికీ రిజర్వేషన్లు కొనసాగిస్తూ వారి కుటుంబాలే ఉన్నత స్థానాలను పొందుతున్నారు కానీ నిరుపేద షెడ్యూల్ కులాలు షెడ్యూల్ క్యాస్ట్ లకు చెందిన వ్యక్తులకు ఈ రిజర్వేషన్ వల్ల న్యాయం జరగలేదని రాష్ట్ర అంబేద్కర్ పోరాట సమితి అధ్యక్షులు సోరు సాంబయ్య విలేకరుల సమావేశంలో తెలియజేశారు. ఆదివారం స్థానిక వెలమ కాలనీలో విలేకరులతో మాట్లాడుతూ 1932లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ బ్రిటిష్ వాళ్ళతో పోరాడి మరి రౌండ్ టేబుల్ సమావేశాల్లో బ్రిటీష్ పాలకొల్లు అంబేద్కర్ మేధాసంపత్తితో ఒప్పించి బ్రిటీష్ పాలకులతో ప్రత్యేక నియోజకవర్గాలు ఓటు హక్కు ఉద్యోగ రిజర్వేషన్ పొలిటికల్ రిజర్వేషన్ పొందినటువంటి ఎస్సీ వాళ్ళ ఐఏఎస్ ఐపీఎస్ ఐఆర్ఎస్ ఐఎఫ్ఎస్సి మెడికల్ ఆఫీసర్లు అంబేద్కర్ సాధించిన రిజర్వేషన్ అలివేస్తున్న షెడ్యూల్ కులాల మేధావులు హక్కుల అనుభవిస్తూ కింద ఉన్న షెడ్యూల్ కులాల పేదలను పూర్తిగా తుంగలో తొక్కేస్తున్నారు ఈనాటికి పైన ఉదాహరించిన పై అధికారుల యొక్క వారసులే బాగుపడుతున్నారు కానీ ఎస్సీ వర్గాలకు వాళ్ల తాలూకా సమస్యలను పట్టించుకునే పొలిటికల్ పార్టీల వారు కూడా పదవులను వారే అలుగువిస్తున్నారు. తప్ప కింద స్థాయి ఎస్సీ వర్గాలకు ఏమాత్రం ప్రయోజనం చూపక పోవడం అన్యాయమైన దిగా భావిస్తున్నామన్నారు. కొంతమంది ఎస్సీ కులం పేరుతో నాయకులుగా తయారై క్రింద ఉన్న అట్టడుగున వర్గాలను కనీసం పట్టించుకోకుండా వారిని అణగారిని వర్గాలుగా చూస్తున్నారు తప్ప వారి ప్రయోజనాలను కాలు రాస్తున్నారు అందుకే ఉన్నత స్థాయి వర్గాలకు రిజర్వేషన్ తొలగించాలని అంబేద్కర్ పోరాట సమితి అధ్యక్షులు సోరు సాంబయ్య డిమాండ్ చేశారు. ఈ ప్రతిపాదన దేశ ఉన్నత వర్గంలో ఉన్న మేధావులు ఆలోచించి అమలుపరిచేందుకు సదస్సులు ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు.

## క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట : మంత్రి

### విజయనగరంలో ఘనంగా ఒలింపిక్ రన్





విజయనగరం, జూన్ 28, ప్రభాతవార్త:

నగరంలో ఒలింపిక్ రన్ అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఈ రన్‌కు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా విచ్చేసి, జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని, గ్రామీణ స్థాయి నుంచే ప్రతిభ కలిగిన ప్లేయర్లను ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని స్పష్టం చేశారు. క్రీడాకారులకు అవసరమైన ఆధునిక మౌలిక వసతులు కల్పిస్తూ మెరికల్లాంటి ప్లేయర్లను తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి క్రీడా స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో మన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ ఒలింపిక్ స్థాయిల్లో రాణించి, పతకాలతో దేశానికి, రాష్ట్రానికి కీర్తిప్రతిష్టలు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు, కార్యదర్శి సిహెచ్. వేణుగోపాలరావు,రాష్ట్ర వెలమ సంఘం డైరెక్టర్ కోల్ నాయుడు, సత్య కాలేజ్ ప్రిన్సిపల్ సాయి దేవమణి, టిడిపి నాయకులు అవనాపు విజయ్ తదితరులు పాల్గొన్నారు. వివిధ క్రీడా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, కోచ్‌లు, వందలాది మంది క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొని ఈ రన్‌ను విజయవంతం చేశారు.

## గజపతినగరం ఆసుపత్రి సేవలు అభినందనీయం



గజపతినగరం, జూన్ 28, ప్రభాతవార్త:

గజపతినగరం ప్రాంతీయ ఆసుపత్రి సేవలు చాలా అభినందనీయమని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం పల్స్ పోలియో సందర్భంగా గజపతినగరంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ 0 నుండి 5 సంవత్సరాల వయసు గల చిన్నారులకు ప్రతి ఒక్కరికి కూడా పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలనీ, ఇప్పటికే పోలియో మహమ్మారి నుండి పోలియో చుక్కలు వేయించుకోవడం ద్వారా భారతదేశంలో కేసులు నమోదు కాకపోవడం గర్వకారణం అన్నారు. ఇప్పటికీ పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ వంటి ఇతర దేశాలలో పోలియోపై అవగాహన లేకపోవడంతో చిన్నారులు పోలియో బారిన పడటం బాధాకరం అన్నారు. గజపతినగరం ఆసుపత్రి రాష్ట్రంలోనే నాలుగవ స్థానం దక్కించుకోవడం చాలా గర్వకారణంగా ఉందనీ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న గజపతినగరం వైద్య బృందానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్పొరేట్ ఆసుపత్రిలో మాత్రమే చేసే అత్యంత ఖరీదైన మోకాలి చికిత్స గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేయటంతో నూతన ఒరవడి సృష్టించారన్నారు. ఆసుపత్రిలోని పలు విభాగాలు పరిశీలించటంతో పాటు రోగులను పరామర్శించారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలు శుభ్రంగా ఉంచటంతో పాటు రోగులకు అందుబాటులో ఉంటూ అన్ని సేవలు అందిస్తూ గజపతినగరం ఆసుపత్రి ఆదర్శనీయంగా ఉందన్నారు. కార్యక్రమంలో మంత్రి గారితో పాటు తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ పివివి గోపాల రాజు, మక్కువ శ్రీధర్, ప్రదీప్, ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ జగదీష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## దివ్యాంగ విద్యార్థులకు రూ. 25 వేలు ఆర్థిక చేయూత



గరివిడి, జూన్ 28 , ప్రభాత వార్త:

శ్రీరాం నగర్ స్త్రీ శిశు సంక్షేమ కేంద్రంలో గల దివ్యాంగ విద్యార్థులకు దుర్గా ప్రసాద్ సరాఫ్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు, కార్మిక నాయకులు ముదునూరు జగన్నాధరాజు 25 వేల రూపాయలు ఆర్థిక సాయాన్ని అందించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. సేవే పరమావదిగా ముందుకు సాగే ముదునూరు జగన్నాధరాజు వికలాంగ విద్యార్థుల కు తన సొంత పైకాన్ని అందించి తన సేవాగుణాన్ని చాటుకోవడం ముదావహం. కాగా ఈ మేరకు ఆ పైకాన్ని సంస్థ వికలాంగ పాఠశాల ప్రతినిధులు నారాయణ మూర్తి, పి.కుమార్ లకు అందించారు. జులై 26 నుండి మౌంట్ అబూ లో జరిగే జాతీయ సాంస్కృతిక కార్యక్రమంలో వికలాంగ విద్యార్థులు పాల్గొనేందుకు అవసరమయ్యే రవాణా ఖర్చు కి గాను జగన్నాధరాజు పాఠశాల ప్రతినిధులకు పైకాన్ని అందించారు. శ్రీరాం నగర్ విమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సెంటర్ వికలాంగ విద్యార్థులకు 25 వేలు రూపాయలు మౌంట్ అబీ లో జరిగే వికలాంగ సాంస్కృతిక కార్యక్రమ రవాణా వ్యయానికి గాను 25 వేలు సాయాన్ని అందివ్వడం పట్ల పలువురు ఆయన్ని అభినందించారు. ఫేకర్ జి ఎం.రామకృష్ణ ఈ సందర్భంగా జగన్నాధరాజుకి కృతజ్ఞతలు తెలిపారు. బ్రహ్మ కుమారి హేమలతకు విద్యార్థుల తరపున ఫేకర్ జి ఎం అభినందించారు.కార్యక్రమంలో సూరప్పడు, తదితరులు పాల్గొన్నారు.

## 98 శాతం పల్స్ పోలియో చుక్కలు పూర్తి



దత్తిరాజేరు, జూన్ 28, ప్రభాతవార్త:

మండలంలోని కే కొత్తవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఉన్న 20 గ్రామాలో ఉన్నఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలను వైద్య సిబ్బంది 98 శాతం పూర్తి చేశారని ప్రాథమిక వైద్యాధికారి కె రఘు తెలిపారు కే కొత్తవలస ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు ఆదివారం పల్స్ పోలియో రెండుచుక్కలు వేసామన్నారు మా పీహెచ్ పరిధిలో ఉన్న 2146 మంది పిల్లలకు గాను 2099 పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరిగిందన్నారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించిన మాట్లాడుతూ పోలియో రహిత సమాజావిష్కరణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని తెలిపారు 29 మరియు30 తేదీల్లో ఇంటింటికి వెళ్లి మిగిలిన పిల్లలకు పోలియో చుక్కలు వేసి శతశాతం పూర్తి చేస్తారన్నారు. సిహెచ్ ఓ మురళి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పోలియో రహిత సమాజమే ప్రధాన లక్ష్యం : జడ్పిటిసి



చీపురుపల్లి ,జూన్ 28, ప్రభాతవార్త :

పోలియో రహిత సమాజమే ప్రతి ఒక్కరు లక్ష్యం కావాలని చీపురుపల్లి జడ్పిటిసి వలిరెడ్డి శిరీష, వైయస్సార్ పార్టీ జిల్లా ప్రచార అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాస నాయుడులు అన్నారు, ఆదివారం నాడు పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా చీపురుపల్లి పట్టణంలోని మేజర్ పంచాయతీ కార్యాలయం తో పాటు పలుచోట్ల ఏర్పాటు చేసిన శిబిరాలలో వీరు పాల్గొని పిల్లలకు పల్స్ పోలియో చుక్కలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో కంటే ప్రస్తుతం ప్రతి ఒక్కరు అవగాహన కలిగిందని.. ఇదే నేపద్యాన్ని కొనసాగిస్తూ పిల్లలు ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరు శ్రద్ధ వహించి ప్రధానంగా పోలియో చుక్కలు అందజేయడం ద్వారా పిల్లలకి సోకే పలు వ్యాధుల నుండి రక్షణ కలుగుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఎం ఎల్.హెచ్.పి వంగల సోమేశ్వరి, ఏఎన్ఎం ఎస్. కె బేగం, అంగన్వాడీ కార్యకర్తలు కే లక్ష్మి, ఎస్ శిరీష, ఆయమ్మ ఎస్ కే చాంది పాల్గొన్నారు.

## విజయవంతంగా పల్స్ పోలియో : డాక్టర్ అనిల్



లక్కవరపు కోట, జూన్ 28, (ప్రభాతవార్త ):

మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం కొనసాగింది ఎల్ కోట పి ఎచ్ సి డాక్టర్ అనిల్ కుమార్ తెలిపారు ఎల్ కోట మేజర్ పంచాయతీ లో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఈ కార్యక్రమం ని పోలియో డ్రాప్స్ వేసి ప్రారంభించారు అని మిగిలిన అన్ని గ్రామాలలో ఆయా గ్రామ పెద్దలు నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు అని అయన తెలిపారు మండలం లో గుర్తించిన మొత్తం 4533 మంది 5 ఏళ్ల లోపు చిన్నారులు ఉండగా ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన 30 బూత్ ల ద్వారా 4533 మంది చిన్నారులకు పోలియో వాక్సిన్ సిబ్బంది వేశారు అని దీని పర్స సేజ్ 98.06 గా ఉందని మిగిలిన చిన్నారులకు సోమవారం మంగళవారాలలో సిబ్బంది ద్వారా పోలియో డ్రాప్స్ వేయించడం జరుగుతుంది అనితెలిపారు . ౦ -5 ఇయర్స్ చిన్నారులకు పోలియో చుక్కలు తప్ప కుండా వేయించాలి అని ఇది వారి ఆరోగ్యం లో కీలక పాత్ర పోసిస్తుంది అన్నారు. ఎమ్మెల్యేతో పాటు మాజీ జడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు కూట మి నాయకులు పాల్గొన్నారుకొట్యాడ్ లో జడ్పీ హై స్కూల్ కొట్యాడ స్కౌట్ విద్యార్థులు పాల్గొని వైద్య సిబ్బంది కి స హకరించారు.

## ఆంధ్రా, ఒడిశా సరిహద్దుల్లో మెరుపు దాడులు : ఎక్సైజ్ సీఐ



కురుపాం, జూన్ 28,ప్రభాతవార్త :

ఆంధ్ర ఒడిస్సా సరిహద్దు గ్రామాలలో నాటు సారా తయారీ కేంద్రాలపై ఒడిస్సా ఎక్సైజ్ పోలీసుల సహకారం తో సంయుక్త దాడులు నిర్వహించినట్లు ప్రోహిబిషన్ ,ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం నవోదయం 2.0 కార్యక్రమం అమలులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ బి.శ్రీనాథుడు ఆదేశములు మేరకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సంతోష్ ఆధ్వర్యం లో ఒడిస్సా సరిహద్దులో గల నాటు సారా తయారీ స్థావరాలు కలిగిన అనిజ, వలవ గ్రామంలో ఒడిస్సా ఎక్సైజ్ అధికారులతో కలిసి సంయుక్త దాడులు నిర్వహించినట్లు తెలిపారు.నాటు సారా తయారీ కోసం సిద్ధంగా ఉంచిన 11,000 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామనిన్నారు. డ్రమ్ములలో నిల్వఉంచిన 220 లీటర్ల నాటు సారాను అధికారుల సమక్షంలో ధ్వంసం చేశామని తెలిపారు. ఈ దాడుల్లో పార్వతీపురం టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ వీవీఎస్ శేఖర్ బాబు, సీతానగరం, చీపురుపల్లి ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది, విజయనగరం ఎన్ఫోర్స్ మెంట్ సబ్ ఇన్స్పెక్టర్ రాజశ్రీ ,సిబ్బంది, కురుపాం ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ జె .రాజశేఖర్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.నాటు సారాపై సరిహద్దులో నిరంతర నిఘా పెడుతున్నామని ఒడిస్సా పోలీస్ మరియు ఎక్సైజ్ అధికారులు సహకారంతో నాటు సారాయి తయారీ కేంద్రాలపై నిరంతర నిఘా ఉంచామన్నారు.

## పవన్ అన్న.. ఇదేనా పారదర్శకత.. పదవుల కోసం లక్షలు చెల్లించాలా?..

చీపురుపల్లి ,జూన్ 28, ప్రభాతవార్త :

చీపురుపల్లి నియోజకవర్గం నుండి జనసేన నాయకులు పదవుల కోసం లక్షల రూపాయలు చెల్లించి చివరకు పదవులు దక్కక పోలీస్లకు ఫిర్యాదు చేసుకునే స్థాయికి జనసేన పార్టీ దిగజారడం పట్ల పలువురు విమర్శల వర్షం కురిపిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రిగా పవన్ చేస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు అనేక రాజకీయ పార్టీలకు యువతకు ఆదర్శంగా నిలుస్తున్నప్పటికీ చీపురుపల్లి ప్రధాన కేంద్రం నుండి జనసేన పార్టీలో పదవుల కోసం కుమ్ములాట జరగడం, పదవులు ఇప్పిస్తామంటూ కొంతమంది లక్షల రూపాయలు వసూలు చేయడం,.. చివరకు చేతులెత్తేయడం పట్ల అదే పార్టీకి చెందిన ఓ నేత చీపురుపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం ప్రస్తుతం చర్చనీయంగా మారింది.. జనసేన నాయకులు నీతిగా నిజాయితీగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అడుగుజాడల్లో నడుస్తున్నారంటూ పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో అదే పార్టీకి చెందిన కొంతమంది నామినేటెడ్ పదవులు ఇప్పిస్తామంటూ యువ నాయకులను మోసం చేయడం పట్ల పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. చీపురుపల్లి నియోజకవర్గం ప్రధాన కేంద్రంలో జనసేన పార్టీ తరపున పనిచేసిన ఓ యువ నాయకుడు నుండి నామినేటెడ్ పదవిని ఇప్పిస్తామంటూ అదే పార్టీకి చెందిన కొంతమంది నేతలు లక్షల రూపాయలు వసూలు చేయడం నియోజకవర్గం లో కూటమి పాలన పట్ల పలువురు ఆరోపణలు చేస్తున్నారు. పార్టీ అధినాయకుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చీపురుపల్లి నియోజకవర్గ ప్రధాన కేంద్రంలో జరుగుతున్న నామినేటెడ్ పదవుల దందా పైన దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. చీపురుపల్లి పోలీస్ స్టేషన్ లో జనసేన పార్టీకి చెందిన ఓ నేత తనకు జరిగిన అన్యాయం పట్ల ఫిర్యాదు చేయడం స్థానికంగా చర్చనీయమైంది. గతంలో పార్టీ తరపున కష్టపడి పని చేసిన సదరు వ్యక్తి అదే పార్టీలో తనకు అన్యాయం చేసి నామినేట్ పదవి ఇప్పిస్తామంటూ లక్షల రూపాయలు వసూలు చేసి ప్రస్తుతం చేతులెత్తేయడం పట్ల సదరు జనసేన నేత చీపురుపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి సర్కిల్ ఇన్స్పెక్టర్ జి శంకర్రావు ను వివరణ కోరగా ఫిర్యాదు తన వరకు వచ్చిందని, చీపురుపల్లి ఎస్సైకి ఫిర్యాదు అందజేయాలని తెలియజేశామని ఆయన చెప్పారు.

## పల్స్ పోలియో విజయవంతం



మెరకముడిదాం, జూన్ 28:ప్రభాతవార్త :

మండలం మెరకముడిదాం పి.హెచ్. సి పరిధిలో గల అన్ని గ్రామా లలో తేదీ 28.06.2026 న పల్స్ పోలియో కార్య క్రమం( ఎన్ ఐ డి ) విజయవంతం అయ్యిందని వైద్యాధికారి డా . కె. అజిత్ బాబు గారు తెలిపారు . పి హెచ్ సి పరిధిలో 14 పోలియో కేంద్రాలు , 2 ట్రాన్సిట్ టీమ్ లు , ఒక మొబైల్ టీములు ఏర్పాటు చేయడమైనదనీ తెలియ చేశారు. ఈ కేంద్రము లన్నింటిలో అప్పుడే పుట్టిన బిడ్డ లగాయతు 5 సంవ త్సరము లోపు పిల్లలందరికీ 95 శాతం మంది కి పోలియో చుక్కలు వేయడం అయిందని తెలిపారు. 29 వ మరియు 30 వ తేదీలలో ఇంటింటికి వెళ్ళి మిగిలిన ఉన్న పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు వేయుబడునని తెలియ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి, కె .అజిత్ బాబు, డా . బి.పూజ , సి.హెచ్ ఓ రామారావు, సూపర్ వైజర్స్ , హెల్త్ అసిస్టెంట్లు , ఏ ఎన్ ఎమ్ లు, అంగన్వాడీ కార్య కర్తలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలియో చుక్కలు వేయించండి .. బాలల జీవితం కాపాడండి



రామభద్రపురం,జూన్ 28, ప్రభాత వార్త

రామభద్రపురం మండలం పంచాయతీ పూడి వీధి అంగనవాడి కేంద్రంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని మాజీ తెలుగుదేశం పార్టీ మాజీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ ప్రారంభించారు శిబిరంలో చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో పల్స్ పోలియో శిబిరాలను నిర్వహిస్తుందని చిన్నారులను తరలించి పోలియో చుక్కలు వేయవలసిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఆరోగ్య శాఖ అధికారి దిలీప్ కుమార్ మాజీ సర్పంచ్ రవ్వ ఈశ్వరరావు అంగన్వాడి కార్యకర్తలు పూడి చిన్నమ్మలు, వరలక్ష్మి, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

## పిడుగు పడి 26 గొర్రెలు, 6 మేకలు మృతి



తెర్లాం, జూన్ 28, (ప్రభాతవార్త ):

మండలంపరిధిలో నందిగాం గ్రామ పంచాయతీలో ఆదివారం మధ్యాహ్నం పిడుగు పడి 26 గొర్రెలు 6 మేకలు మరణించా యి.అందుకు సంబందించిన వివరాలు కోరాడ చిన్నప్పుడు - 17, నీలబోను సూర్యనారా యణ-8, మొగుడు పైడయ్య-7 రైతులకు సంబందించిన మూగ జీవులు మృతి చెందాయి. సమాచారం అందిన వెంటనే మండల పశు వైద్యాధికారి మరియు సిబ్బంది , మాజీ సర్పంచ్ అర్నపల్లి సత్యనారాయణ, ఎాూజూ చైర్మన్ నర్సిపల్లి వెంకటేష్, రెవెన్యూ శాఖ ఎ=ూ , పంచాయతీ కార్యదర్శులు మరియు గ్రామ పెద్దలు అందరు సమక్షంలో శవ పంచనామా చేయడం జరిగింది ఈ 32 సన్న జీవాలకు నష్టపరిహారం అందించుటకు తగిన చర్యలు తీసుకుంటామని తెలియజేయడమైనది.

## క్షత్రియ మహిళకు పరిషత్ తరపున కుట్టు మిషన్లు పంపిణీ



విజయనగరం, జూన్ 28, ప్రభాతవార్త:

క్షత్రియ మహిళా పరిషత్, విజయనగరం ఆధ్వర్యంలో క్షత్రియ కల్యాణ మండపంలో నిర్వహించిన మహిళలకు కుట్టు మిషన్లు, గ్రైండర్లు, వీల్‌చైర్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి ద్వారా తమ కాళ్లపై తాము నిలబడి ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రోత్సహించడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు.

విజయనగరం
పార్వతీపురం మన్యం
వార్త
25

## ఉద్యోగాన్ని టైంపాస్‌గా చేస్తున్న రెవెన్యూ సిబ్బంది ..!

### లేటుగా విధులకు హాజరు.. ఎవరైనా మాకు డోంట్ కేర్

### చేయి తడపందే నో ఆటోగ్రాఫ్ ... వ్యక్తిగత పనులతో ఎస్కేప్



సాలూరు , జూన్ 28, ప్రభాతవార్త :

గవర్నమెంట్ సర్వేంట్ గా ఉంటు ప్రజల డబ్బునే జీతాలుగా తీసుకుంటు వారికి సేవలు అందించాల్సిన రెవెన్యూ సిబ్బంది టైంపాస్ గా ఉద్యోగం చేస్తున్నారని విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి.అలాగే ఆఫీస్ కు లేటుగా రావాడమే కాకుండా ఏదో సేలరీ తీసుకోకుండా డ్యూటీ చేస్తున్నట్టు బిల్డప్ ఇస్తుర్నారని ఆరోపణలు కూడ ఉన్నాయి. అంతేకాకుండా సాయంత్రం ఐదు వరకు ఉద్యోగం మమ అనిపించి కొంతమంది సిబ్బంది జేబులు సర్దుకుంటు ఇంటికి వెళ్లడానికి సిద్ధమౌతరని ఆక్షేపణలు కూడా వినపడుతున్నాయి.ఇదిఇలాఉంచితే ఎమ్మార్వోఆఫీస్ అసలేం జరుగుతుందో ఒక లుక్కేద్దాం. ప్రతీరోజు ప్రజలు తమ వ్యక్తిగత పనులు వెంటనే అయిపోతాయనే భ్రమలో ఎమ్మార్వో కార్యలయంకు త్వరగా చెరుకుంటారు.అలాగే ఆఫీస్ లోపలకి వెళ్లి చూసేసరికి తమకు అవసరమైన సార్ అండ్ మేడం కుర్చీఖాళీగా ఉండేసరికి మొదట షాక్ తింటున్నారు. దీంతో అక్కడ పనిలేక పోయినా బిజీగా తిరుగుతున్న కిందస్థాయి ఉద్యోగిని సార్ లేరా అడిగితే ఏదో ఒకటి పొంతనలేని సమాధానం చెప్పేసరికి అప్పటి నుంచి ఇతర పనులపై ఇంకా సంతకాలు కోసం వచ్చిన వారి నిరీక్షణ మొదలౌతుంది.అలాగే స్థానింగా ప్రజలకు అందుబాటులో ఉండవలసిన ఉద్యోగులు ఇక్కడ ఉండకుండా తమసొంత ఊళ్లనుండి ఆఫీస్ కు వచ్చేసరికి మార్నింగ్ లెవెన్ దాటిపోవంతో జనాలు విసిగిపోతున్నారు. అప్పటికి అయ్యవార్లు దిమాగా తమతో తెచ్చుకున్న మధ్యాహ్నం లంచ్ బాక్స్ పక్కన పెట్టి తీరిగ్గా రిలాక్స్ అవుతారు.తర్వాత తమకోసం ఎదురుచూస్తున్న వారివంక ఎందుకొచ్చవన్నట్లు చూసి మాకేటి అని విధులు మొదలపెడతారు. అంతేకాకుండా రెవెన్యూ డిపార్ట్మెంట్ కు సంబందించిన పౌర సరఫరాల అధికారి గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిదని టాక్ వినపడుస్తుంది. ఎందుకంటే అవినీతికి మారుపేరుగా లంచగొండి తనానికి కీర్తికిరీటం సాధించిన మాయని మచ్చగా ఇంతకుముందు పత్రికల్లో కథనాలు వెలువడ్డాయి.అలాగే భూ వ్యవహారాలు ఇంకా సర్వేలు, మ్యూటేషన్ ల్యాండ్ కన్వర్షన్ దందాలు ఆ గోలవేరేగా అక్కడ భాదితులను కదిపితే తెలుస్తుంది. ఈ మధ్యన ఎమ్మార్వో ఆఫీస్ లో అన్ని తానేఅని విర్రవీగిన ఔట్ సోర్స్ ఉద్యోగి చేతివాటం చూపెట్టడంతో ఉద్యోగం నుంచి తొలగించి ఇంటికి పంపించిన ఘటన చోటుచేసు కోవడం అందరికీ తెలిసిన విషయమే. అందుకే ఈ రెవెన్యూ డిపార్ట్మెంట్ ప్రజలకు ఎన్ని సేవలు అందించిన కొందరు అధికారులు,సిబ్బంది వలన సరైనా గుర్తింపులేక “రెవెన్యూ డే”అనే కార్యక్రమం నిర్వహించి వారి ఉనికి చాటుకుంటున్నారు.అలాగే వ్యక్తిగతల పనులపై ఎక్కవ దృష్టి పెట్టి ఎస్కేప్ అవ్వకుండా తమ ఉద్యోగ భాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తే కాని ప్రజలకు రెవెన్యూశాఖ పై నమ్మకం రాదని సర్వత్ర అభిప్రాయం వ్యక్తమౌతుంది.

**ఇక్కడ విఆర్ఏలే నైట్ వాచ్ మెన్‌లు :**

సాలూరు తాహిసీల్దార్ కార్యలయంలో గత ఎన్నోఏళ్లగానైట్ వాచ్ మెన్ లేకపోవండంతో ఆ పని మేమే చేస్తున్నామని విఆర్ఏలు వాపోతున్నారు. అప్పట్లో రిటైర్మెంట్ లేని ఉధ్యగం ఏదైనా ఉందంటే విఆర్ఏలు అని జీతం తక్కువ పనిభారం ఎక్కువని ఈ ఆఫీస్ లో విధులు నిర్వహిస్తున్న 35 మంది ఆవేదన చెందుతు న్నారు.అలాగే ఉదయాన్నే ఆఫీస్ కు వచ్చి సాయంత్రం వరకు చేయడానికి పెద్ద పనిలేకపోయిన అక్కడ ఇక్కడ కూర్చొని ఏదో పని కల్పించుకొని చేయడం కూడ కష్టమే అని వారి భావన కావచ్చు.అంతేకాకుండా పేరుకే వీఆర్ఏ అని ఇలా నైట్ వాచ్ మెన్ డ్యూటీ చేయలేక పోతున్నామని వయసు పై బడినవారు ఉసూరు మంటున్నారు.అలాగే వారి సమస్యలు పరిస్కరించాలని కోరుతున్నారు.

## ఎల్. కోట పంచాయతీ కార్యాలయంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కోళ్ల



లక్క వరపుకోట, జూన్ 28( ప్రభాత వార్త )

చిన్నారుల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమంలో భాగంగా, ఈరోజు ఎల్.కోట పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాన్ని ఎస్ కోట నియోజకవర్గ శాసనసభ్యులు కోళ్ల లలిత కుమారి సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె చిన్నారి పిల్లలకు స్వయంగా పోలియో చుక్కలు వేసి ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మాట్లాడుతూ.భారతదేశాన్ని పోలియో రహిత దేశంగా ఉంచడంలో పల్స్ పోలియో కార్యక్రమం ఎంతో కీలకమైనది. ఐదేళ్ల లోపు వయసున్న ప్రతి ఒక్క చిన్నారికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి. గతంలో వేయించినప్పటికీ, ఈ విడతలో మళ్లీ చుక్కలు వేయించడం ద్వారా పిల్లలకు సంపూర్ణ రోగనిరోధక శక్తి లభిస్తుంది. నియోజకవర్గంలో ఒక్క పిల్లాడు కూడా పోలియో చుక్కలు వేసుకోకుండా మిగిలిపోకూడదు.తల్లిదండ్రులందరూ బాధ్యతగా తీసుకుని తమ పిల్లలను పోలియో కేంద్రాలకు తీసుకువచ్చి చుక్కల మందు వేయించాలని ఆమె పిలుపునిచ్చారు. అలాగే, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి, ఆశా వర్కర్లకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆమె అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు , కూటమి నాయకులు, పంచాయతీ కార్యదర్శి, వైద్య శాఖ అధికారి డాక్టర్ అనిల్ కుమార్ , ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు, తల్లులు తమ పిల్లలతో భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలియో రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలి



నెల్లిమర్ల, జూన్ 28, ప్రభాతవార్త:

పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జనసేన పార్టీ నాయకుడు, పూసపాటిరేగ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎం. ఎం నాయుడు అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని జరిదాపు పేట పంచాయతీ కార్యాలయం వద్ద నాయుడు పల్స్ పోలియో కార్యక్రమంలో ఆదివారం పాల్గొన్నారు. పలువురు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలియో రహిత సమాజ నిర్మాణం కోసం ప్రభుత్వం విశేష కృషి చేస్తున్నదని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజలు, ప్రధానంగా చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలియో చుక్కలు వేసే సిబ్బందికి ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు. స్థానిక నల్లి సూరిబాబు కళావేదిక వద్ద పల్స్ పోలియో కార్యక్రమంలో నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, రాష్ట్ర నాగవంశం కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మద్దిల వాసు, స్థానిక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ మోనిక, జనసేన పార్టీ నాయకుడు కాళ్ళ మహేష్ , తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా పల్స్ పోలియో కార్యక్రమం




శృంగవరపుకోట,జూన్28,ప్రభాతవార్త :

ప్రభుత్వం చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమం ఎస్.కోట మండలంలో ఆదివారం విజయవం తంగా జరిగింది.కొట్టాం పీహెచ్ సీ పరిధిలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా 35బూత్‌లను ఏర్పాటు చేశారు.మండలం మొత్తం మీద 0-5మంది చిన్నారులకు నిర్దేశించిన లక్ష్యం 6,100కు పైగా ఉండగా ఆదివారం ఒక్క రోజే 5,900 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశామని పీహెచ్ సీ వైద్యాధి ,కారిణి హరిక తెలిపారు.ఎస్.కోట పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్,పందిరప్పన్న జంక్షన్ వద్ద అలాగే దారపర్తి గిరిజన పంచాయతీలో మూడు ప్రత్యేక కేంద్రాల్లో పోలియో బూత్ లను ఏర్పాటు చేశామని తెలిపారు.

## చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసిన మంత్రి

సాలూరు, జూన్ 28, ప్రభాతవార్త :

పట్టణం డబ్బివీధి కేహెచ్ స్కూల్లో ఆదివారం ఉదయం “పల్స్ పోలియో” 2026 కార్యక్రమం మంత్రి సంధ్యారాణి ప్రారంభించారు.అందులో భాగంగా చిన్నారులకు మంత్రి స్వయంగా పోలియో చుక్కలు వేసి తల్లులను ఆప్యాయంగా పలకరించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో 49.20 లక్షల మంది పిల్లలకు, అలాగే మన్యం జిల్లాలో లక్ష మందికి చుక్కలు వేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిందని స్పష్టం చేసారు. అంతేకాకుండా ప్రతి ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.




# అంజూ 22 యేళ్ల లాంగ్‌జంప్ రికార్డు బ్రేక్

**భువనేశ్వర్, జూన్ 28:** భువనేశ్వర్‌లో జరుగుతున్న జాతీయ అంతర్ రాష్ట్ర అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో మరో రికార్డు బద్ద లైంది. అంజు బాబీ జార్జ్ పేరిట ఉన్న 22 ఏళ్ల నాటి లాంగ్ జంప్ జాతీయ రికార్డును కేరళకు చెందిన అన్సీ సోజన్ బ్రేక్ చేసింది. 25 ఏళ్ల అన్సీ తన ఐదవ ప్రయత్నంలో 6.88 మీటర్ల దూరం దూకి... 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో అంజూ నెలకొల్పిన 6.83 మీటర్ల జాతీయ రికార్డును అధిగమించింది. అలాగే భారత అథ్లెటిక్స్ సమాఖ్య నిర్దేశించిన 6.48 మీటర్ల ఆసియా క్రీడల అర్హత ప్రమాణాన్ని కూడా అన్సీ దాటింది. ఈ సీజన్‌లో ఆసియా అథ్లెట్లలో ఆమె అగ్రస్థానానికి చేరుకుంది. శైలి సింగ్ (ఉత్తరప్రదేశ్) 6.67 మీటర్లతో రెండో స్థానంలో, ముబస్సినా(లక్షద్వీప్) 6.53 మీటర్లతో మూడో స్థానంలో నిలిచారు. పతకాలు సాధించిన ముగ్గురు అర్హత సాధించినా జపాన్‌లో జరిగే ఆసియా క్రీడల్లో అన్సీ, శైలిసింగ్ భారత్‌కు ప్రాతినిధ్యం వహించే అవకాశం పొందారు.

**పురుషుల హైజంప్‌లో మరో రికార్డు**

మహారాష్ట్రకు చెందిన సర్వేష్ కుషారే పురుషుల హై జంప్‌లో 2.31 మీటర్ల అద్భుత ప్రదర్శనతో జాతీయ రికార్డును నెలకొల్పాడు. గత ఏడాది టోక్యోలో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్ పురుషుల హై జంప్ ఫైనల్‌కు అర్హత సాధించిన తొలి భారతీయుడిగా నిలిచిన కుషారే... 2.31 మీటర్ల ఎత్తును అధిగమించి 2018 నుండి తేజస్విన్ శంకర్ పేరిట ఉన్న 2.29 మీటర్ల జాతీయ రికార్డును మెరుగు పరిచాడు. కుషారే 2.35మీటర్ల ఎత్తును అధిగమించడానికి ప్రయత్నించినప్పటికీ, రెండు ప్రయత్నాల లోనూ విఫలమయ్యాడు. ఈఛాంపియన్‌షిప్‌లలో ఇప్పటివరకు 5 జాతీయ రికార్డులు నమోదయ్యాయి.



# ప్రపంచ రోయింగ్‌లో భారత్‌కు తొలి స్వర్ణం

**లూసర్నే(స్విట్జర్లాండ్), జూన్ 28:** ప్రపంచ రోయింగ్ కప్‌లో భారత రోయర్లు చరిత్ర సృష్టించారు. ప్రపంచ రోయింగ్‌లో తొలిసారి భారత్‌కు స్వర్ణం అందించారు. స్విట్జర్లాండ్‌లోని లూసర్నే వేదికగా జరుగుతున్న ప్రపంచ రోయింగ్ కప్‌లో భాగంగా ఆదివారం జరిగిన పురుషుల లైట్ వెయిట్ డబుల్స్ స్కల్స్ ఫైనల్లో ఉజ్వల్ కుమార్, లక్షయ్ జోడీ పోటీపడ్డారు. రేసు ఆరంభం నుంచి వేగంగా దూసుకుపోయిన భారత జోడీకి హాంకాంగ్ నుంచి గట్టిపోటీ ఎదురైంది. ఉజ్వల్, లక్షయ్ జోడీ 6 నిమిషాల 26.09 సెకన్లలో రేసు పూర్తి చేశారు. అగ్రస్థానంతో పసిడి పతకం అందుకున్నారు. తరువాతి రెండు స్థానాల్లో నిలిచిన హాంకాంగ్, నెదర్లాండ్స్ ఖాతాలో సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ చేరాయి. భారత్‌కు ప్రపంచకప్ రోయింగ్‌లో ఇదే తొలి స్వర్ణం. గతంలో 3 కాంస్యాలు మాత్రమే అందుకుంది. 2009లో మహిళల క్వాడ్రపుల్‌లో.. 2019, 2022లో మహిళల పారా పెయిర్స్ విభాగాల్లో భారత్ కాంస్యాలు నెగ్గింది. భారత్‌కు స్వర్ణం అందించిన ఉజ్వల్ కుమార్, లక్షయ్ భారత ఆర్మీలో విధులు నిర్వర్తిస్తున్నారు.

## లక్ష్య ఛేదనలో మరోసారి విఫలమైన టీమిండియా

# టి20 సిరీస్ ఐర్లాండ్ కైవసం



**బెల్‌ఫాస్ట్, జూన్ 28:** ప్రపంచ టీ20 ఛాంపియన్లు టీమిండియా మరోసారి లక్ష్య ఛేధనలో బోల్తా కొట్టింది. 155 పరుగులను ఛేధించడంలో విఫలమైన శ్రేయాస్ సేన నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 153 పరుగులకే పరిమితమైంది. చివరి ఓవర్లో 20 పరుగులు చేయాల్సిన టీమిండియా 18 రన్స్ మాత్రమే చేసింది. దీంతో రెండో టీ20లోనూ క్రికెట్ కూన ఐర్లాండ్ ఒక పరుగు తేడాతో నెగ్గి సిరీస్‌ను 2-0తో క్లీన్ స్వీప్ చేసింది. ఐర్లాండ్ పర్యటనను పరాజయంతో ముగించింది.

**ఓపెనర్లు డకౌట్**

155 పరుగుల లక్ష్య ఛేధనలో మరోసారి భారత్ బ్యాటింగ్ తడబడింది. తొలి ఓవర్లోనే ఓపెనర్లిద్దరినీ కోల్పోయింది. ఇన్నింగ్స్ తొలి బంతికే సంజూ శామ్సన్(0)ను ఎల్బీగా అవుట్ చేసిన మూంద్రా...నాలుగో బంతికి అభిషేక్(0)ను పెవిలియన్ చేర్చాడు. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(10) కూడా నిరాశ పరిచాడు. ఇషాన్ కిషన్(12) రనౌట్ కావడంతో 35 పరుగులకే నాలుగు టాప్ ఆర్డర్ వికెట్లను కోల్పోయింది.

**తిలక్, హర్షిత్ ఒంటరిపోరాటం**

అక్షర్ పటేల్(14)తో కలిసి కొద్దిసేపు వికెట్ల పతనానికి తిలక్ వర్మ(46 బంతుల్లో 55 రన్స్; 3 ఫోర్లు, ఓ సిక్స్) ఫుల్ స్టాప్ పెట్టాడు. అయిదో వికెట్‌కు 39 రన్స్ జోడించాడు. ఇక శివమ్ దూబే(20)తోకలిసి స్కోరును వంద దాటించాడు. ఈక్రమంలో తిలక్ వర్మ అర్ధసెంచరీ పూర్తి చేశాడు. ఇద్దరూ ఆడుతున్నంతసేపు భారత్ గెలుస్తుందన్న ఆశలు కలిగాయి. అయితే 8 పరుగుల తేడాతో దూబే, తిలక్‌వర్మ అవుట్ కావడంతో భారత్ ఆశలు సన్నగిల్లాయి. తొలి వన్డే ఆడుతున్న సూర్యాంష్ షెడ్గే (1) కూడా తొందరగానే అవుటయ్యాడు. చివర్లో హర్షిత్ రాణా 10 బంతుల్లో 2 ఫోర్లు, ఒక సిక్స్‌తో 21 రన్స్‌తో మెరుపులు మెరిపించినా భారత్‌ను ఓటమి నుంచి తప్పించలేకపోయాడు. ఐర్లాండ్ బౌలర్లు మూంద్రా, మాట్ హోలార్డ్ మూడేసి వికెట్లు తీసి భారత్‌ను దెబ్బతీశారు.

**ప్రిన్స్ వికెట్ల బోణీ**

అంతకుముందు టాస్ నెగ్గిన టీమిండియా.. ఐర్లాండ్‌కు బ్యాటింగ్ అప్పగించింది. ఐర్లాండ్ ఇన్నింగ్స్‌ను టిమ్ టెక్టార్(5), రాస్ అడైర్(16) ప్రారంభించారు. హర్షిత్ రాణా తన తొలి ఓవర్లోనే టిమ్ టెక్టార్‌ను అవుట్ చేశాడు. రెండు సిక్స్‌లతో ధాటిగా ఆడే ప్రయత్నం చేసిన మరో ఓపెనర్ రాస్ అడైర్‌ను అర్షదీప్ సింగ్ పెవిలియన్‌కు చేర్చాడు. కెప్టెన్ లొర్కాన్ టక్కర్(15)ను తొలి వన్డే ఆడుతున్న ప్రిన్స్ యాదవ్ బోల్తా కొట్టించాడు. దీంతో ఐర్లాండ్ 48 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

**హ్యారీ టెక్టార్ అర్ధ శతకం**

ఈ క్రమంలో వన్‌డౌన్ బ్యాటర్ హ్యారీ టెక్టార్(47 బంతుల్లో 53), బెంజమిన్ కాలిట్జ్ (37) క్రీజ్‌లో నిలదొక్కుకుని ఐర్లాండ్ స్కోరును వంద దాటించారు. నాలుగో వికెట్‌కు 65 రన్స్ జోడించారు. ఈ దశలో శివమ్ దూబే వరుసబంతుల్లో కాలిట్జ్, గరెత్(0)ను ఔట్ చేసి దెబ్బతీశాడు. మరో ఎండ్‌లో అర్షదీప్, ప్రిన్స్ యాదవ్ కూడా వికెట్లు తీయడంతో ఐర్లాండ్ వేగంగా వికెట్లు కోల్పోయింది. కాగా అర్ధసెంచరీ పూర్తి చేసిన హ్యారీ టెక్టార్... ఐర్లాండ్ స్కోరును 150 మార్కు దాటించాడు. భారత బౌలర్లలో అరంగేట్ర పేసర్ ప్రిన్స్ యాదవ్ మూడు వికెట్లు తీయగా.. అర్ష్‌దీప్ సింగ్, శివం దూబే చెరో రెండు, హర్షిత్ రాణా ఒక వికెట్ పడగొట్టారు.



ప్రిన్స్ యాదవ్ మూడు వికెట్లు

## ఆస్ట్రేలియా చేతిలో ఓడిన భారత్ మహిళలు

# టి20 ప్రపంచకప్ నుంచి ఔట్



**లండన్, జూన్ 28:** ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్-2026 టోర్నీలో భారత్ పోరు లీగ్ దశలోనే ముగిసింది. తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో ఓడి సెమీస్‌కు దూరమైంది. మొదట భారత్ ఉమెన్స్ 4 వికెట్లకు 170 పరుగులు చేయగా.. ఆస్ట్రేలియా మరో ఓవర్ ఉండగానే నాలుగు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఈ గెలుపుతో ఆస్ట్రేలియా టాప్ ప్లేస్‌తో, సౌతాఫ్రికా సెకండ్ ప్లేస్‌తో గ్రూప్-నుంచి సెమీఫైనల్లో ప్రవేశించాయి. భారతన ఆడిన 5 మ్యాచ్‌ల్లో మూడు విజయాలు, రెండు పరాజయాలతో ఆరు పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది.

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ మహిళలు నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. ఓపెనర్లు స్మృతి మంధాన(37 బంతుల్లో 38), షఫాలీ వర్మ(26 బంతుల్లో 34).. తొలి వికెట్‌కు 66 పరుగుల శుభారంభాన్నిచ్చారు. అయితే స్కోరును వేగంగా పెంచలేకపోయారు. తర్వాత వచ్చిన రోడ్రిగ్స్(28 బంతుల్లో 34)తో కలిసి కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన హార్మన్‌ప్రీత్(27 బంతుల్లో 56 రన్స్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధాటిగా ఆడి స్కోరు వేగం పెంచింది. ఆస్ట్రేలియా బౌలర్లలో కెప్టెన్ సోఫీ మోలినెక్స్ రెండు వికెట్లు తీసింది.

ఇక లక్ష్య ఛేదనకు దిగిన ఓపెనర్ జార్జియా వోల్ (4)ను ఔట్ చేసి ఆసీస్‌కు ఆదిలోనే రేణుకా సింగ్ షాకిచ్చింది. అయితే, బెత్ మూనీ (22), ఫోబీ లిచిఫీల్డ్ (22) నిలకడగా ఆడుతూ స్కోరును ముందుకు నడిపారు. ఆ తర్వాత వచ్చిన పెర్రి (38 బంతుల్లో 56),గార్డ్‌నర్ (29 బంతుల్లో 53 నాటౌట్) అద్భుత అర్ధ శతకాలతో దుమ్మురేపారు. నాలుగో వికెట్‌కు వంద పరుగులు జోడించి విజయానికి బాటలు వేశారు. ఆరు వికెట్ల విజయాన్ని అందించారు.



# యుఎస్ ఓపెన్ ఫైనల్లో కిడాంబి శ్రీకాంత్

**కాలిఫోర్నియా, జూన్ 28:** భారత్ స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్... యుఎస్ ఓపెన్‌లో టైటిల్ ఆశలను రెట్టింపు చేశాడు. పురుషుల సింగిల్స్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ఆదివారం జరిగిన సెమీ ఫైనల్లో జపాన్ ప్లేయర్ యుదై ఒకిమోటోను మూడు గేమ్‌ల హోరాహోరీ పోరులో 22-20, 15-21, 21-19తో ఓడించాడు. ఈ మ్యాచ్ గంటా 12 నిమిషాల పాటు జరిగింది. ఫైనల్లో చైనీస్ తైపీకి చెందిన సు లి యాంగ్‌తో కిడాంబి తలపడనున్నాడు. కాగా భారత యువ షట్లర్లు రౌనక్ చౌహాన్, దేవికా సిహాగ్ పోరు సెమీఫైనల్లోనే ముగిసింది.

2021 ప్రపంచ ఛాంపియన్‌షిప్ సిల్వర్ మెడలిస్ట్ కిడాంబి శ్రీకాంత్.. సెమీస్‌పోరును చక్కగా ఆరంభించాడు. 9-5తో ఆధిక్యం చాటాడు. ఆ తర్వాత దానిని 17-10కి పెంచుకున్నాడు. అయితే ఒకిమోటో అద్భుతమైన కమ్ బ్యాక్‌తో ఏకంగా పది పాయింట్లు సాధించి సమవుజ్జీగా నిలిచాడు. ఇద్దరూ మధ్య సుదీర్ఘ ర్యాలీలు కొనసాగాయి. చివరకు కిడాంబి తొలి గేమ్‌ను 22-20తో నెగ్గి కైవసం చేసుకున్నాడు. రెండో గేమ్‌లో పుంజుకున్న ఒకిమోటో 21-15తో నెగ్గి సమం చేశాడు. ఫలితం తేల్చే మూడోగేమ్‌లోనూ ఇరువురూ పోటీపోటీగా తలపడ్డారు. చివరకు కిడాంబి వరుసగా ఆరు పాయింట్లు సాధించి పైచేయిగా నిలిచాడు. ఈ గేమ్‌ను తన ఖాతాలో వేసుకుని ఫైనల్లో ప్రవేశించాడు.

**సెమీస్‌లో రౌనక్, దేవికా బోల్తా**

మరో పురుషుల సింగిల్స్ సెమీస్‌లో యువ షట్లర్ రౌనక్ చౌహాన్ అద్భుత ప్రదర్శన ముగిసింది. అతను సు లి యాంగ్ చేతిలో 17-21, 19-21 తేడాతో వరుస గేమ్‌ల్లో పరాజయం పొందాడు. ఈమ్యాచ్ 46నిమిషాల్లోనే ముగిసింది. ఇక ఈ ఏడాది ఆరంభంలో థాయిలాండ్ మాస్టర్స్ గెలిచిన ఆరో సీడ్ దేవిక సిహాగ్... మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో రెండో సీడ్ లైన్ క్రిస్టోఫర్‌సెన్(డెన్మార్క్) చేతిలో 21-15, 11-21, 15-21 తేడాతో ఓటమి పాలైంది. తొలి గేమ్‌ను నెగ్గి శుభారంభం చేసిన దేవిక అదే రోజు మిగతా రెండు గేమ్‌ల్లో చాటలేక చతికిలపడింది.

## టాప్ ఆరు కంపెనీల్లో

# 89వేల కోట్ల ఎంక్యాప్ వృద్ధి



**ముంబయి,జూన్ 28:** దేశంలోని అత్యంత విలువైన టాప్10 కంపెనీల్లో ఆరు సంస్థలు గత వారం రూ.88 వేల 678 కోట్లకు పైగా మార్కెట్ విలువను పెంచుకున్నాయి. మరో నాలుగు కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ తగ్గింది. కాగా ఐసీఐసీఐ బ్యాంక్ అత్యధిక లాభం నమోదు చేసింది. సెలవు కారణంగా నాలుగు ట్రేడింగ్ రోజులకే పరిమితమైన మార్కెట్ విలువ పెరుగుదలలో ఐసీఐసీఐ బ్యాంక్ అగ్రస్థానంలో నిలిచింది. ఆ బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.29 వేల 589 కోట్లు పెరిగి దాదాపు రూ.9.96 లక్షల కోట్లకు చేరింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.24 వేల 718 కోట్లు పెరిగి రూ.12.26 లక్షల కోట్లకు చేరింది. దేశీయ దిగ్గజ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ రూ.12 వేల 44 కోట్లు పెరిగి రూ.17.84 లక్షల కోట్లకు చేరుకుంది. బజాజ్ ఫైనాన్స్ మార్కెట్ క్యాప్ రూ.11 వేల 580 కోట్లు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్కెట్ విలువ రూ.9 వేల 323 కోట్లు, లార్సెన్ అండ్ టుబ్రో మార్కెట్ విలువ 1,424కోట్లు పెరిగాయి.

మరోవైపు, మార్కెట్ విలువ కోల్పోయిన కంపెనీల్లో భారతి ఎయిర్‌టెల్ అత్యధిక నష్టాన్ని చవిచూసింది. ఆ సంస్థ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.35 వేల 615 కోట్లు తగ్గింది. అలాగే ఎల్‌ఐసీ మార్కెట్ విలువ రూ.21 వేల 189 కోట్లు, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) మార్కెట్ విలువ రూ.11 వేల 144 కోట్లు, హిందుస్థాన్ యూనిలీవర్ మార్కెట్ విలువ రూ.5 వేల 322 కోట్లు తగ్గాయి. మార్కెట్ విలువల్లో మార్పులు చోటుచేసుకున్నప్పటికీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ దేశంలోనే అత్యంత విలువైన కంపెనీగా తన అగ్రస్థానాన్ని కొనసాగించింది. ఆతర్వాత వరుసగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్, లార్సెన్ అండ్ టుబ్రో, ఎల్‌ఐసీ, హిందుస్థాన్ యూనిలీవర్ స్థానాల్లో నిలిచాయి.

# ఎక్సైజ్ సుంకాలతో రాష్ట్రాల ఖజానా కళకళ



**న్యూఢిల్లీ,జూన్ 28:** మద్యం అమ్మకాలతో రాష్ట్రాల ఖజానా కళకళలాడింది. రెండు నెలల వ్యవధిలోనే కొన్ని రాష్ట్రాల్లో ఎక్సైజ్ సుంకం వసూళ్లు 82 శాతం వరకు పెరిగింది. వసూళ్లలో ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో నిలవగా వృద్ధి రేటులో హార్యానా మొదటి స్థానాన్ని దక్కించుకుంది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (సీఏజీ) విడుదల చేసిన 10 ప్రధాన రాష్ట్రాల నెలవారీ కీలక సూచికల చూస్తే ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌మే కాలంలో ఉత్తరప్రదేశ్ రూ.10,600 కోట్లకు పైగా ఎక్సైజ్ ఆదాయాన్ని నమోదు చేసింది. హార్యానాలో ఎక్సైజ్ వసూళ్లు 82 శాతానికి పైగా పెరిగి రూ.2,300 కోట్లను దాటాయి. మొత్తం ఆదాయ పరంగా కర్ణాటక రెండో స్థానంలో ఉండగా వృద్ధి శాతంలో కేరళ రెండో స్థానంలో నిలిచింది.

మద్యం వినియోగం 14 శాతం పెరగడం, పలురాష్ట్రాలు ఎక్సైజ్ రేట్లను పెంచడం, తయారీ సంస్థలు ప్రాథమిక ధరలను సవరించడం వల్ల ప్రభుత్వాలకు అధిక ఆదాయం సమకూరిందని పేర్కొంటున్నాయి. కర్ణాటక దేశంలోనే తొలిసారిగా ఆల్కహాల్‌ఇన్‌బెవరేజ్ ఆధారిత ఎక్సైజ్ విధానాన్ని అమల్లోకి తీసుకురాగా తక్కువ ఆల్కహాల్ శాతం ఉన్న మద్యంపై అమ్మకపు పన్ను తగ్గించే ప్రతిపాదనను కేరళ ప్రభుత్వం పరిశీలిస్తోంది.

రాష్ట్రాల సొంత పన్ను ఆదాయంలో ఎక్సైజ్ సుంకం వాటా 13.5 శాతంగా ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఉత్తరప్రదేశ్ రూ.52,575 కోట్లతో అత్యధిక ఎక్సైజ్ ఆదాయాన్ని నమోదు చేసింది. ఆ తర్వాత కర్ణాటక 35వేల 784 కోట్లు, మహారాష్ట్ర రూ.25,466 కోట్లు, ఆంధ్రప్రదేశ్ రూ.19,882 కోట్లు, పశ్చిమ బెంగాల్ రూ.19,521 కోట్లు, తెలంగాణ రూ.18,604 కోట్లు, మధ్యప్రదేశ్ రూ.15,201 కోట్లు, రాజస్థాన్ రూ.15,104 కోట్లతో ఉన్నాయి. ఈశాన్య రాష్ట్రాలు, హిమాలయ ప్రాంత రాష్ట్రాల్లో ఉత్తరాఖండ్ రూ.4,362 కోట్లతో అగ్రస్థానంలో ఉండగా మిజోరం కేవలం రూ.2 కోట్ల ఎక్సైజ్ ఆదాయంతో చివరి స్థానంలో నిలిచింది.




# కోల్‌కత్తాలో జీఎస్టీ సమావేశం

**న్యూఢిల్లీ,జూన్ 28:** దేశంలో పరోక్ష పన్ను విధానంలో మరో కీలక మార్పులకు జీఎస్టీ మండలి రంగం సిద్ధంచేస్తోంది. జీఎస్‌టీ కౌన్సిల్ 57వ సమావేశం వచ్చే నెలలో కోల్‌కతాలో నిర్వహించనున్నారు. పన్ను సంస్కరణలు, తయారీ రంగానికి ఊరటనిచ్చే నిర్ణయాలు, ఆటిజం కేర్ సెంటర్లపై జీఎస్‌టీ తగ్గింపు వంటి కీలక అంశాలపై చర్చ జరిగే అవకాశముంది. పశ్చిమ గత జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశం గత ఏడాది సెప్టెంబర్ 3న జరిగింది. దాదాపు తొమ్మిది నెలల విరామం తర్వాత జరిగిన ఆ సమావేశంలో "జీఎస్‌టీ 2.0" సంస్కరణలను ప్రవేశపెట్టారు.

పన్ను రేట్ల సరళీకరణతో పాటు వ్యాపారాలకు అనుకూలంగా పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈసారి కూడా పరోక్ష పన్ను వ్యవస్థలో మరిన్ని సంస్కరణలు తీసుకొచ్చే అవకాశముందని పన్ను నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా తయారీ రంగంపై భారం తగ్గించే అంశాలు జీఎస్‌టీ కౌన్సిల్ పరిశీలించే అవకాశం ఉందని చెబుతున్నారు.

ఇన్‌వర్టెడ్ డ్యూటీ స్ట్రక్చర్ కారణంగా ఇన్‌పుట్ సర్వీస్ ఐటీసీ రీఫండ్ లభించకపోవడం వల్ల తయారీ రంగం ఇబ్బందులు ఎదుర్కొంటోందని బెంగాల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ జాతీయ ఫిస్కల్ అఫైర్స్ అండ్ టాక్సేషన్ కమిటీ ఛైర్మన్ వివేక్ జలాన్ పేర్కొన్నారు. ఈ లోపాన్ని సరిదిద్దితే పన్నుల భారం తగ్గడంతో పాటు తయారీ రంగ పోటీతత్వం పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆటిజం కేర్ సెంటర్లు, వాటికి సంబంధించిన సేవలపై ప్రస్తుతం ఉన్న 18 శాతం జీఎస్‌టీని 5 శాతానికి తగ్గించాలని కూడా జీఎస్‌టీ కౌన్సిల్‌ను కోరినట్లు తెలుస్తోంది.

# డివిడెండ్లు,షేర్ బైబాక్‌లతో ఈ వారం బిజీ

**ముంబయి,జూన్ 28:** వచ్చే వారం దేశీయ స్టాక్ మార్కెట్లో పలు ప్రముఖ లిస్టెడ్ కంపెనీల షేర్లకు కీలక కార్పొరేట్ చర్యలు అమల్లోకి రానున్నాయి. 29 నుంచి జూలై 3 వరకు డివిడెండ్లు, ప్రత్యేక డివిడెండ్లు, షేర్ బైబ్యాక్‌లు, స్పిన్‌ఆఫ్ వంటి చర్యలకు సంబంధించిన ఎక్స్‌డేట్లు నిర్ణయించబడ్డాయి. దీంతో ఆయా కంపెనీల షేర్లపై పెట్టుబడిదారుల దృష్టి కేంద్రీకృతమైంది.




29న జ్యోతి ల్యాబ్స్ షేరుకు రూ.3.50 తుది డివిడెండ్, కన్సాయ్ నెరోలాక్ పెయింట్స్ షేరుకు రూ.2.50, కల్పతరు ప్రాజెక్ట్స్ ఇంటర్నేషనల్ షేరుకు రూ.11, రేమండ్ లైఫ్‌స్టైల్ షేరుకు రూ.1 తుది డివిడెండ్‌లకు ఎక్స్‌డేట్ ఉంటుంది. 30న బజాజ్ ఫిన్‌సర్వ్ రూ.1.50 తుది డివిడెండ్ ఇవ్వనుండగా, బజాజ్ హోల్డింగ్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ఒక్కో షేరుకు రూ.50 తుది డివిడెండ్‌తో పాటు మరో రూ.50 ప్రత్యేక డివిడెండ్ ప్రకటించింది. బజాజ్ ఫైనాన్స్ రూ.6 ప్రత్యేక డివిడెండ్, మహారాష్ట్ర స్కూటర్స్ రూ.60 ప్రత్యేక డివిడెండ్, వెల్‌స్పన్ కార్ప్ రూ.5 ప్రత్యేక డివిడెండ్‌లకు కూడా అదే రోజు ఎక్స్‌డేట్ ఉంటుంది.

జూలై 1న డీసీఎం శ్రీరామ్ ఫైన్ కెమికల్స్, గ్రోవీ ఇండియా, కెమ్‌బాండ్ మెటీరియల్ టెక్నాలజీస్ కంపెనీల ప్రత్యేక డివిడెండ్లకు ఎక్స్‌డేట్ నిర్ణయించారు. భారత్ ఫోర్జ్ ఒక్కో షేరుకు రూ.6.50, బయోకాన్ రూ.0.50, మహీంద్రా అండ్ మహీంద్రా రూ.33, టెక్ మహీంద్రా రూ.36, శ్రీరామ్ ఫైనాన్స్ రూ.6, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.5, వెల్‌స్పన్ ఎంటర్‌ప్రైజెస్ రూ.3, థర్మాక్స్ రూ.14 తుది డివిడెండ్‌తో పాటు రూ.6 ప్రత్యేక డివిడెండ్ ప్రకటించాయి. అదే రోజున ఎస్కార్ట్స్ కుబోటా రూ.33, ఎక్స్‌డ్ ఇండస్ట్రీస్ రూ.2, మ్యాక్స్ హెల్త్‌కేర్ రూ.2, రెడింగ్టన్ రూ.6, ఎస్‌కేఎఫ్ ఇండియా రూ.40, స్వరాజ్ ఇంజిన్స్ రూ.110, బాలాజీ అమీన్స్ రూ.11 తదితర కంపెనీలు కూడా డివిడెండ్లు అందించనున్నాయి. కార్పొరేట్ చర్యల్లో భాగంగా 29న కజారియా సెరామిక్స్ మరియు పటేల్ ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ కంపెనీలు షేర్ బైబ్యాక్ చేపట్టనున్నాయి.




# వచ్చేనెలలో వస్తున్న మార్పులు చేర్పులు ఇవే!

**ముంబయి,జూన్ 28:** మరోరెండురోజుల్లో జులై నెల ప్రారంభం అవుతున్న తరుణంలో వచ్చేనెల 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా పలు నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఈ మార్పులు సామాన్యుల రోజువారీ జీవితంతో పాటు వారి ఖర్చులపై కూడా ప్రభావం చూపనున్నాయి. ఎల్పీజీ సిలిండర్ ధరల నుంచి క్రెడిట్ కార్డు నిబంధనలు, ఆధార్ సేవలు, విమాన ప్రయాణాలు, కార్ల ధరల వరకు మొత్తం ఐదు ప్రధాన మార్పులు అమల్లోకి రానున్నాయి. ప్రతి నెల మొదటి తేదీ మాదిరిగానే జూలై 1న కూడా చమురు సంస్థలు ఎల్పీజీ సిలిండర్ ధరలను సవరించనున్నాయి. అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో వాణిజ్య ఎల్పీజీ ధరల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. ఏవియేషన్ టర్బయిన్ ఫ్యూయెల్ ఎటిఎఫ్ ధరలను కూడా సవరించనుండటంతో విమాన టికెట్ ధరలపై ప్రభావం పడే అవకాశముంది హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ రెగాలియా గోల్డ్ క్రెడిట్ కార్డు వినియోగదారులకు కూడా కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఉచిత దేశీయ విమానాశ్రయ లాంజ్ సదుపాయాన్ని పొందాలంటే, గత త్రైమాసికంలో కనీసం రూ.60 వేల ఖర్చు చేసిన వారికే ఈ సౌకర్యం కొనసాగుతుంది. ఆధార్ కార్డు వినియోగదారులకు మాత్రం ఊరట లభించనుంది. యుఐడిఎనిర్ణయం ప్రకారం ఆధార్‌లో ఈమెయిల్ ఐడీని అప్‌డేట్ చేసుకునే సేవ జూలై 1 నుంచి డిసెంబర్ వరకు ఉచితంగా అందుబాటులో ఉంటుంది. గతంలో ఈ సేవకు రూ.75 రుసుము వసూలు చేసేవారు. కారు కొనుగోలు చేయాలనుకునే వారికి జూలై నెల నుంచి అదనపు భారం తప్పదు. కియా, టాటా మోటార్స్ వంటి ప్రముఖ ఆటోమొబైల్ సంస్థలు తమ వాహనాల ధరలను 1.5 శాతం నుంచి 2 శాతం వరకు పెంచనున్నట్లు ప్రకటించాయి. దీంతో జూలై నుంచి కొత్త కారు కొనుగోలు మరింత ఖరీదుగా మారనుంది.



# ఇరాన్‌వార్, ఇన్వెస్టర్ల ధోరణులే కీలకం

## ఈవారం మార్కెట్ ధోరణులపై స్టాక్ నిపుణుల దిక్సూచి

**ముంబయి,జూన్ 28:** అమెరికా-ఇరాన్ మధ్య తాజా సైనిక పరిణామాలు, వాటి ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరల కదలికలు, దేశీయ ఆర్థిక గణాంకాలు వంటివి ఈ వారం ఈ వారం భారత స్టాక్ మార్కెట్ దిశను నిర్దేశించనున్నాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల పెట్టుబడి ధోరణి, నైరుతి రుతుపవనాల పురోగతి కూడా మార్కెట్‌పై ప్రభావం ఉంటుంది. రిలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ విభాగం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా మాట్లాడుతూ ఈ వారం పారిశ్రామిక ఉత్పత్తి సూచీ, హెచ్‌ఎస్‌బీసీ తయారీ, సేవలు, కాంపోజిట్ పీఎంఐ తుది గణాంకాలు, దేశ విదేశీ మారక నిల్వల వివరాలపై ఇన్వెస్టర్లు దృష్టి సారిస్తారన్నారు. అంతర్జాతీయంగా ముడిచమురు ధరల మార్పులు, పశ్చిమాసియాలోని భౌగోళిక ఉద్రిక్తతలు మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేసే ప్రధాన అంశాలుగా కొనసాగుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

జూలై 1న విడుదల కానున్న ఆటోమొబైల్ కంపెనీల నెలవారీ విక్రయాల గణాంకాలపై కూడా మార్కెట్ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. ఎన్‌రిచ్ మనీ సీఈఓ పొన్‌ముడి ఆర్ మాట్లాడుతూ అమెరికా-ఇరాన్ మధ్య తాజా సైనిక పరిణామాల నేపథ్యంలో మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు ఇన్వెస్టర్ల ఆందోళనకు కారణమవుతున్నాయని తెలిపారు. పరిస్థితులు సద్దుమణిగితే మార్కెట్లలో సానుకూల సెంటిమెంట్ కొనసాగుతుందని, అయితే ఉద్రిక్తతలు మరింత పెరిగితే ప్రపంచ ఆర్థిక వృద్ధి అంచనాలు, ఇంధన మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు.

మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా మాట్లాడుతూ ఈ వారం భారత్‌కు సంబంధించిన తయారీ పీఎంఐ, మే నెల పారిశ్రామిక ఉత్పత్తి గణాంకాలతో పాటు అమెరికా తయారీ సూచీ విడుదల కూడా మార్కెట్లకు కీలకం అవుతుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.